



భాగవతము


విచారణ

గోపికా రహస్యము










సదాశివ సమారంభాం
గురు దక్షిణామూర్తి
గురు వేదవ్యాస మహర్షి
గురు శుక మహర్షి
గురు నారద మహర్షి
గురు వాల్మీకి మహర్షి
గురు శ్రీకృష్ణ
శంకరాచార్య మధ్యమాం
గురు దత్తాత్రేయ
గురు బాబాజీ
గురు గౌతమ బుద్ధ
గురు ఆదిశంకరాచార్య
గురు రామానుజాచార్యులు
గురు జ్ఞానేశ్వర్
గురు రవిదాస్
గురు కబీర్ దాస్
గురు చైతన్య మహా ప్రభువు
గురు నానక్
గురు రాఘవేంద్ర స్వామి
గురు వీరబ్రహ్మేంద్ర స్వామి
యోగి వేమన
అస్మదాచార్య పర్యంతాం
గురు త్రైలింగ స్వామి
గురు లాహిరి మహాశయ
గురు రామకృష్ణ పరమహంస, అమ్మ శారదాదేవి
గురు వివేకానంద
గురు సాయి బాబా
గురు అరబిందో
గురు రమణ మహర్షి
గురు యోగానంద
గురు భక్తివేదాంత ప్రభుపాద
గురు మళయాళస్వామి
గురు విద్యాప్రకాశానందగిరి
గురు చంద్రశేఖర పరమాచార్య
వందే గురుపరంపరాం..

భారత ప్రభుత్వపు వెబ్ సైట్ - డిజిటల్ లైబ్రరీ అఫ్ ఇండియా

http://www.new.dli.ernet.in




అతి విశిష్టం ఈ దానం!

స్వామి వివేకానంద

"దానాలలోకెల్లా ఆధ్యాత్మిక విద్యాదానం చాలా శ్రేష్ఠమైంది! దాని తరువాతిది లౌకిక జ్ఞానదానం, ప్రాణదానం, అన్నదానం" అని వ్యాసమహర్షి చెప్పారు.

మన ఆధ్యాత్మిక జ్ఞానం భారతదేశ హద్దులలో నిలిచి పోకూడదు. లోకమంతటినీ ఆవరించాలి! ఇలా లోకవ్యాప్తమైన ధర్మప్రచారాన్ని మన పూర్వులు చేశారు. హైందవ వేదాంతం ఎన్నడూ ఈ దేశం దాటి పోలేదని చెప్పేవారూ, మతప్రచారార్థం తొలిసారిగా, పరదేశాలకు వెళ్ళిన సన్యాసిని నేనే అని చెప్పేవారూ, తమ జాతిచరిత్ర నెరుగని వారే! ఇలాంటి సంఘటనలు ఎన్నోసార్లు జరిగాయి. అవసరమైనప్పుడల్లా, భారతీయ ఆధ్యాత్మిక జ్ఞానప్రవాహం వెల్లువలా లోకాన్ని ముంచెత్తుతూ వచ్చింది.



రాజకీయ ప్రచారాన్ని రణగొణధ్వనులతో, యోధులతో సాగించవచ్చు. అగ్నిని కురిపించి, కత్తిని జళిపించి, లౌకిక జ్ఞానాన్నీ, సంఘనిర్మాణ విజ్ఞానాన్నీ విరివిగా ప్రచారం చేయవచ్చు. కానీ ఆధ్యాత్మిక జ్ఞానదానం కళ్ళకు కనిపించకుండా, చెవులకు వినిపించకుండా కురుస్తూ, రోజా పువ్వుల రాసుల్ని వికసింపజేసే మంచులాగా నిశ్శబ్దంగా జరగవలసి ఉంది. భారతదేశం నిరాడంబరంగా, లోకానికి మళ్ళీ మళ్ళీ చేస్తూ వచ్చిన దానమిదే!

మిత్రులారా! నేను అవలంబించే విధానాన్ని తెలియజేస్తాను వినండి. భారతదేశంలోనూ, ఇతర దేశాల్లోనూ మన పారమార్థిక ధర్మాలను బోధించడానికి తగినవారుగా మన యువకుల్ని తయారు చేయడానికై భారతదేశంలో కొన్ని సంస్థలను నెలకొల్పాలి! ఇప్పుడు మనకు కావలసింది బలిష్ఠులు, జవసంపన్నులు, ఋజువర్తనులు, ఆత్మ విశ్వాసపరులు అయిన యువకులు. అలాంటి వారు నూరుమంది దొరికినా, ప్రపంచం పూర్తిగా పరివర్తన చెందగలుగుతుంది!!

ఇచ్ఛాశక్తి తక్కిన శక్తులన్నిటి కన్నా బలవత్తరమైంది. అది సాక్షాత్తూ భగవంతుని దగ్గరి నుండి వచ్చేదే కాబట్టి దాని ముందు తక్కినదంతా లొంగిపోవలసిందే. నిర్మలం, బలిష్ఠం అయిన 'ఇచ్ఛ' (సంకల్పం) సర్వశక్తిమంతమైంది. దానిలో మీకు విశ్వాసం లేదా? ఉంటే మీ మతంలోని మహోన్నత ధర్మాలను ప్రపంచానికి బోధించడానికై కంకణం కట్టుకోండి. ప్రపంచం ఆ ధర్మాల కోసమై ఎదురుచూస్తోంది. అనేక శతాబ్దాలుగా ప్రజలకు క్షుద్రసిద్ధాంతాలు నేర్పడం జరిగింది. వారు వ్యర్థులని ప్రపంచమంతటా బోధలు జరిగాయి. ఎన్నో శతాబ్దాల నుండి వారు ఈ బోధనల వల్ల భయభ్రాంతులై, పశుప్రాయులైపోతున్నారు. తాము ఆత్మస్వరూపులమనే మాటను వినడానికైనా వారెన్నడూ నోచుకోలేదు. "నీచాతినీచుడిలో కూడా ఆత్మ ఉంది. అది అమృతం, పరమ పవిత్రం, సర్వశక్తిమంతం, సర్వవ్యాపకమైనది" అని వారికి ఆత్మను గురించి చెప్పండి. వారికి ఆత్మవిశ్వాసాన్ని ప్రసాదించండి. ❖

మూలం: శ్రీ రామకృష్ణ ప్రభ - ఫిబ్రవరి 2014

ఓం

తత్సత్,

శ్రీ పరబ్రహ్మణేనమః

శ్రీ గోపికా రహస్యము

[తాత్పర్య వివరణసహిత నిర్వచనైకాశ్వాసము]

★

గ్రంథకర్త :

వై. యస్. కృష్ణమూర్తి

సూపరింటెండెంటు,

ఇర్రిగేషన్ డిపార్టుమెంటు, పి. డబ్లియు. డి.

హైదాబాదు గవర్నమెంటు, దక్కను.

1950

వెల { [illegible]
[illegible] 1-3-0

ఉపోద్ఘాతము.

మా మిత్రులగు బ్ర॥ శ్రీ॥ ఎల్లాప్రగడ కృష్ణమూర్తి గారు "గోపికా రహస్య" మను గ్రంథమును వ్రాసియున్నారు. గ్రంథము మిక్కిలి చిన్నదయ్యును దీనియందమూల్యములైన యనేక యోగసూత్రము లిమిడియున్నవి. గోపికా వృత్తాంతము కేవలము పచ్చిబూతులనుకొనెడి వారికీగ్రంథము సరియైన సమాధానము చెప్పుచున్నది. గోపికల పనులన్నియు నున్మత్త చేష్టలుగావనియు, వానియందొక గూఢభావమున్నదనియు, అట్టి గూఢభావమును బయల్పఱుపఁదలంచి వారీ గ్రంథమునకు "గోపికారహస్య" మని పేరిడిరి. దీనిలో నీ క్రింది రెండు పద్యములను జదువువారు రామునికిని దండకలోని ఋషులకును గలిగిన సమావేశఫలితమును బ్రదర్శించుటకై శ్రీకృష్ణుడు వ్రేపల్లెయందవతరించెనని గ్రహింపఁగలుగుదురు

చ॥ కొనకొని మీరు నేఁడు మదిఁ గోరిన కోరిక మీకు ద్వాపరం
బున నిజభూమితో మఱలఁ బుట్టి యశోదకుఁ బుత్రకుండనై
యనువుగఁ గ్రీడసల్పునపు డందగఁ జేయుదు;......॥ 27

శా॥ అంతన్ ద్వాపర మేగుదేర నట బృందారణ్యసామీప్యమా
ర్గాంతర్యూథముల గొల్లభామలగుచుం గర్మానుసారంబుగా
దాంతుల్సంయములుద్భవించి, ॥ 29

గోపికలయుదంతము నీకవి యీ రెండు పద్యములలో నెట్లు చెప్పెనో చూడుఁడు:—

ఉ॥ గొల్లలువీరు, శ్రద్ధమెయిగోవులఁ గాయుదు, రింతవృత్తి, తా
మెల్లరుఁజల్లపాల్పెరుఁగులెమ్మెయిఁగూర్చిగడించుచుందురీ
సల్లలితాబ్జలోచనలు స్వల్పసుఖంబుల నాసచేయుచుం
గల్లజగంబుఁగానని ప్రకారమతోఁ జెడి నెల్లభంగులన్॥ 33

తే॥ గీ॥ శుద్ధచైతన్యమయు పరంజ్యోతియందు
మున్నుక్రీడించు తాపసముఖ్యులయ్యు
మన్మహామాయమునిఁగిరిమాన్యమతులు
కించిదాత్మలు వీరి రక్షింపవలయు॥ 34

గోపికా విహారమును కేవలము లౌల్యమని యెంచి శ్రీకృష్ణునికి జారశిఖామణిబిరుదమును ప్రసాదించుట తగదు. గోపులాతని ధ్యాతలు, గోవిందుఁడువారికి ధ్యేయుఁడు. గోపికలాతని జారచోరగుణసంబద్ధాత్ముఁగా నెంచినను, దయామయుఁడగు శ్రీకృష్ణుఁడు మాత్రము మార్జారకిశోరన్యాయమున వారలఁ గాపాడుచునే యున్నాఁడు.

ఇట్లు చైతన్యస్వరూపుఁడగు శ్రీకృష్ణుఁడు తన బాల్యమంతయు గోపికాస్నేహరసముననే గడుపలేదనియు, కొంత కాలము యోగనిష్ఠయందును గడపెనను నభిప్రాయమీగ్రంథము చాటుచున్నది. వాస్తవమునకు సాధకుఁడు గాక యే సిద్ధుఁడు కాఁజాలఁడుగదా!

శ్రీకృష్ణుని గాథలన్నిటిలో గంభీరమైన యర్థమును ప్రకటించుటకు గ్రంథకర్త యత్నించినట్లు ఈక్రింది యుదాహరణముకూడ నొక స్ఫోరకము:—

75 వ, పద్యమునుండి కథ శ్రీకృష్ణుఁడు కాళియసర్పమును మర్దించినట్లు తెలుపుచున్నది. యోగులు తమ సాధ

నచే మూలాధారమున నిదురించు కుండలిని నుద్బోధించి సహస్రారమునకుఁదీసికొనిపోవుట యీకథకుగంభీరార్థమగునట్లుగ గ్రంథకర్తయే వ్యాఖ్యానించినాఁడు. ఈ సందర్భముననే కవి తన కళానైపుణ్యముచే "కుండలిని" "అంబుజాధారపల్వలము" మొదలగు నుచిత పదములనుగూర్చి ప్రకృత కథకు భంగము గలుగకుండఁ దత్త్వమునుజూపికృతార్థుఁడైనాఁడు.

ఇట్టి గంభీరార్థములు ఆర్షగ్రంథములలోనసంభవములు కావు. ఇట్టి వ్యాఖ్యానములు సంస్కృతమున నూతనములు కావు. కాని మఱుఁగుపడిన యీ విధానమును బయటికిఁ దెచ్చి మన పురాణముల కన్నిటికిని నిట్టి వ్యాఖ్యానములు కల్పింపఁబడినచోహిందూమతమునుగూర్చియితరులకున్న అపోహలు నశించి దాని యొక్క తత్త్వము విశదముగా గోచరింపఁ గలదు.

కృష్ణమూర్తిగారట్టిప్రయత్నమును ఆంధ్రభాషలోఁజేసిరనునది మిక్కిలి ప్రశంసనీయము. అందులోఁ బద్యమున జరిగిన ప్రయత్నము కొంతవఱకు శైలికిని ఛందస్సునకును లోఁబడి తన స్వాతంత్ర్యమును గోల్పోవలసివచ్చును. ఈ కృతి యట్లుగాక ధారాశుద్ధికలిగి అక్కడక్కడ బమ్మెర పోతన శైలిని జ్ఞప్తికిఁ దెచ్చుచున్నది. వీరిట్టి సత్ప్రయత్నము లింకను గావించి హిందూమతమునకును దేశమునకును గూడా నపారమగు సేవ చేయుటకు భగవంతుఁడు వీరి కాయురారోగ్యాదుల నొసంగుఁ గాకయని ఆశాసించుచున్నాను.

ఇట్లు,

యస్. వీరేశ్వర దీక్షితులు, ఎమ్. ఎ.

ప్రస్తావన.

"వేదభూమి" యు, ననేకులగు యోగీశ్వరులకుఁ బుట్టినిల్లునగు "భారతదేశము" నందు ద్వాపరయుగమున శ్రీకృష్ణభగవానుఁ డవతరించి ధర్మసంస్థాపనార్థముగా సర్వోపనిషత్సారసంగ్రహమగు శ్రీమద్భగవద్గీతను లోకులకుఁ బ్రసాదించియుండెను. అట్టి వేదవేద్యుని గుఱించి జనసామాన్యముగాఁ జెప్పికొనఁబడుచున్న చారచోరత్వాదిగుణదోషములను నేను వినవలసి వచ్చినప్పుడు, నాబుద్ధి కదియనువదింపక కటువుగాఁ దోచుచుండెడిది. ఇట్లుండగా నొకనాఁడొక మతాంతరుఁడు దన మతచర్చయందు శ్రీరాముఁడు హింసాపరుఁడై రాక్షసవంశనాశముసేసియుండెననియు, శ్రీకృష్ణుఁడు జారచోరశిఖామణియనియు, నిందించుచు, హిందూమతదైవములఁదీవ్రముగా ఖండించుచుండఁగా నేను విని, సహించికొనలేకపోయితిని. అట్టి విచారమునకులోనైన నేను, నిర్నిమిత్తముగా నాసహచరుఁడొకఁడు శ్రీమదాంధ్రమహాభాగవతమునందలి గజేంద్రమోక్షణమను కథను జదువుకొనుచుండఁగా, వినుట తటస్థించినది. అట్లు వినుచుండఁగా ఆగజేంద్రుఁడు దవ్వులనుండి పొడఁగాంచిన కొలనుగుఱించి వర్ణించుచుఁ బోతనామాత్యునిచే వ్రాయబఁడియున్న మత్తేభవిక్రీడితవృత్తమునందలి తుదిపదమైన "కాసారమున్" అను మాట నాచెవినిబడఁగానే, "సంసారమున్" అను అర్థోక్తి నాకకస్మాత్తుగా స్ఫురించుటసంభవించినది. అప్పుడా పాఠకు నాపద్యము మఱలఁజదువవలసినదని కోరుచు "సంసారమున్" అను పదముతో ముగించి యన్వయింపుమనఁగా, మాయిరువురకు నాయర్థముసరిపోవుచున్నట్లు దోచినది. అం

సవరణ

N. B:- 19—28 అంకెలకు మధ్యనున్న పేజీల నెంబర్లు తప్పుబడినవి, కనుక 20తో లెక్కించికొనవలయును.

పుట.	పంక్తి.	తప్పు.	ఒప్పు.
IV	16	తొల్టింటికంటె	తొల్లింటికంటె
V	16	నేలు వేలుగా	వేలు వేలుగా
4	1	విజనస్థానంబు లందుండి,సచె	విజనస్థానంబు లందుండి,చె
డిటో	2	దుష్టాసక్తింబోనాడి,	దుష్టాసక్తింబోనాడి,స
20	12	బామకొలపి	బాదుకొలిపి
34	8	శీ్రమద్భగవద్గీత	శ్రీమద్భగవద్గీత
41	14	అతురబడుచున్న	ఆతురబడుచున్న
42	9	నిమగ్మ్నలగుచు	నిమగ్నులగుచు
48	1	జెందివారై	జెందినవారై
63	14	సైర్యము	స్థైర్యము
75	17	సర్వోపనిషద్సార	సర్వోపనిషత్సార
81	9	శబ్దబహ్మమై	శబ్దబ్రహ్మమై

ప్రస్తావన.

"వేదభూమి" యు, ననేకులగు యోగీశ్వరులకుఁ బుట్టి నిల్లునగు "భారతదేశము" నందు ద్వాపరయుగమున శ్రీకృష్ణ భగవానుఁ డవతరించి ధర్మసంస్థాపనార్థముగా సర్వోపనిష త్సారసంగ్రహమగు శ్రీమద్భగవద్గీతను లోకులకుఁ బ్రసాదించి యుండెను. అట్టి వేదవేద్యుని గుఱించి జనసామాన్యముగాఁ జెప్పికొనఁబడుచున్న చారచోరత్వాదిగుణదోషములను నేను వినవలసి వచ్చినప్పుడు, నాబుద్ధి కదియనువందింపక కటువుగాఁ దోచుచుండెడిది. ఇట్లుండగా నొకనాఁ డొక మతాంతరుఁడు దన మతచర్చయందు శ్రీరాముఁడు హింసాపరుఁడై రాక్షస వంశనాశము సేసియుండెననియు, శ్రీకృష్ణుఁడు జారచోరశిఖా మణియనియు, నిందించుచు, హిందూమతదైవములఁ దీవ్రముగా ఖండించుచుండఁగా నేను విని, సహించికొనలేకపోయితిని. అట్టి విచారమునకులోనైన నేను, నిర్నిమిత్తముగా నా సహచరుఁ డొకఁడు శ్రీమదాంధ్రమహాభాగవతమునందలి గజేంద్రమోక్షణ మను కథను జదువుకొనుచుండఁగా, వినుట తటస్థించినది. అట్లు వినుచుండఁగా ఆగజేంద్రుఁడు దవ్వులనుండి పొడఁగాంచిన కొలనుగుఱించి వర్ణించుచుఁ బోతనామాత్యునిచే వ్రాయబఁడి యున్న మత్తేభవిక్రీడితవృత్తమునందలి తుదిపదమైన "కాసా రముల్" అను మాట నాచెవినిబడఁగానే, "సంసారముల్" అను అర్థోక్తి నాకతాత్తుగా స్ఫురించుటసంభవించినది. అప్పుడాపా ఠకు నాపద్యము మఱలఁజదువవలసినదని కోరుచు "సంసా రముల్" అను పదముతో ముగించి యన్వయింపుమనఁగా, మాయిరువురకు నాయర్థము సరిపోవుచున్నట్లు దోచినది. అం

తట నాఘట్టమును శ్రద్ధతోఁ బునః చదివి పోల్చిచూచికొను చుండఁగా, నర్థము సరిపోవుచు,—

"భ్రూమధ్యమునం దలి మనోమయమైన త్రికూటమను విశాలమగు పర్వతముమీద, జీవాత్మయను గజేంద్రుడు స్వేచ్ఛగా విహరించుచు, యౌవనాగమముతో విరహ తాపమును బొందినవాఁడై, సంసారమను కోమలాంగి చేత నేకాంతమునందాకర్షింపఁబడి, వివాహవిధియందు గాలుఁబెట్టఁగా, దక్షణమే అహంకారమను బలీయ మైనమకర మొకటితన్నాక్రమించికొనినదయ్యెను. అట్లు సంసారమునందుఁ దగుల్కొని పతితుఁడైన ఆవ్యక్తి అష్టమదములతోడి దురభిమానియై పౌరుషమే ప్ర ధానమని తలచి బహువిధ ప్రయాసములకులోనై వేయిసంవత్సరములుగా సాధించినను, ఆయహంకా రము దన్ను విడిచిపెట్టమిఁ, జకితుఁడై, తుదకు వివేకించి సర్వాధారుఁడైన ఈశ్వరుఁడెవ్వఁడైనా దన్ను రక్షిం పఁజాలినవాఁడసలున్నాడో లేడోయని శంకించియుఁ గృతనిశ్చయుఁడై మూఢభక్తిఁబూని మనోవాక్కా యములను త్రికరణశుద్ధితో ఆజగద్రక్షకుని శరణు బొం ది ప్రార్థింపగాఁ నామఱుక్షణములోఁ దాను విముక్తు డై తననిజస్వరూపమును మోక్షమును బొందెను"—

అని యంతరార్థము పూసగ్రుచ్చినట్లు బొడఁగట్టెను. అట్లు పదపడి విమర్శించికొని, ఆ రీతిగా భాగవతము నందలి శ్రీకృష్ణలీలలను ఘట్టమునందుఁగూడ నిట్టియంతరార్థమేమైనా యుండవచ్చునా యని యాపురాణభాగమును సాంతముగాఁ

జదువుట కారంభించితిని. అట్లు చదువుకొనుచుండఁగా, నక్కడక్కడా కొన్ని యంతరార్థములు దోచుటయేకాక, ముఖ్యముగా శ్రీకృష్ణుఁడు వ్రేపల్లెయం దేకాదశవర్షముల ప్రాయము వచ్చువఱకే పెరిగియుండెననియు, కంసవధానంతరము మధురానగరములోనే బలరామకృష్ణుల కుపనయనము జరిగి, సాందీపునియొద్దకు విద్యాభ్యాసమునకై పంపఁబడి యుండిరనియు, తరువాత శ్రీకృష్ణుఁడు రాజ్యభారమును వహించి మధురాపురిని బాలించుచుండఁగా రుక్మిణీదేవిని గళ్యాణమాడి యుండెననియు మొదలగు విశేషాంశములను గమనింపఁ గలిగితిని.

ఆ విధముగా నయ్యవతారపురుషుఁ డేకాదశవర్షముల ప్రాయము వచ్చుదనుక వ్రేపల్లెవాడలో సామాన్యమానవుని వలెనే పెరుగుచుండి, గోగోపగోపీజనమధ్యమున నిర్వర్తించిన జ్ఞానపరివర్తన ప్రకారమును వివేచించుచు, నాయోగేశ్వరేశ్వరుఁడు దన బాల్యమునందు మార్గదర్శనముగా షణ్మాస ప్రమాణముచొప్పున యోగసాధనకూడఁ జేసిసిద్ధిగాంచియుండెను విశేషాంశమును బ్రకటించుచు శ్రీమదాంధ్రమహాభాగవతపురాణమున వర్ణింపఁబడిన శ్రీకృష్ణుని బాల్యక్రీడల ననుసరించియే, నే నీ "గోపికారహస్య" మను చిన్ని పొత్తమును దొలుదొల్త నిర్వచనమైన కావ్యముగా వ్రాయఁదొడంగితిని.

ఇట్లు ప్రారంభించి ముగించిన దానిని మొదటఁ దాత్కాలికముగాఁ గొలదిప్రతులుగా మాత్రమే ముద్రింపించి పరిచయమైన వారల కొసంగుతు వచ్చితిని, కాని ఆపద్యకావ్యమును జదివిన వారల కాకవిత్వవిషయమును, పురాణగాథాప్రశంసయుఁదప్ప, అందలి విశేషాంశములైన నాభావము లవగతముగాలేదని తెలియవచ్చుటచేత నే నాలోపమును

గూడ సవరించికొనవలసియున్నదని నిశ్చయించికొంటిని. కాని ఆకాలములో సంఘటిల్లిన ప్రపంచయుద్ధము, రాష్ట్రకల్లోలములు మొదలైన కారణాంతరములవల్ల నే నీగ్రంథమును వెంటనేపూర్తిఁజేసి ప్రచురింప లేకపోయినందులకు క్షమింప వేడుకొనుచున్నాను.

అట్లు ప్రస్తుతకాలపరిస్థితులలోగూడ నీనాటికైనా ఆ ప్రయత్నమును గొనసాగించి యీ గ్రంథమైన "శ్రీగోపికారహస్య" మను ఆత్మయోగసిద్ధాంతమును దాత్పర్యవివరణసహితనిర్వచనైకాశ్వాసముగా ముగించుటకు నన్ను బ్రోత్సహించిన నామిత్రవర్గమునకును, బూర్వమునం దీ పద్యగ్రంథముపైఁ దమయపూర్వపుమన్ననను జూపుచు నుపోద్ఘాతము వ్రాసిన బ్ర॥ శ్రీ॥ శనగవరపు వీరేశ్వరదీక్షితులుగారికిని నా కృతజ్ఞతను దెలుపుచు నే నీగ్రంథమును జూపించినదే తడవుగా దీనిపైఁ దమ యమూల్యాభిప్రాయములొసఁగిన,—

1. బ్ర॥ శ్రీ॥ చాయపోలు వెంకటరామ సోమయాజులుగారికి,
2. బ్ర॥ శ్రీ॥ కురుగంటి సీతారామయ్యగారికి,
3. బ్ర॥ శ్రీ॥ రాయప్రోలు సుబ్బారావుగారికిని

నా కృతజ్ఞతానమస్కారము లర్పించుకొనుచున్నాఁడను.

ఈగ్రంథమును వ్రాయుట నాకుఁ బ్రథమ ప్రయత్నమగుటచేఁ జదువరు లిందలి తత్త్వార్థములను "హంస-క్షీర" న్యాయమునఁ బరిగ్రహించెదరు గాక యని విశ్వసించుచున్నాను.

ఇట్లు
ముముక్షుజనప్రియుఁడు,
గ్రంథకర్త.

శ్రీరస్తు.

—:కవి వంశావళి:—

సీ॥ పూరుఁడై, యమితగంభీరుఁడై, ధీరుఁడై,
పేరుఁ బొందినవాఁడు పెద్దతండ్రి
భీముఁడై, విమలనిష్కాముఁడై, రాముఁడై,
వన్నెకెక్కినవాఁడు గన్నతండ్రి
దాంతుఁడై, విపుల వేదాంతుఁడై, శాంతుఁడై,
మిన్నఁ బ్రాకినవాఁడు బిన్నతండ్రి
యోగ్యుఁడై, బహుళార్థభాగ్యుఁడై, కృషికుఁడై,
చెన్నమీఱినవాఁడు చిన్నతండ్రి
తే॥ కవనసంగీతసాహిత్య ఘనకళా వి
శారదుఁడు, యోగి, మా కడసారితండ్రి
యత్రిమునిచేఁ బ్రతిష్ఠితంబై వెలుంగు
"మునికుదురు" గ్రామవాసులు పుణ్యధనులు॥

శా॥ ఎల్లాప్రగ్గడవంశసంజనితుఁడై హృద్వీధి సద్భక్తి రా
జిల్లన్ శ్రీ 'హరిదాసు' నాఁబరఁగుచున్ "సీతా"భిధానాంచితో
త్ఫుల్లాబ్జాక్షికిఁ బ్రాణనాథుఁడయి యొప్పన్ "రామకోటయ్య" యా
సోల్లాసాత్మతృతీయపుత్రకుఁడ నాత్మోపాసనాసక్తుఁడన్

క॥ భారద్వాజ సుగోత్రుఁడ
ధారుణి 'నార్వేలశాఖఁ' దనరినవాఁడన్
పేరునను గృష్ణమూర్తిని
నారసి శ్రీగోపికారహస్యము వ్రాతున్



గ్రంథకర్త : మొదట పద్యభాగమును రచించునప్పుడు 25 వ వయస్సున్న దీసినఫోటో

శ్రీ

సద్గురుభ్యోనమః

శ్రీవిఘ్నేశ్వర ప్రార్థన

శ్రీ సిద్ధివినాయకునిన్
శ్వాసార్చితషట్చతాజపాగాయత్రున్
భాస 'వ-శ-ష-స' దళస్థున్
దాసోహంబనుచు మ్రొక్కెదన్ తొలివేల్పున్॥

శ్రీసరస్వతీ ప్రార్థన

శ్రీలలితాంగుళీప్రచురరేఖలనొప్పెసలారు తంత్రికా
లోల, విలోలలోచన, సరోజజు ముద్దులగుమ్మ, వాక్సుధా
జాలవిలాసవర్తిని, విశాలజగన్నుతశీల, శారదా
బాలఁ దలంచెదన్ మది సుభావపదైక కవిత్వసిద్ధికిన్॥

సిద్ధపురుషుల ప్రార్థన

వ్యష్టిస్థమైన యాత్మ స
మష్టిని బరమాత్మయై సమస్తజగంబున్
పుష్టింజేయును గావున
సృష్టిపరంపరఁగ ముక్తజీవులఁ గొలుతున్.

శ్రీ

సచ్చిదానంద పరబ్రహ్మణేనమః


—:భగవత్ప్రార్థన:—


పార్థా!

స"దోం" తదవ్యాకృతమూలప్ర
కృతిఁబొంది జీవుఁడై తతమహాజ్ఞ
నిత లింగదేహ భాసితుఁడై జడాత్మక
మయిన స్థూలాది దేహంబులందు
నెనరొప్ప నేకాదశేంద్రియవ్యసనుఁడై
తన్నెఱుంగక కర్మతంతుఁడగుచుఁ
జంచలంబైన సంసారప్రయుక్తిచే
బాల్యాది భౌతికావస్థ లమరి
క్రీడ సలుపుచుఁ దిరిగి స్వకృతసుకర్మ
నప్రతిహతైక వైరాగ్య మలవరించి
కర్మనంటక మెలఁగి సంస్కార మొందు
నని ప్రబోధించు "భగవంతు" నాశ్రయింతు॥

"ఐశ్వర్యస్య సమగ్రస్య ధర్మస్య యశస శ్రియః
జ్ఞాన వైరాగ్యయో శ్చైవ షణ్ణాం భగ ఇ తీరణా॥

అనఁగా సమగ్రమైన ఐశ్వర్యము, ధర్మము, యశస్సు, సంపత్తి, జ్ఞానము, వైరాగ్యము అను నీయాఱు లక్షణములు గలిగినవాఁడే భగవంతుఁడని శ్రుతులందుఁజెప్పఁబడియున్నది. కావున ఓంకారవాచ్యుఁడైన నిరాకారపరబ్రహ్మ మనునది కేవలము జడస్వరూపమైన వస్తువుగాక, యీషడైశ్వర్యముల చేనొప్పి యున్న జ్యోతిస్స్వరూపమని విశదమగుచున్నది. ముఖ్యముగా, ఐశ్వర్యముతోడి జ్ఞానవైరాగ్యములని వివరింపఁబడి యుండుటచేత ఆపరబ్రహ్మమునందు కర్మ చేయుచుండుట అనుస్వభావము సిద్ధమగుచు ఆరీతిగా విశ్వమంతయుఁ గల్పించికొని జగన్నాటక సూత్రధారియై క్రీడించుచున్నాఁడనియే స్పష్టమగుచున్నది.


అనిర్దేశ్యమైన అఖండ పరిపూర్ణ నిర్గుణ పరబ్రహ్మము
విజ్ఞానము
పరమానందము
అణు బీజం
అణు మాత్ర నిత్యానంద నిర్గుణ పురుషుడు
విదేహ ముక్తి
జీవన్ముక్తి
సత్
చిత్
ఆనందము
తెలివి
సుఖము


1
2
3
4
5
6
8
9
10
11
12
16
17
18
19
20
21
1. నిర్గుణ పురుషుడు
2. ప్రాణమయకోశము.

3. కారణము (ఆకారము) (సూక్ష్మసమాధి)

ఆణుస్వరూపము

అహంకారము
(లేక)
కారణ శరీరము

(నిరాకారము)



మూలప్రకృతి
(లేక) అవిద్యనాశం
జీవాత్మ
(అనగా: ఎఱుక)

చిత్తము

(సాకారము)

అణుస్వరూపము

సూక్ష్మ శరీరము

2. సూక్ష్మము (సాకారము)


5. అగ్ని తత్వ అణు పదార్థము
4. ఆకాశ తత్వ ధ్వని పదార్థము
3. వాయు తత్వ చలన పదార్థము
2. జల తత్వ రస పదార్థము
1. పృథ్వీ తత్వ ఘన పదార్థము

స్థూల శరీరము

1. స్థూలము (సాకారము)

(పశు పక్ష్యాది జంగమ ప్రకృతి)
(వృక్షలతాది స్థావర ప్రకృతి)

4. సహస్రారము.
5. అష్టదళ పద్మము.
6. అగ్నిమండలము.
7. సూర్యమండలము
8. చంద్రమండలము
9. ఆనందమయకోశము (లేక)
ఆజ్ఞా చక్రము.
10. విద్య (లేక) చిచ్ఛక్తి యను
శుద్ధ మాయా శక్తి.
11. పింగళా నాడి (కుడి)
12. ఇడానాడి (ఎడమ)
13. సుషుమ్నా నాడి.
14. మూలాధార చక్రము.
15. స్వాధిష్ఠాన చక్రము.
16. మణిపూరక చక్రము.
17. అనాహత చక్రము.
18. విశుద్ధ చక్రము.
19. బ్రహ్మనాడి.
20. అమృతనాడి.
21. హృదయకమలము
(జీవాత్మ)
22. అవిద్య (లేక) మూలప్రకృతి



14

వివరణ :—

నిరాకారాఖండ నిర్గుణ పరబ్రహ్మము నుండి జీవాత్మ యనున దేవిధముగా సంకల్పింపబడి మూలప్రకృతిలో వ్యాపకమైనదియు, నెదుట నున్న ప్రకృతిపటము నందు జూపింపబడి యున్నది.

అందు మొదట నట్టిట్టిదనరాని అఖండ పరిపూర్ణ నిర్గుణ పరబ్రహ్మ మాద్యంతములు లేక నిండి యున్నదని గ్రహింపవలసి యున్నది. అట్టి అవ్యక్త పరబ్రహ్మమునే ఓం-అనియు, తత్-అనియు, సత్-అనియు మూడు విధములుగా వాచ్యార్థము నందు శృతులామోదించి పిలచుచున్నవి. ఆరీతిగా బ్రహ్మర్షులైన వారా అవ్యక్తపరబ్రహ్మ మెట్లున్నదా యని విమర్శించి కొనియు, నెక్కువగా దర్శించ జాలక, అఖండమైన జ్ఞానానందమహత్స్వరూపముగా నున్నదని మాత్రమే వ్రాక్కుచ్చి యున్నారు. అనగా అఖండముగా నున్న మహత్తు, అఖండముగా నున్న బ్రహ్మజ్ఞానము, అఖండముగా నున్న బ్రహ్మానందము నను వస్తువిశేషము లేకరసమై అయ్యఖండ పరిపూర్ణ పరబ్రహ్మముగా నొప్పి యున్నదని తెల్సికొనగలిగిరి. ఆ మహత్తు, బ్రహ్మజ్ఞానము, బ్రహ్మానందము నను నవి, మూడును ననంతములైన వస్తువిశేషములనియే చెప్పికొనవలసి యున్నది గాని, వాటిని వస్తువిశేషణములని యర్థము సేయగూడదు. అనగా నవ్యక్త పరబ్రహ్మమను వస్తువొకటి వేఱుగా నుండి ఆవస్తువున కీ మూడును గుణములుగ నున్నవని యన్వయింప వీలు లేక, యీ మూడు మహారసములు గలిసి యేకమైయుండియే

పరబ్రహ్మముగా నొప్పి యున్నదని చెప్పికొనవలసియున్నది.

ఇప్పుడొక మారు పై పటము నందు జూపించిన భాగ విభాగములను గమనింపుడు. అందు దేహప్రకృతి, ఇంద్రియ ప్రకృతి, మనః ప్రకృతి, బుద్ధి ప్రకృతి యను నీ మెట్టులను గ్రమముగా నధిగమించి, నిర్వాణపదము, పరనిర్వాణపదము మహాపరనిర్వాణపదము లను మెట్టులు సూచింపబడి యున్నవి. ఈ మెట్టులు వరుసగా నొక దానికంటె మఱొక టిగా సూక్ష్మములై యుండి, యుచ్చస్థానములుగా నున్నవి. అట్లు చూపింపబడి యున్న యీ యేడు మెట్లును రెండేసి విభాగములుగా జేయబడి యుండి, పై భాగము, క్రింది భాగ మని గ్రహింపవలసి యున్నది. అట్లాయవ్యక్తపరబ్రహ్మము మహర్షులచేత దెలిసికొనబడి యున్నట్లుగా, మహానిర్వాణ పదమునందు మూడు చక్రములు వేఱు వేఱుగా నొక్కే పై భాగమున జూపబడి యున్నవి. వాటిని గ్రమముగా మహత్, బ్రహ్మజ్ఞానము, బ్రహ్మానందమని చెప్పికొనిన, మహత్ అనునది మాత్రమా పై భాగము నుండి క్రిందికి దిగక యుం డగా, బ్రహ్మజ్ఞాన మనునది పరనిర్వాణ పదమ నందలి పై భాగము వరకు మాత్రము వచ్చి నిలబడుచుండి, బ్రహ్మానంద మనునది 5 వ మెట్టుగా నున్న నిర్వాణపదము యొక్క పై భాగము వరకు వ్యాపించు చున్నది. అట్లు పటము నందు జుక్కలు బెట్టి చూపబడి యున్నది. చూడుడు. ఆ విధముగా నణుబీజముగా నిర్వాణపదము వరకు దిగివచ్చిన బ్రహ్మానంద రస మొక్కటియే ఆ యవ్యక్తపరబ్రహ్మము యొక్క అంశ యని చెప్పికొనిన, ఆ అఖండ స్వరూపమును ఖండించి

వేలు చేసినట్లగుచున్నది. కనుక అది పూర్ణాంశ గానే యున్నదని గ్రహించుటకు మహత్ చక్రము నుండి వేటవా లుగా జూపియున్న గీట్ల ననుసరించి, ఆ మహత్తును, విజ్ఞాన మును, నిర్వాణ పదమున కందరాక యున్నను, ఆ అణుబీజ ముగా దిగివచ్చిన ఆనందరసమునందు దమ యఖండస్వభా వముతో నిమిడియే యున్నవని తెలిసికొన వలసి యున్నది. అట్టి యా జ్ఞానానందమహద్రసమగు నవ్యక్తపరబ్రహ్మము యొక్క యేకాంశమైన యీయణుమాత్ర నిత్యానంద నిర్గుణ పురుషుడే గుణమయమగు నీ విశ్వమంతయు సృష్టించి ధరిం చికొని యున్నాడు.

"అథవా బహునైతేన కింజ్ఞాతేన తవార్జున ।
విష్టభ్యాహ మిదంకృత్స్న మేకాంశేన స్థితో జగత్॥

(శ్రీమద్భగవద్గీత)

ఓ యర్జునా ! నా విభూతుల నే నెంతని శ్రమపడి నీకు వివరింప గలను. నీ వెంతని యోపికతో వినగలుగుదువు. నే నీచరాచరమయ్యమైన యావద్విశ్వమును నేకాంశముచేతనే సృజించి ధరించి యున్నాడను.

అట్లా నిర్గుణ పరబ్రహ్మము ఏ తనయొక్క శక్తిచేత నవ్యక్తము నుండి వ్యక్తమును సంకల్పించెనో, ఆ చిచ్ఛక్తియే విద్య యనియు, శుద్ధమాయాశక్తి యనియు బిలువబడి యున్నది. అట్టి వ్యక్తావ్యక్తసమ్మేళనమైన యా చిచ్ఛ క్తియు ననంతము గానే యున్నదని చూపుచు, పట్టము

నందలి నిర్వాణ పదములోని మధ్యభాగములో చిన్నచిన్న యడ్డగీట్ల మధ్య వ్రాయబడియున్నది. గమనింపుడు. ఈ శుద్ధ మాయా శక్తిని గడచిన ముక్తాత్ములు విదేహముక్తి నొందిన వారలై నిత్యానంద ప్రధానముగా వెలుగ బడుచున్న యా అణుమాత్ర నిర్గుణ పురుషునిలో నైక్యము బొందుచు బునరావృత్తి లేని నిర్వాణ మొంది నిత్యసిద్ధులగు చున్నారు.

ఈ నిత్యసిద్ధులును నొకొక్కప్పుడు పరబ్రహ్మముచే నాదేశింపబడి ధర్మ పోషణకై మరల బుట్ట వచ్చును. కాని ఆ జీవాత్మ తొల్లింటి జీవాత్మయే యని చెప్ప వీలులేదు. సముద్రము నందలి తరంగ మొక మా టాసముద్రజలములో నణగిపోయిన, మరల నా తరంగమే లేచి రాజాలదు. ఒక వేళ నదే తరంగము మరల బయటికి వచ్చునది యైనను, మొదటి స్వరూపము కంటె పెద్దదిగానో లేక చిన్నదిగానో యుండుటయే సంభవింపవలసి యున్నది. అట్లే పరబ్రహ్మైక్యము నొందిన జీవుడు లోకోపకారార్థమై తిరిగి జన్మింపవలసి వచ్చిననూ, తొల్లింటికంటె భిన్నరూపముగానే భగవంతునిచే సంకల్పింపబడి జ్ఞానానందమహాత్స్వరూపుడై ప్రహ్లాద నారదాది నిత్యసిద్ధుల వలె నాజన్మజ్ఞానిగానే పుట్టుచు, దన ధర్మరక్షణ ముగించికొనగానే మరల బ్రహ్మైక్యమునే పొందుచున్నాడు.

ఈ చిచ్ఛక్తి నుండి సత్త్వరజస్తమో గుణము లనునవి ప్రభవించి నందువలన, ఆ నిర్గుణ పురుషుడు సగుణపురుషుడై అణుస్వరూపమునొంది శక్తిప్రధానముగా నిలచియున్నాడు.

అనగా, ఆ సగుణ బ్రహ్మమునందు గూడా మహత్తు, బ్రహ్మ జ్ఞానము, బ్రహ్మానంద మను మూడు విశేషము లా యవ్యక్త పరబ్రహ్మము నుండి మూర్తీభవించినదే యున్నను, యవి బుద్ధికి గ్రాహ్యములుగా నుండుటకు వీలులేమి, ఆసగుణబ్రహ్మ మందు విశేషముగా భాసమానమైన యీశక్తి బీజమునే ముముక్షు డెఱిగికొనుచున్నాడు. అట్టి సగుణబ్రహ్మ సాక్షాత్కారముతోనే సాధకుడు జీవన్ముక్తుడై మోక్షాధికారి యగుచు, ప్రారబ్ధకర్మ క్షయముతో విదేహ ముక్తిని బొంది నిత్యానందనిర్గుణపురుషునిలో నైక్యము నొందుచున్నాడు.

అట్లు శక్తి ప్రధానముగా గోచరించు నీ సగుణ బ్రహ్మమందు గూడా అవ్యక్తపరబ్రహ్మస్వరూపమైన జ్ఞానానందమహద్రసములు మిక్కిలి సూక్ష్మీకరణము నొంది యున్నను, యా లక్షణములను స్వభావ మాత్రముగా నైనా గ్రహింపవలసి యున్నది. ఆరీతిగా బటమునందు మూడు మూడేసి చక్రములతోనే సత్, చిత్, ఆనందములను మూడు రసములు వేఱువేఱుగా గ్రహింపబడియున్నవి. ఈ మూటిని నిర్వాణపదమునందలి జీవన్ముక్తి యను క్రింది భాగమున వరుసగానే చూపించికొనుచు, వాటి యేకత్వమును గూడా గ్రహించుకొనుచున్నాము.

ఇప్పుడివి క్రింద నున్న బుద్ధిప్రకృతి యను నొక్క మెట్టులోనే వికారము జెందుచున్న విశేషమునుగమనింపుడు. సత్- అను రసము మాత్రము బుద్ధిప్రకృతి కతీతము గానే నిలిచియున్నది. కాని, చిత్- అనునది మధ్య భాగము వరకు

దిగుచు "తెలివి" యను విరూపము నొంది యున్నది. ఆనంద-మనునది కూడా బుద్ధిప్రకృతిలోని మధ్యభాగము నందు 'సుఖ' రస మను రూపముగా మార్పు జెందుచు, క్రింది మెట్టయిన మనః ప్రకృతి లోని పై భాగమగు కారణశరీరమువరకు క్షీణించి, అవిద్య (లేక) మూల ప్రకృతి యొక్క స్వభావమైన యింద్రియ శక్తులచేత నావరింపబడియున్నది. అట్లాసత్తా మాత్రుడైన సగుణపురుషుడు బుద్ధి ప్రకృతిద్వారా వ్యాపించి మూలప్రకృతిస్వరూపమైన కర్మేంద్రియ జ్ఞానేంద్రియ శక్తుల యొక్క సంఘర్షణ బొంది జీవాత్మ (లేక) ఎఱుక మాత్రము గా నిలబడి యున్నాడు. ఆ ఎఱుకయు ప్రక్షీణమైన సుఖ బీజముతో మనః ప్రకృతి యొక్క నిరాకార భావమునందే గోచరించుట చేత, పాంచభౌతికస్థూలదేహోపాధి నొందిన జీవాత్మ జాగ్రదావస్థలో నిరాకారభావము నసలే స్మరింప బోమి నందలి సుఖప్రపత్తిని గూడ బొత్తిగా గ్రహింపక, కర్మేంద్రియజ్ఞానేంద్రియ కార్యమైన యింద్రియ శక్తుల ద్వారా సులభసాధ్యములుగా నున్న బాహ్యార్థముల నపేక్షించుచున్నాడు.

అట్లాయవ్యక్త పరబ్రహ్మమే లీలామయుడై సంకల్ప మాత్రముతో దన యధీనమునందున్న విద్య, 'అవిద్య యను శక్తి విశేషములం దేకాంశ మాత్రముగానే ప్రవేశించి విశ్వమంతయు నెలకొల్పికొని జీవాత్ముడై యావిర్భవించి వర్ణ రూపప్రధానముగానున్న నానావిధ దేహోపాధుల ధరించి విస్తరిల్లి విహరించు చున్నాడు.

ఆ విధముగా సంభవించిన జీవాత్మ తన యొక్క మనో బుద్ధులీ పాంచభౌతికమైన సాకార లక్షణ దోషము బొందగా వ్యష్టిభావమైన యహంకారమును జెందినవాడై, తానాపరబ్రహ్మాంశగా నున్న నిజ లక్షణమునే మఱచి దేహాత్మాభిమానియై, కర్తృత్వ భోక్తృత్వాది కర్మకలాపము నారోపించికొని, జనన మరణాది రూపమైన సంసారచక్రము నందు బరిభ్రమించుచు, ధన దారా పుత్రులను ఈషణత్రయ బాధితుడై బాల్య యౌవన కౌమారాద్యవస్థల నొందుచు, శిశ్నోదర పరాయణుడై జీవయాత్రల నడపుకొనుచున్నాడు. అనగా నిట్టి కర్మ దోషమంతయు దన కర్తృత్వ కార్యమైన దేహాభిమానమునుండియే కలుగుచున్నది. కాని యాదోష మాకర్మలకు గాని, తన యాత్మస్వరూపమునకు గాని చెంది యుండలేదు. అట్టి జనన మరణ హేతువైన దురభిమాన దోష మునకు దన బుద్ధీంద్రియమే కారణముగా నున్నది. కావున నాబుద్ధితో నిటు నిహవిషయముగా గర్మఫల త్యాగియగుచు నటు బరవిషయముగా భక్తి ప్రధానముగా నుండిన, దాను దన నిజ స్వరూపము నెఱిగికొనగలుగుచున్నాడని స్పష్ట మగుచున్నది.

ఆ విధముగా మనుష్య మాత్రుడైన జీవుని యొక్క లక్షణములను బటము నందలి దేహ ప్రకృతి యను మెట్టులో దెలిసికొనియుంటిమి. కాని, యీపాంచభౌతికసృష్టిజాలము నందలి మిగిలిన జీవరాసులను మాత్రము వేఱుగా నింకొక మెట్టుక్రిందగానే చూపవలసి వచ్చినది. ఎందువల్ల ననగా, ఆ ప్రకృతులలోని జీవరాసుల యొక్క యింద్రియ శక్తులా

దేహములలో జడస్వభావముగా నుండి, మానవ దేహములో ప్రకాశించి యుండుటయే గాక, ఆ జీవస్వరూపము గూడా మానవ శరీరమునందే పూర్ణ స్థితిలో నిలబడుచున్నది కాని, చతుష్పాద బహుపాద జలచర భూచర జంతు జాలములందు గాని, వృక్షలతాది స్థావర ప్రకృతియందు గాని, అట్లు సమగ్ర ముగా వ్యష్టిరూపము గలిగి యుండుట లేదు. అనగా నీ స్థావర జంగమ ప్రకృతులలో ప్రతియొక్క దేహోపాధి యందు నొ క్కొక్క జీవాత్మగా వ్యాపింపక, జీవుడు సమూహ దేహి యగుచున్నాడు. అనగా నొక్క జీవాత్మయే కొన్ని దేహముల సముదాయమునందు ప్రవేశించి, పరివర్తన బొందు చున్నాడు. ఎట్లనగా, ఒక భాండము నందలి శుద్ధ జలమును వేలు వేలు చిన్న చిన్న పాత్రిలలో బోసిన, నాయా పాత్రల లోని నీ రా యాపాత్రిల యొక్క దోషములతో సంకరము నొందుచున్నది. అట్టి యా పాత్రలలోని నీరును మరల గలియ బోసిన, ఆసంకరమంతయు నేకమగుచున్నది. అట్లే జీవులు దమ సమూహమునకు జెందియున్న కొన్ని కొన్ని స్వభావజనితములగు లక్షణముల తోనే పుట్టుచున్నవి. ఉదా హరణముగా నీటిలో సంచరించెడి బాతుయొక్క గ్రుడ్డును నీటికి భయపడు కోడిపెట్టయే పొదిగియుండినను, ఆ గ్రుడ్డు నుండి బైట బడగానే యా బాతుపిల్ల నిర్భయముగా నీటిలో నికే ప్రవేశించి స్వేచ్ఛగా నీదులాడుచున్నది. ఈవిధముగా నీగలు, దోమలు, చీమలు, మొదలగునవి గుంపులు గుంపులు గానే పుట్టి పొరలుచున్నవి. అట్లే పక్షులు, పశువులు, మొదలైన యుచ్చ జాతులందు గూడా చాలునకు రెండు,

మూడుగా సహజముగానే పుట్టుచున్నవి. ఇక వృక్షలతాదుల విషయమున్ననో వేఱుగా జెప్ప నక్కఱయే లేదు. ఆరీతిగా సమూహదేహి యైన జీవాత్మ యేదో యొక పెంపుడు జంతువువలె బరిగణింపబడినప్పుడు, మానవప్రకృతిలక్షణము లందు దిగుచు సంకర్షణ బొంది, కుక్క, గుఱ్ఱము, మొద లగు జంతువులవలె విశ్వాసహేతురూపమైన కార్యాలోచ నకు లోనై బలాత్కారముగా జిత్త విజృంభణము నొందిన మీద, తన దేహసమూహమునకు దెగిపోయి విడిగా సమగ్ర మైన జీవాత్మగానే నిలిచిపోవుచు, మానవత్వము నొంది క్రమముగా నుచ్చస్థితికి బోవుచున్నాడు.

అట్టి సంపూర్ణమైన జీవస్వరూపము గల మానవ దేహమునందా పరబ్రహ్మస్వరూప మెట్లు ప్రవేశించియున్నది తెలిసికొన గలుగుటకుగాను, ఆ ప్రకృతి పటములో వేఱుగా జూపబడి యున్న నాడీపటము నించుక గమనింప వలసి యున్నది.

ఆ నాడీ పటమునందు నెం. 1 అను గుర్తుతో జూప బడియున్న నిర్గుణపురుషుడు, ఆ ప్రకృతిపటములోని నిర్వాణ పదము యొక్క విదేహముక్తి యను పైభాగమందు జూప బడియున్న అణుమాత్ర నిత్యానందనిర్గుణపురుషుడే యని యెఱుంగ నగును. ఆ నిర్గుణపురుషు డట్లు ప్రాణమయకోశము నుండి, ఆనందమయ కోశములో నున్న రెండు కన్నులయొక్క

నల్లగుడ్డులందు బ్రివేశించి వర్ణరూపపరిధానముతో సూక్ష్మ ప్రపంచమును జూచి యానందించుచుండుటయే కాక, అన్య నాడిద్వారా హృదయకమలమునందలి జీవాత్మను సదా లాగ పట్టుకొని యున్నాడు. అదేవిధముగా ఆనిర్గుణ పురుషునుండ బైలుదేరిన నెం. 10 అగు చిచ్ఛక్తి యను శుద్ధమాయాశ జ్ఞాననేత్రమైన అగ్నిమండలము నందు నివసించుచు, అష్టదళ పద్మమునుండి సంతతధారగా స్రవించుచుండెడి యమృతము నాస్వాదన చేయుచుండుటయే కాక, శ్వాసను ఇడా పింగళా నాడుల ద్వారా ఝామున కొకమారుగా మార్చి దినమునకు 21, 600 చొప్పున నాడించుచు, ఆజ్ఞాచక్రము నందలి రెండ దళములతో సంకల్పవికల్పములను కలిగించు చున్నది. అదే విధముగా ఆనిర్గుణపురుషునుండి ప్రభవించిన అవిద్యారూప మైన మూలప్రికృతి, కుండలినీశక్తి యన బరగుచు, వెన్నె ముక యందు (పటములో నిలువు గీట్లతో సూచింపబడి యున్నది) గపాలము నుండి మూలాధారము వరకు వ్యాపిం చియున్న నెం. 19. 13. సుషుమ్నా (లేక) బ్రహ్మనాడి యను సన్నని నరము ద్వారా నధోముఖగా నడచి, నెం. 14 అగు మూలాధార చక్రిమునందు వసించి నిద్రించుచుండుటయే కాక, తల్లక్షణమైన కర్మేంద్రియ జ్ఞానేంద్రియ ప్రకారమైన ప్రాణశక్తిని నెం. 15 అగు స్వాధిష్ఠాన చక్రమునుండి బైలు దేరిన 72000 నాడుల ద్వారా శరీరమంతయు వ్యాపింప జేయుచున్నది.

ఇట్టి శరీర తత్వములో నివృత్తిమార్గమునందు సాధకుని యొక్క నాడీ కూటము నందుద్భవించు వైష్ణవ జ్వర మను

ఱష్ణము చేత నా కుండలినీశక్తి మూలాధార చక్రము నుండి లేచి యూర్ధ్వముగా గదలి బ్రాకుచు ఆజ్ఞాచక్రము నుండి సూర్యమండలమను పేరిటి అర్చిరాదిమార్గముగా అష్టదళ పద్మము సొచ్చి సగుణ బ్రహ్మసాక్షాత్కారమను సిద్ధి నొసగు చున్నది. ఈ కుండలినీశక్తి నెం. 8 అగు చంద్రమండల ములోనికి బోయిన, మోక్షదూరుడై పునర్జన్మము నొందు చున్నాడు. అట్టి కుండలినీశక్తి సహస్రార మందలి ప్రాణమయ కోశమునుగూడా ప్రవేశించిన దక్షిణమే కపాల మోక్షమై అమృతనాడి ద్వారా జీవాత్మ పరమాత్మలో నైక్య మగుచు విదేహముక్తి యను నిర్వికల్పసమాధి సిద్ధించు చున్నది. అట్టి విదేహ ముక్తి నుండి మఱలి వచ్చిన నిత్య సిదులగు పరమహంసలకు నెం. 3 అగు శుక్ల పేటిక యందేర్పడు "ఓజస్సు" అను తేజోరసము భూత భవిష్యద్వర్త మానమను కాలజ్ఞానము నొసగుచు ఋషీంద్రుల జేయు చున్నది. ఆ ఓజశ్శక్తియు దా నస్ఖలితబ్రహ్మచర్య విధిగా సేకరించి యుంచికొనిన శుక్ల ప్రమాణముగా నేర్పడుచు నామహర్షిని ఒక నెల, ఒకవర్షము, ఒకయుగము, ఒకమహా యుగమునను పరిణామభేదములతో త్రికాల వేదిని జేసి బ్రహ్మ ర్షిగా బ్రకాశింప జేయుచున్నదనియు నుపనిషద్వాక్యములందు జెప్పబడి యున్నది.

ఇట్టి యీ జీవాత్మ పరమాత్మల సంబంధమును వివే చించు విషయమున 1. సాంఖ్యమార్గము, 2 బౌద్ధమతము, 3. పూర్వ మీమాంస, 4. యోగ సిద్ధాంతము, 5. తర్క

శాస్త్రము, 6. ఉత్తర మీమాంస, (లేక) వేదాంతము అను నీ యారు మార్గములును బూర్వము నుండియు ప్రచారములుగా నున్నవి. అవి యెట్టివనగా:—

1. సాంఖ్య మార్గము : ఇది కపిల మహర్షి చేత స్థాపింపబడెను. ఈ మతమునందు ఈశ్వరుడన వేఱుగా లేక పరమాత్మయే పురుషుడై యున్నాడు. ఆ పురుషుడును ప్రకృతియు గలిసి ప్రపంచ మగుచున్నది. ఆత్మయైన పురుషుడు నిమిత్త మాత్రముగా నుండి ముక్తి సమయమున ప్రకృతినుండి వేఱగుచు కైవల్యము నొందుచున్నాడు. ఆత్మ కుంటివాని వలెను ప్రకృతి గ్రుడ్డివాని వలెను యుండి, నడువ జాలని కుంటివానిని దాను మోసికొని పోవుటకు సిద్ధమైనచో ఈ గ్రుడ్డివానికి కుంటివాడు త్రోవ జూపికొనుచున్నాడు. ఆవిధముగా ఆత్మ ప్రకృతి నుపాధిగా జేసికొని ప్రపంచమును గల్పించుకొనుచున్నది. యజ్ఞాది కర్మలచేత ముక్తి లేదు. పరోపకారాదుల చేతనే మోక్షము గలుగుచున్నది.

2. బౌద్ధ మతము : దీనిని స్థాపించినది సుగతుడు. శాక్యుడు ప్రచారకుడయ్యెను. జీవేశ్వరుల విషయము అవాఙ్మానసగోచరములు గావున ఆ విమర్శన మనావశ్యకము. ప్రత్యక్షానుమానములే ప్రమాణములు గాని, వేదశబ్దములు ప్రమాణములు గావు. ఈ బౌద్ధమతము నుండి నాలుగు శాఖలు వెలువడినవి. 1. సర్వం దుఃఖం దుఃఖం-అనగా దుఃఖవాదులు, 2. సర్వం క్షణికం క్షణికం-అనగా క్షణికవాదులు,

3. సర్వం స్వలక్షణం స్వలక్షణం-అనగా స్వలక్షణవాదులు,
4. సర్వం శూన్యం శూన్యం-అనగా శూన్యవాదులు.

ఈ సర్వశూన్యవాదులలోను నాలుగు తెగలుగలవు:
1. యోగాచార్యులు, 2. మాధ్యమికులు, 3. సౌత్రాంతికులు 4. వైభాషికులు. మొదటి తెగవారు బాహ్య శూన్యత్వము నొప్పుకొని, విజ్ఞానమే సత్యమనిరి. మాధ్యమికులు సర్వము శూన్యమనిరి. మూడవ తెగవారు బాహ్యార్థములు కేవలము అనుమేయములే కాని ప్రత్యక్షములు గావనిరి. వైభాషికులు బాహ్యార్థములే ప్రత్యక్షములనియు, విజ్ఞానమే అనుమేయమనియు ప్రతిపాదించిరి. అట్లు బౌద్ధులు మొత్తము మీద శూన్యవాదులనియు, బాహ్యవాదులు (లేక) బాహ్యకులనియు రెండు శాఖలైరి.

బౌద్ధమతసిద్ధాంతములరీత్యా మానవునకు దా జేయు కర్మ ముఖ్యము. తాను చేయు ప్రతియొక్క పనియు కర్మయే యగుచున్నది. కర్మకు ఫలము తప్పదు గనుక దాని ననుభవించుటకై మరల జన్మ కలుగుచున్నది. కావున జన్మరాహిత్యమునకు గర్మనే సన్యసించుట ముఖ్యము. అట్లు జీవుడు శూన్యత్వము (లేక) నిర్వాణమును బొంది శాంతినొందుచున్నాడు.

2. పూర్వ మీమాంస : ప్రవక్త జైమినిమహర్షి-ఈ మతప్రకారముగా నటు సాంఖ్యముగాని, యిటు బౌద్ధమతము గాని ముక్తినొసంగవు. వేదమంతయు ధర్మమునకుమూలము. సనాతనధర్మములే యాచారములు. వేదోదిత నిత్యనైమిత్తిక

కర్మములే యొక ధర్మమను దేవతావిశేషమున నావిర్భవించి మరణానంతరము స్వర్గ సుఖముల నిచ్చును.

4. యోగ సిద్ధాంతము : ప్రవక్త పతంజలి మహర్షి. ప్రాణాయామాద్యష్టాంగ యోగసాధనచే నంతరింద్రియములను బాహ్యేంద్రియములను వశపఱచికొని, చిత్త వృత్తుల నిరోధించి, సమాధి నిష్ఠాగరిష్ఠుడై కైవల్యము నొందవలయు ననుట. చిత్తైకాగ్రత బొందుటకుగాను, అనేక విధములుగా ప్రతీకములను (అనగా ధ్యానము చేయుటకు ఆకారములను) గల్పించికొని సాధన చేయవలెను. అట్లు ఒక్కొక్క వస్తువుపై ధారణ, ధ్యానము, సమాధిని బొందిన సంయమించినవా డగుచున్నాడు.

5. తర్కశాస్త్రము : ఇది రెండువిధములు, 1. న్యాయ దర్శనము, 2. వైశేషికము.

1. న్యాయ దర్శనము:- ప్రవక్త గౌతముడు. యథార్థ జ్ఞానమునకు ప్రత్యక్షము, అనుమానము, ఉపమానము లను గుఱించి చెప్పుచు నెదుటి పక్షము వారి సిద్ధాంతములను ఖండించు యుక్తులు గలది. ఇందు ఈశ్వరతత్వము లేదు.

2. వైశేషికము: ప్రవక్త కణాదుడు. ఇదియు న్యాయదర్శనమువంటిదే, కాని పరమాణువాదము. జగత్తు అణుమయము. సుఖదుఃఖములు, ఔషధములు, ప్రళయము అన్నియు అణు కారణములు. ఇదియు నిరీశ్వరమతము.

3. ఉత్తర మీమాంస (లేక) వేదాంతము (జ్ఞానకాండ)

స్థాపకుడు వేదవ్యాసుడు. జీవాత్మ పరమాత్మ సంబంధము లగు నుపనిషద్వాక్యముల నేరి బాదరాయణుడు బ్రహ్మసూత్రముల నొనరించెను.

ఈ వేదాంతము నుండి 1. ద్వైతము, 2. అద్వైతము, 3. విశిష్టాద్వైతము, లను అభిప్రాయభేదములు ప్రవర్తిల్లెను. కాని యీ మూడును ఆస్తిక మతములే.

1. ద్వైత మనగా జీవుడెప్పుడును ఈశ్వరుడు గాజాలడు. ఆతనా శరీరముతో బరలోకమున ననుభవించును. ఎక్కువ పుణ్యముచే ఈశ్వర సాన్నిధ్యము బొందును.

2. అద్వైత మనగా జీవుడు ఈశ్వరుడే యై యున్నాడు. కాని తాను మాయచేత గప్పబడి తన నిజత్వమును మఱచి యహంభావమును బొంది దేహాభిమానియై, కర్తృత్వ భోక్తృత్వముల నారోపించికొను చున్నాడు. పుణ్యాతిశయముచే మఱల దేహాభిమానమును అహంకారమును వదలిన తన సచ్చిదానందస్వరూపము నెఱుగుచున్నాడు. సగుణోపాసన కే దేవుడైననూ నొకటియే.

3. విశిష్టాద్వైత మనగా జీవు డీశ్వరుడు గా నేరడు. ముక్తియందు సాటిరూపమును మాత్రము బొందును. ఈ మతస్థులు గొందరు విష్ణు పరముగా వైష్ణవు లనియు, శివ పరముగా శైవులనియు పిలువబడిరి.

ఇట్లభిప్రాయ భేదములతో ననేకమతములు ప్రచారములోనికి వచ్చిననూ యీ మతములన్నియు యథాస్థితిలో జీవు

డు పతితుడై క్షుద్రావస్థలో నున్నాడనియు, తాను ప్రయత్నించిన ఉచ్ఛదశకు బోగలడనియు నొక సర్వసామాన్యమైన సూత్రము ననుసరించియే యున్నవి. అట్లు సృష్టి యందలి నానావిధ జీవరాసులలో, మానవజన్మయే సర్వోత్కృష్టమై యున్నది. అదియు కలియుగప్రమాణముతో నూరువత్సరముల పరిమితి నొంది యున్నది. అందు సగము నిద్రలో లయమైపోవుటయే కాక బాల్యకౌమారయౌవనాద్యవస్థలలో గూడా సర్వము నష్టమగు చున్నది. అట్టి స్థితిలో మానవుడొక్క జన్మలోనే ముక్తి సాధించు నిమిత్తమై నాలుగాశ్రమ ధర్మములు గల్పింపబడినవి. అందు కౌమారావస్థయే సాధనకు యోగ్యమై యున్నది కాన, కౌమారావస్థ నుండి 12 ఏండ్లు వేదాధ్యయన మనబడు బ్రహ్మచర్యాశ్రమ మనియు, తరువాత 12 ఏండ్లు గృహస్థాశ్రమమనియు, పిమ్మట 12 ఏండ్లు నస్ఖలితదీక్షతోడి తపశ్చరణ మనబడు వానప్రస్థాశ్రమ మనియు, తదనంతరము సన్యాసాశ్రమ మనియు గల్పింపబడెను. వానప్రస్థాశ్రమతపోదీక్షయందు భార్యాసమేతముగానే నడపి ఆత్మసాక్షాత్కారమను జీవన్ముక్తి నెఱిగికొని తదనంతరము సన్యాసాశ్రమము బ్రవేశించి జ్ఞానబోధ చేసి తుదకు మోక్షము బొందుచు ధర్మార్థకామమోక్షములను చతుర్విధపురుషార్థములను ఈ జన్మలోనే సాధింప గలుగుచున్నాడు. బ్రహ్మచర్యాశ్రమధర్మము, వేదాధ్యయనమును; గృహస్థాశ్రమ ధర్మము, ఋతుసమాగమ వ్రతము తోడి వంశాంకురమును; వానప్రస్థాశ్రమ ధర్మము, అస్ఖలితబ్రహ్మచర్య దీక్షతోడి తపస్సునై యున్నవి. "తపము లే దుపవాస

వ్రతంబుకంటె" నని యన్నట్లుగా, తపమనగా ఉపవాసవ్రతమేయై యున్నది. అది క్రమముగా దినమునకు రెండు కుడుపులని కొన్నాళ్లు సాధింపవలయును. తరువాత ఒంటి పూట భోజనము సాధింపవలయును. తరువాత రెండు దినముల కొకమాఱుగాను, మూడు దినముల కొకమాఱుగాను, యిట్లు క్రమముగా అభ్యాసబలముతో పక్షోపవాసదీక్షయు, మాసోపవాసదీక్షయు సాధింపగలిగిన, ఆ యా దీక్షల కా యా శక్తి సామర్థ్యము లేర్పడుచున్నవి. మాసోపవాసదీక్షతో మోక్షాధికారు డగుచున్నాడు. మాసోపవాసదీక్షకంటె నధికముగా నుపవసించుటచే ఆత్మహింస జరుగుచున్నదని మాసమునకు మించిన పరిమితి నిషేధింపబడినది. కాని, ముఖ్యముగా తన కంఠధ్వని క్షీణించిన, తత్క్షణమే దీక్ష నాపివేయవలె ననుట సాధకు డెప్పుడు గమనింపవలసి యున్నది.

ఈ పైజెప్పబడిన యన్ని మతములకంటెను నవవిధ భక్తియే శ్రేష్ఠమును సులభమునని శ్రీశుకమహర్షి మతము:-

మ॥ తను (1) హృద్భాషల సఖ్యముఙ్ (2) శ్రవణముఙ్
(3) దాసత్వముఙ్ (4) వంద (5) నా
ర్చనముఙ్ (6) సేవయు (7) నాత్మలో నెఱుకయుఙ్
(8) సంకీర్తనం (9) చింతనం,
బను నీ తొమ్మిది భక్తి మార్గముల స
ర్వాత్మున్ హరిన్ నమ్మి స
జ్జనుఁడై యుండుట భద్రమంచుఁ దలతుఙ్
సత్యంబు దైత్యోత్తమా॥ (శ్రీమద్భాగవతము)

3

ఇట్టి వేదాంతధర్మమైన భక్తియోగమును—శ్రీశంకరాచార్యులవారుగూడా తరువాత నామోదించి తదనుగుణ్యముగా దేవాలయములు విగ్రహారాధన గల్పించినట్లుగా—ద్వాపరయుగాంతము నాటి భగవద్గీతయందు శ్రీకృష్ణభగవాను డీక్రిందివిధముగా బ్రతిపాదించి యుండెను:-

1. ఓం-తత్-సదితి నిర్దేశో బ్రహ్మణ స్త్రివిధః స్మృతః
బ్రాహ్మణాస్తేన వేదాశ్చ యజ్ఞాశ్చ విహితాః పురా॥

అనగా ఆ అవ్యక్త పరబ్రహ్మము బ్రహ్మసూత్రములందు ఓం-అనియు, వేదములందు తత్-అనియు, యజ్ఞయాగాది కర్మకాండయందు సత్-అనియు, పిలువబడుచు 'ఓంతత్సత్' అను మంత్రము చేతనే పూర్ణముగా గలిపిచెప్పబడుచున్నది. ఆస్వరూపమునే తరువాత 'సచ్చిదానంద'స్వరూపమని చెప్పుట వాడుకలోనికి వచ్చియున్నది.

2. ఈశ్వర స్సర్వభూతానాం హృద్దేశేఽర్జున తిష్ఠతి
భ్రామయన్ సర్వభూతాని యంత్రారూఢాని మాయయా॥

ఓ యర్జునా! ఆ పరమాత్మయే సర్వభూతముల యొక్క హృదయస్థానమునందు నిల్చి తన మాయాశక్తి యను కర్మసూత్రముచేత యంత్రములను నడపుచున్నట్లుగా గదలించి యాడించుచున్నది.

3. యోగస్థః కురు కర్మాణి సంగం త్యక్త్వా ధనంజయ
సిద్ధ్యసిద్ధ్యోః స్సమో భూత్వా సమత్వం యోగ ఉచ్యతే॥

కావున నో యర్జునా! కర్మఫలమునం దాసక్తి విడిచిన యోగయుక్తి గలిగిన వాడవై కర్మలనే చేయుము. అప్పుడు నీకు కర్తృత్వముగాని భోక్తృత్వముగాని యుండదు. ('యోగః బుద్ధి సుకౌశలం' అని చెప్పబడి యున్నట్లుగా, యోగ మనగా బుద్ధికౌశల్యము (లేక సమత్వమని గ్రహింపనగును).

4. సన్న్యాసః కర్మయోగశ్చ నిఃశ్రేయసకరావుభౌ
తయోస్తు కర్మసన్న్యాసా త్కర్మయోగో విశిష్యతే॥

సన్న్యాస మనగా కర్మసన్న్యాసము; కర్మయోగమనగా కర్మలను చేయుచు ఫలమును వదలుట. ఈ రెంటిలో గర్మలను బూర్తిగా వదలుట కంటె, యోగయుక్తితో గూడిన కర్మయే గొప్పది యగుచున్నది.

5. ఉద్ధరే దాత్మ నాత్మానం నాత్మాన మవసాదయేత్
ఆత్మైవ హ్యాత్మనో బంధు రాత్మైవ రిపు రాత్మనః॥

తన ఆత్మచేతనే త న్నుద్ధరించికొనవలయును. తన ఆత్మయే తనకు బంధువును శత్రువును నగుచున్నాడు.

6. క్లేశోఽధికతర స్తేషా మవ్యక్తాసక్తచేతసామ్
అవ్యక్తాహిగతిర్దుఃఖం దేహవద్భి రవాప్యతే॥

అవ్యక్త బ్రహ్మోపాసనము మనస్సునకు క్లిష్టముగా నుండును. వ్యక్తులైన దేహధారు లవ్యక్తోపాసన చేయుటకు మిక్కిలి కష్టముతో. సాధింపవలసి యున్నది. కనుక వ్యక్తమైన సగుణోపాసనమే సులభసాధ్యము సుమా.

7. శ్రేయో హి జ్ఞాన మభ్యాసాత్ జ్ఞానా ధ్ధ్యానం విశిష్యతే
ధ్యానా త్కర్మఫలత్యాగ స్త్యాగా చ్ఛాంతి రనంతరమ్॥

మూఢాభ్యాసము కంటె జ్ఞానము శ్రేష్ఠము. జ్ఞానము కంటె ధ్యానము శ్రేష్ఠము. ధ్యానముకంటె కర్మఫలత్యాగము శ్రేష్ఠము. తరువాత త్యాగము కంటెను శ్రేష్ఠమైన శాంతి కలుగుచున్నది.

8. యో నహృష్యతి నద్వేష్టి నశోచతి నకాంక్షతి
శుభాశుభ పరిత్యాగీ భక్తిమాన్ యస్సమేప్రియః॥

అట్లు యిష్టాయిష్టములు, శుభాశుభములు, విడిచి, నాకు భక్తుడైనవాడు నాకు ఇష్టుడు, అనగా శ్రేష్ఠుడు.

9. సర్వధర్మాన్ పరిత్యజ్య మా మేకం శరణంవ్రజ
అహం త్వా సర్వపాపేభ్యో మోక్ష యిష్యామి మాశుచ॥

కావున అన్ని ధర్మసంబద్ధములు విడిచి సర్వసంగపరిత్యాగివై నన్నేశరణుబొంది కర్మలను చేయుము. అట్లైన నేను నిన్ను సమస్త పాపములనుండి తప్పక రక్షించుచున్నాను. కావున నీవు అన్యథా శోకింప బనిలేదు.

10. ఓ మి త్యేకాక్షరంబ్రహ్మ వ్యాహర న్మా మనుస్మరన్
యః ప్రయాతి త్యజన్ దేహం సయాతి పరమాంగతిమ్॥

అట్లు ఎవ్వ డవసానదశయందు "ఓం" అనెడి యే కాక్షరమంత్రము నుచ్చరించుచు, నన్ను స్మరించుచు, దేహము

వదలి పోవుచున్నాడో, వాడు బరమోత్కృష్టమైన గతిని బొందుచున్నాడు.

అని భక్తిపరమైన త్యాగలక్షణమునే నిర్వచించుచు, సంగ్రహముగా:-

"ఓ పార్థా! సత్-అని చెప్పబడు నా ఓంకారమే తన మాయాశక్తియైన మూలప్రకృతితో గలిసి జీవాంశ సంభూతుడై క్రీడార్థముగా లింగదేహమును ధరించి జడమైన స్థూలాది శరీరములందు నేకాదశేంద్రియ వ్యాపారుడగుచు తాను బరమాత్ముని యంశముగానే నుండినప్పటికి, తన నిరాకారత్వమును మఱచి, సాకారాభిమానియై యహంకారమునొంది దేహాత్మైకబుద్ధితో నింద్రియలోలుడై సంసార చక్రమున జిక్కి మాటిమాటికి బుట్టి గిట్టి పరిభ్రమించుచు దుదకు స్వార్జితమైన పుణ్యవిశేషముచే నింద్రియవాసనలందు విరక్తిబొంది త్యాగియగుచు గర్మఫలము నపేక్షింపక ప్రారబ్ధశేష మను జీవయాత్ర ముగించికొని తుదకు అక్షరపరబ్రహ్మత్వ మను సంస్కారమునొంది నిత్యసిద్ధుడై ప్రకాశించుచున్నాడు సుమా!"

యని ప్రబోధించిన యా శ్రీకృష్ణభగవానుడు నన్ను సదా రక్షించుగాక ! ! !

ఓం తత్సత్

శ్రీమ ద్రామావతారపరబ్రహ్మణే నమః॥

శ్రీ గోపికా రహస్యము

ఓంకారరూప! విగతా
హంకారమునీంద్రహృద్గుహాంతర్వర్తీ!
శంకావిరహితభక్తవ
శంకర! సచ్చిత్సుఖాత్మ! సర్వేశ! హరీ!

సీ॥ త్రేతాయుగమున నుద్రేకించి పూర్వదే
వానీక[1] మతిఘోరమైన భంగిఁ
గవిసి, గోవుల యోగిగణముల మానుల
భూసుర ప్రతతి స్వర్భువననాథు
నప్సరోవర సిద్ధ యక్షాది సాధ్యగం
ధర్వ నిలింపుల సర్వలోక
ములఁ గ్రూరులగుచుఁ బాముఁ[2] బెట్టుచుండఁగ ని
ర్వీర్యులై దివిజు లవ్వేధఁ[3] దలఁచి

1. దైత్యులు, దానవులు, రాక్షసులను యన్ని తెగలవారు,
2. కష్టముల 3. బ్రహ్మదేవుని.

తే॥సత్యలోకమునకు నేగి జలజగర్భు
చరణపంకేరుహంబుల శరణుఁజొచ్చి
వరము మును బొంది దైత్యసంహారణమునకు
మొనయుమని కోరి వేడిరి మనికితముగ ॥

ఉ॥ వారిజసంభవుం డమరవర్యులనెల్ల దయార్ద్రచిత్తుఁడై
కూరిమి నాదరించి, రణకోవిదులైన నిశాచరేశులం
బోరునఁ దాకలేమి, నిజబుద్ధిఁ దలంచి, పురాణపూరుషుం
దారకశబ్దవాచ్యు సుఖదాయకు స్తోత్రముసేసి వేడినన్ ॥2

మ॥అభయంబయ్యెడుమీకు, దివ్యవరగర్వాంధాత్ములై రాక్షసుల్
శుభకార్యంబుల కెగ్గుఁజేయుచు, జనక్షోభంబుగాలోకముల్
వ్యభిచారంబులపాలుసేసి, మతముల్ వంచించి, పాపాత్ములై
రభవా! కాలముగూడఁ జంపెదస్వకార్యంబింతపొండిండ్లకున్॥ 3

క॥అని యొకభీషణనాదము
వినఁబడినం గలఁతఁదేఱి వేల్పులు వనజా
సనుఁ దగువిధమున వీడ్కొని
చనిరి, శుభంబయ్యెననుచు సదనోన్ముఖులై॥ 4

ఉ॥దుర్జయులైన దానవులు దోర్మదులై కసి దేవకోటులన్
గర్జనతర్జనల్సెలఁగఁ గారియఁబెట్ట విదారితప్రకా
రోర్జితచిత్తవృత్తులుయథోచితసత్త్వగుణప్రధానమై
కర్జముమీఱఁగాఁబ్రకృతికార్యముఁబొందిక్రమక్రమంబునన్॥

ఆ॥ కాలమనుసరించి గంభీరమగుచుఁ గేం
ద్రత్వ మొంది మేఘ రాజివోలె
నీలవర్ణ మెలయ నెఱిఁ బరిణామంబు
నొందుచుండెఁ గర్మయుక్తమగుచు ॥

ఆ॥ అట్లు పరిధవిల్లి యవతారపురుషుఁడై
దశరథేశ్వరునకు ధర జనించెఁ
బట్టమహిషియైన భార్య కౌసల్యయం
దోజతో సమష్టితేజ మపుడు.

మ॥ తన సర్వాంగములందు దీధితులు విస్తారంబు గాఁబ్రజ్వరి
ల్లిన 'శ్రీ' యొప్పి, తదాత్మరూపవిలసల్లీలల్మనోరమ్యమై
చన "రాముం" డనఁజెల్లి, భాసిలెఁ దదజ్ఞానాస్యామ్ల
తాంశుల్ కనం
గ నితాంతైకసుఖప్రదంబులయి వెల్గం బూర్ణ 'చంద్రుం' [1]
డనన్ ॥ 8

క॥ అక్షీణబలుఁడు రాముఁడు
దక్షుండై వెడలి క్షాత్రధర్మము బేర్మిన్
రక్షోగణసంహారం
బక్షయమని చేరె దండకారణ్యంబున్ ॥ ౯

1. చంద్రుఁడు.

శా॥ సారంబైన వివేకమూని, విజనస్థానంబులందుండి, సచె
న్నారన్ శాంతమనస్కులై తనరి, దుష్టాసక్తిఁబోనాడి,
రార్వారంభంబులుమాని, సంతతము "బ్రహ్మోఽహం-
శివోఽహం-న సం
సారమ్మస్తీ"యటంచునుండి రట విశ్వాసాత్ములై
సంయముల్ ॥10

మ॥ ఒకనాఁడా భువనైక మోహనుఁడునత్యుత్సాహమే పారదం
డకసుక్షేత్రములందునొక్క మునికూటంబేర్పడఁగాంచి, లో
నికి సుస్వాగతుఁడై ప్రమోదకరుఁడై నేత్రోత్సవాకారుఁడై
యకలంకోజ్జ్వలుఁడై వెలింగెముని తారానీక రాకేందుఁడై

సీ॥ తొలకరిమొగులు కాంతులనీను నవకోమ
ల శ్యామలాంగ విలాసవరుని
బదునాలుభువనముల్ ప్రభవించు మహిత నా
భీకంజగంభీరవివర యుతుని
దిశలెల్ల వెలిగించు దినరాజు రేరాజు
రహిఁ విరాజిల్లు నేత్రములవాని
బేదఱికము వాపు పెద్దముత్తైదువ
శయనించు విపులవక్షంబు వాని
తే॥ "గలదు-లే"దనఁ జెల్లెడి కౌనువాని
భద్రకుంజర[1]యాన వైభవమువాని
రుచిరలావణ్య నతులతారుణ్యుఁ బురుష
మోహనోద్దాము రఘుకులాంభోధిసోము॥ 12

---

1. భద్రజాతి యేనుఁగు.

క॥ అనిమిషులై కన్గవ ము
జ్జనితాశ్రుకణంబులొలుక సంయమివర్యుల్
గని, తద్వదనామృతమును
ఘనముగ సేవించి రధిక కౌతుక మొదవన్॥ 13

శా॥ ఆనీలత్వము, నామహోన్నతియు, నాయాజాను
బాహుత్వ, మా
పీనుల్ నేత్రము, లాభుజాస్యగళనాభీపాదపద్మంబు, లా
కౌస్తాపెందొడలాయురంబు, నాకటం, గందర్పబాణంబులై
మానిస్వాంతములందు నాటినమహామాయాపరిభ్రాంతులై॥

ఆ॥ వన్నెకాఁడటంచు హృన్నియమముఁదప్పి
యంగజాగ్నివివశలైన యావ
నాంగులట్లు గడు భయంబు సంభ్రమము ద
లిర్పఁ గదిసి కౌఁగిలింపఁ బూని॥ 15

క॥ మగవాఁడని, నగుఁబాటని,
బెగడువడుచు, జడత గదుర బెదరుచు, లోలో
వగరుచు, నువ్విళ్లూరుచు,
మొగములు పరికించికొనుచు మురియుచుఁ దమలోన్॥ 16

ఉ॥ అక్కట! ధీరవృత్తి విపినాంతములందు వసించి, గింజలం
బొక్కుచుఁబెక్కువర్షములుపూనికతో వ్రతచర్యనుండుచుఁ
జిక్కనియింద్రియంబులఁగృశింపఁగఁజేయుచు, జీవయాత్రచే
స్రుక్కినమమ్ము, నేఁడుపురుషుండొకఁడిట్టులనేచెడింగదే॥

చ॥ అచలసమాధియోగమున నంచితభక్తిమనంబుఁ గ్రుచ్చి, చి
త్త చలనవృత్తుల న్నిలిపి, తర్కక బుద్ధిని మాన్చి, కర్త క
ర్మ చదిపి, మించి, యద్వయసమాహితవర్తనమందు వెల్గు నా
త్మ చలితమయ్యెనెట్లొకో? వృథా కద నేఁడు తపఃప్రభావముల్॥

తే॥ ఆ పరబ్రహ్మ మీరాముఁ డగుచుఁ బుట్టె
ననుట నిశ్చయమయ్యె, నయ్యాది విశుద్ధ
హంసవాచ్య మగునుగాక, నరయ హేయ
మైన యీదేహ మాతత్త్వ మగునె తలఁప?॥ 19

క॥ సాక్షిస్వరూపమై, ఫా
లాక్షాది తృణాంతమై, మహద్రూపంబై,
యక్షరమై, ప్రత్యక్ష వి
లక్షణ మైనట్టిదే పరబ్రహ్మ మగుఁ॥ 20

క॥ గడ్డములు నెరసి, మిక్కిలి
జడ్డుఁదనము గదుర నొడలు సడలించి, కడు
న్నొడ్డెలగునట్టి ముసలి
గొడ్డులమై యుండి, యిట్లు గోరం దగునే? 21

తే॥ అని బహుప్రకారముల నెమ్మనమ్ములందుఁ
గడు వితర్కించి యనురాగ ముడుగ లేక
ప్రీతి నాలింగనమ్ము సేయ వేడ్కఁ గడలు
కొనఁగ వేగిర పడుచున్న మునుల నరసి. 22

శా॥ఆలోకేశ్వరుఁ డాచరాచరవిభుం డారామచంద్రుండు శ్రీ
డాలోలాత్మకుఁ డామునీంద్రులయభీష్టం బంతరంగంబునం
దాలోకించి దయాసముద్రుఁడుస్వభక్తార్థప్రదుండౌట హృ
న్నీలీరాగముదోప వారిఁగలయన్వీక్షించి సోత్కంఠుఁడై॥

సీ॥ తాపసోత్తములార! తథ్యంబు బ్రాహ్మణా
ధీనుఁడనగు దేను; ధృతి దలిర్ప
నేమానవుండేని హృదయకమలమందు
సర్వమంగళకర సత్త్వరూపుఁ
డన నొప్పు నన్ను భావనసేయ నిరతిశ
యానంద మొసఁగుదు, నమరలోక
మాదిగా నీవిశ్వ మతనిద యైయుండు;
శుద్ధమనస్కులు సిద్ధపురుషు
తే॥ లంచితాధ్యాత్మయోగవిద్యార్థవేదు
లుత్తమోత్తములగు మీర లుత్సహించి
సురుచిరాలింగనముఁ గోర, దొరక దెట్లు?
వరుస సిద్ధించు నది మీ కవశ్యముగను॥ 24

ఉ॥ వినను మీయభీష్ట మిపు డక్కట! చేకుఱఁజాల, దెట్లనన్
మానితమైన సత్యనియమంబులఁబూని చరించు జానకీ
జానిని గౌఁగిలించు టపచారముగాన నిషిద్ధమింత, యో
ధీనిధులార! రాముని యతీతసతీవ్రత మట్టిదాఁ జుఁడీ!॥ 25

తే॥ వరతపఃపుణ్యధనషడైశ్వర్యసమితి
కడఁగి మూర్తీభవించి నా కాయమయ్యె
నన్ను నిమ్మైన నాలింగనమును జేయఁ
పాత్రు లౌరులెవ్వ ? రొక్క భూపుత్రితక్క॥ 26

చ॥ కొనకొనిమీరు నేఁడు మదిఁగోరినకోరిక మీకు ద్వాపరం
బున నిజభూతితో మఱలఁ బుట్టి యశోదకుఁబుత్రకుండనై
యనువుగఁగ్రీడసల్పునపుడందగఁ జేయుదు; నేడుస్త్రీలువో
లె నిటులఁగోరుటందగఁజరింతురుగోపికలౌచుమీరట౯॥

తే॥ అనఁగ "నీ మహాత్మునకు సాయకము నొకటె,
మాట యొక్కటె, యొకరిత మగువ యట్టె,
ఔర ! యీ దివ్యరామావతార నియమ
సరణి యిట్లొప్పునె?" యను గుసగుసలొదవె॥ 28

శా॥ అంత౯ ద్వాపర మేగుదేర నట బృందారణ్యసామీప్యమా
గ్రాంతర్భూముల గొల్లభామలగుచుం గర్మానుసారంబుగా
దాంతుల్సంయములుద్భవించిమమతందత్క్రియాలోలురై
భ్రాంతింబొంద యశోద గాంచెఁగడుసొంపార౯ 'కృష్ణు'
రోచిష్ణుని౯॥

ఉ॥ బాల్యుఁడు గోపబాలకుఁ డపారకృపాదిగుణాలవాలుఁ డు
న్మూలితరాగలోభమదమోహవికారసుశీలుఁ డవ్యయ
శ్రీలలితుండు భక్తజనసేవితచిన్మయరూపుఁ డాత్మలీ
లాలముతంత్రుఁడంచితభవాంబుధిబాడబుఁడాతఁడల్పుఁడే॥

శా॥ అజ్ఞానాంధపరీతలైన వ్రజకన్యానీక మధ్యస్థుఁ డ
త్యజ్ఞానప్రదుఁడైన కృష్ణునెడ దైవత్వంబు లక్షింప కా
త్మజ్ఞానంబులఁ జూఱఁబుచ్చి గుణసంతానంబులం జొచ్చినం
బ్రజ్ఞాలభ్యుఁడు దేవదేవుఁడు కృపాపారీణధౌరేయుఁడై॥

క॥ వ్రేపల్లె గొల్లపడుచులు
చూపొఱఁగి ప్రవృత్తియందుఁ జొఱఁబడి కామ
వ్యాపారతఁ జంచలలై
తాపత్రయగుణములందుఁ దలఁపడి రకటా!॥ 32

ఉ॥ గొల్లలువీరు, శ్రద్ధమెయి గోవులఁ గాయుదురింతవృత్తి, తా
మెల్లరుఁ జల్లపాల్పెరుఁగు లెమ్మెయిఁ గూర్చి గడించుచుందు, రీ
సల్లలితాబ్జలోచనలు స్వల్పసుఖంబుల నాసచేయుచుం
గల్లజగంబుఁ గానని ప్రకారము తోచెడి నెల్లభంగులన్॥ 33

తే॥ శుద్ధచైతన్యమయపరంజ్యోతియందు
మున్ను క్రీడించు తాపసముఖ్యులయ్యు
మన్మహామాయ మునిఁగి, రి మ్మాన్యమతులు
కించిదాత్ములు, వీరి రక్షింపవలయు॥ 34

క॥ అని చింతించి యదూత్తముఁ
డనుకంప తొలంగి నిజసహచరులతోడం
జని వారి సిరులఁ గొనియెం
జనదే సిరిమగని కఖిల సంపదలఁ గొనన్? 35

మత్త॥ అల్లనల్లన గోపబాలకు లందఱున్ గుమిఁగూడి రా
మెల్లమెల్లఁగ నిండ్లలోనికి మిణ్కరించుచు దూఱి బల్
మల్లుఁడై కల పాలువెన్నల మంచిగా దిగఁద్రావి, యా
గొల్లభామల మర్లు గొల్పెను గూర్మి శైశవలీలలన్॥ 36

మ॥ అబలల్ చంచలలజ్ఞతంబరముసర్వాత్మున్ హరిన్ మాధవున్
సబలున్[1] లక్ష్యము సేయనేఱక రజ[2]స్సంబంధలై భ్రాంతలై
ప్రబలంబైచను జారచోరగుణసంబద్ధాత్ముఁగా నెంచి, డా
సి బహూదవృత్తిఁదదంబపైఁగవిసి రిస్సీ! యంచుఁ
గోధించుచున్

క॥ గోపమ్మా! నీతనయుఁడు
మాపుణ్యముకొలఁదిఁ బుట్టె; మఱి యింకేలా?
యేపాపమొ? మేమిఁక నిటఁ
గాపురములు సేయలేము, కంజదళాక్షీ!॥ 38

సీ॥ ముకురంబు గనరాదు మొగమునఁగస్తూరి
చుక్కఁబెట్టుమటంచుఁ బ్రక్కఁజేరుఁ
జేరి నీసరిగలు సిక్కుఁబొందినవంచుఁ
జన్నొమ్మనల్ స్పృశియించి శంకఁజేయుఁ
జేసి, నీకొకమాటఁ జెప్పెద వినుమంచుఁ
జెవిఁనొగ్గి కదిసి నుంజెక్కునొక్క
నొక్క, నీకంటె నే నెక్కుడుందు నటంచు
మోము మోమునఁజేర్చి మోవినాను

1. బలరామునితోఁ గూడియున్న వానిని
2. రజోగుణ

తే॥ నాని, చోద్యముఁ జూపెద ననుచుఁ గనులు
మూసి, యిలుసొచ్చి, పాల్దావి, మూతిఁబూయుఁ
బూసి, లేనవ్వుతో ముద్దుసేసి వోవుఁ
బిల్లవాఁడె? యశోద! మీ నల్లవాఁడు॥ 39

సీ॥ భద్రంబుగా క్షీరభాండంబు లందంద
జాగ్రత్తపఱచి నిశ్చయము మెఱయ
ద్వారబంధమునొద్ద ధైర్యంబుగా నిల్చి
'యదెవచ్చె-నిదెవచ్చె' ననుచు బ్రిమసి
తలడిల్లుచుండ నేదారి లోఁజొచ్చునో
గుర్తింపఁగారాదు గూఢచారి
పాలు మీఁగడ వెన్న భక్షించి తాఁబోవుఁ
గల్ల కాదిది, వట్టికడవ లుండు,

తే॥ వింతకూఁతల మమ్ము నిర్ఘాంతపఱచి
పాలకుండల నన్నిఁటిఁ గాలఁదన్ని
పాఱిపోవును; పెక్కేల? బడుగు నిట్టు
లూరిపైఁబడ విడిచిన నోర్వమమ్మ! 40

క॥ అని పెల్లారడిఁ బెట్టినఁ
గని, విస్మయమొంది, కృష్ణుఁగని సస్మితయై,
జనని గగుర్పాటొదవఁగ
వనితలఁ గలయంగఁ జూచి 'వంచన' యనుచున్॥ 41

ఉ॥ "గోపికలార! మీరిటులఁ గోపముతాపముతోడ వచ్చి, యీ
పాపని, జన్ను నేమఱని బాలుని, జారుఁడు చోరుఁడంచు మి
థ్యాపరివర్తనోక్తి నిటు లారడిఁ బెట్టఁగఁ జూతురమ్మ! సం
తాపకరంబు గాదె తలిదండ్రులె? కాత్మజునింద సేసినన్॥"42

క॥ "బిడ్డలఁ గాంచఁగ లేదో?
గొడ్డాండ్రో? నాదు ముద్దుకుఱ్ఱని చే
లాడ్డి మిగులదూఱెద రీ
జడ్డుగుణంబులనుమాని చనుఁ డావలకున్"॥ 43

ఆ॥ "మగలయందుఁ గనలి, మగవారి ననలేక,
పొరుగుతల్లి కన్న బుడుతఁ జూచి
తగుదుమనుచు వచ్చి తగవులాడఁగనౌనె?
జాణతనము లింకఁ జాలుఁ జాలు"॥ 44

తే॥ "పసితనంబున నెపుడేని బాలకుండు
తిరిరి మీయిండ్లవరుస కేతెంచి యెదుట
నున్న తినుబండములఁ గోరి తిన్న యెడల
నదురుబెట్టుడుగాక యీ యలుపు లేల?॥" 45

క॥ అన్ని హరిఁ బనిచి సుతుపై
ననురాగము ప్రబ్బికొనిన ననునయమతియై
చనుబాలొలుకఁగ వానిం
గని మూర్కొని చుంచుదువ్వి, కలఁకవాడమినన్॥ 46

ఆ॥ "కొంటెవాఁడు నీదుకొడుకు"కంచు దూఱెడి
వాడలోని గోపవనిత లెల్ల
మొనసి ముదిమిఁగన్న ముద్దుబిడ్డఁడ వీవు
కొంటెతనము మానుకొనఁగదయ్య"॥ 47

క॥ అనిబుజ్జగించి లోసికిఁ
గొనిపోయి, జలము వోసి, గోపంచితముల్
మనసారఁ జల్లి, భస్మము
దొనకుచు మేనెల్లఁబూసె "ఘూః-ఘూః"యనుచున్॥ 48

ఆ॥ అవల గర్గమౌని యరుదెంచి, యాబాల
కృష్ణుపద్యమంబు నెదగ్రహించి,
యోగవిద్యఁ బలికి ప్రోత్సాహపఱచె, యో
గీశ్వరేశ్వరుఁడని యెఱిఁగి యెఱిఁగి। 49

క॥ అటుపై శ్రీకృష్ణుండు
తక్కటముగఁ జెలరేఁగ క్షీరదధిభాండంబుల్
మటుమాయమయ్యె నతివలుఁ
గటకటఁబడి బెగ్గడిలిరి కష్టంబనుచున్॥ 50

సీ॥ గోపి యొక్కతె క్షీరకుంభంబు లేపొద్దు
రిత్తయుండుట కృష్ణకృత్యమనుచుఁ
గనలి యాదివస మేకాదశి యగుటచేఁ
బనులాపి ద్వారముల్ భద్రపఱచి

యుట్టిలోఁ గుండలుబెట్టి యుత్తిగ నడి
కప్పున గాయుట్టిఁగట్టి, యుంచు
కేమఱియున్న వాఁడిలుసొచ్చునని యెడు
భయమున నితరభావములు మాని

తే॥ వీధిఁ గాచుచు, నీనాఁడు విడువననుచుఁ
జింతసేయుచు, ధీరయై చీమ చిటుకు
మన్న భ్రమఁజెంది వెఱగొంది వెన్నుఁడనుచుఁ
గలువరించుడు మధ్యాహ్నకాలమయ్యె॥ 51

ఉ॥ అంతట దాహమేర్చినఁ బ్రియాసముఁజెంది జలంబుఁ
గోరి యా
కాంతముహూర్తమేయనుచుఁ గాల్కడలించి సరిజ్జలంబుతో
గొంతుకఁదేర్చి, నెమ్మనము కొందలపెట్ట బిజానవచ్చి య
త్యంతభయస్థయైకనె గృహంబున గోపకబాలబృందముఁ

సీ॥ పీటలు రోటిపై, జేర్చి దిట్టరియైన
వాని భుజంబులపైన నిలిచి
చిఱునవ్వు నవ్వుచు సెలగోల నొకచేతఁ
బట్టి యందనియట్టి యుట్టిఁగొట్టి
జెట్టియై యిట్టట్టు లుట్టితోనూఁగుచు
నంజలి వదనగహ్వరముఁ జేర్చి
మోఁచేతులకుఁగ్రింద మునరిన చెలికాండ్ర
మన్నించి తక్కియామగ్నుఁడగుచు

తే॥ స్వయముగా బొజ్జ యెదుగ స్వభావయుక్తిఁ
దనివిఁజెందని శుద్ధచైతన్యమూర్తి
కరుణ సపరివారముగ సాక్షాత్కరించె
నెలమిఁ బూఁబోఁడివ్రతము ఫలించెననఁగ॥ 53

మ॥ కని, లోవిస్మయమొందుచున్ భ్రమయుచుం గంపించుచున్ గోపి దాం
గను బట్టంగఁదలంచి ధైర్యమును జిక్కంబట్టి మెల్లంగ డా
సీన వీక్షించిదయాళుఁడామగువశుష్కీభూతనేత్రంబులో
య్యనఁ బుణ్యామృతమాన నూఁదుచు నదృశ్యంబయ్యెఁ జిత్రంబుగాన్॥ 54

ఉ॥ "ఎప్పుడుచూచునో? గృహము లెప్పుడుచొచ్చునో? యెట్లు పోవునో?
చప్పుడుగాదు, భాండములుఁజక్కగనెప్పటియట్లయుండునే
మప్ప!" యటంచు నయ్యతివ లర్భకుఁజేష్టల కగ్గలించి యా
'తప్పుడువాని' దల్లియునుదండనసేయమిఁగంటగించుచున్॥

శా॥ వాకిండ్లూడ్చుచు ముగ్గువెట్టుచుఁ బనుల్వాటించుచుం బాఁడుచున్
శాకాద్యన్నము లేర్పరించుచు సఖీసల్లాపముల్ సేయుచున్
వీకన్నిద్రసుఖించుచుందిరుగుచున్ వీక్షించుచుంబల్కుచున్
నేకాగ్రస్థితిఁ బొందిరద్భుతముగా హేలావతుల్ గృష్ణుపై॥ 56

క॥ చిక్కియుఁ జిక్కని బాలుని
గ్రక్కునఁ బట్టంగలేక గాసిలి లోలో
నెక్కొను మక్కువఁ బొందిరి
మొక్కవదక్కవలు మాని యిందునిభాస్యల్॥ 57

మ॥ ఇటులయ్యంగనలంచితాభ్యుదయలై యిష్టానుసారంబు గాఁ
గుటిలత్వంబులువాసి సక్తలగుచుం గోపాలదేవుం విశం
కటవృత్తిం గదియంగఁ జూఁడ 'ననహంకారోపదేశంబు' వి
స్ఫుటలీలుండయి చేసెఁగృష్ణుఁడు గడుంజోద్యంబుగా బాలుఁడై॥

మ॥ తనుమధ్యల్ వ్రతచర్యఁబూనివరుసన్ దాక్షాయణీ దేవిలో
ననుసంధానము సేసిపొందుచు గృహీతాన్యోన్యహస్తాబ్జలై
యనివార్యంబుగ నేగియామునయందారూఢి మైఁజొచ్చి ని
ర్జనతీరంబుననగ్నలై జలములన్ సంప్రీతిఁ గ్రీడించుచోన్॥ 59

క॥ వారిజలోచనుఁడగు హరి
వారివిహారములఁ దేలు వారి వసనముల్
వారక వేచన్ని దొంగిలె
వారు విహారములుమాని వారింపంగన్॥ 60

శా॥ "ఓరీ! కృష్ణ! యిదేమిరా? నిలువరా! యోషిజ్జనంబుల్ వడిన్
నీరంబుల్ సొరఁ బొంచిచూచియిటురా నీకొప్పునే? వచ్చితే
నీరీతింగలవస్త్రముల్గొనుట మేలే? తెమ్ము మా చేలముల్
పొరంజూఁడకు మంచివాఁడవుగదబ్బా! పెద్దప్రొద్దయ్యెడిన్.'

క॥ "మీయమ్మతోఁ జెప్పుదు
మోయీ! యివియేటిపను లయో! యిటురమ్మా,
మాయన్న! కోక లంది
మ్మా"-యని లజ్జించి పడఁతులారట పడినన్॥

శా॥ "ఏలా? కామినులార! లజ్జపడఁగా, నేలా చలం? శీ
జ్జాలం బెల్ల నశిత్య, మీతనువులిచ్ఛామాత్రదుష్టంబు,
లేలా భ్రాంతి? జలంబులన్వెడలి రండిచ్చోటికిన్, వచ్చి
చేలంబుల్గొనఁడింతులార! శుభముల్ చేకూరెసిన్ మీఁదటి

క॥ అని సిగ్గులపహరించిన
వనములఁ బొరివోయి సతులు మఱల యశోదం
గని కృష్ణుడుడుకుఁదన మొ
య్యాన నామెకుఁ దెలియఁజెప్పి యావురుమనినన్॥

ఆ॥ సతియు వారిమాట సత్యంబుగానమ్మి
కినుకఁజూపి "నేడు కృష్ణుఁబట్టి
తగిన బుద్ధిసెప్పి దండింతుఁదప్పక
రామలార! సుగుణధామలార!"॥ 65

మ॥ అని యాకాంతలవీడుకొల్పి సుతునిందాలాపముల్ నెమ్మనం
బునఁజింతించివిషాదమొందిమదిలోమూర్ఛించి, తామందపైఁ
జనబుచ్చున్ వలెనంచునాథుఁగనిప్రస్తావించి, గోపమ్మ నం
దను నాయత్తముసేసె నొక్కసుముహూర్తంబందు
సోద్యోగయై॥ 66

ఉ॥ బల్లిదుఁడై ప్రభాతమున బాలకుఁ డావుల వెల్వరించుచుం
దల్లికి మ్రొక్కి, చల్ది నొకదండమునందుఁ దగిల్చి, నవ్వు శో
భిల్లవ్రజాంగనాహృదయభేదకరైకమహాత్సవాంగుఁడై
యెల్లలుమీఱి గోగణము నెల్లెడలందునఁ గ్రుమ్మరించుచున్॥

చ॥ వరయమునానదీవిమలవారిపదంబులఁ డాసి, తద్వనో
పరిగిరిభూము లెక్కుడుశుభప్రదమంచుఁ దలంచి, గోవులం
గరిశరభాది భీకరమృగంబులు లేని బయళ్లయందు బం
ధురగతి మేపఁగా దొడఁగెఁ దుష్టిగఁ బచ్చికలొప్పమీఱఁగన్॥

క॥ యదుకులభూషణుఁ డగు హరి
సదమలతీరములఁ జొచ్చి చనువున మేపన్
మొదవులు పుష్కలముగఁ బె
న్బొదుగులఁ బాల్గురిసె నాత్మభూతిం బ్రీతిన్. 69

ఉ॥ అక్కడ నావ్రజాంగన "లహా! యిఁకఁ గృష్ణుఁడు దూరమయ్యె నే
చక్కని మోమువాఁడు, రుచిసంపద లొప్పిన మేనువాఁడు, చేఁ
జిక్కక జాఱిపోయి యొకసెక్కెములాడెడువాఁడ" టంచుఁ బెం
దిక్కును బొందిరోలి; నుపదేశమహత్త్వమనూనమైచనన్--

శా॥ తన్నేపట్టుచుఁ బోఁడుచుం దలఁచుచుం దర్కించి
చింతించుచున్,
నన్నారుల్ బగలెల్లఁ బోమఱచి సాయంకాలమైనంతఁ దా
మెన్నెన్నో తినువస్తువుల్గొని ప్రియంబేపారఁ గాఁబోయి 'మా
వెన్నుం డెక్కడ నే యశోద!' యని యన్వేషింతు రుద్విగ్నలై

సీ॥ కృష్ణవేణి యొకర్తు కృష్ణదర్శనమహో
త్కంఠయై ప్రొద్దు గ్రుంకకయమున్నె
చకచకఁ బనిఁ జేసి సంధ్యచీఁకటిరాఁగ
వత్తిని వెలిగించి తెత్తుననుచుఁ
దిన్నగాఁ గృష్ణమందిరముఁ బ్రవేశించి
వత్తి ముట్టించుచుఁ జిత్తమలర
నందనందనుని యాననము వీక్షించుచుఁ
దత్పరచిత్తయై తడవు సేయ

తే॥ వత్తి చూచిచూచి యాగ్రహ మొంది, గో
పమ్మ యింటి కరిగి సెమ్మె యొద్దఁ
జెయ్యిఁ గాల్చుకొనెడి చిన్నకోడలిఁ జూచి
యాగ్రహంబు మాని యార్తిఁ బొందె॥ 72

క॥ దినదినప్రవర్ధమానమ
యిననిష్ఠామహిమకతన నిందుముఖులు గ్ర
న్నన గృహకార్యంబులయం
దనాదరము గలిగి మఱచి రఖిల జగంబున్॥ 73

మ॥ రమణన్ గోపకుమారకుల్ చెలఁగి బాల్యక్రీడలం దేలుచో
యమునారణ్యమునన్ బలానుజుఁడు సోహంభావముం బూని యే
మమకారంబులఁ బోకదీక్ష మెఱయన్ ధ్యానంబు వాటించి, యో
గముఁ బ్రారంభము సేసె వేడ్క [illegible] గర్గప్రోక్తమార్గంబు
గన్॥ 74

తే॥ పొన్నవృక్షంబుక్రిందఁ జిన్ముద్రితోడఁ
జెలఁగు పద్మాసనమున రేచించి, పూర
కంబున హృదయబృందావనంబులో న
పానయమునా¹ప్రవాహముఁబట్టిచనుచు॥ 75

తే॥ ఒనర నామీఁద దుర్వారఘనతరంగ
సంగతోత్తుంగమగుచుఁ బ్రచ్ఛన్నభుజగ
మానితాధారమగు నిండుమడుఁగు దఱిసి
సరస నొక్కదినాన నిశ్చలత మెఱయ॥ 76

సీ॥ పట్టుపుట్టము మొలచుట్టుఁ జక్కఁగాఁ గట్టి
దీర్ఘశిరోజముల్ దిటవు పఱచి
హారావళులఁ గంఠమందునఁ గీలించి
బర్హిపింఛము మౌళిఁ బాదుకొలిపి
పైవస్త్రమును గ్రిందవైచి నేరుపుమీఱఁ
గాయమధ్యమమును గళము శిరము
నిక్కించి బాహువుల్ నిగిడించి తొడరి యు
ద్రేకించి మది హుంకరించి మించి
ఆ॥ ముక్కు మూసిపట్టి ముప్పోకలాఁ దూఁది
మడుపులోనదుమికి మహితవృత్తి
నలపుసొలపులేక వలయముల్ బచరించి
వింతయాఁతలోడఁ గొంతతడవు॥ 77

1. గంగా, యమునా, సరస్వతీ యని ఇడా పింగళా సుషుమ్నా నాడులకు పేర్లు.

శా॥ కల్లల్లాక యథేచ్ఛఁ దోల్లి కమఠగ్రాహాదిరూపంబులం
జెల్లాటంబుగ నీఁదు నేర్పుకలిమిం జెన్నారి శ్రీకృష్ణుఁ డ
త్యుల్లాసంబునఁ వీరుఁడై బహుళవాయుస్తంభనల్
సేయుచుం
గల్లోలంబొనరించె నామడుఁగుఁ బ్రాగ్భవ్యక్రియాస్ఫూర్తి
తోఁ॥

క॥ లోపలి చేతననిచయము
లోపమిగా హ్రదముఁ గలఁచి యుగ్రస్థైర్యా
టోపమున నడుగునకుఁ జని
యేపునఁ గుండలినిఁ దన్ని హేలాగతుఁడై॥ 79

సీ॥ లలితాజపామంత్ర మలఘునాదము గాఁగ
సకలేంద్రియములు ప్రేక్షకులు గాఁగ
బహుళనాడీస్వనల్ ప్రథితవీణా వేణు
శంఖమృదంగనిస్వనము గాఁగఁ
బటుకుంభితోదగ్రపవనసఝంపాధ్వనుల్
గ్రమము గాఁ దాళశబ్దములు గాఁగ
నిర్మలానందాంబు నిధియైన బ్రహ్మనా
ళము భవ్యనాగస్వరంబు గాఁగఁ
తే॥ ద్విజగదభినవసౌభాగ్యరేఖ వెలయ
నంబుజాధారపల్యలాభ్యంతరమునఁ
జిత్రనటనుండు గోపాలశేఖరుండు
నృత్యమాడె నిమీలితనేత్రుఁడగుచు॥ 80

క॥ ఆవిధ మావరణంబుల1
కావలగాఁబోవునెడ సహస్రాక్షుని చే2
గోవులు3 జడిఁగొని తడఁబడ
గోవర్ధనబిందు4 వెత్తె గోవిందుం డై॥ 81

మ॥ ఘనుఁ డాకృష్ణకుమారకుం డిటు లవక్రప్రక్రియారంభుఁడై
వనమధ్యంబును జేరి దీర్ఘగమనాస్వస్థాంగుఁడై విశ్రమిం
చిన నాలో మృదుశబ్దమొండు నెయిదిం జిత్రంబుగా మోగుచుం
వినరా మేల్కని యాలకించె నచలాభిన్నైకధీభాసుఁడై॥82

సీ॥ ఎలమిఁ జిణీస్వాన మెఱిఁగి, యంతఁ జిణిచి
ణీనిస్వనము నేర్పుతో నెఱింగి,
క్రమముగా ఘంటారవమును గుర్తించి, శం
ఖనినాదమును జక్కఁగా గ్రహించి,
వెలయు వీణాతాళవేణునాందంబు ల
త్యంతభద్రార్థుఁడై యాలకించి,
యలఘు భేరీమృదంగారావములను నే
ర్పుఱిచి, మేఘధ్వని నెఱిఁగి, యనుప

1=సుషుమ్నానాడియందలి చక్రములు (లేక) ఎల్లలు.
2=వేలకొలది సంకల్పములను కన్నులు గలిగిన మనస్సు (లేక) దేవేంద్రుడు
3=గోః-అనగా యింద్రియములు
4=ఇంద్రియప్రవర్ధమానమైన రేతోబిందువు

తే॥ మౌన నాదం "అ" కారంబు గాను, విమల
బిందువు "ఉ" కారముగను గావించి, తనగు
కళ "మ" కారముగాఁగ హృత్కమలమందు
ఘనతరోంకార మరసి లక్ష్యంబు సేసె॥ 83

శా॥ జ్ఞానానందమహత్స్వరూప రుచిరోంకారంబు నిట్లంచిత
ధ్యానాకర్ణనయుక్తిభేదములచేతం దచ్చి యోగీంద్రుఁడై
నానాస్థావరజంగమప్రతతులం దన్గాంచి విశ్వానుసం
ధానోద్వేలమహాసుఖంబుఁగనెఁ దత్త్వజ్ఞానసంపూర్ణుఁడై॥

క॥ ధీరుఁడు శ్రీకృష్ణుఁ డహం
కారము నాశంబుసేయఁగాఁ దనువున నోం
కార రవ మెఱుఁగఁ బడు నని
పేరెన్నికఁ దాల్చె నంతఁ బిల్లనగ్రోవిన్॥ 85

మ॥ ఒకనాఁ డాయదువంశమండనుఁడు ధ్యానోద్దీప్తిమైఁ బాంగి గా
యకుఁడై బ్రాహ్మముహూర్తకాలమున బృందారణ్య
మధ్యంబునం
బ్రకటస్ఫూర్జితగాత్రుఁడై మురళిఁ గేలం దాల్చి పూరించుచోం
డొకగీతంబును బాడె నద్వయరసం బాష్పంబ్రభూతంబుగాన్

సీ॥ చెలఁగి నాడీధేనువులు మోదమునుజెంది,
తన్మయత్వముఁబొంది, ధన్యమొందఁ;
జటులతరప్రాణసర్పరాజంబులు
వశ్యమై, కడుఁ బారవశ్యమొంద;
వరబ్రహ్మదండి తామరసషండంబు లం
దంబులై, ఘనవికాసంబునొంద;
హాళి దేహజగత్ప్రియంబు లానందించి
సుఖ మొంది, దీర్ఘసుషుప్తిఁజెందఁ;

తే॥ దన యిడాపింగళాకరద్వయమునందు
ఘనసుషుమ్నామురళి ముద్దుగారఁ దాల్చి
హృదయబృందావనమున శ్రీవేశ్వరుండు
గాన మొనరించె ననఁగ నోంకారమొప్ప॥ 87

క॥ నవరంధ్రాన్వితనాళం
బవిరళ సిద్ధాంగుళీవిహారోజ్జ్వలమై
పవనప్రసరోదంచిత
రవంబు దశగతులఁ బటుతరంబుగఁ బఱవన్॥ 88

తే॥ తేనెవాఁకలఁ బఱతెంచు తేంట్లువోలెఁ
బూర్వజన్మానుభవమైన బోధగదుర
విమల విజ్ఞానజనకమౌ వేణురవము
కర్ణపుటములసోఁకె నాకాంతలెల్ల॥ 89

ఉ॥ "ఈవరశబ్ద మీస్వరము నీకళ లెన్నడొ వింటి" మంచు
భావనసేసి తత్స్వరమ భాగవతార్ధసమృద్ధనాదముఁ
వావిరిగు ర్తెఱింగి, తనువాసనలం దెగఁగోసి, యద్వయ
శ్రీవిలసిల్ల గానలహరీమహితాంబుపధోన్ముఖంబుగన్॥

శా॥ ప్రస్తాకంపిత కేశపాళికలతో స్వస్థానముల్ వాసి, యే
ప్రస్తావంబులఁబోక, భర్తృజనులన్ భావింపఁగాలేక వ
త్యస్త శ్రీచరణారవిందు నెదలో దర్శించి, భ్రాంతాత్మలై
హస్తాహ్వానము సేయుచుం జనిరి "కృష్ణా!" యంచు
నయ్యామినిన్॥ 91

మ॥ చని, డాయంగని, భామినుల్ ప్రణతలై సాక్షాత్కృతున్
మాధవున్
జనితోత్కర్షమనస్కలై ప్రవిమలోత్సాహాత్మలై కూడి,పా
యనిభక్తిన్ స్తుతిఁ జేసి యత్యలఘునిత్యాత్మానుసంధానయో
గనిరూఢత్వమొసంగవే! మముదయం గాంక్షించిరక్షింపవే!

ఆ॥ అని సభక్తికముగఁ బ్రార్థింపఁ గృష్ణయో
గీశ్వరుండు భువనహితుఁడు మిగుల
సంతసిల్లి యాత్మసందర్శనంబును
గలుగఁ జేతు ననుచుఁ గరుణఁ జేసె॥ 93

తే॥ గరుడ గంధర్వ కిన్నర సుర మునీంద్ర
సంఘముల కెల్ల మంగళాస్పదమగుచును
జెలువుమీఱెడు తన యఱచేయిఁ జాచి
హస్తమస్తకసంయోగ మపుడు సేసె॥ 94

క॥ మాధవుకరసంస్పర్శన
బోధితలై పూర్వకర్మపుంజము లెడలన్
సాధనలేకయ కాంచి ర
సాధారణమైన యాత్మసాక్షిత్వంబున్॥ 95

క॥ సత్యంబై, సుజనముని
స్తుత్యంబై, నిగమమూలసూత్రార్థంబై,
నిత్యంబై, సద్యోగ
ప్రత్యక్షంబై వెలుంగు పరము, ననంతున్॥ 96

తే॥ సగుణనిర్గుణమయు, శుద్ధసత్త్వరూపు
నజరు నక్షరు నచ్యుతు నచలు నమలు
గూఢుఁ జిద్రూపు నిత్యు నంగుష్ఠమాత్రు
నవ్యయానందుఁ బరిపూర్ణు నంతరాత్ము॥ 97

క॥ ఆధ్యేయు నాద్యు నవ్యయు
నధ్యాత్ము నగోచరుం బరాపరశక్తున్
మిథ్యాగుణుని సుమనో
మధ్యస్థుం గాంచి యధిక మహిమోన్నతలై॥ 98

సీ॥ జయజయసర్వేశ! సకలభూతములకా
ధారుఁడవగుచు హృద్వనజకర్ణి
కాంతంబులం దంతరాత్మండవై యుండి
కర్తృత్వ భోక్తృత్వ కర్మఁబోరయ
కఖిలేంద్రియద్రష్టవై యొప్పు నిన్ననృ
ధాకరించితిమి ప్రధానపురుష!
యహహా! మా గోవు లాయాదవుల్ నంద య
శోదాదు లేము మత్సుతులుఁ బతులుఁ
తే॥ గా సమస్తము నీవనాఁ గంటి మిప్పు
డిట్టి విజ్ఞానచక్షువు నెల్ల ప్రొద్దుఁ
గలుగ వరము బ్రసాదించి కరుణఁ జూడు
మచ్యుతా! నంత! హరి! పరమాత్మ! కృష్ణ!॥ 99

ఉ॥ నీవు యశోదసూనుఁడవె? నీరజనాభ! చరాచరాత్మలో
కావళికెల్ల నాశ్రయుఁడ వారయ వేదమయుండవీవు,తం,
గావుమటంచు మున్ధరణి గాసిలి ప్రార్థనఁ జేసియుండుటన్
నీ విటులుద్భవించితివి నేఁడు జగంబుల నుద్ధరింపఁగన్॥ 100

క॥ అని బ్రహ్మానందము నొం
ది, నెఱినమస్కృతులొనర్చి, దృఢచిత్తములన్
ఘనముగ నా భగవంతుని
గొనియాడి రనంతనామ గుణరూపములన్॥ 101

క॥ గురుఁడని పరుఁడని హరుఁడని
వరుఁడని ప్రణుతించి నయనపంకజముల నా
వరదుని కృష్ణబ్రహ్మము
సరోజలోచనలు పూజ సలిపిరి ప్రీతిన్ ॥ 102

తే॥ ప్రేమమీఱంగ భక్తిమైఁ బ్రీతివుట్టి
విభవుఁ బ్రత్యక్షుఁ దిలకించి వివశలగుచు
నెత్తుకొని ముద్దుఁగొని ముదంబెసఁగఁ జాలఁ
"కౌఁగిలించిరి గోపికల్ గానలోలు"॥ 103

చ॥ అనవరతానురక్తి హృదయంబులఁ గృష్ణుని బాయలేమి మా
నిను లనవద్యమవ్యయమనింద్యమఖండమబోధ్యమచ్యుతం
బనఁదనరారు నిర్గుణము నాత్మలఁ గాంచియు భక్తిఁ బూనినె
మ్మనములలోన నాయదుకుమారుని గొల్చిరి
దేవదేవుఁగన్ ॥ 104

క॥ వెన్నుని సుస్మితవదనుఁ బ్ర
సన్నుని మురళీవినోదు సర్వాత్ముని నా
పన్నులయి కదియఁ బోవుదు
'రన్నా!ర' మ్మనుచుఁ దోయజాస్యలు ప్రీతిన్ ॥ 105

సీ॥ కృష్ణుఁడా! రమ్మని కేలిసేయుచు నొక్క
జలధరకచభర జలకమార్చుఁ
బురుషోత్తమా!యని ముద్దుసేయుచు నొక్క
యంబరమధ్య వస్త్రంబుఁగట్టు

నగధరా! యని యొక్క నవనీతహృదయ మేల్
వెన్న ముద్దలను నైవేద్యమిచ్చు
మాధవా! యని యొక్క మలయజగంధి శ్రీ
చందనం బలఁదు వక్షంబునందుఁ
తే॥ ప్రియమెసఁగఁ బల్లవాధర విడెము మొసఁగు
మాల లలినిడుఁ గుసుమకోమలి గళమున
రత్నకంకణ మంగళారతిని బట్టి
మేటి కలకంఠి యంకించి పాటఁబాడు॥ 106

ఉ॥ తమ్ము నెఱుంగలేక తమ తల్లులుఁదండ్రులు నత్తమామలున్
బమ్మెరవోవ భామినులు బాలురఁజూచి యప్పు రెల్ల నే
మమ్మునఁ గృష్ణుఁడంచును గ్రమమ్మున నాప్రభుఁగాంచి రెల్లరా
పమ్ములఁ బుత్రులం బతుల భ్రాతృజనంబుల బంధుమిత్రులన్

తే॥ పరమమైన పరాభక్తిఁ బ్రమద లఖిల
జగము శ్రీకృష్ణమయమని సంగ్రహించి
సచ్చిదానందపరమహంసల వడువున
జడతమీఱి చరించిరి సగుణమందు॥ 108

ఉ॥ మాపటి వేళలందు వనమార్గములన్ హరి వేణుగాన మా
లాపము సేయుచో గృహకలాపములన్ మఱచోసి కృష్ణుఁడే
ప్రాపని డాసి, తత్పరమ పావన గానసుధారసాంబుధిం
దాపముఁగీఱఁ గ్రుంకులిడి తన్మయలయ్యెద నంగనామణుల్

మ॥ వనితల్ మన్మథకేళికిన్ నిజపతుల్ ప్రాపించినం జూచి తా
రని గుర్తింపఁగలేక కృష్ణుఁడని యవ్యాజానురాగంబుతోఁ
గనుచుంబల్కుచు నవ్వుచుం బెనఁగుచుం గందర్పలీలాతరం
గనికాయంబుల నోలలార్చెదరు తత్కాంతారభాగంబులన్

క॥ వేదార్థప్రతిపాదిత
నాదమధురసంబుఁ ద్రావి నారీమణు లు
న్మాదోద్ధతిఁ గ్రీడించిరి
నాదబ్రహ్మైకరతి సనాథోత్సుకలై॥ 111

మ॥ తమ జీవేశ్వరు లంతలో మఱలినన్ దందహ్యమానాంగలై
యమునారణ్యనికుంజపుంజముల మాయాకృష్ణునిన్ రోయుచుం
దమలోనొండొరుల భ్రమించుచు యశోదానందనుం
బొన్నభూ
జముపొంతం గని డాయఁబాఱుదురు చంచత్కాంతితోఁ
గామినుల్॥ 112

క॥ లీలామానుషవిగ్రహుఁ
డా లలనాజనముఁగూడి యస్ఖలితవిధిన్
హేలాగతిఁ గ్రీడించుచు
లీలలఁ దాఁ దేలి యొప్పె లీలాత్ముండై॥ 113

మ॥ పొదరిండ్లం బులినస్థలంబుల లసద్భూమీరుహచ్ఛాయలం
బదునార్వేలసతీలలామ లనువొప్పన్ దాస్యముల్సేయ 'నీ
యదుశుభ్రాంశుని తేజముంగన నశక్యంబింకమీఁ"దంచు వె
ల్లదనంబొప్పఁ బలాయితుండగును దారాకాంతుఁ
డుద్భ్రాంతమున్॥ 114

ఉ॥ అందఱ కన్నిరూపముల నాడుచుఁ బాడుచు బోధసేయుచున్
నందఱియందు సర్వసముఁడై విలసిల్లుచు వ్రేతలన్ మహా
నందరసాబ్ధిఁ దేల్చి భవనాశకుఁడై తఱియింపఁజేసెఁ దా
నందఱి నందునింటి శిశువై చెలియై గురుఁడై
కుమారుఁడై॥ 115

క॥ మంగళము రుక్మిణీధవ!
మంగళ మవతారపురుష! మధురావాసా!
మంగళము పాపహరణా!
మంగళ మఖిలాగమప్రమాణధురీణా! 116

1. తాత్పర్యము:- త్రేతాయుగమున నొకపాదము ధర్మము నశించుచున్నట్లుగా నంతదనుక సత్ప్రవర్తనగలిగి యున్న రాక్షసులు గొప్పగొప్పవరములను బొంది యున్న వారలై, మదించి, ముల్లోకములందలి ప్రజలను నానాహింసల బెట్టుచుండగా ఆబాధలు పడలేక దేవతలు సృష్టికర్తయైన బ్రహ్మదేవు నొద్దకు బోయి రాక్షస నాశమునకు బూనుకొని తమ్ము గాపాడవలసినదని ప్రార్థించిరి.

2. తా॥ బ్రహ్మదేవు డాదేవతల మొఱయంతయు సావధానముతోవిని రణశూరులైన రాక్షసులను జయించుటకు దనకు యుద్ధనైపుణ్యము లేదని విచారించి, పురాణపురుషుడును సర్వజ్ఞానసగోచరుడునైన ఆ అఖండ పరిపూర్ణసచ్చిదానందస్వరూపమగు పరబ్రహ్మమును దనహృదయమునందు ధ్యానించెను.

3- 4. తా॥ అప్పు డొకశబ్ద మభయమిచ్చుచు నారాక్షసులు వరబలముచేతబిచ్చలించియధర్మపరులైయన్యాయము గాలోకులను హింసించుచుండిననూ, వారి వారి పాప కర్మ పరిపక్వముగాలేదనియు, అట్టికాలమే సమీపించిన శీఘ్రముగా దనమాయాధర్మమైన కర్మసూత్రప్ర కారముగా స్వయముగా దానే వారిని నశింపజేయ గలవాడననియు, కావున నాదేవతలు నిశ్చింతగా

నుండవలసినదనియు, ఆ బ్రహ్మదేవున కాత్మనిష్ఠలో స్ఫురించి, ఆ దేవతలకును వినిపింపగా, వారందఱు సంతోషించి బ్రహ్మలోకమునుండి మఱలి నిజస్థానములకు వెళ్ళిరి-

వివరణ:-

భగవంతుడు సర్వాంతర్యామియయ్యు జీవుల పుణ్యపాపకర్మవిషయములో దాను గర్త కాడు. జీవుడు భగవంతుని యొక్క అంశయే గావున ఆ పరబ్రహ్మమువలెనే తానుగూడ స్వతంత్రమైనశక్తి గలిగియున్నాడు. కావున జీవులు దాము సంకల్పించి చేయు కర్మయే, వారివారికి కాలపరిమాణముతో దప్పక ఫలించి సుఖదుఃఖరూపముగా సిద్ధించుచున్నది. కాని సహజముగా నొకజన్మలోని కోరిక వేఱొకజన్మలో బక్వమై లభించుటచేత, అప్పుడది సుఖదాయకముగాక ప్రతిబంధకముగా నేర్పడుటయు దటస్థించుచున్నది. ఉదాహరణముగా నొక భాగ్యవంతుడు మొదటిజన్మలో సంతానములేక కోరికోరియుండుటచేత రెండవజన్మలోగాని మూడవజన్మలోగానియా సంతానము గలుగవచ్చును. కాని యాజన్మలో దాను గర్భదరిద్రుడై యుండును- ఎందువలననగా, దా నా పూర్వజన్మలో సంతానమొక్కటియే గోరెనుగాని ధనముగూడ గోరియుండలేదు. కనుక ఆమఱుజన్మలో దనకు సంతానముమాత్రమే కలుగుచు, దరిద్రుడుగానే పుట్టుచున్నాడు. అట్లు దుఃఖభాజనముగా సంభవించిన ఆజన్మయందు, మఱల, ధనములేదని ధనమొక్క

టిమే గోరునుగాని, సంతానముమాట కోరుటకూడ సంభవింపదు. ఆరీతిగా కోరికలపసవ్యములై దుఃఖకారకములే యగుచు వాటి ననుభవింపవలసిన బంధనముతో జన్మలను బెంచుచున్నవి. అట్లు కర్మబీజము వృద్ధిబొందక యే. కోరిక పుట్టినతోడనే ఫలించవీలులేనట్లు, కాలపరిణామములో గర్మపక్వమైనచో నే దేవతలు దన్ను బ్రార్థింపకపోయిననూ భగవంతుడు స్వయముగానే దుష్టశిక్షణ జేయుననుట కర్మసూత్రలక్షణమైయున్నది. ఇందులకు ప్రమాణము శ్రీమద్భగవద్గీత యందలి భగవానువాచ:-

పరిత్రాణాయ సాధూనాం వినాశాయచ దుష్కృతాం
ధర్మసంస్థాపనార్థాయ సంభవామి యుగే యుగే॥

5. తా॥ అట్లు క్రూరులైన రక్కసులు దమ్ము వివిధప్రకారముల హింసించుచుండగా నాబాధల కోర్వలేని దేవతలు మొదలైన ప్రజలు దమ తమ హృదయముల్లో ఆరాక్షసులను దూషించుచూబోగా ఆదూషణములను వారిచిత్తవృత్తులు సత్త్వగుణప్రధానులైన జీవుని యొక్క కోరికలుగావున వృథాగా నశించిపోవీలులేక కర్మసూత్రము ననుసరించి సృష్టి కారణమైన ప్రకృతి ధాతువుతోగలిసి పరిణామముబొందుచుండెను.

వివరణ:-

ఇది అవతారలక్షణము. అసలు భగవంతుడఖండనిర్గుణసచ్చిదానందమయస్వరూపమని శ్రుతులు సెప్పుచున్నవి.

అట్టి అఖండమైన పరబ్రహ్మను ఖండముగుటకాని, నిర్గుణము సగుణముగా మారుటకాని, యన్యోన్యవిరుద్ధము. జీవాత్మస్వరూపవిషయమై గూడా ఆ యఖండపరిపూర్ణపరబ్రహ్మము దన మాయయైన మూలప్రకృతియందు ప్రతిబింబమునొంది, అద్దములోని సూర్యబింబమువలె పరమాత్ముని అంశమై జీవుడని వ్యవహరింపబడుచు, సత్తు- చిత్తు- ఆనందమను భగవల్లక్షణములే స్వరూపముగాగలిగి క్రీడించుచున్నాడని చెప్పబడియున్నదిగాని ఆ యఖండస్వరూపము ముక్కలు ముక్కలుగా జెదిరిపోయి యీ నానాజీవులైరని యర్థవాదము లేదు. సృష్టిపరిణామమునందు నద్దమువంటి ప్రకృతియే తునకలు తునకలై యసంఖ్యాకములగు ప్రతిబింబములను జీవులను గల్పించుచున్నది, అయితే అవతారమనున దట్లోకసామాన్యజీవుడుగా బరిగణింపబడ వీలులేదు. శ్రీమద్భగవద్గీతలోగూడా దానే ప్రతియుగమునందు నవతరించి ధర్మసంస్థాపన జేయుచుంటినని భగవంతుడు స్పష్టముగానే చెప్పికొనియుండెను. ఇది సూక్ష్మగ్రాహ్యము. ఎట్లన:- ఒక బలవంతుడకారణముగా నొకదుర్బలుని బీడించును. ఆబలహీనుడు సేయునదిలేక ఆ బలవంతునిపై వ్యసనపడి తన మనమ్ములో దూషించికొనును. ఆ దూషణములను చిత్తవృత్తులు జీవాత్మయొక్క స్వయంశక్తి ప్రధానములుగావున ఆబలశాలివైపు ప్రసరించును. ఆబలవంతు డట్లు గ్రమేణ ననేకదుర్బలులను హింసించుచుచూబోగా, వారివారియొక్క చిత్తవృత్తులుగూడా నల్పశాపములై ఆదురాత్ముని నావరించును. అప్రకారముగా ఆబలవంతునితో సమానమైనశక్తి సమకూడువఱకు నానా

జీవుల యొక్క లక్షలకొలది చిత్తవృత్తులు ప్రకోపించి గుమిగూడి ఆవరించికొనుచు నేకీభావమునొందును. అట్లు తగిన శక్తివంతముగాగా, ఆ ధాతువు దట్టమై సంకర్షణ బొందుచు, బీజమై సాకారముగా ప్రభవించి తనకర్మవృత్తమైన క్రియా పరిష్కారమునకు వేచికొనియుండును. అట్లనేక కోట్లకొలది జీవాత్మలయొక్క అంశలు గూడి యొకే తేజముగా జనియించుటచేత ఆవ్యక్తియొక్క చిత్తప్రకృతి సహజముగా అమానుషమైన శక్తికలిగియున్నదై, సామాన్యజీవుడని గణింపబడ వీలులేక, అవతారపురుషుడనియే ఆమోదింపబడుచున్నాడు. అట్టి అవతారపురుషుడును దన కర్మయోగమంతయు నివర్తించికొనుచు, సులభముగా జ్ఞానముగూడా సంపాదించికొని, తదనుసారముగానే జన్మసంస్కారము బొందుచున్నాడనుట ధర్మసూక్ష్మము.

6. తా॥ క్రమక్రమముగా ఆచిత్తవృత్తు లమోఘములై యేకీభవించి, నీరు ఆవిరిగామారి వర్షమేఘమైనట్లు, ఘనీభవించుచు బరిణామమునొంది, సత్వగుణప్రధానమైన తేజోవిశేషముతో నీలవర్ణముగా మారుచుండెను.

వివరణ:—

మహాతేజమైన ప్రకాశము దృగ్గోచరమగునపుడు నీలవర్ణముగా గనుపించును. ఇందుకు దార్కాణము, ఆకసమునందలి సూర్యరశ్మి. ఎండయెక్కుడు తీక్ష్ణముగానుండు మిట్టమధ్యా

హ్న కాలమున ఆరశ్మి నీలముగానుండి, సాయంప్రాతః కాలములందు బ్రకాశముదక్కువకాగా వివిధరంగులతో కన్పించుచున్నది. అకారణముచేతనే జ్యోతిర్మయమైన జీవాత్మపరమాత్మలకు నీలవర్ణ ముపాధిగా చెప్పబడియున్నది. అట్లావర్ణమును జలాశయముగా నన్వయించి శ్రీమన్నారాయణుడు అనగా నీటియందు వసించినవాడనియు బ్రతిపాదింపబడియున్నది.

7. తా॥ అట్లు కోట్లకొలది దేవతాజనులయొక్క యంశలు కలిసి ఒక మహాతేజమగుచు నావిధముగా సృష్టివెచిత్ర్యముబొంది జీవస్వరూపమై దేశకాలపాత్రానుసారముగా భూలోకమున బుణ్యాత్ముడగు దశరథమహారాజుయొక్క పట్టమహిషియైన కౌసల్యాదేవికి బుత్రరూపమున ఆవిర్భవించెను.

8 తా॥ అట్టి సమష్టిశక్తియైన ఆశిశువు తనయొక్క మహాతేజ మెక్కుడు ప్రకాశమానముగా వెలుగుటచేత శ్రీయనియు, దనచైతన్యరూపమైన ఆత్మలీలలు మనోరమ్యమై చూపఱులనాకర్షించుటచేతరాముడనియు, చంద్రబింబమువంటి తనముఖకాంతులు జంద్రకిరణములవలె హృదయానందకరముగా నుండినందున చంద్రుడనియు, సార్థకపదములతో 'శ్రీరామచంద్రమూర్తి' యని వ్యవహరింపబడెను.

9. తా॥ తరువాత శ్రీరామచంద్రుడు పెరిగి పెద్దవాడై తన క్షత్రియ ధర్మము ననుసరించి రాక్షససంహారమును దుష్టశిక్షణము గావించుటకై దండకారణ్యము చేరెను.

10. తా॥ ఆ దండ కారణ్యమునం దొక్కకచోట జ్ఞానులును, వైరాగ్యవంతులును, శాంతులునునై నసంయమీంద్రులు గూడ నెల్లప్పుడు భగవద్ధ్యానతత్పరులై యుండిరి.

11. తా॥ అట్టియెడ ఆశ్రీరామచంద్రు డొకనా డొకముని పల్లె సమీపించి యందు సమావేశమైయున్న మునికూటములోనికి ప్రవేశించి వారికందఱకు దనజగన్మోహనమైనసౌందర్యముతో నేత్రపర్వమొనరించుచు, నక్షత్రరాశి నడుమనున్న నిండుచంద్రునివలె తేజోమూర్తియై ప్రకాశించెను.

వివరణ :-

భగవంతుని యొక్క యన్ని అవతారములలోను శ్రీరామావతారమేయనన్యమైన రూపలావణ్య విభ్రమములుగలిగి మిక్కిలి సౌందర్యవంతమై యుండెనని చెప్పబడియున్నది.

12. తా॥ తొలకరిమబ్బువంటి మెఱుగుగల నీలవర్ణమైన శరీరచ్ఛాయయు, పదునాల్గులోకములను సంకల్పమాత్రముచే బుట్టించు గంభీరమైన నాభీస్థలమును, విశ్వమంతయు బ్రకాశింపజేయు సూర్యచంద్రులవంటి నేత్ర

ద్వయమును, లక్ష్మీదేవి కాటపట్టయిన విశాలమగు
వక్షస్థలమును, మిగులసన్నమైన నడుమును, గలిగి, యేను
గుగున్నవలె ఠీవిగా నడచుచు రూపలావణ్యతేజో
విశేషములచే బురుషులనుగూడా మోహింపజేయు
సౌందర్యమూర్తియైన ఆ శ్రీరామచంద్రుని,—

13. తా॥ ఆ మునీశ్వరులు కనుఱెప్ప లార్పకుండగా జూచి
చూచి, తనివిజెందక, పులకాంకితులై, తదేకదృష్టితో
నివ్వెఱబడి లక్షించుచుండిరి.

14, 15. తా॥ అప్పు డాశ్రీరామచంద్రమూర్తి యొక్క ఆనీ
లవర్ణమైన దేహచ్ఛాయయు, ఆవుత్తైన విగ్రహసౌష్ఠ
వము, ఆమోకాళ్లనుదాకు పొడవైనచేతులు, ఆ
చెవులు కన్నులు భుజములు ముఖము కంఠము నాభి
పాదములు, దక్కగల నడుము తొడలు వక్షస్థలము
మొదలైన ప్రతియొక్క యవయవము మనోరంజక
ములై మన్మథునిబాణములవలె గాఢముగా మనస్సుల
నాటుకొనగా ఆమునీంద్రులు చలించి భ్రమించి చిత్త
వైకల్యము నొందినవారలై విరహముజెందిన స్త్రీల
వలె ఆయవతారపురుషుని మూర్తివైభవము నొక్కట
నాలింగనముసేయ గుతూహలపడిరి.

16. తా॥ అంతలో ఆశ్రీరామచంద్రుడును దమవల్లనొకమగ
వాడే కదా యనియు, నగుబాటుసుమా యనియు,

తడబడుచు, సంబరపడుచు, ఒకరిమొగమొకరు చూచి కొనుచు, ముచ్చటపడుచు, తమలోఁదా మిట్లని తలపో యఁజొచ్చిరి,—

17. తా॥ అక్కటక్కటా వానప్రస్థాశ్రమవాసులమై యరణ్యములనివసించుచు, నీవారధాన్యముతో పొట్టపోసికొనుచు ననేకసంవత్సరములనుండి బ్రహ్మచర్యదీక్షవహించి యింద్రియజయముగలిగి జీవితమునందుగూడా విసుగుజెందియున్న మాబోటి తపస్సంపన్నులనే యీ పురుషుఁడొక డీరీతిగా మోహింపజేయుచున్నాఁడుగదా!

18. తా॥ అయ్యయ్యో! కేవలమైన నిర్వికల్ప సమాధినిగూడా సాధించుచు, మనస్సును బుద్ధిని జిత్తమును లయమొనరించి, ద్వంద్వాతీతమైన అమనస్కయోగ మనుభవించుచుండిన ఆత్మ సంచలించిన మాతపశ్శక్తియంతయు గూడ నేఁడు వృథామైపోవును గదా!

19. తా॥ ఆ సచ్చిదానందపరబ్రహ్మమే ఈ శ్రీరామచంద్రమూర్తియై అవతరించెననుట యదార్థమైనను, అపరమాత్మునియొక్క అంశయని పిలువబడుటకు హంసమాత్రుఁడైన జీవునకు వ్యవహరించునుగాని, శుద్ధజడాత్మకమైన యీపాంచభౌతికస్థూలశరీరమే అపరబ్రహ్మస్వరూప మనుట అజ్ఞానమేయగును గదా!

20. తా॥ పరబ్రహ్మ మనునది సర్వాంతర్యామియు, మహత్తు మాత్రము చేతనే రూపము గలవాడని తెలియబడువాడును, శాశ్వతుడును, తానేవస్తువుచేతను జూడబడక తనకు దానే సర్వమునకు సాక్షిమాత్రుడు నగును గావున దదంశసంభూతుడైన జీవుడగు హంసునకే యాలక్షణము లేర్పడుచున్నవి కాని క్షయవృద్ధులకులోనైన దేహమునకు గాదు కదా!

21. తా॥ అట్లని యెఱింగియు, నింతటి యింద్రియజయమును గూడాసాధించి గొడ్డుబాఱిపోయిన యీవృద్ధాప్యమున నిట్లాలింగనము సేయగోరు టెంతయనుచితము సుమా!

22. తా॥ అని ఆందోళనబడుచుండియు ఆశ్రీరాముని సౌందర్యముచేత నాకర్షింపబడి, హృదయస్థైర్యము సెడి, ఆతురబడుచున్న ఆమునిలోకమును జూచి,—

23. తా॥ లోకేశ్వరుడును, సమస్త స్థావరజంగమశోభల నేలువాడును నైన ఆశ్రీరామదేవుడామునీశ్వరుల యభిమతమును గ్రహించి, దయామయుడును, భక్తుల కోరికల నొసంగువాడును గావున ననురాగము సూచించుచు వారి నెల్లరను గలయజూచి యిట్లనియె,—

24. తా॥ ఓ సంయమిప్రవరులారా! నేను నిక్కువముగా బ్రహ్మజ్ఞానులకు వశ్యమయ్యెయున్నాను. అంతేగాక, సర్వసాధారణముగా నేమాసవుడైనను నాయొక్క సగుణస్వరూపముగాని నిర్గుణస్వరూపముగాని హృదయములో ధారణజేయుచు ధ్యానించుచుండిన నేను వానికి బ్రహ్మానంద మొనగూర్చుటయేగాక, యీ పదునాలుగు భువనములుగూడా వానిధనమై ప్రవర్తిల్లును. అట్టియెడ జిత్తశుద్ధిగలిగిన యోగసిద్ధులును నిరంతరము నిర్వికల్పసమాధిలో నిమగ్నులగుచు మునిపుంగవులైన మీవంటి సిద్ధపురుషులు గోరినప్పుడీపాటి నా యీ దేహాలింగనమే మీకు దొరుకకపోవునా? కనుక, యది మీకందఱకు దప్పక సిద్ధించితీఱును.

25. తా॥ కాని మీ యీకోరిక నీక్షణమే నెఱవేర్చుటకు వీలు లేదు. ఏలననగా, నేనీజన్మమునందు గర్భిష్ఠుడనై కొన్ని అమోఘనియమముల బూనియున్నాడను గనుక నా యర్ధాంగియైన యొక్కసీతకుదప్ప నితరుల కాలింగనమొసగుటచేత నాయేకపత్నీవ్రతమునకు భంగము వాటిల్లును గావున నిషిద్ధమైయున్నది.

26. తా॥ అంతేగాక యమోఘమైన తపశ్శక్తిగలిగిన దేవతల నుండి సముద్భవమైన యీసమష్టితేజము దివ్యములైన యాషడ్గుణైశ్వర్యములయొక్క సమ్మేళనములో మూర్తీభవించుటచేత నాయీశరీరముగూడా మిక్కిలి

పవిత్రమైయున్నది. కనుక యట్టి యీ నా దేహమును గౌగిలించుట కయోనిజయు నా భూదేవికూతురునగు ఆసీతవినా యితరులెవరును బాత్రులుగాజాలరు.

27. తా॥ కనుక మీ రిప్పుడు గోరిన నా దేహాలింగనము మీకు రాబోవు ద్వాపరయుగాంతములో దప్పకలభింపజేయుచున్నాను. ఆయుగమ్ములో నేను నా నిజభూమితో మఱల నవతరించుచున్నాడను. మీరును స్త్రీబుద్ధితోనే డిట్లుగోరినవార లైతిరికావున మీరందఱు గోపవనితలై పునర్జన్మము నొందెదరు. నేను మీకోఱకై వ్రేపల్లెలో నివసించుచు యశోదాదేవికి గుమారుడనై విహారించునప్పుడు మీకు నా ఆలింగనము సిద్ధింపగలదు.

28. తా॥ అని పలికిన ఆశ్రీరామదైవము యొక్క వచనము లాలకించి యా మునీశ్వరులు, "శూర! ఏమి యీరామావతార నియమములు? ఒక్కటే మాట, ఒక్కటే బాణము, ఒక్కతెయేనట భార్యయుగూడా నని తమలోదాము మెచ్చికొనుచు గుసగుసలాడుకొనిరి.

వివరణ:-

శ్రీరాముడు ధనస్సునందు బాణముసంధించిన, దానికి నెత్తురు తగిలి తీఱవలయుననియు, శత్రువు బాఱజూచిన వెనుకగాబోయి తగులక వెన్నంటిమాత్రము దిరుగుననియు, జెప్పబడియున్నది.

29. తా॥ పిమ్మట ద్వాపరయుగము కడపటగా బృందారణ్య ప్రాంతమునందలి వ్రేపల్లియలో ఆసంయమీంద్రులు దమతమ కర్మానుసారముగా గొల్లపడుచులై పుట్టి పెరుగుచుండగా పెద్దగొల్లయగు నందుని భార్యయైన యశోదాదేవికి ఆరామావతారము యొక్క తేజము మఱల నిజభూతితో శ్రీకృష్ణుడై ఆవిర్భవించెను.

వివరణ:-

త్రేతాయుగములో శ్రీరామచంద్రమూర్తియై ప్రభవించిన ఆమహాతేజము పుణ్యపాపవిచక్షణతోడి కర్మయోగపరిమగు సిద్ధిని గాంచుటచేత ఉత్తరజన్మమైన శ్రీకృష్ణావతారమునందు ఆజన్మజ్ఞాని యయ్యెను.

30. తా॥ అట్లు ఆజన్మజ్ఞానియైన గోపాలకృష్ణుడు దయాసముద్రుడును, అరిషడ్వర్గముల జయించినవాడును, మంగళప్రదుడును, కపటనాటకసూత్రధారుడును, భక్తపరతంత్రుడునై విలసిల్లెను.

31. తా॥ అట్టియెడ గోపికలు బూర్వజన్మజ్ఞానములేక, సంసారలంపటలోబడి శ్రీకృష్ణుడు వ్రేపల్లెవాడలో నవతరించిన కర్మయోగ రహస్యమైన భగవదాలింగన విషయమును గాని, ఆయవతారపురుషుని మహిమము గాని గుర్తింపకపోవుటచేత, ప్రజ్ఞగలపాత్రులకే దొరకువా

డును, జ్ఞానచక్షువు నొసంగువాడును నైన ఆశ్రీకృష్ణుడు వారియందు జాలినొందినవాడై యిట్లని విమర్శించికొనెను.

వివరణ:-

గోపికలు సామాన్యజీవులవలె జన్మించుటచేత బూర్వజన్మజ్ఞానమును మఱచియుండిరి. కాని వారలకు బూర్వజన్మసంస్కారములు లేకపోలేదు. అనగా వారి మనస్సులందు బూర్వజన్మమునందు సాధించియున్న చిత్తశుద్ధి దాగికొనియేయున్నది. అట్లణగియున్న చిత్తవృత్తులు ప్రకోపించిననే కాని వారలు మఱల సత్త్వగుణప్రధానలు గాజాలరు. అట్లు సత్త్వగుణము ప్రకాశమానముగాక, యింద్రియప్రవృత్తిలోనే యుండిన, వారు బ్రహ్మజ్ఞాలభ్యుడైన శ్రీకృష్ణుని యొక్క ఆలింగనము లభించుటకు బాత్రులుగారు. పూర్వజన్మమునందు వారలెట్టి యంతఃకరణముతో ఆశ్రీరామచంద్రుని యాలింగనము గోరిరో యట్టి సత్త్వగుణస్థితిలోనే యిప్పుడది చేకూఱవలసియున్నది, కాని వారింద్రియలోలలై యుండినగాదు. కావున భక్తపరతంత్రుడగు శ్రీకృష్ణభగవానుడు వారి నట్లుద్ధరింపవలసినవాడయ్యెను.

32. తా॥ పాప మీ గోపిక లింద్రియజాలములోబడి చిత్తభ్రమనొంది సంసారమార్గానువర్తినులై నన్ను దెలియలేకుండిరి కదా!

33. తా॥ వీరు గొల్లజాతికి జెందియుండుటచేత, ఆలమందల గాచికొనుచు, పాలువెన్నల నమ్మికొని సుఖముగా జీవ

నము సేయుచున్నారే కాని, యీజగత్తు మిథ్యయ
నియు, నీశారీరసుఖము లనిత్యములనియు నెంతమాత్ర
ము దెలియకుండిరి కదా!

34. తా॥ విశ్వమున కంతటికి జీవస్వరూపమైన ఆపరంజ్యోతి
యందు సమాధినిష్ఠలో లయముజెందిన పూర్వజన్మ
పరిపాకము గలిగియున్నవారలయ్యు, ఈ గోపికలు
నామాయాపాశమున జిక్కుబడియున్నారు గనుక
వీరల నే నిప్పుడు దప్పక రక్షింపవలసియున్నది.

వివరణ:-

సాధకుడు మొదట దన పురుషప్రయత్నముతో వ్యవ
సాయముసేసి యింద్రియజయము బొందినయెడల దదనంత
రము దైవమే ప్రయత్నపూర్వకముగా దన్నుద్ధరించుచున్నా
డు. అమెట్లు జేసినపిదప మానవునకు దాను తిను ఆహారము తన
ప్రయత్నము లేకపోయిననూ ఏవిధముగా జీర్ణమగుచున్నదో,
యాదేవిధముగా మనస్సు నివృత్తిపరమగునట్టి నాడీశుద్ధిని
బొందిన పిమ్మట ఆపరమాత్మునిచేతనే యాకర్షింపబడి సాధ
కుని చిత్తవృత్తికి బాహ్యేంద్రియసంకర్షణ నిరోధించి మనో
లయ మొనరించుచున్నది. కావుననే భక్తాగ్రేసరుడగు ప్ర
హ్లాదుడయస్కాంత మినుపముక్కను లాగికొను నట్లుగా
దనచిత్తము నాహృషీకేశునిశక్తి లాగికొని పోవుచున్నద
నియు, దానిని మళ్లింప దనకు వశముగాకున్నదనియు దండ్రి
యైన హిరణ్యకశిపునితో విన్నవించికొనెను.

35. తా॥ అని తర్కించికొనినవాడై శ్రీకృష్ణుడు గనికరము విడిచి, తోడిగోపాలురతోఁగూడి ఆగోపికల సర్వసౌఖ్యములకు మూలమైన పాలు పెరుగు వెన్నల నపహరించి బాధింప సమకట్టెను.

వివరణ:-

తమ శిశువును సన్మార్గములో నుంచుటకు మొదట దలిదండ్రులశిక్షణ మవసరమైయున్నది. అట్లు దా మాకుమారుని గొట్టినను దిట్టినను వారి భావ మాబాలకుని క్షేమమే గావున నన్యాయముగాదు. అజ్ఞానుడగుబాలున కది తెలియక నిజముగానే భయపడవచ్చును. కాని తన క్షేమము విషయమై తనకంటె నెక్కువగా వాని తలిదండ్రులకే తెలిసియున్నదనుట నిర్వివాదము. అదేవిధముగా గోపికలయొక్క చిత్తప్రవృత్తి నిరోధించుటకు భగవంతుడు బాహ్యసుఖముల కంతరాయము గల్పింప సంకల్పించుటయు, ఆగోపికల యాత్మక్షేమమునకే కావున, వా రది మొదట గ్రహింపలేకపోయినను దాన్ని వారి జ్ఞానసంస్కారములను రక్షింపవలసినవాడయ్యెను.

36. తా॥ అక్కడక్కడ నాటలాడుకొనుచుండెడి గోపబాలురను గూర్చికొని, దొంగతనముగా, ఆగోపికలయొక్క యిండ్లలోనికి జాగరూకతతో జొఱబడి, ప్రతిదినమును చేతికందిన పాలుపెరుగువెన్నల సొంతముగా దినివేయుచుండుటచేత, ఆగొల్లపడుచులు శ్రీకృష్ణునిపై ఆ

సూయాద్వేషములు జెందివారై యాబాలుని చిదానం
దలీలలు గ్రహింపలేక వాపోవుచు,—

37. తా॥ అబలలు, చంచలలునైన ఆగోపకన్యలు, భగవం
తుడైన శ్రీకృష్ణు నెఱుంగజాలక, లోకవ్యవహారరీత్యా
నన్యాయము నవమానము జరుగుచున్నదని భ్రమించి
యొకనాడు వారందఱుగలిసి యశోదాదేవి యింటి
మీదికి దండెత్తి ఆకృష్ణుని చేతలవిషయమై ఆమెతో
ఘోరముగా బోట్లాడిరి,—

38. తా॥ ఓ యశోదమ్మగారూ! నీకు గొడుకుపుట్టుట మాక
ర్మకొలదీ మాకొంపలు దోచుకొనుటకే శాబోలు.
ఇంకేమున్నది, మాపాప మిట్లాపండిపోయినది. ఏమో
నమ్మా! ఈయూరిలో మే మిక కాపురములువదలి
యింకేయూరైనా లేచిపోవలసి వచ్చినట్లేయున్నది.

39. తా॥ అయ్యయ్యో! నీకొడు కేదో యొకవంకబెట్టుకొని
మాయిండ్లలో దూఱి యన్నియు నాశముచేసి పోతా
డమ్మా. అంటే, అడ్డము గనుపించలేదు కొంచెము
చుక్కబెట్టమ్మాయీ! యంటూ దగ్గిరకు జేరుతాడు;
పోనీలేయని, మొగమున జుక్కదిద్దుతుంటే, మెడ
లోని సొమ్ములు చూచినట్లు నటించి బొమ్ములు-ముట్టు
కుంటాడు; ముట్టుకొని నీకొక మంచిరహస్యము చెపుతా
నంట్రూ! చెవియొద్దకువచ్చి చెక్కిలినొక్కుతాడు;నొక్క

నీకంటె నేనే పొడవున్నాను కొలుచుకుందా
మంటూ, ముందునకు నిలబడి మోవిదగులుతాడు;
తగిలి నీవు కండ్లుమూసుకో గమ్మత్తుచూపుతానంటూ,
నాకండ్లురెండూమూసి యింట్లోకిజొఱబడి ఆపాలు
మీగడలు దోచికొని, పోతూపోతూ నానోటికికూడా
కొంచెముపూసి కిలకిలనవ్వు నవ్వుకుంటూ పరుగెత్తి
పోతాడమ్మా! మీనల్లపిల్లగాడు.

వివరణ:-

శ్రీకృష్ణుడు బదునొకండేండ్ల ప్రాయమువచ్చువఱకే వ్రేపల్లెలో నందునింట బెరిగెనని శ్రీమద్భాగవతమునందే చెప్పబడియున్నది. అట్లా శ్రీకృష్ణుని బాల్యక్రీడలు పసితనమునందే జరిగియుండెనుకనుక నట్టిచిన్నవయస్సునకు జారత్వమాపాదింప వీలులేదు. పోతనామాత్యుడు దనకవితాచమత్కృతితో భగవల్లీలలని యట్లు శృంగారరసముతో దెనుగు భాగవతమునందు వర్ణించియుండెనుకాని, యౌవనమే లేని బాలున కట్టికాముకాభావము గలిగెననుటలో నర్థములేదు. అంతేగాక "నీవుయశోదబిడ్డడవె నీరజనేత్ర సమస్త జంతు చేతో విదితాత్మ వీశుడవు" అని యాకవీశ్వరుడు బిమ్మట గోపికాగీతలందా వ్రేతల చేతనే స్తుతి జేయించియున్నాడు. కనుక గోపికలు మొదట దన్ను గడపద్రొక్క నీయకపోయినప్పు డాబాలకృష్ణు డేదోయొక చమత్కారముతో దగ్గరకు జేరి, మఱపించి, యుక్తిగా నింటిలోనికిజొచ్చుట జరిగియుండెడిది. అది సహజముగా కుఱ్ఱవాండ్లకుండ దగును స్వాభావికమ్మైయె యున్నది.

40. తా॥ అంతేగాక మేము మాయిండ్లలోనున్న పాలకుండలనన్నింటిని జాగ్రత్తగా దాచికొని, తలుపులు బిగించి, గుమ్మముమీదనే గూర్చొని కావలియుండగా, మాకంటబడకుండగనే యెటుగండి లోనికిబోవునో కాని, కడవలుమాత్రము ఖాళీయై యుండునమ్మా! ఇంకా యేమేమో పులి, తోడేలువలె దొంగయలుపులఱచి మమ్ము నిర్ఘాంతపెట్టి మాయిండ్లలోదూఱి పాలకుండల దన్నికొనుచు జిక్కకుండా దప్పించుకొని మఱీ పాఱిపోతూయుంటే, యింకా నీ కేమిచెప్పవలెనమ్మా యశోదమ్మగారూ! మొత్తముమీద కనిపాఱేసి యాబోతును విడిచినట్లుగా ఊరిమీద వదలివేస్తేమట్టుకు మే మిక యూరుకోలేమమ్మా!

41. తా॥ అని యుప్పతనబెట్టుచూ ఆడిపోసుకొనుచుండగా విని నివ్వెఱబొందిన యశోద తన చిన్నికుమారుని ముఖలక్షణములలోని యమాయకత్వమును జూడగానే చిఱునవ్వు గలిగి, తనముద్దుబిడ్డ నన్యాయముగా సరిపడక నిందించుచుండి రనితలంచి యొడలుపులకరింపగా వారిని నిరాకరింపనెంచి,—

42. తా॥ ఓహోహో గోపికలారా! మీ రిట్లు గోపమెత్తివచ్చి యీరోజువరకు నాచనుబాలైనామానని యీ పసివాని నీరీతిగా జారచోరదూషణములతో నిందించి వృథాగా యెందులకి ట్లుప్పతనపాల్జేసెదరమ్మా?

అన్యాయముగా శిశువుల నింద జేసిన గన్నకడుపైన తలిదండ్రుల కెంతయు విచారకరము గాదా!

43. తా॥ మీరుమట్టుకు బిడ్డలగనని గొడ్డుబోతులా యీరీతిగా నాముద్దులకొడుకుమీద బాఱలుసాచిమఱీ తిట్టిపోయుచున్నారు. చాలుజాలుగాని యీ వేషాలు మాని నాయింటిముంగటినుంచి వెళ్లిపొండి.

44. తా॥ కానిచో మీరు మీమగవాండ్లపై దిరుగుబాటుజేసి గెలువలేక, ఆకసియంతయు, యీ పరాయితల్లిగన్న పసివానిమీద జూపించి వాపోవుచుంటిరి కాబోలు.

45. తా॥ ఆహా ఏమి యీ ఆగడము? పసివాడన్న తఱువాత బొరుగిండ్లవైపుకే రాకయుండునా? వచ్చినప్పుడొకవేళ నేమైన తినేవస్తువులు గన్పించిన నందుకొనక మానునా? అట్లని ఆపాలుపెరుగులు గంటబడకుండా జాటుగా దాచిపెట్టుకొని, యేదో కళ్లెదురుపెట్టి వాడందుకొనకుండా చూచుకొనవలెనుగాని, యిట్లు పరువుమర్యాదలులేకుండా శాస్త్రంతదానికి గంపెడంత చేసి బాఱలు చాపుతూ బాజారుకెక్కితే యేమున్నది?

46. తా॥ అని యీ గోపికలను తిరస్కరించినదై యశోద కుమారునిపై ప్రేమజనింపగా వారి సంగతివిడిచి. శ్రీకృష్ణుని దగ్గరకుదీసికొని,—

47. తా॥ నాయనా! నిన్ను ఊరిలోనివారందఱు గొంటెపిల్లవాడని యప్పతనబెట్టుచున్నారు. నీవా నాకు లేకలేక కలిగిన వంశాంకురము గనుక చెడ్డపేరు దెచ్చికొనబోకుమురా నాతండ్రీ!

48. తా॥ అని లాలనము సేయుచు శ్రీకృష్ణుని గృహములోనికి దీసికొనివెళ్లి దృష్టిదోషము దగిలెనేమోయని భయపడి విభూతిని మంత్రించి తన మనస్సునకు దృప్తిగా నాబాలుని కాపాదమస్తకమును బూసినదయ్యెను.

49. తా॥ ఆప్రకారముగా దల్లిచేత మందలింపబడిన శ్రీకృష్ణుడుపేక్షాభావము వహించి గోపికల విషయమై వదలివేయగా, దమ యింటిపురోహితుడైన గర్గమహాముని యరుదెంచి యాకృష్ణావతారమర్మ మెఱిగియున్నవాడు గనుక ఆయోగేశ్వరుని యోగవిద్యా విధానమును బునశ్చరణ జేయవలసినదని ప్రేరేపించుచు క్రియాయోగములో నుదాసీనుడు గాగూడదని యాశ్వాసించి వెళ్లెను.

వివరణ:-

అట్లు లోకులచేత దూషింపబడి ఉదాసీనుడైయున్న బాలకృష్ణుని గర్గమునీంద్రుడు క్రిందివిధముగా నుదోబ్ధించెను:-

గర్గ॥ గోపాలదేవా! ఏమ ట్లుదాసీనునివలె యేదో చింతించుచున్నాడవు?

కృ॥ గురుదేవా! నే నితరులకు మేలుసేయుచుండగా నన్ను దుర్మార్గునిగా భావించుచున్నారుగదా స్వామీ!

గ॥ నాయనా! లోకము కాకులవంటిదనికదా సామెత. మఱియు "లోకో భిన్నరుచిః" కావున మన మితరుల యుద్దేశములు గమనింపకూడదు. నీవు నీబుద్ధికి దోచి నటుల జేయుట నీకర్తవ్యము.

కృ॥ కాని యితరులు నన్ను దూలనాడుచుండిరిగదా స్వామీ!

గ॥ ఎవ్వ రెవ్వరిని దూలనాడి రోయీ, గోపాలా?

కృ॥ ఈ యూరివారందఱువచ్చి నన్ను దిట్టి మాయమ్మతో బోట్లాడిపోయిరి స్వామీ!

గ॥ ఎవరిని దిట్టిరి నాయనా?

కృ॥ నన్నే స్వామీ! నన్నే.

గ॥ అంటే నాకర్థముగాలేదే!

కృ॥ అయ్యో నన్నేనండి, నన్నే. ఈ యశోదాకుమారుడ నగు శ్రీకృష్ణుని.

గ॥ ఓహో! అటులానా, కృష్ణుడవైన నిన్నే తిట్టిపోయిరా?

కృ॥ ఔనండి, ఔను.

గ॥ అయితే నీపేరు కృష్ణుడన్నమాట.

కృ॥ కాదు స్వామి; నాపేరు శ్రీకృష్ణుడు.

గ॥ సరే, నీ పేరైతే శ్రీకృష్ణుడు.

కృ॥ ఆఁ ఔను స్వామీ, నా పేరు శ్రీకృష్ణుడు.

గ॥ అయితే నీ వెవ్వర వోయీ?

కృ॥ అయ్యో! నేను శ్రీకృష్ణుడనని చెప్పికొంటిని గాదండీ, యింతలోనే మఱచిపోతిరా స్వామీ!

గ॥ కావచ్చాయీ! శ్రీకృష్ణ డనేది నీ యొక్క పేరు గదా! అటులైన నీవు ఎవ్వరో చెప్పుము.

కృ॥ అదేమిటి స్వామీ! అట్లా అడుగుచున్నారు.

గ॥ నీకు నామాట యర్థముగాలేదు కాబోలు. సరే, ఈయశోద ఎవరి తల్లి?

కృ॥ నా తల్లియే.

గ॥ ఔను గదా! నీవు వేఱు, మీయమ్మ యశోద వేఱు? నుంటిరికావున, ఆమె నీయొక్క తల్లియైనది. కాని ఆమెయు నీవును నొక్కటే మనిషి కాదుగదా!

కృ॥ అవునండి, ఆమె నాతల్లి కాని, నేనూ ఆమె యొక్క రమే యెట్లగుదును!

గ॥ మఱి, యిందాక నీవు నీపేరు శ్రీకృష్ణ డంటివే. అప్పుడు నీవూ నీయొక్క పేరును వేఱే వేఱేగాక, యొకేవస్తు వెటులైనది?

కృ॥ అవును స్వామీ! నేను బుట్టినతరువాత చిన్నప్పుడు దమవారే దయచేసి నాకు శ్రీకృష్ణుడని పేరుబెట్టినా రటగదా! ఆ ఆబ్బాయి నేనండి నేను. ఇప్పుడింత పెద్దవాడనైతిని.

గ॥ సరే పోనీలే, నీ చేయి యేది?

కృ॥ ఇదుగో నండి, యిది కుడిచేయి.

గ॥ అవును, యిది ఎవరి చేయి?

కృ॥ —నాచెయ్యే గదండి, నాదే.

గ॥ అవును, ఇది నీది. అనగా నీయొక్క చేయి. అంటే, యిందాక నీయొక్క తల్లి యన్నట్లుగా, నీ చేయి వేఱు, నీవు వేఱుగా నున్నారు గాదూ!

కృ॥ అ దెట్లాయగు నండి? నాచేయీ నేనూ కలిసియేయున్నాము. కాని నాతల్లీ నేను వేఱేవేఱేయున్నాము గాదండీ.

గ॥ అయితే, యీ నీచేయి తెగిపోయిన, నీవుగూడ లేక పోదువా?

కృ॥ అఁహాఁ; ఈచేయిపోతే, నా కింకొకచేయిగూడాయున్నదిగదండి.

గ॥ అవును, యీచేయిపోతేగూడా "నీవు" అంటూ యుంటున్నాడవు గనుక నీవు వేఱు, నీచేయి వేఱు. అనగా నీవు ఆచేయివే యని చెప్పవీలులేదు అది నీయొక్క చేయి. అనగా నీవు వేఱేగా యుంటూయుండగా, ఆ చేయిగూడా వేఱే గానే యుండి, నీది యగుచున్నది.

కృ॥ ఔను స్వామి, తెలిసినది. ఇది నాయొక్క చేయి యగుచున్నది. అయితే యీ కాలూ నాదియే, యీముక్కూ నాదియే, యీకన్నులూ నావియేనన్నమాట ఇవి యుంటే నావి, యుండకపోతే నాకు లేకపోవుచు

న్నవి కాని "నే" నంటూ నివి లేక పోయిన గూడా యుంటానండి!

మఱి, యీ కండ్లూ ముక్కూ, చెవులూ, కాళ్లూ తలా నీవు గాకపోతే "నీ" వెవ్వర వోయ్?

అదేనండి, నే నెవరిని?... ఆఁ, యీముక్కులో నడిచే యూపిరి గావచ్చును గాదండీ!

మంచిది, ముక్కు మూసిపట్టుకొని చూడు.

నాకు ఊపిరి ఆడదుగదండీ!

ఆఁ, నీకు ఊపిరియాడదంటే నీవు వేఱు, నీ యూపి వేఱు గాదూ?

అంతే నండి.

మఱి నీ వెవ్వడవు?

ఏమో తెలియుట లేదండి. అంతా ఆ యోమయముగా నున్నది. స్వామీ! తమరే నన్ననుగ్రహింప వలసినది మునీంద్రా!

అటులైన వినుము. నీశరీరమునందు "నే" ననునది నీశరీరము కాదు. నీశ్వాసయు గాదు. ఈశ్వాస మనస్సు యొక్క స్థూలరూపము. ఈశ్వాసననుసరించుచు ననుగమించిన, నీదేహమునందలి పంచకోశములను దాటి యగలవు. ఆ యింద్రియములజయించి, మనస్సును వశపఱచికొని యహంకారము నణగద్రొక్కిన బుద్ధికి ఆత్మావలోకన మొదవి నిను నీవు యథార్థముగా నెఱిగికొనగలుగుచున్నాడవు. కాని, యీదేహమును

వనియు, మనస్సు నీ వనియు పొఱపడుట మాయ (లేక) అజ్ఞాన మనబడుచున్నది. నీవు సర్వకాలసర్వావస్థలందునగూడా ఆత్మవే యై యున్నాడవు. ఆ అజ్ఞానమను మాయ తెఱ దొలగిన, సూర్యోదయముతో నిండుచీకటియంతయు నెగిరిపోవునట్లు, ఆత్మసాక్షాత్కార మొదవి, అజ్ఞానమంతయు నశించుచున్నది. ఆత్మ యెల్లప్పుడు సాక్షిమాత్రుడే కాని, కర్తయు భోక్తయు గాడు. కావున ఆత్మకు దూషణభూషణములెన్నడును లేవు. నీవా ఆత్మస్వరూప మయ్యే యుంటివి గనుక లోకు లాత్మయగు నిన్ను దిట్టుచుండిరని తలంచుట యారోపిత మగుచున్నది. అన్ని జీవులిలోని ఆత్మ యొక్కటే గనుక తిట్టువాడు, తిట్టుదినువాడు గూడ నాత్మయేయై యున్నది. ఇక ఈమిథ్యారోపణ చేయుంచునది మనస్సేయై యున్నది. ఆమనస్సు పంచజ్ఞానేంద్రియములద్వారా యానందము కొఱకు బాహ్యవిషయములలో వెతకికొనుచు, జీవునకహంకార మాపాదించి కర్మలంపట నొందించి జననమరణముల బొందించుచున్నది. జీవాత్మయే యథార్థస్థితిలో అఖండానంద స్వరూపముగానున్నది. కావున మనస్సు నంతర్ముఖము సేయవలయును. రెండుకండ్లను మూసికొనిన, యీ మాయాప్రపంచమునం దొకయైదవభాగము అదృశ్యమగుచున్నది. నోరు గూడా మూసిన, రెండు వంతులుగా నశించుచున్నది. చెవులు మూసిన మూడువంతులు మాయమగుచున్నది. అట్లే

ముక్కుమూసిన నాల్గువంతులుగాను, శరీరమే మఱి
చిన బూర్తిగాగాను ప్రపంచము లేకపోవుచున్నది.
అనగా యీ మైకు మార్గములు నిరోధించిన, మనస్సు
పరిభ్రమించక జీవాత్మలో నణగిపోవుచున్నది. కనుక
శ్రీ, గోపాలదేవా! నీ వా మనస్సునుజయించి లోకులకు
వెలువక, నీ బుద్ధికి యుక్తమని తోచినట్లు కర్మాచర
ణము సేయుచు, కర్తృత్వాభిమానములేక లోకోప
కారము సేయ వలసినది.

కృ॥ అయితే, గురువర్యా! సాధన మేప్రకారముగా జేయ
వలయునో యనుగ్రహించి, నన్ను గృతార్థుని
జేయుడు.

గ॥ కృష్ణభగవానుడా! నీవు సాక్షాత్ భగవంతుడవును ఆ
జన్మజ్ఞానివియు గావున నేను నీకు వేతే యుపదేశింప
వలశినది లేదు. ఐనను, నీ వీబాల్యమునందే యష్టాం
గయోగముతోగూడిన రాజయోగమును బునశ్చరణచేసి
కొనిన, ఉత్తరోత్తరా లోకమునకు దత్త్వోపదేశము
సేయుటకు మాననీయుడవగుదువు. కానిచో లోకులు
నీ మానుషత్వమెఱుగజాలక నీ గీతాబోధతత్త్వ మా
ద్దరింపకపోయిన రాబోవు కలియుగమున ధర్మము
బొత్తుగా నశించిపోవును సుమా!

అని గర్గమహాముని శ్రీకృష్ణుని బ్రోత్సాహపఱచి వెడలి
పోయెను.

50. తా॥ ఆవిధముగా మాతృదేవతకంటె గొప్పదైన గురు
దేవునివాక్యము ననుసరించి, కాలయాపనము సేయక,

శ్రీకృష్ణుడు గోపికల విషయమై త్వరపడి విచ్చలవిడిగా వారి పెరుగు పాలు మొదలైన వస్తువుల నాశము సేయ మొదలుబెట్టగా, వారందఱు జాలా మనోవ్యధపాలైరి.

51. తా॥ గోపిక యొక్కతె ప్రతిదినము శ్రీకృష్ణుడు సేయు దానికి వానిని బట్టికొని ప్రతిక్రియ జేయవలెనని సంకల్పించి, ఆనాడు యేకాదశి గూడా అగుటచే నింటిలో వంటచేయనక్కఱలేదుగదా యని యితరపనులేమియు దలబెట్టక, కృష్ణుడందుకొన వీలులేకుండునట్లు నడికప్పున కొక యుట్టినిగట్టి, అందులో బాలు పెరుగు వెన్నకుండలను జాగ్రత్తపఱచి, తలుపులు బిగించి, పీధిగుమ్మము మీదనే మిక్కిలి మెలకువతో గూర్చొని త్రోవగాచికొనుచుండగా నంతలో మధ్యాహ్నకాలమయ్యెను.

52. తా॥ అట్లు పచ్చియుపవాసముసేయు నామెకు నోరు ఎండగా వాకిలిముంగటనున్న చెఱువులోనికి వెనుకకు దిరిగితిరిగి చూచికొనుచు బోయి, త్వరగా నొకగ్రుక్కెడు నీటితో నోరుదడిపికొని, మఱుక్షణములో గిర్రున తిరిగి యిల్లుసేరుకొనునప్పటికి గుండెఝల్లురనగా నంతలో నేయిల్లంతయునిండియుండిన యనేకమంది గోపకులజూచెను.

53. తా॥ ఆబాలురతోపాటు శ్రీకృష్ణుడును రోళ్లు పీటలు బోర్లవెట్టి, వే ఱొక పిల్లవాని నెక్కించి, వాని భుజ

ములపై దాఁనునిలబడి, చేతికందని యాయుట్టియందలి
కుండలకు రంధ్రముగొట్టి, ఆవిసురున కాయుట్టి యిటు
నటు నూగుచుండగా దానితోఁబాటు దాను తనశిర
మునుగూడా సమానముగా వంచుత్రిప్పుచు, క్రిందికి
గారుచున్న క్షీరధారకు దోసిలిబట్టి, తానును దనక్రింద
నిలబడినవాడును త్రాగుచుండగా, తక్కుంగల బాలకులు
మోచేతులక్రింద జుట్టికొని త్రాగుచుండి, యందఱు
దదేక నిమగ్నులై పిలచినా వినిపించికొనలేని స్థితిలో
పొట్టలుమట్టుకు బెద్దవిగా బెరుగుచుండగా, ఆయిల్లాలి
ఏకాదశీవ్రతము సఫలమాయెనా యన్నట్లుగా శ్రీకృ
ష్ణుడు నిజవిభూతియైన గోపాలురతో సహా ప్రత్యక్ష
మయ్యెను.

వివరణ:-

ఈ గోపవనిత యుపవాసదీక్షతో నేకాదశేంద్రియ
ముల నిరోధించి, చిత్తైకాగ్రతగలదై, శ్రీకృష్ణునే స్మరించుచు
బగచేతనో వగచేతనో ధ్యానించుచుండెను గనుక, భక్త
పరాధీనుడైన్న భగవంతుడామె కవశ్యము దర్శన మీయవ
లసివచ్చినది. కాని ఆమెబుద్ధిపరిపక్వముకాకపోవుటచే ఆమె
ఆభగవత్సాక్షాత్కారము నెఱుగలేకపోయినది. అట్లాధర్మ
సూక్ష్మమాయిల్లాలు గ్రహింపలేకపోయినను, గర్మఫలము
దప్పదుకావున, దదేకధ్యానముతో శుచియై ఆదిన మామె

సాధించిన కర్మయోగ్యతయే యామెపాత్రతకొలది నామెకు దక్షిణము ఫలించి భగవత్సందర్శనము ప్రసాదించెను.

54. తా॥ ఆరీతిగా జూచి, భయము, నాశ్చర్యములతో గూడి కొనిన వణకుపుట్టుచున్ననూ, దొంగయని యనుకొనిన ఆబాలకృష్ణుని బట్టుకొనవలయునని ధైర్యముతెచ్చికొని, వానిమీదనే దృష్టినిలిపి, మెల్లమెల్లగా దగ్గరకు జేరుచుండగా శ్రీకృష్ణుడామె నేత్రము లుపవాసము చే జిక్కియుండెనని దయదలచెనన్నట్లుగా, బుక్కిట లోని పాల నామెకన్నులపై నుమిసి, ఆమె తెప్పరిల్లి చూడగలిగేలోపుగా నాగోపాలకులతో సహా చిత్రముగా నదృశ్యమయ్యెను.

55. తా॥ ఆవిధముగా నెవ్వరి కంటబడకుండా నెక్కడ గని పెట్టుకొని యుండునో, యెప్పుడిండ్లలోనికి దూఱునో యెట్లు పాఱిపోవునో, కాని యేమాత్రమును చప్పుడు గాదు. పైగాకుండలు బెట్టినట్లేయుండును కాని లోపల చూచిన శూన్య మని పరిపరివిధముల దలపోయుచు ఆకొంటెకృష్ణుని విషయమై వానితల్లికూడా పట్టించి కొనుట లేదుగదా యని వ్యసనపడుచు,—

56. తా॥ అట్టి విచార మారోజు కారోజు కెక్కుడుగాగా, ఆగోపికలు వాకిం డ్లూడ్చుచున్ననూ, ముగ్గుబెట్టుచున్ననూ, వంటకములు సేయుచున్ననూ, మాట

లాడుకొనుచున్ననూ, నిద్రపోవుచున్ననూ, తిరుగు చు
న్ననూ, చూచుచున్ననూ, వినుచున్ననూ, యింకా
నేమేమిచేయుచున్ననూ, చిత్తముమాత్ర మాకృష్ణుని
చేతలమీదనే యాకర్షింపబడి వేఱే తాముగా గష్ట
పడి సాధించే ప్రయత్నము లేకుండగనే మనస్సులంత
ర్ముఖమై యేకాగ్రత్వమునొందిరి.

57. తా॥ అట్లు దాము బట్టుకొనవలయునని ప్రయత్నములు
సేసినను, దొరికియు దొరకని బాలునిగూర్చి విసిగి,
వేసరి, లోలో మెచ్చికొనుచు, యనురాగవతులై
తుద కాగోపిక లసూయాద్వేషములు మఱచి, యంద
ఱుగలసి సమానముగా శ్రీకృష్ణుని ప్రేమింపదొడగిరి.

58. తా॥ ఈ ప్రకారముగా జిత్తైకాగ్రత నొందుచు, హృద
యపూర్వకముగా గామక్రోధాదుల విసర్జించి శ్రీకృ
ష్ణునియం దెక్కుడు మమకారము గలిగినవారలై
గోపికలాబాలకుని దమ చేతులలోనికి జేరదీసికొని
గారాబము సేయవలయునని గాఢముగానపేక్షింపగా
ఆశ్రీకృష్ణుడు వారలకు శరీరము వేఱు ఆత్మలు వేఱు
అని నిర్ధారణచేయుచు స్ఫుటముగా ననహంకారో
పదేశము సేయదలచినవాడై చిత్రముగా దన బాల్య
లీల నొకటి నిరూపించెను.

వివరణ:-

గోపిక లింద్రియలోలులుగానుండియే శ్రీకృష్ణుని దాకగోరుచుండిరి, కాని గతజన్మలోని మునీశ్వరులవలె నింద్రియాతీతలై కాదు. కనుక, వారికి స్థూలదేహవాసన పూర్తిగా నశింపజేయుటకై భగవంతు డుపదేశము సేయవలసివచ్చెను. అట్లని తన దైవత్వ మెఱుగని సంసారిణులగు ఆగోపికలను బిలిచి మంత్రోపదేశము సేయుటకు వీలులేమి క్రియారూపముగా నొక్కట ఆత్మచికిత్స నొనరింపగడగెను. ఆవిధముగా జ్ఞానులైన వారతాత్తుగా జిత్తప్రక్రియ నొనర్చిన పాత్రులు గానట్టిమూఢహృదయులగు శిష్యులకు నాడీదోషముసంభవించి ప్రమాదము జరుగుట తటస్థించును. అందువల్లనే యమనియమాదులు మొదట తప్పక సాధింపవలసియున్నది. కాని ఆగోపికలన్ననో అదివఱకే యింద్రియవాసనలను మఱల్చిన హృదయనైర్మల్యమును బొందియున్నవారగుటచే వారికా నాడీవిజృంభణము దరుణమేయయ్యెను.

59. తా॥ ఒకనాడు గోపికలందఱు గౌరీదేవీవ్రత మారంభించి వినోదముగా నాడుచు బాడుచు యమునానదికి వెళ్లి నిస్సంకోచముతో వివస్త్రలై స్నానముసేయుచుండిరి.

60. తా॥ అప్పుడాబాలకృష్ణుడా యొడ్డుమీదనున్న ఆవ్రేతల చీరెలు దొంగిలుచుండగా వారు చూచి యాతని వారింపదొడగిరి,—

61. తా॥ అయ్యో, అయ్యో, కృష్ణా! ఇదేమిపనిరా? ఆడవాండ్లు స్నానమాడుచుండగా మగవాండ్లిట్లు పొంచి చూచి రావచ్చునటరా? ఒకవేళ పొరపాటున వచ్చితేని, యీవిధముగా చీరెలెత్తుకొనిపోవుదురా? ఛీ! ఛీ! నీవు చాలామంచివాడవు గదా! పరుగెత్తి పాఱిపోక మాకోకలక్కడ విడిచిపెట్టి వెళ్లు నాయనా. అయ్యో! అప్పుడే బాలాప్రౌఢగూడా వొక్కనదే!

62. తా॥ ఓ కృష్ణా! నీవు మా మాట వినకపోయిన, మీయమ్మతో జెప్పెదము సుమా! అయ్యయ్యో! ఇవేమి యాటలురా? మా నాయనగాదూ! తే, మాచీరెలు మా కందిచ్చు తండ్రీ! యని స్వభావసిద్ధమైన లజ్జతో నయమున భయమున బ్రతిమాలికొనిరి.

63. తా॥ అప్పుడా గోపాలకృష్ణుడు దానకర్మపరుడుగాడు గావున వారి కోకలు దీసికొని పాఱిపోక వారి కొక క్రియావిధానమును గల్పించి సాభిప్రాయముగా నిట్లనియె:— ఓ గోపికలారా! భయపడకుడు. మీ కేల యింత సిగ్గునొందెదరు? ఈజగమంతయు మిథ్యయే కదా! అటులనే యీపాంచభౌతికమైన మీశరీరములును మీ మీ ప్రారబ్ధకర్మానుభవమునకై మీరు ధరింపవలసివచ్చినదే కదా! కావున అనిత్యములైన మీ యీతుచ్ఛదేహములపై నింతయభిమానమెందులకు?

మీరు యింద్రియవాసనలుమాని, దేహభ్రాంతివిడిచి ఆత్మాత్మానుసంధానబుద్ధితో నీటిలోనుండి వెలుపలికి వచ్చిన, మీకు మీ మీ ప్రకృతిధారణావశ్యకములైన వస్త్రములిచ్చుటయేగాక, తక్కు ఆత్మక్షేమకరములైన దివ్యలక్షణములను దృఢమగు మనోబలమును గూడ బ్రాప్తింపగలవు.

64. తా॥ అని సహేతుకముగా వారిదేహవాసన బలాత్కారముగా హరింపగా, నిశ్శంకగా దదోబ్ధత గ్రహింప లేని చంచలలుగావున, నిర్విణ్ణహృదయలై ఆగోపికలోపికలు సెడి మఱల యశోదకడకుంజని కృష్ణుని విపరీత చర్యను సాదృశ్యముగా నిరూపించి వాపోయిరి.

65. తా॥ అప్పుడాయశోదాదేవియు సహజమైన స్త్రీహృదయముతో గమనించి, గోపికలు సెప్పినమాటయే నమ్మినదికాని, శ్రీకృష్ణుని బుద్ధియందలి సదుద్దేశమైన అనహంకారోపదేశవిధానము గ్రహింపలేకపోయెను. అందువలన, ఆమె తనకుమారునిపై నలుకదెచ్చికొని తాను వానిని దప్పక దండింతునని ప్రేతల సమాధానపఱచి పంపివేసెను.

66 తా॥ తరువాత ఆ యశోదమ్మ శ్రీకృష్ణుని దుశ్చేష్టలగురించి విచారగ్రస్తమై, యికబిల్లహాడింటగేయుండిన

బొత్తిగా జెడిపోవునని తలంచి, తమ కులవృత్తియైన గొడ్లకాపరితనముపై నియమించుచు శీఘ్రముగా నడవులకు బంపవలసినదే యని మనస్సుగుదుర్చుకొని, భర్తయైన నందునకుగూడా నచ్చజెప్పినదై యొక నాటి సుముహూర్తము నిర్ణయించెను.

67. తా॥ అట్లు ప్రప్రథమముగా మందదోలికొనిబోవుటకై యలంకరింపబడిన ఆగోపాలకృష్ణుడు దన మాతృదేవతకు ప్రదక్షిణపూర్వక నమస్కారాదు లాచరించి, ఆమె యాశీర్వచనమునందుకొని, చల్దియన్నము నొకకట్టకు దగిల్చికొని తన్ను జూచి పరితపించుచున్న గోపికాజనమునకు నుపశాంతి కలుగునట్లుగా జిఱునవ్వు నవ్వుచూ, నొయ్యారముతో వారివైపు తిరిగి తిరిగి చూచుచు నావులమంద వెంట నడచెను.

68. తా॥ అట్లు శ్రీకృష్ణుడూ రి వె లు ప ల నున్న పొలములలో బశువుల మేపికొనుచు క్రమముగా నన్నిదిక్కులందలి దూరపు బయళ్లనుగూడా యరసికొనుచు, తుదకు యమునానదీప్రాంతము సేరెను. అక్కడ నున్న కొండభూములయందు, గడ్డి యెక్కుడుగా గన్పడుటచేతను ఆ నదియం దెల్లప్పుడు నీరుగూడా పాఱుదలగా నుండుటచేతను, ఆ ప్రదేశమే యెక్కువ వసతిగా నున్నదని నిశ్చయించికొని, క్రూరమృగములు సంచరింపని పచ్చిక బీడులం దాపశువుల మేపికొనుచుండెను.

69. తా॥ ఆవిధముగా యాదవకులశేఖరుడైన గోపాలదేవుడు దేశకాలపాత్రమెఱిగికొని పశుపోషణ జేయుచుండగా ఆవులును బొదుగులుబెంచి పుష్కలముగా బాలిచ్చుచూ ఆ వ్రేపల్లెవాడలో గలవుమాటయే కల్లగా సిరిసంపదల కభివృద్ధి గలుగజేసెను.

70. తా॥ ఇట్లు శ్రీకృష్ణుడాలమేపికొనుటకై ప్రతిదినమును యూరిబైటకు బోవుచుండగా నక్కడ వ్రేపల్లెవాడలోని గోపికలాబాలగోపాలుడట్లు గంటికిదూరమయ్యెగదా యని వగజెందినవారై ప్రొద్దస్తమానము వానివిషయమే చెప్పికొని యాలాపముసేయుచు దిగులుపడజొచ్చిరి.

71. తా॥ అంతేగాక ఉపదేశముయొక్క బలముచేతగూడ నిరంతర మాశ్రీకృష్ణునిమీదనే ధ్యాసకలిగినవారై వాని విషయమే మాటలాడుకొనుచు, వానిమీదనే పాటలుబాడుకొనుచు, వానిసంగతియే యనుకొనుచు వానినే మెచ్చికొనుచు యెప్పుడెప్పుడు ప్రొద్దుగ్రుంకునా, యెప్పుడా బాలకృష్ణుడడవులనుండి మఱలి యింటికివచ్చునా యని తపించుచు వేచియుండి, సూర్యాస్తమయముకాగానే ఆగోపికలాకృష్ణుని కిష్టమగు తినుబండములను సేకరించికొని వెళ్లి యాతురలై మాచిన్నికృష్ణుడెక్కడున్నాడమ్మా! యశోదా! యని వెతకికొనుచుండిరి.

వివరణ:-

ఉపదేశమనునది ఉపన్యాసమువంటిది గాదు. ఉపన్యాసమనునది చిత్తక్షోభముగా జేయు గ్రంథవిమర్శనకు బర్యవసానమై యెప్పటికప్పుడు సెప్పువాడును, వినువాడును మఱచుట కవకాశము గలిగియుండును. ఉపదేశమన్ననో యట్లుగాక అక్షరస్పృహనే యెరికట్టి దన్నుదానుగా బ్రపంచమునుండి మఱల్చుచు మనోవేగమునిలిపి జీవాత్మపరమాత్మలను జతగూర్చు దారమువంటి యొకనాడీచలన మగుచున్నది గురువైన వాడొక్కయుపదేశముతోనే తనయోగశక్తిని బ్రవేశపెట్టి శిష్యునిశరీరమునందలి నాడిని బ్రకోపింప జేయగా నిక నది యావజ్జీవమును వ్యక్తిగతముగానే ప్రసరించుచుండి, తదధిష్ఠానదేవత నేనాటికైననూ సాక్షాత్కరింప జేయుచున్నది. అట్లా యా దేవతలకా యా నాడీస్థానములుండి, బ్రహ్మత్వమునకును వేఱే యొకయూర్ధ్వనాడి హృదయమునందు గలదు గావున, అట్టితత్త్వోపదేశము సేయుటకును గురువైనవాడు బ్రహ్మజ్ఞానియైయుండవలెనుగాని యోగసిద్ధిలేని వారలు సేయజాలరు. అందునను క్షుద్రదేవతలు శీఘ్రముగాను గొప్పదేవతలాలస్యముగాను ప్రసన్నలగుదురు, గావున అవ్యక్తపరబ్రహ్మస్వరూపమగు నేకాక్షరప్రణవారాధన మత్యంత దూరముగానున్నది. అట్టి బ్రహ్మజ్ఞానిక నెఱుగుటయు గష్టతరమే. కాని సాధకునికి వైరాగ్యయుక్తమైన పాత్రత చేకూఱిన ఆపరబ్రహ్మమే గురుదేవునిరూప

ముగా స్వయముగావచ్చి యుద్ధరించుచున్నాడని శ్రుతులు సెప్పుచున్నవి.

72. తా. శ్రీకృష్ణభక్తి తత్పరురాలైన (రాధయను) ఒక గోపిక యెప్పుడు ప్రొద్దుగ్రుంకునా యెప్పుడు వెళ్లి బాలకృష్ణుని ముద్దులమోమును జూడగలుగుదునా యని యాతురతతో తొందరతొందరగా దనయింటిలోని పనులన్నియు దీర్చికొని, చీకటిపడగానే, దివ్వె వెలిగించికొని వచ్చెదనను నెపముతో గడపదాటి నేఱుగా యశోదయింటికిం జని యక్కడ దీపము ముట్టించికొనుచు, దాపుననున్న నందనందనుని సుందరముఖారవిందమును దిలకించియానందించుచు, తన్నుదా మఱచి యుండగా, ఆమె వెలిగించుచున్న చేతిలోని వత్తి యంతయు మండుకొని తుదకు చేతివ్రేళ్లు కాలిపోవుచున్ననూ ఆగోపిక తెలిసికొనలేకపోయెను. అంతలో ఆమె యత్తగారు తన కోడలాయశోదమ్మగారింటికే వెళ్లియుండునని యనుమానించి, యాగ్రహావేశముతో నచ్చటికి వెళ్లగా, ఆ యమాయకపుకోడలి చేతివ్రేళ్లు కాలిపోవుటజూచి, తనకు వచ్చిన కోపమంతయు మఱచి గొల్లుమంటూ ఓొమ్మొబాదుకొని యేడ్వసాగెను.

విశేషార్థము:-

ముఖ్యముగా నాగోపాలకృష్ణుని మేనత్తయైన రాధయను యువతి ఆ బాలకృష్ణునియందలి భగవల్లక్షణములను

దన పూర్వపుణ్య భాగ్యముచే స్వయముగా గుర్తించినదై, ఆకృష్ణకుమారకునిపై దివ్యమైనభక్తి భావమును బెంపొందించి కొనుచు, ఆమాయామానుష విగ్రహుని శిష్యబృందమన నొప్పు నాపదునాఱు వేల గోపిక లందఱిలోను ముఖ్య శిష్యురాల య్యెను.

వివరణ:-

సాధకుడు దనహృదయములో నిజమైన భక్తిని గల్గి యున్న వానికి ప్రకృతియంతయు ననుగుణ్యముగానే నడచి కొనెను, కనుక కోపముతో బోయిన ఆయత్తగారు శాంతు రాలై గారాబముతో గోడలి నింటికిదిసికొని వెళ్లినది.

73. తా॥ ఆవిధముగా దినదినమును వృద్ధియగుచుండిన ధ్యాన శక్తితో ఆవేతలు గ్రమక్రమముగా గృహచ్ఛిద్రము లయం దాసక్తి వదలి తమ చిత్తములయందు బ్రపంచ ఖోరణియే మఱచి మనోలయము నొందు చుండిరి.

వివరణ:-

ఈప్రకారముగా బూర్వజన్మసంస్కారములు గలిగిన గోపికల నింద్రజాలమగు సంసారప్రవృత్తినుండి మఱలించి, భక్తులను సంసారచక్రమునుండి తఱింపజేయు ప్రభువైన యాశ్రీకృష్ణభగవానుడాగోపీజనమునకు ధారణాధ్యానస మాధియోగముల నలవాటుబఱచి సంయమనిష్ఠల నొనగి

చెను. కాని గోపికలన్ననో ఆ బాలకృష్ణు డవతారమూర్తియని కాని, ఆజన్మజ్ఞానియని కాని యెఱిగికొనలేకపోగా, తామ ధ్యాత్మనిష్ఠ బొందుచుండుటయుగూడా తెలిసికొనియుండ లేదు. అనగా వారికి దమ బుద్ధియొక్క ప్రమేయములేకుండి ననూ తమశరీరములలో జీర్ణకోశము, శ్వాసకోశము మొద లైన వెట్లుపనిచేయుచుండెనో, యదేవిధముగా వారిబుద్ధి కవగతము గాకపోయిననూ తామాత్మనిష్ఠాధురంధరిణులగుట సహజమైనట్లుగా సంభవించినది.

74. తా॥ అక్కడ ఆయమునారణ్యములందు దోడిగోపాలు రాటపాటలయందు ప్రొద్దుబుచ్చుకొనుచుండగా, ఆజ న్మజ్ఞానియైన శ్రీకృష్ణు డేకాంతముసొచ్చి నిజగురువు లాదేశించినచొప్పున రాజయోగము బునశ్చరణము సేయదలకొని యమనియమములతో అష్టాంగయోగా భ్యాసదీక్షవహించి సాధన కుపక్రమించెను.

75. తా॥ ఆ ట్లాటపాటలయం దాసక్తిలేనివాడై శ్రీకృష్ణు డాయమునారణ్యములందలి వింతలను జూడదలచి యే కాంతముగా బోవుచు బృందావనము బ్రవేశించి, యొకపొన్నచెట్టుక్రింద గూర్చొని వినోదించుచు ఆయ మునానదియొక్క నీటిప్రవాహమును గమనించుచుం డగా,—

విశేషార్థము:-

అట్టు యమనియమముల నవలంబించి యేకాంతము జొచ్చిన శ్రీకృష్ణుడు దీక్షవహించి, యొకపొన్నచెట్టుక్రింద బద్ధాసనస్థుడై కూర్చొని, చిమ్ముద్రబట్టి, క్రమముగా రేచక పూరక కుంభకములతో హృదయకోశమునందలి యపానవాయువును త్రేల్చుచుండగా,—

76. తా॥ అటువైపున పెద్దపెద్దయలలతో బొంగుచుండి, లోపలదాగియున్న కాళియసర్పమునకు నిలయముగా నుండిన యొక నీటిమడుగును గుర్తించి దానిని సమీపించెను.

విశేషార్థము:-

కొలది యభ్యాసముతోనే తెంపులేని యింద్రియవాసనలతో బొంగిపొరలుచు, లోపలనణగియున్న కుండలినీశక్తి కాశ్రయముగానున్న మూలాధారచక్రము నెఱిగికొనినవాడై,—

77. తా॥ ఆ ట్లా కాళిందీమడువును సమీపించి, సాహసముతో ఆమడుగులోనికి దుముకదలంచి, మొలనున్న పీతాంబరమును గట్టిగా బిగించికట్టుకొని, శిరోజములను జక్కగాముడివైచికొని, హారములను కంఠమునకు మెలికలుగా దగిల్చికొని, పింఛమును దీర్చి యమర్చికొని, తన పైనున్న యుత్తరీయమును గూడా గ్రిందబడవైచి, శరీ

రము బెంచి, భుజములుగొట్టి, యూపుత్రో న్ముద్రేకము దెచ్చికొని హుఉమ్మనుచు మూర్ఖపుపట్టుదలగా ముక్కు బట్టికొని, యెగిరి, యామడువులోనికి దూకినవాడై వలయాకారములు దిరుగుచు నలయక ఘోరముగా నీదులాడజొచ్చెను.

<u>విశేషార్థము:-</u>

ఒకనాడు వృథమగు బుద్ధితో దీవ్రముగా గుంభకములు సేయదలంచి, కటిచేలమును జక్కగావదులు సేసికొని, శిరోజములు గాలికెగిరి చెదరకుండా సర్దుకొని, హారములు దేహస్పృహ గలిగింపకుండునట్లుగా మడతలుగా వేసికొని, మీది యుత్తరీయమునే యాసనయోగ్యముగా క్రిందబఱచికొని, బిగువుగా బద్మాసనముమీద వెన్న, కంఠము, శిరము సమానముగా నిలువరించి కూర్చొని, హస్తముసాపి చిన్ముద్ర బట్టి, పూనికతో "ఓం" అను ఏకాక్షరప్రణవమును స్మరించుచు, బిజ్జమిఱగా నొకముక్కురంధ్రమును మూసి, రేచించి పూరించుచూ, ఆ ముల్లోకేశ్వరు డలసటనొందక యమోఘముగా గుంభకములు సేయుచు, ఆమూలాధార చక్రమును భేదింపజొచ్చెను.

78. తా॥ ముఖ్యముగా దా ననేకమాఱులు మత్స్యకూర్మాది యవతారములెత్తుచు మహాసముద్రములయందే యాది యున్నవాడై యున్నవారు కావున, శ్రీకృష్ణుడేమాత్రమునలయక

పీరావేశముతో గ్రుక్కబట్టి మునిగి తిరుగుచు ఆమడు
గంతయు గలచి బురద బురద చేసెను.

విశేషార్థము:-

యథార్థమునకు దాను, యోగేశ్వరుడైన సగుణనిర్గుణ
మయపరబ్రహ్మస్వరూపుడును అవతారపురుషుడు గావున
అనంతవీర్యుడై దృఢముగా ననేక కుంభకములుసేసి తన చై
తన్యశక్తితో నామూలాధార కమలమును భీభత్సము సేయ
జొచ్చెను.

79. తా॥ అట్లామడుగులోని జలచరములన్నియు బెగ్గడిలు
నట్లుగా అల్లకల్లోలమొనరించుచు విజృంభించి, యడు
గునేలవఱకుబోగా హఠాత్తుగా దనకాలుదాకి బుస్సు
మనుచు దఱిమివచ్చిన కాళియసర్పమునుజూచి ।
వినోదియై,—

విశేషార్థము:-

అట్లామూలాధార చక్రమునందలి ప్రాణశక్తి
భరించి తట్టుకొనలేనట్లుగా గుంభించి భీభత్సముసేయు
నిజమనోబలమునుజూపి భేదించి, ఆమూలాధారకమలమునం
నిద్రించియున్న కుండలినీశక్తిని లేవగొట్టి లీలావినోదియై,—

80. తా॥ తన ముక్కురంధ్రములలో సంచరించెడి శ్వాస
యొక్క బుసలే నాదముగను, నదీతీరమునందలి యర
ణ్యములనుండిన ఆలమందలు మొదలగుజంతువులు ప్రే
క్షకులుగను, నరములయొక్కయు కీళ్లయొక్కయు

చప్పుడులు మద్దెల మొదలగు వాయిద్యములుగను,
ముక్కు యూదునప్పుడు ప్రసరించెడి యూపిరి యొక్క
గతులు తాళముగను, ఒక పెద్దబూర నాగస్వరము
గను మేళము సేసికొని ప్రపంచమునకంతటికి నాశ్చ
ర్యముగలుగునట్లుగా, ఆమడుగులోని తామరపుష్పము
లమధ్యనున్న కాళియసర్పముపై నిలబడి యూతుంటరి
పిల్లవాడైన గోపాలకృష్ణుడు కన్నులుగూడా మూసి
కొని పరవశమొందుచు మోడివేసెను,—

విశేషార్థము:-

అట్లు సులభముగా ప్రాణాయామసిద్ధిగాంచిన శ్రీకృ
ష్ణుడు దదేకదీక్షతో ప్రత్యాహారము సేయువాడై సోహంభా
వమే స్వరముగాను, దశేంద్రియములే ప్రేక్షకులుగాను,
72,000 నాడులధ్వనులే బహువిధ వాద్యవిశేషములుగాను, కుం
భకమునందు బరిభ్రమించుచుండిన శ్వాసయొక్క గతియే
తాళముగను, నిత్యానందదాయకమగు బ్రహ్మనాళమే నాగ
స్వరముగను నన్వయించికొని, ముల్లోకములకు నూతన మంగ
ళమొనగూర్చెడి సర్వోపనిషద్సారసంగ్రహమైన గీతోపదేశ
వైఖరిసూచించుచు, చైతన్యమాత్రస్వరూపుడై యోపద్మాసన
ము మీద నేయుండి తనమూలాధారకమలముమధ్యనున్న కుండలి
నీశక్తి నాడించుచు, తదధిష్ఠానదేవతయైన గణేశున కాయు
వందల హంసగాయత్రిని "వశషస" బీజాక్షరములతో జపించి
సమర్పించెను.

81. తా॥ ఆప్రకారముగా గాళియమర్దన మాచరించిన శ్రీకృష్ణుడా యమునారణ్యములలోనెల్లలుమిాఱిభయంకరమైన చోట్లుగూడ బ్రవేశించి యావులమేపికొనుచుండగా దేవేంద్రుడు రాలవాన గురిపించెను. అప్పుడా వర్షములో గోవులు దడిసి బెగడువడి చావ సిద్ధముగాగా దత్క్షణము శ్రీకృష్ణుడాదాపుననున్న గోవర్ధనమను కొండను లేవనెత్తి ఆవులమందల కాశ్రయమిచ్చి వాటిప్రాణములు దక్కించెను.

విశేషార్థము:-

ఆవిధముగా బ్రిత్యాహార మొనరించిన శ్రీకృష్ణుడు మూలాధారచక్రమునుండి సహస్రారకమలమువరకుగల యేడు చక్రములను దాట వలెనని ధారణాయోగమును బూని నిర్మలత్వము బొందుచుండగా చంచలమైన మనస్సుయొక్క పరివర్తనచేత సూక్ష్మముగానున్న యింద్రియములు క్షోభించి దుర్బలమగుచు సడలి నశించిపోవుచుండగా నంతలో సులభముగా స్వాధిష్ఠానకమలములోని రేతోబిందువును గదల్చియూర్ధ్వరేతస్కుడైనందున ఆయింద్రియములకు బూర్ణసత్త్వముగలిగి బునరుద్ధారణము నొందెను.

వివరణ:-

ఇక్కడ నొక గూఢమైన విషయముగలదు. ఏమన, అదివఱ కధోముఖముగానుండిన కుండలనీశక్తి లేచినప్పు డూర్ధ్వముగా బైకిబ్రాకుచు సుషుమ్నామార్గముగా నడచునప్పుడు,

దద్వారభేదనముతో సాధకునికి ప్రాణాపాయమే సంభవించును. లేక, ఆసుషుమ్నానాడిలోనున్న మలము కపాలమునకెక్కిననూ మెదడుసెడి పిచ్చివాడగుటయు జరుగును. అట్టి యేప్రమాదములుగలుగకుండా ఆపాచి కుత్తుకలోనికే వచ్చినిలబడి నోటిలోనుండి యుమియబడుటకు ఆక్రియాసిద్ధి తన పురుషార్థములో లేక కేవలము సాధకుని యొక్క భగవద్భక్తి తాత్పర్యమును, ఆసర్వేశ్వరుని యొక్క దయాకటాక్షమునై యున్నది. ఈస్థితిలో సాధకునికి భౌతికముగా నొక పెద్దజబ్బు చేసి క్రమేణనివారించును. ఆపరీక్షతో ఆవ్యక్తి జీవన్ముక్తి గూడ ఆజన్మలోనే సాధింపగలుగుననుట నిస్సంశయముగా నుండును, యెందువల్లననగా నటనుండి ఆపరమేశ్వరునిశక్తి సు తన మనస్సును ఆకర్షించి లాగికొనిపోవుచున్నది. మూలాధారచక్రమునుండి కుండలినీశక్తి కదలువరకు, మానవుడు గర్మేంద్రియములకువశ్యుడై స్త్రీలోలుడైయుండును. ఆకుండలినీశక్తియూర్ధ్వముఖమైన కామము స్వతఃగానే నశించి బ్రహ్మచర్యము నిర్విఘ్నముగా నిలచుచున్నది. ఈకుండలినీ శక్తి నాభీకమలము యొద్దనున్న మణిపూరకచక్రమును జేరియున్నను, ప్రమాదముజరిగిన మఱల మూలాధారమునందు వచ్చినిలచును, గాని యది యామణిపూరకచక్రమును గూడా గడచియున్న, తిరిగి మూలాధారచక్రము వరకు రాజాలక మణిపూరకచక్రమునందే నిలబడిపోవుచున్నదనియు యోగశాస్త్రము చెప్పుచున్నది.

82. తా॥ ధీరుడైనగోపాలకృష్ణుడట్లు నిరాటంకముగా గోవులను మేపికొనుచు, అరణ్యమధ్యమును బ్రవేశించి,

దూరప్రయాసముచే నొక్కింత విశ్రమించగా, నం
తలో నొక విపరీతమైన యీలవంటిధ్వని విని మేలు
కాంచి, యెవ్వడైనా బోయవా డాదాపున దిరుగుచు
ద నొకయడవిమృగమని పొఱపడి బాధించడుగదా
యని తన జాతకలక్షణము దలచికొనుచు ధైర్యము
దెచ్చికొని నలుదిక్కుల బరికించి చూచెను.

విశేషార్థము:-

సిద్ధసంకల్పుడైన శ్రీకృష్ణు డట్లు నిర్విఘ్నముగా యోగ
సాధన జేయుచు నూర్ధ్వరేతస్కుడై శ్వాసను హృదయస్థానము
నందలి అనాహతచక్రమున జేర్చి చిత్తశాంతినొందుచు ధార
ణాయోగ మతిక్రమించుచుండగా నంతలో నొక చిత్రమైన
"ర్రీజ్" కార శబ్దమొకటి విని మిక్కిలి శ్రద్ధతో ఆధ్వనియందు
బుద్ధిని దీవ్రముగా బ్రవేశపెట్టి సంయమన మొనరించెను.

83. తా॥ అట్లు జాగరూకుడై యాయడవిలోని చిన్నచిన్న
యెండుటాకుల చప్పుళ్లను, కిచకిచమను పిట్టలయొక్క
కూతలను, టంటం అని దొర్లుచుండెడి రాతిబండ
లయొక్క శబ్దములను, వెదురుచెట్లు మొదలైనవాటి
యొక్క యొరపిడిధ్వనులను, నలుగడలబరుగులెత్తు జిం
కలు లేళ్లు మొదలగు జంతువులయొక్క గిట్టలచప్పు
ళ్లను, ఆకసమును గప్పియున్న మేఘముల యొక్క
గర్జలను, నాలకించి, విమర్శించికొనుచు, సావధానుడై

యా యరణ్యసీమయందు దనకు వినిపించుచున్న
"రీఙ్" కారము ద ద్వాయువు యొక్క ప్రకృతిసిద్ధ
మగు ఝంకారమేగదా యని బుద్ధితో సమాధానపడి
మనస్సుగుదుర్చుకొని భయరహితుడయ్యెను.

విశేషార్థము:-

శ్రీకృష్ణు డట్లనాహతచక్రమునుండి స్ఫురించిన "రీఙ్" కారముపై సంయమనము సేసి, క్రమముగా ద దంతర్భాగమైన "చిణీ" నాదమును, "చిణి-చిణీ" నాదమును, ఘంటా రవమును, శంఖనినాదమును, వీణానాదమును, తాళధ్వనిని, వేణు స్వరమును, భేరీ నాదమును, మృదంగ శబ్దమును మేఘధ్వనిని, శ్రద్ధాయుక్తుడై విమర్శించికొని, యానంద పరవశుడై, అకార బీజమైన ఆసమష్టి నాదమునందు, ఉకారసంజ్ఞనొప్పు బుద్ధీంద్రియమును జొనిపి, తత్పర్యవసానముగా నొదవిన "మ్" అను వాచ్యార్థమునందు లక్ష్యము సేసి, సప్తకోటి మహామంత్రములకు మూలమైన యా "ఓం" కార బీజమును దనహృదయకర్ణికయందు సంశయరహితుడై ఆరాధించెను.

వివరణ:-

84 లక్షల జీవరాసులందు "నేను—నే" నను అహంకారభావము సమానముగానే యున్నది. ఈ "నే" ననునప్పు డాభావము పాదములందుగాని, శిరస్సునందోగాని కలుగక హృద

యమునందే తెలియవచ్చుటచేత "నే" నని యచ్చోటనే చూచికొనుచున్నాము. మఱియు ముక్కురంధ్రములద్వారా నడచుచుండెడిశ్వాస, లోనికిబోవునపుడు "సో" అనియు, వెలుపలికి వచ్చునప్పుడు "హం" అనియు ధ్వనించుచున్నది. అట్టి "సోహం" అను పదను "సః + అహం" అను మాత్రల చేగూడికొనియుండి "సః" అను సత్తామాత్రస్వరూపమైన పరబ్రహ్మమునందు, "అహం" అను జీవాత్మను హృదయకలమునుండి కలుపుచున్నది. అంతేగాక యీ "సోహం" అజపా గాయత్రీమంత్రవిశేషముచేతనే, పశుపక్ష్యాదు జీవులుగూడా క్రమముగా నుచ్చజన్మలకు వచ్చుచు, తుద మానవజన్మ మెత్తగలుగుచున్నవని కూడా చెప్పబడియున్నది. అట్టి "సోహం" అను హంసగాయత్రియందలి హల్లులైన "స—హ" లను గొట్టివేసిన, "ఓం" అను అచ్చులతో గూడిన యేకాక్షర ప్రణవము నిలచుచున్నది. ఆ "ఓం" అను అక్షరమును విడదీసిన "అ" "ఉ" "మ్" అను మూడుమాత్రలు గన్పడుచున్నవి. "అ" యని పలికినప్పు డాధ్వని బొడ్డువద్దనుండి పుట్టి హృదయములోనుండి మీదికెగసి కుత్తుకవఱకు వ్యాపించుచున్నది. "ఉ" యను మాత్రయొక్క ధ్వని కుత్తుకలోనుండి పుట్టి నాలుకకొనవరకు వచ్చుచునది. "మ్" అను అనుస్వరము నోటికి వెలుపలగా పుట్టుచు, దీర్ఘముగా నెంత పొడవుగానైనను బోవుచున్నది. అట్టి మూడుమాత్రలుగలిసినచో "ఓం" అను అక్షరమన్నిరకములైన ధ్వనులు (లేక) అక్షరములకు మూలమై మాతృరూపముగానున్నది ఈ ప్రణవశబ్దమునకు జాతినీతభాషాభేదములును, స్త్రీపురుషలింగభేద

ములును లేక సమస్తప్రాణులయందును సమానముగానే తెలి
యఁబడుచు "ఏకోఽపరబ్రహ్మ" త్వము నిర్దేశించుచున్నది.
అంతేకాక వ్యక్తికి నెక్కుడు సంతోషము గలిగినప్పుడు,
మెక్కువ దుఃఖము వచ్చినప్పుడు, "ఓ"—"హో" యను
భిన్నధ్వనులలో జీవునిప్రాణము విలీనమై శాంతిబొందుచున్న
ది.మఱియు, రోగియైనవాడుగూడా "ఊఁ"యను భిన్నస్వర
ముతో మూల్గుచు ఆ "ఓం" కారమునందు శాంతిననుభవించు
చున్నాడు. అట్టి మూర్తిత్రయరూపమైన "ఓం" కారమే
శబ్దబ్రహ్మమై వేదములకుగూడా యందక, వేదాంతమనబడుచు
న్నది.అట్టి శబ్దాతీతమైన ఓంకారబ్రహ్మమే సత్ = శాశ్వతము,
చిత్ = చైతన్యము, ఆనందము = సుఖము అను లక్షణముల
మిశ్రమస్వరూపముతో సకలజీవులయందున నిలిచియున్నది.
కావుననే యెఱుకచెడినజీవాత్మ యింద్రియములద్వారా సుఖా
న్వేషణకై బాహ్యవిషయవాసనలందు పరివర్తనజేయుచు
నెచ్చోటను నిత్యానందముగానక తపించుచు కర్మాభిమాన
ముతో సంసారచక్రమునందు జన్మలెత్తుచున్నాడు.అట్టియింద్ర
జాలరూపమైన విశ్వమునకంతటికి, నవ్యక్తస్వరూపమైన ఆ
ఓంకారపరబ్రహ్మమే సృష్టిస్థితిలయములకు గారణమై కర్మ
యోగప్రవృత్తిగల ప్రకృతితత్త్వములో ధర్మసూక్ష్మముగా
వ్యాపించి, యీ క్రియాప్రపంచములో "సత్" గా నిలిచి
"సత్కర్మ"యని నిర్వచింపబడుచుసర్వకాలసర్వావస్థలందను
సాక్షిస్వరూపమై నిత్యముగా వెలయుచున్నది.

34 తా॥ ఐనను దాను భ్రమచే బొరపడిన బోయవాండ్రే
యైనచో మోసమువాటిల్లునని తలచి యుపేక్షింపక,

ఆధ్వనిని నానావిధకుల నాలకించి పరీక్షించి యను మానరహితుడై ఆయరణ్యమునందలి సకలచరాచర జంతుజాలములలో దాను దప్ప యితరుల నెవ్వరిని గానక నిశ్చింతతో దన శరీరశ్రమయంతయు బూర్తిగాబాసిపోవునట్లు గాఢనిద్ర జెంది మహాసుఖము నొందెను.

విశేషార్థము:-

అట్లు సచ్చిదానందస్వరూపమగు ఆత్మసాక్షాత్కారము బొందిజీవన్ముక్తుడయ్యు దీక్షవిడువక విదేహముక్తినిగూడ ననుభవింపగోరిన వాడై శ్రీకృష్ణుడాయఖండపరిపూర్ణపరబ్రహ్మము నేకాక్షరప్రణవ బీజములో ధ్యానించుచు నానావిధయుక్తిభేదములైన ప్రత్యక్షానుమానాగమప్రమాణ విధుల మననము సేయుచు తన ఆత్మవంటి ఆత్మయే సకలజీవరాసులయందు నున్నదని సమాధానము బొందినవాడై, తల్లక్ష్యమైన కేవలనిర్వికల్పసమాధి నధిగమించి, స్థితప్రజ్ఞుడై విశ్వాతీతుడగు ఆయఖండపరిపూర్ణ సచ్చిదానందమయపరబ్రహ్మమునందు లయసిద్దినిగూడ ననుభవించి ఆయోగేశ్వరుడైన గోపాలకృష్ణుడు యోగీశ్వరుడయ్యెను.

వివరణ:-

యోగసాధనకు మొదట యమనియమముల నలవరించికొని, తరువాత చిత్తవృత్తినిరోధకమైన సాధన మేదైనా

యభ్యసింపవలెను. ఈప్రశ్నమే యజ్ఞమున బరగి "యజ్ఞానాం జపయజ్ఞోస్మి" యన్నట్లు హింసాపూర్వకమైన యజ్ఞములకంటె జపయజ్ఞ మేశ్రేష్ఠమైయున్నది. అట్లు వ్యవసాయము సేయగా క్రమేణ మనస్సు పరిపరివిధముల సంకల్పించుటలుమాని చిత్తము నిర్మలమగుచున్నది. అట్లు చిత్తశుద్ధి కలిగిన మీదట నిష్కల్మషమైన అద్దమునందలి బింబమువలె బరమాత్మని ప్రతిబింబమైన ఆత్మ ప్రత్యక్షముగా బుద్ధీంద్రియమునకు దర్శనమిచ్చుచున్నది. ఈస్థితికే "జీవన్ముక్తి" యని పేరు.

జీవన్ముక్తితో వ్యక్తి మోక్షాధికారి యగుచున్నాడు: కాని ప్రారబ్ధ మనునది పూర్తిగా నశించలేదు గనుక, ఆ యోగియొక్క జీవాత్మ హృదయకమలములోనుండి బైటకు దుమికిరాజాలదు. కావున ప్రారబ్ధమనుభవించుదనుక నంతఃకరణమునందే నణగియుండి, యవసానకాలమున గర్మరహితమయ్యెను గనుక బరమాత్మలో గలిసి పుట్టుటయే లేసి మోక్షమొందుచున్నాడు. ఈ యోగ మెక్కుడు చిత్తశుద్ధిగల యధికారునకు ఆరుమాసములలోను, మధ్యస్థునకు ఒక్క సంవత్సరపరిమితిలోను, మూఢహృదయునకు బండ్రెండు వర్షములలోను సిద్ధినొసగుచున్నదని శృతి ప్రమాణము.

అట్లు ఆపరమాత్మలో ఈ దేహమునందుండియే కలసిన "విదేహముక్తి" యనబడుచున్నది. దీనికి వేఱెయోగసాధనలు లేవు. జీవన్ముక్తుడాపరబ్రహ్మవృత్తిననుసంధానముసేసికొని తైలధారవలె ప్రణవధ్యానముసేయుచున హోరాత్రములునిమగ్న

డే గా వలయును. అట్టి పరాభక్తికి మెచ్చికొని ఆ ప
బ్రహ్మమే యావిశ్వరూపము గటాక్షించుచున్నది. అట్టి నిర్వి
కల్పసమాధిసిద్ధికి దేశకాలపాత్రాన్వాయములులేక నడ
చుండినను, మాటలాడుచుండినను గూడా అకస్మాత్తుగ
లభించుచున్నది. అట్టి అమనస్కయోగసిద్ధిని గాంచిన
వుడు తిరిగి ఆజీవన్ముక్తుని శరీరములోనికి మఱలివచ్చుటకు
దుర్ఘటము. తన ఆత్మయను జ్యోతి ఆపరంజ్యోతిలోగ
సముద్రములోబడిన ఉప్పుకల్లువలె అపరూపమే యగుచున్నది.
కాని యొక్కొక్కప్పుడాపరబ్రహ్మమే తన్ను దెలిసిన ఆ వి
దేహముక్తుని లోకోద్ధరణమునకై మఱలబ్రతికించుచున్నాడు.
కావున అట్టి నిర్వికల్పసమాధిలో నిర్జీవమైన జీవన్ముక్తుని కళే
బరము నిరువదొకదినములవరకు శిష్యులు గాపాడుకొనవలసి
యున్నది. అట్లా కాలములో ఆదేహమునకు చైతన్యము గలు
గకపోయిన సంస్కారము నడపవచ్చునని శృతివచనము.
అది యట్టిది గావున, సాధకుడు జీవన్ముక్తి నొందిన తరువాత
వెంటనే విదేహముక్తికి బ్రయత్నించుటయు ప్రమాదకరమని
యెఱింగి, కేవలము స్వాభిలాషి కాక వేదాంతజ్ఞానమును ప్ర
చారముచేసి లోకములోని యజ్ఞానసారాయణుల నుద్ధరిం
చి, తదనంతరమే నిర్వికల్పసమాధికై యత్నింపవలయునని
యుశృతులు నిర్దేశించుచున్నవి. అప్పుడాజీవన్ముక్తుని కానిర్వి
కల్పసమాధి సిద్ధించినను, లేక యంతలో నవసానవేళ ప్రా
ప్తించినను, అనుభవ భేదమే గాని, మోక్షమునే పొందు

చున్నాడు గనుక పునర్జన్మము గలుగదు. కాని విదేహముక్తి గూడా నీభౌతిక దేహములోనే సాధింపవలె. ననిన అది కోటి జీవన్ముక్తులలో నొకానొకనికే గాని సిద్ధించుటలేదని శ్రీభగవానువాచ:

> మనుష్యాణాం సహస్రేషు కశ్చి ద్యతతి సిద్ధయే
> యతతామపి సిద్ధానాం కశ్చి న్మాం వేత్తి తత్త్వతః॥

అనగా వేలకొలదిగానుండిన సాధకులలో, నే యొకని కో జీవన్ముక్తి సిద్ధించుచుండగా, అటువంటి వేలకొలది సిద్ధులలోగూడా, నెవ్వడో యొక్కడే నన్ను సంపూర్ణముగా తెలిసికొన గలిగిన విదేహముక్తి సాధించి యనుభవింపగలుగు చున్నాడు సుమా!

85. తా॥ ఆజన్మజ్ఞానియైన శ్రీకృష్ణు డట్లు దృఢవ్రతుడై షణ్మాసప్రమాణమున జ్ఞానానందమహాత్స్వరూపమును, అవ్యక్తపరబ్రహ్మము నైన ఓంకారమునందట్టి స్వానుభవసిద్ధిగాంచి, ఆవిధముగా అహంకారమును దీసివైచిన ప్రతిమానవుడును బ్రణవస్వరూపుడగుచున్నాడని సార్థకపఱచుటకుగాను, లోపలనున్న మలమంతయు దీసివేయబడి డొల్లగానుండిన వెదురు గొట్టమును పిల్లంగ్రోవిని తన విజ్ఞాన చిహ్నముగా స్వీకరించి ధరించెను.

86. తా॥ అట్లొకనాటిరాత్రి తెల్లవాఱుఝామున ఆబృందారణ్యమునందు బ్రణవధ్యాననిష్ఠాగరిష్ఠుడై తనివి సనక

తన్నిష్ప్రపత్తికి బాహ్యాంతరముగ వేణువును గ్రహించి, గానలోలుడై, యొకగీతముతో నాగస్వరము నాలాపన జేయుచు నావేశపూరితుడయ్యెను.

87. తా॥ అట్లు విశ్వమంతట వ్యాపించి నిండుచుండిన ఆమురళియొక్క ప్రణవనాదమునకు నొకవైపున దనశరీరమునందలి 72,000నాడులు లయమగుచుండగా, రెండవైపున బాహ్యప్రపంచములో నాలమందలు మోరలెత్తి వినుచు దన్మయ మొందునట్లుగాను; ఇటు తన దేహమునందలి పంచప్రాణము లను ముఖ్యవాయువులు విలీనమై తనకు వశ్యమగుచుండగా, అటుబాహ్యసృష్టిలో త్రాచుపాములు లేచి పడగలువిప్పి పరవశమొందునట్లుగాను; తన బ్రహ్మనాడియందలి షట్చక్రములు శ్వాసకు సులభమార్గములగుచుండగా, బాహ్యమున ప్రాతఃకాలముతో బాటు ప్రకృతియందలి పద్మములు చక్కగా వికసించునట్లుగాను; తన యొక్క స్థూలసూక్ష్మకారణోపాధిత్రియము సడలి బ్రహ్మానందమయమగుచుండగా, ఆచతుర్వ్యూమమున బ్రకృతింగల జీవకోటులు లాలింపబడి, మైమఱచి, గాఢనిద్రయను సుఖ మనుభవించుచుండినట్లు గాను; దన కుడిరెండవ హస్తములందు దా జీవమాత్రుడైన బాలకృష్ణుడు మురళినిధరించి; ఆబృందావనమునందు గానము సేయు

దొడగగా, సాక్షాత్తుగా ఆసర్వేశ్వరుడే హృదయ గోళమునందాయిడాపింగళానాడులమధ్యనున్న ఆసుషు మ్నా నాళమును ధరించి, నాదానుసంధానము సేయు చుండెనా యనునట్లుగా, ఆమురళీనినాదము కేవలము సోహంమంత్రరూపమగు బ్రహ్మనాదమైన ఓం-కార మై బ్రహ్మాండమంతయు నిండి ప్రతిధ్వనించెను.

వివరణ:-

సిద్ధపురుషుడైన శ్రీకృష్ణభగవానుడు బాహ్యకృతముగా వేణుగానము సేయునప్పుడు గూడా తన యోగకౌశల్యములో శుద్ధమైన ఓంకారనాదమునే ప్రవర్తింపజేయగలుగగా నది యంతర్బహిర్వ్యాప్తముగా పరిసరించి యొకవైపు యోగసిద్ధి నొందిన ఆబాలకృష్ణుని వ్యష్టిరూపమును రెండవవైపు సమష్టి రూపమైన యావత్ప్రపంచమును నిర్మలమగు నానందమహా సముద్రమున నోలలాడించెను.

88. తా॥ అట్లు తొమ్మిదిరంధ్రములతో చేయబడిన యా వెదురుగొట్టము, చాకచక్యముగల యెనిమిది వ్రేళ్లచే, నెడ తెగకుండా నాదింపబడుచు, వాయువుతో పూరింపబడగా ఆ గానరసము దశదిశలందు దట్టముగా వ్యాపించెను.

విశేషార్థము:-

అట్లు నవద్వారములు గలిగిన ఆగోపాలదేవుని శరీరము మహనీయమైన యష్టసిద్ధులతో జాజ్వల్యమానమై శ్వాస

పర్యటనచేత నుద్ఘాటింపబడిన ఆప్రణవనాదము దశవిధనాదములతో భూనభోంతరాళములు నిండునట్లుగా ఘూర్ణమానమయ్యెను.

89. తా॥ అట్టి సమయమున నాప్రణవనాదపరంపరలు చెవులబడగానే ఆవ్రేపల్లెవాడలోని గోపవనితలు ద పూర్వజన్మజ్ఞాన సంస్కృతిచే నిద్రావస్థనుండి యత్తుగా దెలివివచ్చి కలవరబడుచు,—

90. తా॥ ఆయపూర్వనాద మిదివఱ కెప్పుడో వినియటిమి సుమా యని యాందోళనబడి పూర్వజన్మ సంస్కారబలముచే నయ్యది స్మృతికిరాగా, అమ్మహనీయమైన ఓంకారనాదమును గుర్తించి,తత్క్షణమే దేహవాసనల నొక్కట విసర్జించి, తేనెవాసనల కెదురుగా బరుగులిడు తేనెటీగల చందమున, ఆమురళీగాన ప్రవాహమున కెదురీదునట్టి వారలై,—

91. తా॥ తమతమ స్వగృహములనుండి వెడలి నిజభర్తలనుగుఱించిగాని తదితర సంసారవిషయములనుగుఱించిగాని తలంపనేరక, తమ చిత్తశుద్ధి విశేషములో బృందారణ్యమునందలి వ్యత్యస్తపాదారవిందుడైన వేణుగానలోలుని నిజమనోవీధియందు బొడగని, సంభ్రమాశ్చర్యములు ముప్పిరిగొనగా, నెదుట దోచుచుండిన ఆగోపాలదేవు నాతురపడి తమ రెండుగరములతో

నందుకొనబోయిన ట్లాహ్వానించుచు "కృష్ణా! కృష్ణా!" యను కేకలతో నా రాత్రియామునందా గోపికలు గొప్పులు ముడివీడగా నాయరణ్యమార్గములబట్టి-పరుగులెత్తి జనిరి.

92. తా॥ ఆ ట్లామురళీవినోదుని డాసి, యాగోపకాంతలు సాక్షాత్ భగవంతుడని తెలిసికొనిన వారై యందున, భయభక్తివినమ్రలై స్తోత్రములొనర్చి, తమ కా అద్వైతానుసంధానయోగప్రాప్తి దయజేసి కర్మరహితలను గావించి రక్షింపవలసినదని ప్రార్థించిరి.

93-94. తా॥ అప్పుడాజగదోద్ధారకుడగు శ్రీకృష్ణభగవానుడును బ్రసన్నుడై వారలకు బరమాత్మసందర్శనముగలిగింప నిచ్చగించి, పదునాల్గు భువనములకు మంగళప్రదమైన తన కుడిచేయి చాచి హస్తమస్తకసంయోగ మొనరించెను,——

95. తా॥ ఆకరస్పర్శతో వెంటనే సమస్త సంచితకర్మేమ్ము నశించినవారలై ఆమానవతుల తికష్టతరమైన నిర్వికల్పసమాధిని సునాయాసముగా నొక్కక్షణములోనే సాధింపగలిగి ఆ యఖండ పరిపూర్ణ నిరాకార పరబ్రహ్మ సాక్షాత్కారము నొందిరి.

వివరణ:-

మానవశరీరమునందు 72,000 నాడులు గలవు. ఈ నాడులన్నియు వేలు వేలు దేవతాశక్తులుగా బరిగణింపబడి ఆ యా నాడీప్రసారములయొక్క ధ్వనులను బీజమంత్రములతో నారాధింపగా దలక్షితమైన నాడీప్రకోపము సిద్ధించుచున్నది. ఈమంత్రాక్షరములకు స్వరమే ప్రధానమై, యా నాడీస్వరముతో దన మంత్రోచ్చాటనాధ్వని యేకీభవించినతోడనే ఆనాడిలో నుష్ణముగలిగి దానిని గదలింపగా జ్యోతిర్కళలు గూడా బుట్టుచున్నవి. కావున నీమంత్రాక్షరముల నెగుడుదిగుడుగాగాని, భాషాంతరీకరణముగాని చేయగూడదు. అట్లొనర్చిన యవి ఫలమునీయవు. ఆవిధముగా హృదయస్థానమునుండి కపాలమువరకు వ్యాపించియున్న యొకానొకనాడి అమృతనాడి యనబరగుచు ప్రణవారాధనతోడి గురుకటాక్షమువల్లనే తెలుపబడి సంకల్పరహితమైన కేవలామనస్కయోగసిద్ధి బ్రసాదించుచు గపాలమోక్షలక్షణమైన విదేహముక్తి నొసగుచున్నది. కావున, అట్లాహృదయగ్రంధిని హస్తమస్తకసంయోగవిధానములో నకస్మాత్తుగా సడలింపజేసియు దజీవాత్మల స్థితప్రజ్ఞులుగా నిలువరించుట కాయాచర్యవరుడు సాక్షాత్ శ్రీకృష్ణభగవానుడు గ్రీస్తుదేవులవలె గేవల మవతార పురుషుడు గావలయునేకాని, యితర సిద్ధపురుషులవల్లనూ గాదు. కాని గురుదేవుడైనవాడామార్గము నెఱిగికొని యున్నవాడు గావున నిజశిష్యు నవశ్యము కృతార్థుని జేయగలుగుచున్నాడు. అంతేకాక అట్టిసద్గురునికటాక్షములేనిదే ఆమోక్షకవాట మెఱిగికొనుటయే సాధ్యము గాదని శృతులు సెప్పుచున్నవి.

96 తా॥ అట్లు కేవలము సత్యమైనదియు, పుణ్య పురుషుల చేత గొనియాడబడునదియు, శృతిస్మృతేతిహాసములకు రహస్యమైనదియు, సత్వగుణప్రధానమైన ఆత్మనిష్ఠ లోదర్శన మిచ్చునదియు, దేదీప్యమానమైనదియు, అవ్యక్తమైనదియు, ఆదియంతములులేని యథాతథస్వరూప మైనట్టిదానిని,—

97. తా॥ సగుణము నిర్గుణ మను రెండునై యొప్పునదియు, శుద్ధసత్వరూపమైనదియు, జరారహితమైనదియు, నాశము లేనిదియు, తెగగొట్టబడనిదియు, కదలిక లేనిదియు మాలిన్యదోషము లేనిదియు, గోప్యమైనదియు, చైతన్యరూపమైనదియు, నిత్యమైనదియు, నంగుష్ఠప్రమాణమైనదియు, బ్రహ్మానందస్వరూపమైనదియు, సర్వవ్యాపియు, సర్వాంతరాత్మయు నైయున్న ఆదిపురుషుని,—

98. తా॥ బుద్ధికి నగమ్యమైన యవ్యక్తపరబ్రహ్మతత్వమును దమ హృదయాకాశమునందు జ్ఞాననేత్రముతో సువ్యక్తముగా సందర్శించి దివ్యమహిమ నొందినవారలై యాగోపిక లావిశ్వాత్ము నిట్లని స్తుతించిరి.

వివరణ:-

అసలు మానసిక ప్రపత్తిలో నేదైనా యొకవస్తువు నూహించుటకు దా నావస్తువు నొకప్పుడు గనియైన వినియైన యుండవలెను. ఎట్లనగా "ఆవు" యని చెప్పగానే,

మనస్సునకొకయావుయాకారము బొడగట్టి,తద్వారా తక్కిన విషయము గ్రాహ్యమగుచున్నది. అట్లదివరకేయావును దాను జూచియుండని పక్షమున, దా జూచియున్న వేఱొక జంతువుతోనైనా పోల్చిచెప్పవలసివచ్చుచున్నది. అటువలెనే పరబ్రహ్మస్వరూపము సూచి యెఱుగనంత వఱకు, నిట్టిటి దని నిర్దేశింప వీలుగాకున్నది. అందుననుఅవ్యక్త పరబ్రహ్మ మనలే గ్రాహ్యముగాజాలదు. అంతేగాక,యథాస్థితిలో జీవాత్మయు బరమాత్మస్వరూపమే గావున, దన మొగము దాను జూచుటకు వీలుగాదను న్యాయప్రకారమున, బరమాత్మస్వరూపము ముఖాముఖిగా దెలియ వీలులేకున్నదని శృతులుచెప్పుచున్నవి. ఐనను సమాధియందాపరమాత్మదర్శనము బ్రత్యక్షముగా ననుభవవేద్యమే యగుచున్నదనియు, శృతివాక్యము. కావున ఆపరబ్రహ్మస్వరూప మెట్లుండునా యని తర్కించిన మనకనుభవస్థితిలో గాఢనిద్రావస్థ కావలగా బోల్చుకొనవలసియున్నది. ఆనిద్రావస్థయు దమోగుణప్రధానమేమైయున్నప్పటికి, అది యవ్యక్తాత్మికస్థితిలోని చిట్టచివరి దశగా నుండి, వ్యక్తసృష్టికి మొదటి మెట్టగుచు దశేంద్రియములతోగూడిన మనస్సు ననుదినము లయమొనరించి పునరుద్ధారణ జేయుచున్నది. కాన దాని కాశ్రయమగు శుద్ధసత్వప్రధానమైన నిర్వికల్పసమాధిస్వరూప మగు అవ్యక్త పరబ్రహ్మలక్షణమును దదంతర్గతముగా నూహించికొనవలసియున్నది.

99. తా॥ హే జగదీశ్వరా! నీ వీసమస్తమైన స్థావర జంగమ

ప్రాణికోటులందు సూత్రధారివై కర్తృత్వ భోక్తృత్వ
ములు లేక సాక్షిమాత్రుడవయ్యు, సర్వాధారుడవై
యుండి, మా పశువులు, యాదవులు, నందయశోదా
దులు, మా బంధువులు, మేమునుగూడా సర్వము నీవే
యగుచు నీవు గాసివస్తువే యీ విశ్వములో లే దని
యిప్పు డనుభవసిద్ధమైన యీవిజ్ఞానము మఱల మాకు
జన్మజన్మేపి మఱపుగలుగకుండునట్లుగా స్థితప్రజ్ఞురాం
డ్రనుజేసి మమ్మనుగ్రహింపుమో యచ్యుతా! అనంత!
హరి! పరమాత్మ! కృష్ణా! యని వేడుకొనిరి.

100. తా॥ ఓ యశోదాకుమారా! నీవు కేవలము మానవమా
త్రుడవుగాక నిక్కువముగా నీ భూతకోటికెల్ల నాశ్ర
యుడవైన ఆహిరణ్యగర్భుడగు పరబ్రహ్మవే సుమా!
అట్టి నీవుభూభారముదొలగింపగా నవసరపడి యిట్లు
లీలామానుషవిగ్రహుడవై యవతరించిన పురాణపురు
షుడవే గదా!

101. తా॥ అని పరమానందముతో బ్రదక్షిణపూర్వకసా
ష్టాంగదండప్రణామాదుల నాచరించి ఆగోవిందుని
అనంతనామగుణముల గీర్తన జేయుచు నుతించిరి.

102. తా॥ అట్లు బాలకృష్ణు ననేక విధములుగా స్తుతించి
ఆగోపాలదేవుని విజ్ఞానమయమగు మాయామానుషవి
గ్రహమునందు జూడ్కులు నిలిపి ఆరాధించుచు,—

103. తా॥ భక్తిపరవశలై యత్యధికమైన యనురాగమును
జెంది యాగోపిక లాప్రత్యక్షపరబ్రహ్మమైన బాలకృ

ష్ణుని నెత్తికొని, ముద్దుగొని, కౌగిటనిడికొని, భక్తి
వివశాత్ములై బ్రహ్మానందము నొందిరి.

104. తా॥ అంతియుకాక తామా యశోదాకుమారుని దివ్య
విగ్రహముపై చిరకాలమునుండి స్నేహభావము గలిగి
యుండినందున, నిరాకారమైన ఆయఖండనిర్గుణపర
బ్రహ్మైక్యానుభవము నొల్లక కేవలభక్తిప్రధానలై,
ఆ అవ్యక్త పరబ్రహ్మమే యీ బాలకృష్ణుడై యవత
రించెనని సిద్ధాంతీకరించికొని సగుణోపాసనయందే
నిలిచి యారాధింపదొడగిరి.

వివరణః—

కేవలాద్వైత సమాధియందు జీవాత్మ పరమాత్మయను ద్వంద్వభావము నశించి సముద్రమునందుబడిన యుప్పుకల్లువలె నపరూపమగుచున్నది. అట్టి స్థితియందు మనస్సు గాఢనిద్రలోనుండునట్లు లయమైపోవుటచేత బుద్ధికిగూడా నయోమయముగానేయుండి,ఆసమాధినిష్ఠనుండి మెలకువవచ్చువరకు నేమియు తెలియక తరువాతనే తాను ఆనిష్ఠలో అట్టిసుఖము నొందితినిగదా యని యెఱిగికొనగలుగుచున్నాడు. సగుణోపాసనమన్ననో యట్లుగాక, తాను వేఱు, తేనె వేఱుగానుండుటూ, తానా మధుపానము సేయునప్పు డుండునట్లుగా ననుభవవేద్యమైన హృదయాహ్లాదమును బొందుచున్నాడు. ఆయానందానుభవము దానా తేనెలో గరగిపోయినచో బాప్పించుట లేదుగదా! కావుననే ప్రహ్లాదనారదాది నిత్యసిద్ధులు

గూడా తాము భగవద్భక్తి విశేషముతో నాజన్మజ్ఞానులై యె
న్నిమారులైనను బుట్టుదుమనుచు భక్తిప్రసాదమునే వేడుకొనిరి
కాని కించిత్ గర్భనరకమును గుఱించి యీ మాయసంసా
రచక్రమునకు భయపడి జన్మరహితమైన మోక్షము నాశించి
యుండలేదు.

105. తా॥ అట్లు సగుణబాహ్యారాధనాసక్తలై యాగోపికలా బాలకృష్ణుని షోడశోపచారముల నిత్యము నర్చించి సేవింప దొడగిరి.

106. తా॥ ఓ నల్లని పిల్లవాడా యిటు రా! యని హాస్యమాడుచు వానమబ్బులవంటి కొప్పుగల యొకపొలతి యా నందనందనుని స్నానము సేయించగా, వేఱొక సన్నని నడుము గల తన్వి ఓ గొప్పముగవాడా! యని మందహాసము సేయుచు వాని మొలకు బీతాంబరమును జుట్టును. ఓ గుట్టలెత్తెడివాడా! యని వెన్నముద్దలవంటి వక్షస్థలముగల యొకవెలది వెన్న దెచ్చి నైవేద్యము బెట్టగా, మంచికస్తూరివంటి శరీరవాసనగల వేఱొక చేడియ మాధవా! యని చేరదీసి దేహమునకు జందనము బూయును. చిగురుటాకువంటి యధరముగల నొక కన్నియ ప్రేమతో దాంబూలము నందించగా, పుష్పమాలవంటి కోమలమైన దేహముగల యింకొక జవ్వని కంఠమునకు బూలహారము వేయును. రత్నకంకణములు గలిగిన యొకయిల్లాలు మంగళహారతి నిచ్చు

చుండగా, మేటియైన కలకంఠి యొక్క తీయూగుచు
చాటబాడి లాలించి జోకొట్టును.

107. తా॥ ఈప్రకారముగా శ్రీకృష్ణ సేవాతత్పరులై మైమ
అచియున్న తమ్ముగని మతిభ్రష్టులైరని బంధుజనులు
బెగ్గడిలుచుండగా ఆగోపికలు జాగ్రదావస్థలో నుండి
నపుడు గూడా బాలకు డెవ్వడు దృగ్గోచర మైననూ
ఆనందనందనుడేయని భ్రమించుచు, దుద కా సర్వ
మయుని దివ్యరూపము దమబంధుకోటితో సహా సకల
దేహధారు లందున బ్రత్యక్షముగా దమ మాం
కన్నులతోనే చూడగలిగిన వారలైరి.

108. తా॥ అట్టి పరమోత్కృష్టమైన పరాభక్తితో
భౌతికప్రపంచ మా కృష్ణదేవము యొక్క దివ
హమయ మేయని ప్రత్యక్షముగా జూచి యానం
చుచు, బరమహంసలై, భావముఖసమాధియందు నిలి
సగుణబ్రహ్మమునందే సంచరించిరి.

వివరణ:-

అద్వైతసిద్ధి నొందినప్పటికీ, ఆశ్రీకృష్ణుడుగాని యీ
గోపికలుగాని యీద్వాపరయుగాంతమునందే సన్యాసాశ్ర
మమునుస్వీకరింపలేదు. ఇక నీకలియుగమునందన్ననో, సన్యా
సాశ్రమమునుని యోగమును, శ్రీశంకరాచార్యులవారిచేబూర్తి
గాని వేధింపబడియున్నది. అసలు సన్యాసమనునది బౌద్ధమత
సాంప్రదాయముగా బూర్తిగా కర్మసన్యాస మై పోయినది.
వేదాంతమునందు జ్ఞానియైనవాడు నిరాటంకముగ భూతసేవ

జేసి లోకోద్ధారణము సేయవలయుననియు, నందులకుగాను
దనకు లంపటలేకుండిన నెక్కుడుస్వేచ్ఛగా దిరుగుచు జ్ఞాన
బోధ జరుపగలుగుననియు వ్రాయ్యబడియుండినను, ఆయా
చార్యుడు భార్యాసమేతముగాకూడా నుండవచ్చుననియే
చెప్పబడియున్నది. గావున బ్రహ్మచర్య, గార్హస్థ్య, వానప్రస్థ
సన్యాసాశ్రమప్రకారము జీవన్ముక్తి సాధించి, లోకసేవ జేయు
టకే నిర్ణయింపబడియున్నను, బ్రహ్మజ్ఞానియైనవానికే యా
శ్రమధర్మములులేక కర్మఫలత్యాగియగుచు జనకునివలెను శ్రీ
కృష్ణునివలెను రాజ్యభారముగూడా వహింపదగియున్నది.
అంతేగాక, ఉపనిషత్తులందును బెక్కుచోట్ల రాజులే బ్రా
హ్మణులకధ్యాత్మబోధ జేసియుండిరనియు గ్రహింపనగును.
విశేషించి, జీవన్ముక్తి యను సగుణసాక్షాత్కారము సిద్ధించువ
ఱకు మనుజుడాశ్రమధర్మముల ననుసరించి, ఆత్మానుభవము
దొరికినమీదట త్యాగియగుచు ననగా బుద్ధిమాత్రముగ కర్మ
ఫలసన్యాసములో నిలిపికొనియుండి యజ్ఞానములోనుండిన
సంసారుల ననుసరించియే వారి నుద్ధరింపవలసియున్నది. తుద
కవసానకాలమెఱిగికొని నిర్వికల్పసమాధికొఱకు బ్రయత్నింప
వలయును. ఏలననగా దానియజ్ఞాననారాయణుల ప్రబోధిం
పకయే (సగుణసాక్షాత్కారముతో దృప్తినొందక) నిర్గుణస
మాధిలో బ్రవేశించిన దక్షణమే తన జీవాత్మ పరమాత్మలో
బూర్తిగా గలిసిపోయి తనకళేబరము సంస్కారయోగ్యమగు
చున్నది. అట్లు కేవలము స్వలాభియైనను మోక్షదూరుడై
నరకమునే పొందుచున్నాడనియు శ్రుతులుసెప్పుచున్నవి.

కనుక ప్రతిమానవునికి "బ్రహ్మం చరంతి బ్రహ్మచర్యంతి" అను నట్లు వేదాధ్యయనలక్షణమైన బ్రహ్మచర్యాశ్రమమనబడు 12 వర్షముల మాత్రకాలముతోడి కౌమారావస్థ గడచిన మీదట గృహస్థాశ్రమ వ్యవహారియై పండ్రెండు సంవత్సరముల మాత్ర కాలము సంసారధర్మ మవలంబించి, పిదప వానప్రస్థాశ్రమ లక్షణమైన పండ్రెండు వర్షముల యస్ఖలితబ్రహ్మచర్యదీక్షతో దపోనిష్ఠబొందుచు భార్యాసమేతముగానే నడపికొని యోగ సిద్ధినొందుచు ధర్మార్థకామ మోక్షము లనుచతుర్విధ ఫ షార్థములను సాధింపవలసియున్నది. అట్లు జీవన్ముక్తు వాడు సన్యాసాశ్రమము బ్రవేశించి వేదాంతతత్త్వప్రచ మ్మును ముగించికొని కృతకృత్యుడై పిమ్మట నిర్వికల్పసమా బ్రయత్నించి విదేహముక్తి నొందుచున్నాడు. కావున సన్యా మనుదానికి గర్మసన్యాసమని పూర్వాచారము లేదు. సన్యా సాశ్రమమనగా కర్మఫలసన్యాసియై అనగా త్యాగియై భూపర్యటనచేసి జ్ఞానబోధచేయుచు తరువాత నిర్వికల్ప సమాధి కధికారి కావలసియుండుటచేత ముఖ్యముగా భక్తి యు గల్గియుండవలసియున్నది. అనగా కేవలకర్మఫలత్యాగ ముతోడి భక్తి లక్షణమే సన్యాసాశ్రమధర్మమై యుండెను. కాని బౌద్ధమతము ప్రచారమైన తరువాత సన్యాసమనగా బూర్తిగా గర్మనే సన్యసించుట యను నర్థవాదము బైలుదేరి సాధకునికి బ్రారంభదశనుండియు సన్యాసదీక్ష నిచ్చుచుండిరి. అందుచేతనే, శ్రీశంకరాచార్యులవారు అవతరించి, కలియుగ-మున సన్యాసము నిషేధముగాజేసి, వేదాంతధర్మమును సంస్కరింపవలసివచ్చెను.

109. తా॥ అట్లు దమ తమ కుటుంబములం దుండియే మహా త్యాగినులై సగుణబ్రహ్మారాధన మాచరించుచు ఆ శ్వేత లనుదినము రాత్రిరఘాముల శ్రీకృష్ణు డేయరణ్య మధ్యమునుండి వేణుగానము సేసినను, దత్క్షణ మాదేవ దేవుని జేరంజని ఆప్రణవనాదామృత రసాస్వాదనమున బ్రపంచమే మఱచి పోవు చుండిరి.

110-111. తా॥ అట్టి సందర్భములలో బామరులైననిజభర్తలు గాముకులై తమ్మరసికొనుచు వెళ్లి మన్మథ కేళీరతు లగుచుండిననూ, తత్క్రియా పరతను పరమహంసలైన ఆగోపికలు పసిపాపలవలె గుర్తింపలేకయే, శ్రీకృ ష్ణుడే సన్నిహితుడాయెనను నిథిధ్యాసతో సంకల్పశూ న్యలై పరిభ్రమించుచు, ఆప్రణవామృతపానముచే జోక్క లయము బొందినవారలైరి.

112. తా॥ అట్లు దమపతులు తిరిగి యిండ్ల కేగగా, నంతలో దమ మనస్సులుగూడా క్రిందిమెట్టునకుదిగి యింద్రియ స్పృహ కలిగినవారలై తమ కదివఱకు సన్నిహితమై నట్లుగా దోచిన ఆ శ్రీకృష్ణస్వరూప మప్పుడు దాపున గనుపింపమి దపించుచు, కృష్ణాన్వేషలై యరణ్యమంత యు గాలించుచు నొకరి నొకరుగా గృష్ణుడేయని భ్రమించుచు దిరిగి తిరిగి తుదకాపొన్నవృక్షముయొద్ద నెప్పటివలె బద్మాసనాసీనుడై వేణుగానము సేయు చుండెడి ఆ గోపాలబాలునిజూచి చిత్తశాంతి బొందు చుండిరి.

113. తా॥ ఆవిధముగా జగన్నాటక సూత్రధారుడును అస్ఖలితబ్రహ్మచారియునైన ఆకృష్ణకుమారుడు దన బాల్యమునందా గోపీజనములోఁగూడి వివిధలీలల గ్రీడించుచు లీలామానుషవిగ్రహుడై విహరించెను.

114. తా॥ ఆ శ్రీకృష్ణు నాపదునాఱువేల గోపికాలలామ లర్చించి దాస్యముసేయుచుండగా నాకసమునుండి ఆ నక్షత్రములకు పతియైన చంద్రుడు సూచియా మహాశోభ కసూయపడుచు క్షోభించి నిలువక వెనుకకు మఱలిపోవుచుండెనా యన్నట్లుగా బ్రతిదినము భల్లున దెల్లవాఱుచు ననేక సుదినములు గడచిచనెను.

115. తా॥ అట్లు నందనందనుడైన శ్రీకృష్ణపరమాత్ముడు దనకు బదునొకండు సంవత్సరముల ప్రాయము వచ్చుదనుక యశోదాకుమారుడై వ్రేపల్లెవాడలోఁ బెరుగుచు ఆ రాధ మొదలైన గోపికాజనము నందఱను గర్మాతీతురాండ్రనుగా నొనరించి మోక్షాధికారుల జేసి క్రియాకర్తృత్వమును బాచికొనియెను.

116. తా॥ అట్టి మధురానగరనివాసియు, దుష్టజనశిక్షకుడును అవతారపురుషుడును శ్రీమద్భగవద్గీతోపదేశికుడునైన ఆ రుక్మిణీపతియగు శ్రీకృష్ణభగవానుడు నిత్యమంగళస్వరూపుడై యీ చరాచర జంతుజాలములకు సదా శుభమంగళ మొసగూర్చుగాత!!!

-: గద్యము :-

ఇది శ్రీమద్భరద్వాజసగోత్ర పవిత్ర యెల్లాప్రగడవంశోద్భవ
లక్ష్మయాఖ్యాతపౌత్ర రామకోట యామాత్యపుత్ర
సీతమాంబికా గర్భశుక్తి ముక్తాఫలాయమా
నానవరతాద్వైతానందసమ్మీళితచిత్తవశవర్తి
శ్రీ కృష్ణమూర్తి నామధేయ
విరచితతాత్పర్యవివరణసహిత
నిర్వచనైకాశ్వాస
శ్రీగోపికారహస్యం
బనుగ్రంథంబున
సర్వంబును,
సమాప్తము.

ఓం తత్ సత్..

శ్రీమత్ కృష్ణావతార పరబ్రహ్మణేనమః



తే। గీ॥ కవినిగాను, పండితుండనుగాను, గానఁ
గావ్యవివరణమున కీవెకర్తవనుచుఁ
తెలిపికొంటిని, మన్మనోదృష్టినిలిచి
నన్ను గృతకృత్యుఁ జేయవే నందతనయ!

శుభమస్తు

కృతిసమర్పణ

—— :o: ——

"నాకేలా? రణ, మర్జునా! యని ప్రతి
జ్ఞాపాలకుం డౌచు, ను
ద్రేకుండై, నాగలాక్రమించి, విలస
ద్వీష్టాహతారాతియై,
మూకల్ గొందలమొంద ఘోటకములన్
ముప్పోకలందోలు, నా
లోకాతీతున కిత్తునీకృతి మదిన్
రూపించి సద్భక్తితోన్

శ్రీ

సద్గురుభ్యోనమః

శ్రీవిఘ్నేశ్వర ప్రార్థన

శ్రీ సిద్ధివినాయకునిఁ
బ్రార్చితషట్చతాజపాగాయత్రులఁ
బాస 'వ-శ-ష-స' దళస్థులఁ
దాసోహంబనుచు మ్రొక్కెదఁ దొలివేల్పున్॥

శ్రీసరస్వతీ ప్రార్థన

శ్రీలలితాంగుళీప్రచురరేఖలనొప్పెసలారు తంత్రికా
లోల, విలోలలోచన, సరోజజు ముద్దులగుమ్మ, వాక్సుధా
జాలవిలాసవర్తిని, విశాలజగన్నుతశీల, శారదా
బాలఁ దలంచెదన్మది సుభావపదైక కవిత్వసిద్ధికిన్॥

సిద్ధపురుషుల ప్రార్థన

వ్యష్టిస్థమైన యాత్మ స
మష్టిని బరమాత్మయై సమస్తజగంబుల్
పుష్టింజేయును గావున
సృష్టిపరంపరఁగ ముక్తజీవులఁ గొలుతున్.

శ్రీ

సచ్చిదానంద పరబ్రహ్మణే నమః


—:భగవత్ప్రార్థన:—


పార్థా!

స "దోం" త దవ్యాకృతమ్మూలప్ర
కృతిఁబొంది జీవుఁడై తతమహాజ్ఞ
నిత లింగదేహ భాసితుఁడై జడాత్మక
మయిన స్థూలాది దేహంబులందు
నెనరొప్ప నేకాదశేంద్రియవ్యసనుఁడై
తన్నెఱుంగక కర్మతంత్రుఁడగుచుఁ
జంచలంబైన సంసారప్రయుక్తిచే
బాల్యాది భౌతికావస్థ లమరి
క్రీడ సలుపుచుఁ దిరిగి స్వకృతసుకర్మ
నప్రతిహతైక వైరాగ్య మలవరించి
కర్మనంటక మెలఁగి సంస్కార మొందు
నని ప్రబోధించు "భగవంతు" నాశ్రయింతు॥


"ఐశ్వర్యస్య సమగ్రస్య ధర్మస్య యశ స శ్శ్రియః
జ్ఞాన వైరాగ్యయో శ్చైవ షణ్ణాం భగ ఇ తీరణా॥

అనఁగా సమగ్రమైన ఐశ్వర్యము, ధర్మము, యశస్సు, సంపత్తి, జ్ఞానము, వైరాగ్యము అను నీయాఱు లక్షణములు గలిగినవాఁడే భగవంతుఁడని శ్రుతు లందుఁ జెప్పఁబడియున్నది. కావున ఓంకారవాచ్యుఁడైన నిరాకారపరబ్రహ్మ మనునది కేవలము జడస్వరూపమైన వస్తువుగాక, యీ షడైశ్వర్యములచే నొప్పియున్న జ్యోతిస్స్వరూపమని విశదమగుచున్నది. ముఖ్యముగా, ఐశ్వర్యముతోడి జ్ఞానవైరాగ్యములని వివరింపఁబడి యుండుటచేత ఆ పరబ్రహ్మమునందు గర్మ చేయుచుండుట అనుస్వభావము సిద్ధమగుచు ఆరీతిగా విశ్వమంతయుఁ గల్పించికొని జగన్నాటక సూత్రధారియై క్రీడించుచున్నాఁడనియే స్పష్టమగుచున్నది.


అఖండ పరిపూర్ణ నిర్గుణ పరబ్రహ్మము
విజ్ఞానము
పరమానందము
అణు బీజం
విదేహముక్తి.
అణుమాత్ర నిత్యానంద
నిర్గుణ పురుషుడు
జీవన్ముక్తి.
సత్
చిత్
త్రిగుణయుత
అణురూప సగుణ పురుషుడు
తెలివి
సుఖము
5.
6.
7.


1
2
3
4
5
6
7
8
9
10
11
12
13
16
17
19
20
21
1. నిర్గుణ పురుషుడు
2. ప్రాణమయకోశం

1. జడ (ప్ర)కృతి (స్థూల శరీరము)
2. మాయా (ప్ర)కృతి (సూక్ష్మ శరీరము)
3. శుద్ధ (ప్ర)కృతి (కారణ శరీరము)
4. మూల (ప్ర)కృతి



ఆత్మ స్వరూపము

అహంకారము (లేక) కారణ శరీరము

(నిరాకారము)

మూల ప్రకృతి (లేక) అవిద్యనబడు జీవాత్మ (అనగా: ఎఱుక)

చిత్తము

(సాకారము)


అణు స్వరూపము

సూక్ష్మ శరీరము

5. అగ్ని తత్త్వ అణు పదార్థము
4. ఆకాశ తత్త్వ ధ్వని పదార్థము స్థూల శరీరము
3. వాయు తత్త్వ చలన పదార్థము
2. జల తత్త్వ రస పదార్థము
1. పృథ్వీ తత్త్వ ఘన పదార్థము

(పశు పక్ష్యాది జంగమ ప్రకృతి)

(వృక్ష లతాది స్థావర ప్రకృతి)



3. శుక్లపేటిక
4. సహస్రారము.
5. అష్టదళ పద్మము.
6. అగ్ని మండలము
7. సూర్య మండలం
8. చంద్రమండలం
9. ఆనందమయ కోశము (లేక) ఆజ్ఞా చక్రము.
10. విద్య (లేక) విద్యాశక్తి యను శుద్ధ మాయా శక్తి.
11. పింగళా నాడి (కుడి)
12. ఇడా నాడి (ఎడమ)
13. సుషుమ్నా నాడి.
14. మూలాధార చక్రము.
15. స్వాధిష్ఠాన చక్రము.
16. మణిపూరక చక్రము.
17. అనాహత చక్రము.
18. విశుద్ధ చక్రము.
19. బ్రహ్మనాడి.
20. అమృత నాడి.
21. హృదయ కమలము (జీవుని స్థానము)
22. అవిద్య (లేక) మూలప్రకృతి

వివరణ :—

నిరాకారాఖండ నిర్గుణ పరబ్రహ్మము నుండి జీవాత్మ యనున దేవిధముగా సంకల్పింపబడి మూలప్రకృతితో వ్యాపకమైనదియు, నెదుట నున్న ప్రకృతిపటము నందు జూపింపబడి యున్నది.

అందు మొదట నట్టిట్టిదనరాని అఖండ పరిపూర్ణ నిర్గుణ పరబ్రహ్మ మాద్యంతములు లేక నిండి యున్నదని గ్రహింపవలసి యున్నది. అట్టి అవ్యక్త పరబ్రహ్మమునే ఓం-అనియు, తత్-అనియు, సత్-అనియు మూడు విధములుగా వాచ్యార్థము నందు శృతులా మోదించి పిలుచుచున్నవి. ఆరీతిగా బ్రహ్మర్షులైన వారా అవ్యక్తపరబ్రహ్మ మెట్లున్నదా యని విమర్శించి కొనియు, నెక్కువగా దర్శించ జాలక, అఖండమైన జ్ఞానానందమహత్స్వరూపముగా నున్నదని మాత్రమే వాక్రుచ్చి యున్నారు. అనగా అఖండముగా నున్న మహత్తు, అఖండముగా నున్న బ్రహ్మజ్ఞానము, అఖండముగా నున్న బ్రహ్మానందము నను వస్తువిశేషము లేకరసమై అయ్యఖండ పరిపూర్ణపరబ్రహ్మముగా నొప్పి యున్నదని తెలిసికొన గలిగిరి. ఆ మహత్తు, బ్రహ్మజ్ఞానము, బ్రహ్మానందము ననునవి, మూడును ననంతములైన వస్తువిశేషములనియే చెప్పికొన వలసి యున్నది గాని, వాటిని వస్తువిశేషణములని యర్థము సేయగూడదు. అనగా నవ్యక్త పరబ్రహ్మమును వస్తువొకటి వేఱుగా నుండి ఆవస్తువునకీ మూడును గుణములుగ నున్నవని యన్వయింప వీలు లేక, యీ మూడు మహారసములు గలిసి యేకమైయుండియే

పరబ్రహ్మముగా నొప్పి యున్నదని చెప్పికొనవలసియున్నది.

ఇప్పుడొక మారు పై పటము నందు జూపించిన భాగ విభాగములను గమనింపుడు. అందు దేహప్రకృతి, ఇంద్రియ ప్రకృతి, మనః ప్రకృతి, బుద్ధి ప్రకృతి యను నీ మెట్లులను గ్రమముగా నధిగమించి, నిర్వాణపదము, పరనిర్వాణపదము మహాపరనిర్వాణపదము లను మెట్లులు సూచింపబడి యున్నవి. ఈ మెట్లులు వరుసగా నొక దానికంటె మఱొక టిగా సూక్ష్మములై యుండి, యుచ్చస్థానములుగా నున్నవి. అట్లు చూపింపబడి యున్న యీ యేడుమెట్లును రెండేసి విభాగములుగా జేయబడి యుండి, పై భాగము, క్రింది భాగ మని గ్రహింపవలసి యున్నది. అట్లాయవ్యక్తపరబ్రహ్మము మహర్షులచేత దెలిసికొనబడి యున్నట్లుగా, మహానిర్వాణ పదమునందు మూడు చక్రములు వేఱు వేఱుగా నొకే పై భాగమున జూపబడి యున్నవి. వాటిని గ్రమముగా మహత్, బ్రహ్మజ్ఞానము, బ్రహ్మానందమని చెప్పికొనిన, మహత్ అనునది మాత్ర మా పై భాగము నుండి క్రిందికి దిగక యుం డగా, బ్రహ్మజ్ఞాన మనునది పరనిర్వాణ పదము నందలి పై భాగము వరకు మాత్రము వచ్చి నిలబడుచుండి, బ్రహ్మానంద మనునది 5 వ మెట్టుగా నున్న నిర్వాణపదము యొక్క పై భాగము వరకు వ్యాపించు చున్నది. అట్లు పటము నందు జుక్కలు బెట్టి చూపబడి యున్నది. చూడుడు. ఆ విధముగా నణుబీజముగా నిర్వాణపదము వరకు దిగివచ్చిన బ్రహ్మానంద రస మొక్కటియే ఆ యవ్యక్తపరబ్రహ్మము యొక్క అంశ యని చెప్పికొనిన, ఆ అఖండ స్వరూపమును ఖండించి

వేఱు చేసినట్లగుచున్నది. కనుక అది పూర్ణాంశ గానే యున్నదని గ్రహించుటకు మహత్ చక్రము నుండి వేటవాలుగా జూపియున్న గీట్ల ననుసరించి, ఆ మహత్తును, విజ్ఞానమును, నిర్వాణ పదమున కందరాక యున్నను, ఆ అణుబీజముగా దిగివచ్చిన ఆనందరసమునందు దమ యఖండస్వభావముతో నిమిడియే యున్నవని తెలిసికొన వలసి యున్నది. అట్టి యీ జ్ఞానానందమహాద్రసమగు నవ్యక్తపరబ్రహ్మము యొక్క నేకాంశమైన యీయణుమాత్ర నిత్యానంద నిర్గుణ పురుషుడే గుణమయమగు నీ విశ్వమంతయు సృష్టించి ధరించికొని యున్నాడు.

"అథవా బహు నైతేన కింజ్ఞాతేన త వార్జున ।
విష్టభ్యాహ మిదంకృత్స్న మేకాంశేన స్థితో జగత్॥

(శ్రీమద్భగవద్గీత)

ఓ యర్జునా! నా విభూతుల నే నెంతని శ్రమపడి నీకు వివరింప గలను. నీ వెంతని యోపికతో వినగలుగుదువు. నే నీచరాచరమయమైన యావద్విశ్వమును నేకాంశముచేతనే సృజించి ధరించి యున్నాడను.

అట్లా నిర్గుణ పరబ్రహ్మము ఏ తనయొక్క శక్తిచేత నవ్యక్తము నుండి వ్యక్తమును సంకల్పించెనో, ఆ చిచ్ఛక్తియే విద్య యనియు, శుద్ధమాయాశక్తి యనియు బిలువబడి యున్నది. అట్టి వ్యక్తాఽవ్యక్తసమ్మేళనమైన యీ చిచ్ఛక్తియు ననంతము గానే యున్నదని చూపుచు, పటము

నందలి నిర్వాణ పదములోని మధ్యభాగములో చిన్నచిన్న యడ్డగీట్లు మధ్య వ్రాయబడియున్నది. గమనింపుడు. ఈ శుద్ధ మాయా శక్తిని గడచిన ముక్తాత్ములు విదేహముక్తి నొంది నవారలై నిత్యానంద ప్రధానముగా నెలుగ బడుచున్న యా అణుమాత్ర నిర్గుణ పురుషునిలో నైక్యము బొందుచు బునరావృత్తి లేని నిర్వాణ మొంది నిత్యసిద్ధులగు చున్నారు.

ఈ నిత్యసిద్ధులును నొక్కొక్కప్పుడు పరబ్రహ్మ ముచే నాదేశింపబడి ధర్మ పోషణకై మరల బుట్ట వచ్చును. కాని ఆ జీవాత్మ తొల్లింటి జీవాత్మయే యని చెప్ప వీలులేదు. సముద్రము నందలి తరంగ మొక మా ఆసముద్ర జలములో నణగిపోయిన, మరల నా తరంగమే లేచి రాజాలదు. ఒక వేళ నదే తరంగము మరల బయటికి వచ్చునది యైనను, మొదటి స్వరూపము కంటె బెద్దదిగానో లేక చిన్నదిగానో యుండుటయే సంభవింపవలసి యున్నది. అట్లే పరబ్రహ్మై క్యము నొందిన జీవుడు లోకోపకారార్థమై తిరిగి జన్మింప వలసి వచ్చినను, తొల్లింటికంటె భిన్నరూపముగానే భగవం తునిచే సంకల్పింపబడి జ్ఞానానందమహత్స్వరూపుడై ప్రహ్లాద నారదాది నిత్యసిద్ధుల వలె నాజన్మజ్ఞానిగానే పుట్టుచు, దన ధర్మరక్షణ ముగించికొనగానే మరల బ్రహ్మైక్యమునే పొందుచున్నాడు.

ఈ చిచ్ఛక్తి నుండి సత్త్వరజస్తమో గుణము లనునవి ప్రభవించి నందువలన, ఆ నిర్గుణ పురుషుడు సగుణపురుషుడై అణుస్వరూపమునొంది శక్తిప్రధానముగా నిలచియున్నాడు.

అనగా, ఆ సగుణ బ్రహ్మమునందు గూడా మహత్తు, బ్రహ్మజ్ఞానము, బ్రహ్మానంద మను మూడు విశేషములా యవ్యక్త పరబ్రహ్మము నుండి మూర్తీభవించియే యున్నను, యవి బుద్ధికి గ్రాహ్యములుగా నుండుటకు వీలులేమి, ఆసగుణబ్రహ్మమందు విశేషముగా భాసమానమైన యీశక్తి బీజమునే ముముక్షు డెఱిగికొనుచున్నాడు. అట్టి సగుణబ్రహ్మ సాక్షాత్కారముతోనే సాధకుడు జీవన్ముక్తుడై మోక్షాధికారి యగుచు, ప్రారబ్ధ కర్మ క్షయముతో విదేహ ముక్తిని బొంది నిత్యానందనిర్గుణపురుషునిలో నైక్యము నొందుచున్నాడు.

అట్లు శక్తి ప్రధానముగా గోచరించు నీ సగుణ బ్రహ్మమందు గూడా అవ్యక్తపరబ్రహ్మస్వరూపమైన జ్ఞానానందమహద్రసములు మిక్కిలి సూక్ష్మకరణము నొంది యున్నను, యా లక్షణములను స్వభావ మాత్రముగా నైనా గ్రహింపవలసి యున్నది. ఆరీతిగా బటమునందు మూడు మూడేసి చక్రములతోనే సత్, చిత్, ఆనందములను మూడు రసములు వేఱువేఱుగా గ్రహింపబడియున్నవి. ఈ మూటిని నిర్వాణపదమునందలి జీవన్ముక్తి యను క్రింది భాగమున వరుసగానే చూపించికొనుచు, వాటి యేకత్వమును గూడా గ్రహించుకొనుచున్నాను.

ఇప్పుడివి క్రింద నున్న బుద్ధిప్రకృతి యను నొక్క మెట్టులోనే వికారము జెందుచున్న విశేషమునుగమనింపుడు. సత్ - అను రసము మాత్రము బుద్ధిప్రకృతి కతీతము గానే నిలిచియున్నది. కాని, చిత్ - అనునది మధ్య భాగము వరకు

దిగుచు "తెలివి" యను విరూపము నొందియున్నది. ఆనంద-మనునది కూడా బుద్ధిప్రకృతిలోని మధ్యభాగము నందు 'సుఖ' రస మను రూపముగా మార్పు జెందుచు, క్రింది మెట్టయిన మనః ప్రకృతి లోని పై భాగమగు కారణశరీరమువరకు క్షీణించి, అవిద్య (లేక) మూల ప్రకృతి యొక్క స్వభావమైన యింద్రియ శక్తులచేత నావరింపబడియున్నది. అట్లాసత్తా మాత్రుడైన సగుణపురుషుడు బుద్ధి ప్రకృతిద్వారా వ్యాపించి మూలప్రకృతిస్వరూపమైన కర్మేంద్రియ జ్ఞానేంద్రియ శక్తుల యొక్క సంఘర్షణ బొంది జీవాత్మ (లేక) ఎఱుక మాత్రము గా నిలబడి యున్నాడు. ఆ ఎఱుకయు ప్రక్షీణమైన సుఖ బీజముతో మనః ప్రకృతి యొక్క నిరాకార భావమునందే గోచరించుట చేత, పాంచభౌతికస్థూలదేహోపాధి నొందిన జీవాత్మ జాగ్రదావస్థలో నిరాకారభావము నసలే స్మరింప బోమి నందలి సుఖప్రపత్తిని గూడ బొత్తిగా గ్రహింపక, కర్మేంద్రియజ్ఞానేంద్రియ కార్యమైన యింద్రియ శక్తుల ద్వారా సులభసాధ్యములుగా నున్న బాహ్యార్థముల నపేక్షించుచున్నాడు.

అట్లాయవ్యక్త పరబ్రహ్మమే లీలామయుడై సంకల్ప మాత్రముతో దన యధీనమునందున్న విద్య, అవిద్య యను శక్తి విశేషములం దేకాంశ మాత్రముగానే ప్రవేశించి విశ్వమంతయు నెలకొల్పికొని జీవాత్ముడై యావిర్భవించి వర్ణరూపప్రధానముగానున్న నానావిధ దేహోపాధుల ధరించి విస్తరిల్లి విహరించు చున్నాడు.

ఆ విధముగా సంభవించిన జీవాత్మ తన యొక్క మనో బుద్ధు లీ పాంచభౌతికమైన సాకార లక్షణ దోషము బొందగా వ్యష్టిభావమైన యహంకారమును జెందినవాడై, తా నాపరబ్రహ్మాంశగా నున్న నిజ లక్షణమునే మఱచి దేహాత్మాభిమానియై, కర్తృత్వ భోక్తృత్వాది కర్మకలాపము నారోపించికొని, జనన మరణాది రూపమైన సంసారచక్రము నందు బరిభ్రమించుచు, ధన దారా పుత్రులను ఈషణత్రయ బాధితుడై బాల్య యౌవన కౌమారాద్యవస్థల నొందుచు, శిశ్నోదర పరాయణుడై జీవయాత్రల నడపుకొనుచున్నాడు. అనగా నిట్టి కర్మ దోషమంతయు దన కర్తృత్వ కార్యమైన దేహాభిమానమునుండియే కలుగుచున్నది. కాని యాదోష మాకర్మలకు గాని, తన యాత్మస్వరూపమునకు గాని చెంది యుండలేదు. అట్టి జనన మరణ హేతువైన దురభిమాన దోష మునకు దన బుద్ధీంద్రియమే కారణముగా నున్నది. కావున నాబుద్ధితో నిటు నిహవిషయముగా గర్మఫల త్యాగియగుచు నటు బరవిషయముగా భక్తి ప్రధానముగా నుండిన, దాను దన నిజ స్వరూపము నెఱిగికొనగలుగుచున్నాడని స్పష్ట మగుచున్నది.

ఆ విధముగా మనుష్య మాత్రుడైన జీవుని యొక్క లక్షణములను బటము నందలి దేహ ప్రకృతి యను మెట్టులో దెలిసికొని యుంటిమి. కాని, యీపాంచభౌతికసృష్టిజాలము నందలి మిగిలిన జీవరాసులను మాత్రము వేఱుగా నింకొక మెట్టుక్రిందగానే చూపవలసి వచ్చినది. ఎందువల్లననగా, ఆ ప్రకృతులలోని జీవరాసుల యొక్క యింద్రియ శక్తుల

దేహములలో జడస్వభావముగా నుండి, మానవ దేహములో బ్రకోపించి యుండుటయే గాక, ఆ జీవస్వరూపము గూడా మానవ శరీరమునందే పూర్ణ స్థితిలో నిలబడుచున్నది కాని, చతుష్పాద బహుపాద జలచర భూచర జంతు జాలములందు గాని, వృక్షలతాది స్థావర ప్రకృతియందు గాని, అట్లు సమగ్రముగా వ్యష్టిరూపము గలిగి యుండుటలేదు. అనగా నీ స్థావర జంగమ ప్రకృతులలో ప్రతియొక్క దేహోపాధియందు నొక్కొక్క జీవాత్మగా వ్యాపింపక, జీవుడు సమూహ దేహి యగుచున్నాడు. అనగా నొక్క జీవాత్మయే కొన్ని దేహముల సముదాయమునందు బ్రవేశించి, పరివర్తన బొందుచున్నాడు. ఎట్లనగా, ఒక భాండము నందలి శుద్ధ జలమును వేలు వేలు చిన్నచిన్న పాత్రిలలో బోసిన, నాయా పాత్రల లోని నీ రా యాపాత్రిల యొక్క దోషములతో సంకరము నొందుచున్నది. అట్టి యా పాత్రలలోని నీరును మఱల గలియ బోసిన, ఆసంకరమంతయు నేకమగుచున్నది. అట్లే జీవులు దమ సమూహమునకు జెందియున్న కొన్ని కొన్ని స్వభావజనితములగు లక్షణములతోనే పుట్టుచున్నవి. ఉదాహరణముగా నీటిలో సంచరించెడి బాతుయొక్క గ్రుడ్డును నీటికి భయపడు కోడిపెట్టయే పొదిగియుండినను, ఆ గ్రుడ్డు నుండి బైట బడగానే యా బాతు పిల్ల నిర్భయముగా నీటిలో నికే ప్రవేశించి స్వేచ్ఛగా నీదులాడుచున్నది. ఈవిధముగా నీగలు, దోమలు, చీమలు, మొదలగునవి గుంపులు గుంపులు గానే పుట్టి పొరలుచున్నవి. అట్లే పక్షులు, పశువులు, మొదలైన యుచ్ఛ జాతులందు గూడా చాలునకు రెండు,

మూడుగా సహజముగానే పుట్టుచున్నవి. ఇక వృక్షలతాదుల విషయమున్ననో వేఱుగా జెప్ప నక్కఱయే లేదు. ఆరీతిగా సమూహదేహి యైన జీవాత్మ యేదో యొక పెంపుడు జంతువువలె బరిగణింపబడినప్పుడు, మానవప్రకృతిలక్షణము లందు దిగుచు సంకర్షణ బొంది, కుక్క, గుఱ్ఱము, మొద లగు జంతువులవలె విశ్వాసహేతు రూపమైన కార్యాలోచ నలలోనై బలాత్కారముగా జిత్త విజృంభణము నొందిన మీద, తన దేహసమూహమునకు దెగిపోయి విడిగా సమగ్ర మైన జీవాత్మగానే నిలిచిపోవుచు, మానవత్వము నొంది క్రమముగా నుచ్ఛస్థితికి బోవుచున్నాడు.

అట్టి సంపూర్ణమైన జీవస్వరూపము గల మానవ దేహమునందా పరబ్రహ్మస్వరూప మెట్లు బ్రవేశించియున్నది తెలిసికొన గలుగుటకుగాను, ఆ ప్రకృతి పటములో వేఱుగా జూపబడి యున్న నాడీ పటము నించుక గమనింప వలసి యున్నది.

ఆ నాడీ పటమునందు నెం. 1 అను గుర్తుతో జూప బడియున్న నిర్గుణపురుషుడు, ఆ ప్రకృతిపటములోని నిర్వాణ పదము యొక్క విదేహముక్తి యను పైభాగమందు జూప బడియున్న అణుమాత్ర నిత్యానందనిర్గుణపురుషుడే యని యెఱుంగ నగును. ఆ నిర్గుణపురుషు డట్లు ప్రాణమయకోశము నుండి, ఆనందమయ కోశములో నున్న రెండు కన్నులయొక్క

నల్లగుడ్డునందు బ్రవేశించి వర్ణరూపప్రధానముతో నున్న ప్రపంచమును జూచి యానందించుచుండుటయే కాక, అమృత నాడిద్వారా హృదయకమలమునందలి జీవాత్మను సదా లాగి పట్టుకొని యున్నాడు. అదేవిధముగా ఆనిర్గుణ పురుషునుండి బైలుదేరిన నెం. 10 అగు చిచ్ఛక్తి యను శుద్ధమాయాశక్తి జ్ఞాననేత్రమైన అగ్నిమండలము నందు నివసించుచు, అష్టదళ పద్మమునుండి సంతతధారగా స్రవించుచుండెడి యమృతము నాస్వాదన చేయుచుండుటయే కాక, శ్వాసను ఇడా పింగళా నాడుల ద్వారా ఝామున కొకమారుగా మార్చి దినమునకు 21, 600 చొప్పున నాడించుచు, ఆజ్ఞాచక్రము నందలి రెండు దళములతో సంకల్పవికల్పములను కలిగించుచున్నది. అదే విధముగా ఆనిర్గుణపురుషునినుండి ప్రభవించిన అవిద్యారూప మైన మూలప్రకృతి, కుండలినీశక్తి యనబరగుచు, వెన్నెముక యందు (పటములో నిలువు గీట్లతో సూచింపబడి యున్నది) గపాలము నుండి మూలాధారము వరకు వ్యాపించియున్న నెం. 19. 13. సుషుమ్నా లేక బ్రహ్మనాడి యను సన్నని నరము ద్వారా నధోముఖగా నడచి, నెం. 14 అగు మూలాధార చక్రమునందు వసించి నిద్రించుచుండుటయే కాక, తల్లక్షణమైన కర్మేంద్రియ జ్ఞానేంద్రియ ప్రకారమైన ప్రాణశక్తిని నెం. 15 అగు స్వాధిష్ఠాన చక్రమునుండి బైలు దేరిన 72000 నాడుల ద్వారా శరీరమంతయు వ్యాపింపజేయుచున్నది.

ఇట్టి శరీర తత్వములో నివృత్తిమార్గమునందు సాధకుని యొక్క నాడీ కూటమునందుద్భవించు వైష్ణవ జ్వరమను

ఉష్ణము చేత నా కుండలినీశక్తి మూలాధార చక్రము నుండి లేచి యూర్ధ్వముగా గదలి బ్రాకుచు, ఆజ్ఞాచక్రము నుండి సూర్యమండలమను పేరిటి అర్చిరాదిమార్గముగా అష్టదళ పద్మము సొచ్చి సగుణ బ్రహ్మసాక్షాత్కారమను సిద్ధి నొసగు చున్నది. ఈ కుండలినీశక్తి నెం. 8 అగు చంద్రమండల ములోనికి బోయిన, మోక్షదూరుడై పునర్జన్మము నొందు చున్నాడు. అట్లు కుండలినీశక్తి సహస్రార మండలి ప్రాణమయ కోశమునుగూడా ప్రవేశించిన దక్షిణమే కపాల మోక్షమై అమృతనాడి ద్వారా జీవాత్మ పరమాత్మలో నైక్య మగుచు విదేహముక్తి యను నిర్వికల్పసమాధి సిద్ధించు చున్నది. అట్టి విదేహ ముక్తి నుండి మఱలి వచ్చిన నిత్య సిద్ధులగు పరమహంసలకు నెం. 3 అగు శుక్ల పేటిక యం దేర్పడు "ఓజస్సు" అను తేజోరసము భూత భవిష్యద్వర్త మానమను కాలజ్ఞానము నొసగుచు ఋషీంద్రుల జేయు చున్నది. ఆ ఓజశ్శక్తియు దా నస్ఖలితబ్రహ్మచర్య విధిగా సేకరించి యుంచికొనిన శుక్ల ప్రమాణముగా నేర్పడుచు నామహర్షిని ఒక నెల, ఒకవర్షము, ఒకయుగము, ఒకమహా యుగమునను పరిణామభేదములతో త్రికాలవేదిని జేసి బ్రహ్మ ర్షిగా ప్రకాశింప జేయుచున్నదనియు నుపనిషద్వాక్యములందు జెప్పబడి యున్నది.

ఇట్టి యీ జీవాత్మ పరమాత్మల సంబంధమును వివే చించు విషయమున 1. సాంఖ్యమార్గము, 2 బౌద్ధమతము, 3. పూర్వ మీమాంస, 4. యోగ సిద్ధాంతము, 5. తర్క

శాస్త్రము, 6. ఉత్తర మీమాంస, (లేక) వేదాంతము అను నీ యారు మార్గములును బూర్వము నుండియు ప్రచారములుగా నున్నవి. అవి యెట్టివనగా:—

1. సాంఖ్య మార్గము: ఇది కపిల మహర్షి చేత స్థాపింపబడెను. ఈ మతమునందు ఈశ్వరుడన వేఱుగా లేక పరమాత్మయే పురుషుడై యున్నాడు. ఆ పురుషుడును బ్రకృతియు గలిసి ప్రపంచ మగుచున్నది. ఆత్మయైన పురుషుడు నిమిత్త మాత్రముగా నుండి ముక్తి సమయమున ప్రకృతినుండి వే ఱగుచు కైవల్యము నొందుచున్నాడు. ఆత్మ కుంటివాని వలెను, ప్రకృతి గ్రుడ్డివాని వలెను యుండి, నడువ జాలని కుంటివానిని దాను మోసికొని పోవుటకు సిద్ధమైనచో ఈ గ్రుడ్డివాని కా కుంటివాడు త్రోవ జూపికొనుచున్నాడు. ఆవిధముగా ఆత్మ ప్రకృతి నుపాధిగా జేసికొని ప్రపంచమును గల్పించుకొనుచున్నది. యజ్ఞాది కర్మలచేత ముక్తి లేదు. పరోపకారాదుల చేతనే మోక్షము గలుగుచున్నది.

2. బౌద్ధ మతము: దీనిని స్థాపించినది సుగతుడు. శాక్యుడు ప్రచారకుడయ్యెను. జీవేశ్వరుల విషయము అవాఙ్మానసగోచరములు గావున ఆ విమర్శన మనావశ్యకము. ప్రత్యక్షానుమానములే ప్రమాణములు గాని, వేదశబ్దములు ప్రమాణములు గావు. ఈ బౌద్ధమతము నుండి నాలుగు శాఖలు వెలువడినవి. 1. సర్వం దుఃఖం దుఃఖం-అనగా దుఃఖవాదులు, 2. సర్వం క్షణికం క్షణికం-అనగా క్షణికవాదులు,

3. సర్వం స్వలక్షణం స్వలక్షణం-అనగా స్వలక్షణవాదులు,
4. సర్వం శూన్యం శూన్యం-అనగా శూన్యవాదులు.

ఈ సర్వశూన్యవాదులలోను నాలుగు తెగలుగలవు: 1. యోగాచార్యులు, 2. మాధ్యమికులు, 3. సౌత్రాంతికులు 4. వైభాషికులు. మొదటి తెగవారు బాహ్య శూన్యత్వము నొప్పుకొని, విజ్ఞానమే సత్యమనిరి. మాధ్యమికులు సర్వము శూన్యమనిరి. మూడవ తెగవారు బాహ్యార్ధములు కేవలము అనుమేయములే కాని ప్రత్యక్షములు గావనిరి. వైభాషికులు బాహ్యార్ధములే ప్రత్యక్షములనియు, విజ్ఞానమే అనుమేయమనియు ప్రతిపాదించిరి. అట్లు బౌద్ధులు మొత్తము మీద శూన్యవాదులనియు, బాహ్యవాదులు (లేక) బాహ్యకులనియు రెండు శాఖలైరి.

బౌద్ధమతసిద్ధాంతములరీత్యా మానవునకు దా జేయు కర్మ ముఖ్యము. తాను చేయు ప్రతియొక్క పనియు కర్మయే యగుచున్నది. కర్మకు ఫలము తప్పదు గనుక దాని ననుభవించుటకై మరల జన్మ కలుగుచున్నది. కావున జన్మరాహిత్యమునకు గర్మనే సన్యసించుట ముఖ్యము. అట్లు జీవుడు శూన్యత్వము (లేక) నిర్వాణమును బొంది శాంతినొందుచున్నాడు.

౫. పూర్వ మీమాంస: ప్రవక్త జైమినిమహర్షి. ఈ మతప్రకారముగా నటు సాంఖ్యముగాని, యిటు బౌద్ధమతము గాని ముక్తినొసంగవు. వేదమంతయు ధర్మమునకుమూలము. సనాతనధర్మములే యాచారములు. వేదోదిత నిత్యనైమిత్తిక

కర్మకులే యొక ధర్మమును దేవతావిశేషమున నావిర్భవించి మరణానంతరము స్వర్గ సుఖముల నిచ్చును.

4. యోగ సిద్ధాంతము : ప్రవక్త పతంజలి మహర్షి. ప్రాణాయామాద్యష్టాంగ యోగసాధనచే నంతరింద్రియము లను బాహ్యేంద్రియములను వశపఱచికొని, చిత్త వృత్తుల నిరోధించి. సమాధి నిష్ఠాగరిష్ఠుడై కైవల్యము నొంద వలయు ననుట. చిత్తైకాగ్రత బొందుటకుగాను, అనేక విధములుగా ప్రతీకములను (అనగా ధ్యానము చేయుటకు ఆకారములను) గల్పించికొని సాధన చేయవలెను. అట్లు ఒక్కొక్క వస్తువు పై ధారణ, ధ్యానము, సమాధిని బొందిన సంయమించినవా డగుచున్నాడు.

5. తర్క శాస్త్రము : ఇది రెండువిధములు, 1. న్యాయ దర్శనము, 2. వైశేషికము.

1. న్యాయ దర్శనము:- ప్రవక్త గౌతముడు. యథార్థ జ్ఞానమునకు ప్రత్యక్షము, అనుమానము, ఉపమానము లను గుఱించి చెప్పుచు నెదుటి పక్షము వారి సిద్ధాంతములను ఖండించు యుక్తులు గలది. ఇందు ఈశ్వరతత్వము లేదు.

2. వైశేషికము: ప్రవక్త కణాదుడు. ఇదియున్యాయదర్శ నమువంటిదే, కాని పరమాణువాదము. జగత్తు అణుమయము. సుఖదుఃఖములు, ఔషధములు, ప్రళయము అన్నియు అణు కారణములు. ఇదియు నిరీశ్వరమతము.

4. ఉత్తర మీమాంస (లేక) వేదాంతము (జ్ఞానకాండ)

స్థాపకుడు వేదవ్యాసుడు. జీవాత్మ పరమాత్మ సంబంధము లగు నుపనిషద్వాక్యముల నేరి బాదరాయణుడు బ్రహ్మ సూత్రముల నొనరించెను.

ఈ వేదాంతము నుండి 1. ద్వైతము, 2. అద్వైతము, 3. విశిష్టాద్వైతము, లను అభిప్రాయభేదములు ప్రవర్తిల్లెను. కాని యీ మూడును ఆస్తిక మతములే.

1. ద్వైత మనగా జీవుడెప్పుడును ఈశ్వరుడు గాజాలడు. ఆతనా శరీరముతో బరలోకమున ననుభవించును. ఎక్కువ పుణ్యముచే ఈశ్వర సాన్నిధ్యము బొందును.

2. అద్వైత మనగా జీవుడు ఈశ్వరుడే యై యున్నాడు. కాని తాను మాయచేత గప్పబడి తన నిజత్వమును మఱచి యహంభావమును బొంది దేహాభిమానియై, కర్తృత్వ భోక్తృత్వముల నారోపించికొను చున్నాడు. పుణ్యాతిశయముచే మఱల దేహాభిమానమును అహంకారమును వదలిన తన సచ్చిదానందస్వరూపము నెఱుగుచున్నాడు. సగుణోపాసన కేదేవుడైననూ నొకటియే.

3. విశిష్టాద్వైత మనగా జీవు డీశ్వరుడు గానేరడు. ముక్తి యందు సాటిరూపమును మాత్రము బొందును. ఈ మతస్థులు గొందరు విష్ణు పరముగా వైష్ణవు లనియు, శివ పరముగా శైవులనియు పిలువబడిరి.

ఇట్లభిప్రాయ భేదములతో ననేకమతములు ప్రచారము లోనికి వచ్చిననూ యీ మతములన్నియు యథాస్థితిలో జీవు

డు పతితుడై క్షుద్రావస్థలో నున్నాడనియు, తాను ప్రయ
త్నించిన ఉచ్చదశకు బోగలడనియు నొక సర్వసామాన్యమైన
సూత్రము ననుసరించియే యున్నవి. అట్లు సృష్టి యందలి
నానావిధ జీవరాసులలో, మానవజన్మయే సర్వోత్కృష్టమై
యున్నది. అదియు కలియుగప్రమాణముతో నూరువత్సర
ముల పరిమితి నొంది యున్నది. అందు సగము నిద్రలో
లయమైపోవుటయే కాక బాల్యకౌమారయౌవనాద్యవస్థలలో
గూడా సర్వము నష్టమగు చున్నది. అట్టి స్థితిలో మానవు
డొక్క జన్మలోనే ముక్తి సాధించు నిమిత్తమై నాలుగాశ్రమ
ధర్మములు గల్పింపబడినవి. అందు కౌమారావస్థయే సాధ
నకు యోగ్యమై యున్నది కాన, కౌమారావస్థనుండి 12
ఏండ్లు వేదాధ్యయన మనబడు బ్రహ్మచర్యాశ్రమ మనియు,
తరువాత 12ఏండ్లు గృహస్థాశ్రమమనియు, పిమ్మట 12 ఏండ్లు
నస్ఖలితదీక్షతోడి తపశ్చరణ మనబడు వానప్రస్థాశ్రమ
మనియు, తదనంతరము సన్యాసాశ్రమ మనియు గల్పింప
బడెను. వానప్రస్థాశ్రమతపోదీక్షయందు భార్యాసమేతము
గానే నడపి ఆత్మసాక్షాత్కారమను జీవన్ముక్తి నెఱిగికొని,
తదనంతరము సన్యాసాశ్రమము బ్రవేశించి జ్ఞానబోధ చేసి
తుదకు మోక్షము బొందుచు ధర్మార్థకామమోక్షములను
చతుర్విధపురుషార్థములను ఈ జన్మలోనే సాధింప గలుగు
చున్నాడు. బ్రహ్మచర్యాశ్రమధర్మము, వేదాధ్యయనమును;
గృహస్థాశ్రమ ధర్మము, ఋతుసమాగమ వ్రతము తోడి
వంశాంకురమును; వానప్రస్థాశ్రమ ధర్మము, అస్ఖలితబ్రహ్మ
చర్య దీక్షతోడి తపస్సునైయున్నవి. "తపము లే దుపవాస

వ్రతంబుకంటె" నని యన్నట్లుగా, తపమనగా ఉపవాసవ్రత మేమై యున్నది. అది క్రమముగా దినమునకు రెండు కుడుపులని కొన్నాళ్లు సాధింపవలయును. తరువాత ఒంటి పూట భోజనము సాధింపవలయును. తరువాత రెండు దినముల కొకమాఱుగాను, మూడు దినముల కొకమాఱుగాను, యిట్లు క్రమముగా అభ్యాసబలముతో పక్షోపవాసదీక్షయు, మాసోపవాసదీక్షయు సాధింపగలిగిన, ఆ యా దీక్షల కా యా శక్తి సామర్థ్యము లేర్పడుచున్నవి. మాసోపవాసదీక్షతో మోక్షాధికారి డగుచున్నాడు. మాసోపవాసదీక్షకంటె నధికముగా నుపవసించుటచే ఆత్మహింస జరుగుచున్నదని మాసమునకు మించిన పరిమితి నిషేధింపబడినది. కాని, ముఖ్యముగా తన కంఠధ్వని క్షీణించిన, తత్క్షణమే దీక్ష నాపివేయవలె ననుట సాధకు డెప్పుడు గమనింపవలసి యున్నది.

ఈ పైజెప్పబడిన యన్ని మతములకంటెను నవవిధ భక్తియే శ్రేష్ఠమును సులభమునని శ్రీశుకమహర్షి మతము:-

మ॥ తను (1) హృద్భాషల సఖ్యముఀ (2) శ్రవణముఀ (3) దాసత్వముఀ (4) వంద (5) నా
ర్చనముఀ (6) సేవయు (7) నాత్మలో నెఱుకయుఀ (8) సంకీర్తనం (9) చింతనం,
బను నీ తొమ్మిది భక్తిమార్గముల స ర్వాత్ముఀ హరిఀ నమ్మి స
జ్జనుఁడై యుండుట భద్రమంచుఁ దలతుఀ సత్యంబు దైత్యోత్తమా॥ (శ్రీమద్భాగవతము)

ఇట్టి వేదాంతధర్మమైన భక్తియోగమును—శ్రీశంక రాచార్యులవారుగూడా తరువాత నామోదించి త దనుగుణ్య ముగా దేవాలయములు విగ్రహారాధన గల్పించినట్లుగా—ద్వాపరయుగాంతము నాటి భగవద్గీతయందు శ్రీకృష్ణభగ వాను డీక్రిందివిధముగా బ్రతిపాదించి యుండెను:-

1. ఓం-తత్-స దితి నిర్దేశో బ్రహ్మణ స్త్రివిధః స్మృతః
బ్రాహ్మణాస్తేన వేదాశ్చ యజ్ఞాశ్చ విహితాః పురా॥

అనగా ఆ అవ్యక్తపరబ్రహ్మము బ్రహ్మసూత్రము లందు ఓం-అనియు, వేదములందు తత్-అనియు, యజ్ఞ యాగాది కర్మకాండయందు సత్-అనియు, పిలువబడుచు 'ఓంతత్సత్' అను మంత్రము చేతనే పూర్ణముగా గలిపిచెప్ప బడుచున్నది. ఆస్వరూపమునే తరువాత 'సచ్చిదానంద'స్వరూ పమని చెప్పుట వాడుకలోనికి వచ్చియున్నది.

2. ఈశ్వర స్సర్వభూతానాం హృద్దేశేఽర్జున తిష్ఠతి
భ్రామయన్ సర్వభూతాని యంత్రారూఢాని మాయయా॥

ఓ యర్జునా! ఆ పరమాత్మయే సర్వభూతముల యొక్క హృదయస్థానమునందు నిల్చి తన మాయాశక్తియను కర్మసూత్రముచేత యంత్రములను నడపుచున్నట్లుగా గద లించి యాడించుచున్నది.

3. యోగస్థః కురు కర్మాణి సంగం త్యక్త్వా ధనంజయ
సిద్ధ్యసిద్ధ్యోః సమో భూత్వా సమత్వం యోగ ఉచ్యతే॥

కావున నో యర్జునా! కర్మఫలమునం దాసక్తి విడిచిన యోగయుక్తి గలిగిన వాడవై కర్మలనే చేయుము. అప్పుడు నీకు కర్తృత్వముగాని భోక్తృత్వముగాని యుండదు. ('యోగః బుద్ధి సుకౌశలం' అని చెప్పబడి యున్నట్లుగా, యోగమనగా బుద్ధికౌశల్యము (లేక) సమత్వమని గ్రహింపనగును).

4. సన్న్యాసః కర్మయోగశ్చ నిశ్శ్రేయసకరా వుభౌ
తయోస్తు కర్మసన్న్యాసా త్కర్మయోగో విశిష్యతే॥

సన్న్యాస మనగా కర్మసన్న్యాసము; కర్మయోగమనగా కర్మలను చేయుచు ఫలమును వదలుట. ఈ రెంటిలో గర్మలను పూర్తిగా వదలుట కంటె, యోగయుక్తితో గూడిన కర్మమే గొప్పది యగుచున్నది.

5. ఉద్ధరే దాత్మ నాత్మానం నాత్మాన మవసాదయేత్
ఆత్మైవ హ్యాత్మనో బంధు రాత్మైవ రిపు రాత్మనః॥

తన ఆత్మచేతనే త న్నుద్ధరించికొనవలయును. తన ఆత్మయే తనకు బంధువును శత్రువును నగుచున్నాడు.

6. క్లేశోఽధికతరస్తేషా మవ్యక్తాసక్తచేతసామ్
అవ్యక్తాహిగతిర్దుఃఖం దేహవద్భి రవాప్యతే॥

అవ్యక్త (బ్రహ్మో)పాసనము మనస్సునకు క్లిష్టముగా నుండును. వ్యక్తులైన దేహధారు లవ్యక్తోపాసన చేయుటకు మిక్కిలి కష్టముతో సాధింపవలసి యున్నది. కనుక వ్యక్తమైన సగుణోపాసనయే సులభసాధ్యము సుమా.

7. శ్రేయో హి జ్ఞాన మభ్యాసాత్ జ్ఞానా ధ్ధ్యానం విశిష్యతే
ధ్యానా త్కర్మఫలత్యాగ స్త్యాగా చ్ఛాంతి రనంతరమ్॥

మూఢాభ్యాసము కంటె జ్ఞానము శ్రేష్ఠము. జ్ఞానము కంటె ధ్యానము శ్రేష్ఠము. ధ్యానముకంటె కర్మఫలత్యాగము శ్రేష్ఠము. తరువాత త్యాగము కంటెను శ్రేష్ఠమైన శాంతి కలుగుచున్నది.

8. యో నహృష్యతి నద్వేష్టి నశోచతి నకాంక్షతి
శుభాశుభ పరిత్యాగీ భక్తిమాన్ యస్సమేప్రియః॥

అట్లు యిష్టాయిష్టములు, శుభాశుభములు, విడిచి, నాకు భక్తుడైనవాడు నాకు ఇష్టుడు, అనగా శ్రేష్ఠుడు.

9. సర్వధర్మాన్ పరిత్యజ్య మా మేకం శరణంవ్రజ
అహం త్వా సర్వపాపేభ్యో మోక్ష యిష్యామి మాశుచ॥

కావున అన్ని ధర్మసంబద్ధములు విడిచి సర్వసంగపరిత్యాగివై నన్నేశరణుబొంది కర్మలను చేయుము. అట్లైన నేను నిన్ను సమస్త పాపములనుండి తప్పక రక్షించుచున్నాను. కావున నీవు అన్యథా శోకింప బనిలేదు.

10. ఓ మి త్యేకాక్షరంబ్రహ్మ వ్యాహర న్మా మనుస్మరన్
యః ప్రయాతి త్యజన్ దేహం సయాతి పరమాంగతిమ్॥

అట్లు ఎవ్వ డవసానదశయందు "ఓం" అనెడి యే కాక్షరమంత్రము నుచ్చరించుచు, నన్ను స్మరించుచు, దేహము

వదలి పోవుచున్నాడో, వాడు బరమోత్కృష్టమైన గతిని బొందుచున్నాడు.

అని భక్తిపరమైన త్యాగలక్షణమునే నిర్వచించుచు, సంగ్రహముగా:-

"ఓ పార్థా! సత్-అని చెప్పబడు నా ఓంకారమే తన మాయాశక్తియైన మూలప్రకృతితో గలిసి జీవాంశ సంభూతుడై క్రీడార్థముగా లింగదేహమును ధరించి జడమైన స్థూలాది శరీరములందు నేకాదశేంద్రియ వ్యాపారు డగుచు తాను బరమాత్ముని యంశముగానే నుండినప్పటికి, తన నిరాకారత్వమును మఱచి, సాకారాభిమానియై యహంకారమునొంది దేహాత్మైకబుద్ధితో నింద్రియలోలుడై సంసార చక్రమున జిక్కి మాటిమాటికి బుట్టి గిట్టి పరిభ్రమించుచు తుదకు స్వార్జితమైన పుణ్యవిశేషముచే నింద్రియవాసనలందు విరక్తిబొంది త్యాగియగుచు గర్మఫలము నపేక్షింపక ప్రారబ్ధశేష మను జీవయాత్ర ముగించికొని తుదకు అక్షరపరబ్రహ్మత్వ మను సంస్కారమునొంది నిత్యసిద్ధుడై ప్రకాశించుచున్నాడు సుమా!"

యని ప్రబోధించిన యా శ్రీకృష్ణభగవానుడు నన్ను సదా రక్షించుగాక !!!

ఓం తత్సత్

శ్రీమ ద్రామావతారపరబ్రహ్మణే నమః॥

శ్రీ గోపికా రహస్యము

ఓంకారరూప! విగతా
హంకారమునీంద్రహృద్గుహాంతర్వర్తీ!
శంకావిరహితభక్తవ
శంకర! సచ్చిత్సుఖాత్మ! సర్వేశ! హరీ!

——

సీ॥ త్రేతాయుగమున నుద్రేకించి పూర్వదే
వానీక[1] మతిఘోరమైన భంగిఁ
గవిసి, గోవుల యోగిగణముల మానుల
భూసురప్రతతి స్వర్భువననాథు
నప్సరోవర సిద్ధ యక్షాది సాధ్య గం
ధర్వ నిలింపుల సర్వలోక
ములఁ గ్రూరులగుచుఁ బాముఁ[2] బెట్టఁదొడఁగ ని
ర్వ్యర్థులై దివిజు లవ్వేధఁ[3] దలఁచి

1. దైత్యులు, దానవులు, రాక్షసులను యన్ని తెగలవారు.
2. కష్టముల 3. బ్రహ్మదేవుని.

తే॥సత్యలోకమునకు నేగి జలజగర్భు
చరణపంకేరుహంబుల శరణుఁజొచ్చి
వరము మును బొంది దైత్యసంహారణమునకు
మొనయుమని కోరి వేడిరి మనికితముగ ॥

ఉ॥ వారిజసంభవుం డమరవర్యుల నెల్ల దయార్ద్రచిత్తుఁ డై
కూరిమి నాదరించి, రణకోవిదులైన నిశాచరేశులం
బోరునఁ దాకలేమి, నిజబుద్ధిఁ దలంచి, పురాణపూరుషుం
దారకశబ్దవాచ్యు సుఖదాయకు స్తోత్రముసేసి వేడినన్ ॥2

మ॥అభయంబయ్యెడుమీకు, దివ్యవరగర్వాంధాత్ములై రాక్షసుల్
శుభకార్యంబుల కెగ్గుఁ జేయుచు,జనక్షోభంబు గాలోకముల్
వ్యభిచారంబులపాలు సేసి, మతముల్ వంచించి,పాపాత్ములై
రభవా! కాలముగూడఁ జంపెదస్వకార్యంబింతపొండింద్రు
కున్ ॥ 3

క॥అని యొకభీషణనాదము
వినఁబడినం గలతఁ దేఱి వేల్పులు వనజా
సనుఁ దగువిధమున వీడ్కొని
చనిరి శుభంబయ్యెననుచు సదనోన్ముఖులై ॥ 4

ఉ॥దుర్జయులైన దానవులు దోర్మదులై కసి దేవకోటులన్
గర్జనతర్జనల్సెలగఁ గారియఁబెట్టి విదారితప్రకా
రోర్జితచిత్తవృత్తులుయథోచిత సత్త్వగుణప్రధానమై
కర్జముమీఱఁగాఁబ్రకృతి కార్యముబొందిక్రమక్రమంబునన్ ॥

ఆ॥ కాలమనుసరించి గంభీరమగుచుఁ గేం
ద్రత్వ మొంది మేఘరాజిపోలె
నీలవర్ణ మెలయ నెఱిఁ బరిణామంబు
నొందుచుండెఁ గర్మయుక్తమగుచు॥ 6

ఆ॥ అట్లు పరిఢవిల్లి యవతారపురుషుఁడై
దశరథేశ్వరునకు ధర జనించెఁ
బట్టమహిషియైన భార్య కౌసల్యయం
దోజతో సమష్టితేజ మపుడు. 7

మ॥ తన సర్వాంగములందు దీధితులు విస్తారంబు గాఁ బ్రజ్వరి
ల్లిన 'శ్రీ' యొప్పు, తదాత్మరూపవిలసల్లీలల్మనోరమ్యమై
చన "రాముం" డనఁజెల్లి, భాసిలెఁ దదబ్జా[1]స్యామృ
తాంశుల్ కనం
గనితాంతైకసుఖప్రదంబులయి వెల్గం బూర్ణ 'చంద్రుం'
డనన్॥ 8

క॥ అక్షీణబలుఁడు రాముఁడు
దక్షుండై వెడలి క్షాత్రధర్మము బేర్మిన్
రక్షోగణసంహారం
బక్షయమని చేరె దండకారణ్యంబున్॥ 9

---

1. చంద్రుఁడు.

శా॥సారంబైన వివేకమూని, విజనస్థానంబులందుండి, సచె
న్నారన్ శాంతమనస్కులై తనరి, దుష్టాసక్తిఁబోనాడి,
ర్వారంభంబులుమాని,సంతతము "బ్రహ్మోఽహం-
శివోఽహం-నసం
సారమ్మస్తి"యటంచునుండి రట విశ్వాసాత్ములై
సంయముల్ ॥10

మ॥ఒకనాఁడాభువనైకమోహనుఁడునత్యుత్సాహమేపారదం
డకసుక్షేత్రములందునొక్కమునికూటంబేర్పడంగాంచి, లో
నికి సుస్వాగతుఁడై ప్రమోదకరుఁడై నేత్రోత్సవాకారుఁడై
యకలంకోజ్జ్వలుఁడై వెలింగె మునితారానీకరాకేందుఁడై

సీ॥ తొలకరిమొగులు కాంతులనీను నవకోమ
ల శ్యామలాంగ విలాసవరుని
బదునాలుభువనముల్ ప్రభవించు మహిత నా
భీకంజగంభీరవివరయుతుని
దిశలెల్ల వెలిగించు దినరాజు రేరాజు
రహిఁ విరాజిల్లు నేత్రములవాని
బేదఱికము వాపు పెద్దముత్తైదువ
శయనించు విపులవక్షంబువాని
తే॥ "గలదు-లే"దనఁ జెల్లెడి కౌనువాని
భద్రకుంజర[1]యాన వైభవమువాని
రుచిరలావణ్య నతులతారుణ్యుఁ బురుష
మోహనోద్దామ రఘుకులాంభోధిసోము॥ 12

1. భద్రజాతి యేనుఁగు.

క॥ అనిమిషులై కన్గవ ము
జ్జనితాశ్రుకణంబులొలుక సంయమివర్యుల్
గని, తద్వదనామృతమును
ఘనముగ సేవించి రధిక కౌతుకమొదవన్॥ 13

శా॥ఆనీలత్వము, నామహోన్నతియు, నాయాజాను
బాహుత్వ,మా
పీనుల్ నేత్రము, లాభుజాస్యగళనాభీపాదపద్మంబు, లా
కౌనా పెందొడలాయురంబు, నాకటం, గందర్పబాణంబులై
మౌని స్వాంతములందు నాటిన మహామాయాపరిభ్రాంతులై॥

ఆ॥ వన్నెకాఁ డటంచు హృన్నియమముఁదప్పి
యంగజాగ్నివివశలైన యావ
నాంగులట్లు గడు భయంబు సంభ్రమము ద
లిర్పఁ గదిసి కౌఁగిలింపఁ బూని॥ 15

క॥ మగవాఁడని, నగుఁబోటని,
బెగడువడుచు, జడత గదుర బెదరుచు, లోలో
వగరుచు, నువ్విళ్లూరుచు,
మొగములు పరికించికొనుచు మురియుచుఁ దమలోన్॥ 16

ఉ॥ అక్కట! ధీరవృత్తి విపినాంతములందు వసించి, గింజలం
బొక్కుచుఁ బెక్కువర్షములు పూనికతో వ్రతచర్యనుండి, చేఁ
జిక్కనియింద్రియంబులఁ గృశింపఁగఁ జేయుచు, జీవయాత్ర చే
స్రుక్కినమమ్ము, నేఁడు పురుషుండొకఁ డిట్టుల నేచెడింగదే॥

చ॥ అచలసమాధియోగమున నంచితభక్తిమనంబుఁ గూర్చి, చి
త్త చలనవృత్తుల న్నిలిపి, తర్కక బుద్ధిని మాన్పి, కర్త క
ర్మచదిపి, మించి యద్వయసమాహితవర్తనమందు వెల్గు నా
త్మ చలితమయ్యెనెట్లొకో? వృథాకదనేఁడు తపఃప్రభావముల్॥

తే॥ ఆ పరబ్రహ్మ మీరాముఁ డగుచుఁ బుట్టె
ననుట నిశ్చయమయ్యె, నయ్యాది విశుద్ధ
హంసవాచ్య మగునుగాక, నరయ హేయ
మైన యీదేహ మాతత్త్వ మగునె తలఁప?॥ 19

సాక్షి స్వరూపమై, ఫా
లాక్షాది తృణాంతమై, మహద్రూపంబై,
యక్షరమై, ప్రత్యక్ష వి
లక్షణమైనట్టిదే పరబ్రహ్మ మగుఁ॥ 20

గడ్డములు నెరసి, మిక్కిలి
జడ్డుఁదనము గదుర నొడలు సడలించి, కడు
న్నెడ్డెలగునట్టి ముదుసలి
గొడ్డులమై యుండి, యిట్లు గోరం దగునే? 21

అని బహుప్రకారముల నెమ్మనములందుఁ
గడు వితర్కించి యనురాగ ముడుగ లేక
ప్రీతి నాలింగనము సేయు వేడ్కఁ గడలు
కొనఁగ వేగిర పడుచున్న మునుల నరసి. 22

శా॥ ఆలోకేశ్వరుఁ డాచరాచరవిభుం డారామచంద్రుండు శ్రీ
డాలోలాత్మకుఁ డామునీంద్రులయభీష్టం బంతరంగంబునం
దాలోకించి దయాసముద్రుఁడుస్వభక్తార్థప్రదుఁడౌట హృ
న్నీలీరాగమువోప వారిఁగలయన్వీక్షించి సోత్కంఠుఁడై॥

సీ॥ తాపసోత్తములార! తథ్యంబు బ్రాహ్మణా
ధీనుఁడనగు దేను; ధృతి దళిర్ప
నేమానవుండేని హృదయకమలమందు
సర్వమంగళకర సత్త్వరూపుఁ
డన నొప్పు నన్ను భావనసేయ నిరతిశ
యానంద మొసఁగుదు, నమరలోక
మాదిగా నీవిశ్వ మతనిద యైయుండు;
శుద్ధమనస్కులు సిద్ధపురుషు

తే॥ లంచితాధ్యాత్మయోగవిద్యార్థవేదు
లుత్తమోత్తములగు మీర లుత్సహించి
సురుచిరాలింగనముఁ గోర, దొరక దెట్లు ?
వరుస సిద్ధించు నది మీ కవశ్యముగను॥ 24

ఉ॥ ఐనను మీయభీష్ట మిపు డక్కట! చేకుఱఁజాల, దెట్లన
న్మానితమైన సత్యనియమంబులఁబూని చరించు జానకీ
జానిని గాఁగిలించు టపచారముగాన నిషిద్ధమింత, యో
ధీనిధులార! రాముని యతీతసతీవ్రత మట్టిదాఁ జూఁడీ!॥ 25

తే॥ వరతపఃపుణ్యధనసదైశ్వర్యసమితి
కడఁగి మూర్తీభవించి నా కాయమయ్యె
నన్ను నిమ్మైన నాలింగనమును జేయఁ
గాత్రు లొరులెవ్వ? రొక్క భూపుత్రితక్క॥ 26

చ॥ కొనకొనిమీరు నేఁడు మదిఁగోరినకోరిక మీకు ద్వాపరం
బున నిజభూతితో మఱలఁ బుట్టి యశోదకుఁబుత్రకుండనై
యనువుగఁగ్రీడసల్పునపుడందగఁ జేయుదు; నేడుస్త్రీలువో
లె నిటులఁగోరుటందగఁజరింతురుగోపికలౌచుమీరటన్॥

తే॥ అనఁగ "నీ మహాత్మునకు సాయకము నొకటె,
మాట యొక్కటె, యొకరితె మగువ యట్టె,
ఔర! యీ దివ్యరామావతార నియమ
సరణి యిట్లొప్పునె?" యను గుసగుసలాడ వె॥ 28

శా॥ అంతన్ ద్వాపర మేగుదేర నట బృందారణ్యసామీప్యమా
గ్రాంతర్భూముల గొల్లభామలగుచుం గర్మానుసారంబుగా
దాంతుల్సంయములుద్భవించిమమతం దత్క్రియాలోలురై
భ్రాంతింబొంద యశోదగాంచెఁగడుపారన్ 'కృష్ణు'
రోచిష్ణునిన్॥

ఉ॥ బాలుఁడు గోపబాలకుఁ డపారకృపాదిగుణాలవాలుఁ డు
న్మూలితరాగలోభమదమోహవికారసుశీలుఁ డవ్యయ
శ్రీలలితుండు భక్తజనసేవితచిన్మయరూపుఁ డాత్మ లీ
లాలఘుతంత్రుఁడంచితభవాంబుధిబాడబుఁడాతఁడల్పుఁడే॥

శా॥ అజ్ఞానాంధపరీతలైన వ్రజకన్యానీక మధ్యాత్ముఁ డ
త్యజ్ఞానప్రదుఁడైన కృష్ణునెడ దైవత్వంబు లక్షింప శా
త్వజ్ఞానంబులఁ జూఱఁబుచ్చి గుణసంతానంబులంజొచ్చినం
బ్రజ్ఞాలభ్యుఁడు దేవదేవుఁడు గృపాపారీణధారేయుఁడై॥

క॥ వ్రేపల్లె గొల్లపడుచులు
చూపోఱఁగి ప్రవృత్తియందుఁ జొఱఁబడి కామ
వ్యాపారతఁ జంచలలై
తాపత్రియగుణములందుఁ దలఁపడి రకటా!॥ 32

ఉ॥ గొల్లలు వీరు, శ్రద్ధమెయి గోవులఁ గాయుదురింతవృత్తి, తా
మెల్లరుఁ జల్లపాల్పెరుఁగులె మ్మెయిఁ గూర్చి గడించుచుందు, నీ
సల్లలితాబ్జలోచనలు స్వల్పసుఖంబుల నాసచేయుచుం
గల్లజగంబుఁ గానని ప్రకారమతో చెడి నెల్లభంగులన్॥ 33

తే॥ శుద్ధచైతన్యమయపరంజ్యోతియందు
మున్ను గ్రీడించు తాపసముఖ్యులియ్యె
నున్మహామాయ మునిఁగి, రి మ్మానవ్యమతులు
కించిదాత్ములు, వీరి రక్షింపవలయు॥ 34

క॥ అని చింతించి యదూత్తముఁ
డనుకంప తొలంగి నిజసహచరులతోడం
జని వారి సిరులఁ గొనియెం
జనదే సిరిమగని కఖిల సంపదలఁ గొనన్? 35

మత్త॥ అల్లనల్లన గోపబాలకు లందఱున్ గుమిఁగూడి రా
మెల్లమెల్లఁగ నిండ్లలోనికి మిణ్కరించుచు దూఱి బల్
మల్లుఁడై కల పాలువెన్నల మంచిగా దిగఁద్రావి, యా
గొల్లభామల మర్లు గొల్పెను గూర్మి శైశవలీలలన్॥ 36

మ॥ అబలల్ చంచలలజ్ఞతం బరము సర్వాత్మున్ హరిన్ మాధవున్
సబలున్[1] లక్ష్యము సేయనేఱక రజ[2]స్సంబంధలై భ్రాంతలై
ప్రబలంబైచను జారచోరగుణసంబద్ధాత్ముఁగా నెంచి, డా
సి బహూద్వృత్తిఁ దదంబపైఁ గవిసి రిస్సీ! యంచుఁ
గోఁధించుచున్

క॥ గోపమ్మా! నీతనయుఁడు
మాపుణ్యముకొలఁదిఁ బుట్టె; మఱి యింకేలా?
యేపాపమొ? మేమిఁక నిటఁ
గాపురములు సేయలేము, కంజదళాక్షీ!॥ 38

సీ॥ ముకురంబు గనరాదు మొగమునఁ గస్తూరి
చుక్కఁబెట్టుమటంచుఁ బ్రక్కఁజేరుఁ
జేరి, నీసరిగలు సిక్కుఁబొందినవంచుఁ
జన్మొనల్ స్పృశియించి శంకఁజేయుఁ
జేసి, నీకొకమాటఁ జెప్పెద వినుమంచుఁ
జెవిసొగ్గి కదిసి నుంజెక్కునొక్కు
నొక్కి, నీకంటె నే నెక్కుడుందు నటంచు
మోము మోమునఁ జేర్చి మోవినాను

---

1. బలరామునితో గూడియున్న వానిని
2. రజోగుణ

తే॥ నాని, చోద్యముఁజూపెద ననుచుఁ గనులు
మూసి, యిలుసొచ్చి, పాల్ద్రావి, మూతిఁబూయుఁ
బూసి, లేనవ్వుతో ముద్దుసేసి వోవుఁ
బిల్లవాఁడె? యశోద! మీ నల్లవాఁడు॥ 39

సీ॥ భద్రంబుగా క్షీరభాండంబు లందంద
జాగ్రత్తపఱచి నిశ్చయము మెఱయ
ద్వారబంధమునొద్ద ధైర్యంబుగా నిల్చి
'యదెవచ్చె-నిదెవచ్చె' ననుచు బ్రమసి
తలడిల్లుచుండ నేదారి లోఁజొచ్చునో,
గుర్తింపఁగారాదు గూఢచారి
పాలు మీఁగడ వెన్న భక్షించి తాఁబోవుఁ
గల్ల కాదిది, వట్టికడవ లుండు,

తే॥ వింతకూఁతల మమ్మొక్క విభ్రాంతపఱచి
పాలకుండల నన్నిఁటిఁ గాలఁదన్ని
పాఱిపోవును; పెక్కేల? బడుగు నిట్టు
లూరిపైఁబడ విడిచిన నోర్వమమ్మ!॥ 40

క॥ అని పెల్లారడిఁ బెట్టినఁ
గని, విస్మయమొంది, కృష్ణుఁగని సస్మితయై,
జనని గఁగుర్పాటొదవఁగ
వనితలఁ గలయంగఁ జూచి 'వంచన' యనుచున్॥ 41

ఉ॥ "గోపికలార! మీరిటులఁ గోపముతాపముతోడ వచ్చి, యీ
పాపని, జన్నునేమఱని బాలుని, జారుఁడు చోరుఁడంచు మి
థ్యాపరివర్తనోక్తి నిటు లారడిఁ బెట్టఁగఁ జూతురమ్మ! సం
తాపకరంబు గాదె తలిదండ్రుల? కాత్మజునింద సేసినన్॥" 42

క॥ "బిడ్డలఁ గాంచఁగ లేదో?
గొడ్డాండ్రో? నాదు ముద్దుకుఱ్ఱంగని చే
లొడ్డి మిగుల దూఱెద రీ
జడ్డుగుణంబుల నుమాని చనుఁ డావలకున్"॥ 43

ఆ॥ "మగలయందుఁ గనలి, మగవారి ననలేక,
పొరుగుతల్లి కన్న బుడుతఁ జూచి
తగుదుమనుచు వచ్చి తగవులాడఁగ నౌనె?
జాణతనము లింకఁ జాలుఁ జాలు"॥ 44

తే॥ "పసితనంబున నెపుడేని బాలకుండు
తిరిగి మీయిండ్లవరుస కేతెంచి యెదుట
నున్న తినుబండములఁ గోరి తిన్న యెడల
నదురు బెట్టుడు గాక యీ యఱుపు లేల?॥" 45

క॥ అని వారిఁ బనిచి సుతుపై
ననురాగము ప్రబ్బికొనిన ననునయమతియై
చనుబాలొలుకఁగ వానిం
గని మూర్కొని చుంచుదువ్వి, కలఁకవాడమినన్॥ 46

ఆ॥ "కొంటెవాఁడు నీకుకొడు"కంచు దూఱి
వాడలోని గోపవనిత లెల్ల
మొనసి ముదిమిఁగన్న ముద్దుబిడ్డఁడ వీవు
కొంటెతనము మానుకొనఁగదయ్య"॥ 47

క॥ అనిబుజ్జగించి లోనికిఁ
గొనిపోయి, జలమ్మువోసి, గోపంచితమున్
మనసారఁ జల్లి, భస్మము
దొనకుచు మేనెల్లఁబూసె "ఘూః-ఘూః" యనుచున్॥ 48

ఆ॥ అవల గర్గమౌని యరుదెంచి, యాబాల
కృష్ణుచద్యమంబు నెదగ్రహించి,
యోగవిద్యఁ బలికి ప్రోత్సాహపఱచె, యో
గీశ్వరేశ్వరుఁడని యెఱిఁగి యెఱిఁగి। 49

క॥ అటపై శ్రీకృష్ణుం డు
త్కటముగఁ జెలరేఁగ క్షీరదధిభాండంబుల్
మటుమాయమయ్యె నతివలుఁ
గటకటఁబడి బెగ్గడిలిరి కష్టంబనుచున్॥ 50

సీ॥ గోపి యొక్కతె క్షీరకుంభంబు లేపొద్దు
రిత్తయుండుట కృష్ణకృత్యమనుచుఁ
గనలి యాదివస మేకాదశి యగుటచేఁ
బనులాపి ద్వారముల్ భద్రపఱచి

యుట్టిలోఁ గుండలుబెట్టి యుత్తికగ నడి
కప్పున కాయుట్టిఁగట్టి, యుంచు
కేమఱియున్న పాఁడిలుపొంచ్చునని గోఁడు
భయమున నితరభావములు మాని

తే॥ వీధిఁగాచుచు, నీనాఁడు విడువననుచుఁ
జింతసేయుచు, ధీరుఁడై చీమ చిటుకు
మన్న భ్రమఁజెంది వెఱగొంది వెన్నుఁడనుచుఁ
గలువరించుడు మధ్యాహ్నకాలమయ్యె॥ 51

ఉ॥ అంతట దాహమేర్చినఁ బ్రయాసముఁజెంది జలంబుఁ గోరి యా
కాంతముహూర్తమేయనుచుఁగాల్కడలించిసరిజ్జలంబుతో
గొంతుకఁదేర్చి, నెమ్మనము కొందలపెట్ట బిఱానవచ్చి య
త్యంతభయస్థుఁడై కనె గృహంబునగోపకబాలబృందముఁ

సీ॥ పీటలు రోటిపై, బేర్చి దిట్టరియైన
వాని భుజంబులపైన నిలిచి
చిఱునవ్వు నవ్వుచు సెలగోల నొకచేతఁ
బట్టి యందనియట్టి యుట్టిఁగొట్టి
జెట్టియై యిట్టిట్టు లుట్టితోనూఁగుచు
నంజలి వదనగహ్వరముఁజేర్చి
మోఁచేతులకుఁగ్రింద మునరిన చెలికాండ్రఁ
మన్నించి తత్క్రియామగ్నుఁడగుచు

తే॥ స్వయముగా బొజ్జ యెదుగ స్వభావయుక్తిఁ
దనివిఁజెందని శుద్ధచైతన్యమూర్తి
కరుణ సపరివారముగ సాక్షాత్కరించె
నెలమిఁ బూఁబోఁడివ్రతము ఫలించెననఁగ॥ 53

మ॥ కని, లోవిస్మయమొందుచున్ భ్రమయుచుం గంపించుచున్ గోపి దాం
గను బట్టంగఁదలంచి ధైర్యమును జిక్కంబట్టి మెల్లంగ డా
సిన వీక్షించిదయాళుఁడామగువ శుష్కీభూతనేత్రంబులా
య్యనఁ బుణ్యామృతమాన నూఁదుచు నదృశ్యంబయ్యెఁ జిత్రంబుగాన్॥ 54

ఉ॥ "ఎప్పుడుచూచునో? గృహము లెప్పుడుచొచ్చునొ? యెట్లు పోవునో?
చప్పుడుగాదు, భాండములుఁజక్కగనెప్పటియట్లయుండునే
మప్ప!" యటంచు నయ్యతివ లక్ష్యుఁ జేష్టల కగ్గలించి యా
'తప్పడువాని' దల్లియునుదండనసేయమిఁగంటగించుచున్॥

శా॥ వాకిండ్లూడ్చుచు ముగ్గువెట్టుచుఁ బనుల్ వాటించుచుం బాఁడుచున్
శాకాద్యన్నము లేర్పరించుచు సఖీసల్లాపముల్ సేయుచున్
వీకన్నిద్రసుఖించుచుందిరుగుచున్ వీక్షించుచుం బల్కుచున్
నేకాగ్రస్థితిఁబొందిరద్భుతముగా హేలావతుల్ కృష్ణుపై॥ 56

క॥ చిక్కియుఁ జిక్కని బాలుని
గ్రక్కునఁ బట్టంగలేక గాసిలి లోలో
నెక్కొను మక్కువఁ బొందిరి
మొక్కవదక్కవలు మాని యిందునిభాస్యల్॥ 57

మ॥ ఇటులచ్యుంగనలంచితాభ్యుదయులై యిష్టానుసారంబు గాఁ
గుటిలత్వంబులు వాసి సక్తలగుచున్ గోపాలదేవున్ విశం
కటవృత్తిం గదియంగఁ జూడ 'ననహంకారోపదేశంబు' వి
స్ఫుటలీలుండయి చేసె గృష్ణుఁడు గదుం జోద్యంబుగా బాలుఁడై॥

మ॥ తనుమధ్యల్ వ్రతచర్యఁ బూని వరుసన్ దాక్షాయణీదేవిలో
ననుసంధానము సేసి పోఁడుచు గృహీతాన్యోన్యహస్తాబ్జలై
యనివార్యంబుగ నేగి యాయమునయం దారూఢిమైఁ జొచ్చి ని
ర్జనతీరంబుననగ్నలై జలములన్ సంప్రీతిఁ గ్రీడించుచోన్॥59

క॥ వారిజలోచనుఁడగు హరి
వారివిహారములఁ దేలు వారి వసనముల్
వారక వేచని దొంగిలె
వారు విహారములు మాని వారింపంగన్॥ 60

శా॥ "ఓరీ! కృష్ణ! యిదేమిరా? నిలువరా! యోషిజ్జనంబుల్ వడిన్
నీరంబుల్ సొరఁ బొంచి చూచియిటురా నీకొప్పునే? వచ్చితే
నీరీతిం గలవస్త్రముల్గొనుట మేలే? తెమ్ము మాచేలముల్
పారంజూఁడకు మంచివాఁడవుగదబ్బా! పెద్దప్రొద్దయ్యెడిన్'

క॥ "మీయమ్మ తోడఁ జెప్పుదు
మోయీ! యివియేటిపను లయో! యిటురమ్మా,
మాయన్న! కోక లంది
మ్మా"-యని లజ్జించి పడఁతు లారట పడిన౯॥ 62

శా॥ "ఏలా? కామినులార! లజ్జపడఁగా, నేలా చలం? బీజగ
జ్జాలం బెల్ల నశిత్య, మీతనువులిచ్ఛామాత్రదుష్టంబు, లిం
కేలా భ్రాంతి? జలంబులన్వెడలి రండిచ్చోటికి౯, వచ్చి, మీ
చేలంబుల్గొనఁడింతులార! శుభముల్ చేకూరెడి౯ మీఁదట౯॥

క॥ అని సిగ్గులపహరించిన
వసనములఁ బొరివోయి సతులు మఱల యశోదం
గని కృష్ణుదుడుకుఁదన మొ
య్యన నామెకుఁ దెలియఁజెప్పి యావురుమనిన౯॥ 64

ఆ॥ సతియు వారిమాట సత్యంబుగానమ్మి
కినుకఁజూపి "నేడు కృష్ణుఁబట్టి
తగిన బుద్ధిసెప్పి దండింతుఁదప్పక
రామలార! సుగుణధామలార!"॥ 65

మ॥ అని యాకాంతలవీడుకొల్పి,సుతునిందాలాపముల్ నెమ్మనం
బునఁజింతించివిషాదమొంది మదిలోమూర్ఖించి, తామందపైఁ
జనబుచ్ఛ౯ పతెనంచునాథుఁగని ప్రస్తావించి, గోపమ్మ నం
దను నాయత్తముసేసె నొక్కసుముహూర్తంబందు
సోద్యోగయై। 66

ఉ॥ బల్లిదుఁడై ప్రభాతమున బాలకుఁ డావుల వెల్వరించుచుం
దల్లికి మ్రొక్కి, చల్ది నొకదండమునందుఁ దగిల్చి, నవ్వు శో
భిల్ల వ్రజాంగనాహృదయభేదకరైకమహాత్మవాంగుఁడై
యెల్లలుమీఱి గోగణము నెల్లెడలందునఁ గ్రుమ్మరించుచున్॥

చ॥ వరయమునానదీవిమలవారిపదంబులఁ డాసి, తద్వనో
పరిగిరిభూము లెక్కుడుశుభప్రదమంచుఁ దలంచి, గోవులం
గరిశరభాది భీకరమృగంబులు లేని బయళ్లయందు బం
ధురగతి మేపఁగాఁ దొడఁగెఁ దుష్టిగఁ బచ్చికలొప్పమీఱఁగన్॥

క॥ యదుకులభూషణుఁడగు హరి
సదమలతీరములఁ జొచ్చి చనువున మేపన్
మొదవులు పుష్కలముగఁ బె
న్బొదుగులఁ బాల్గురిసె నూత్నభూతిం బ్రీతిన్. 69

ఉ॥ అక్కడ నావ్రజాంగన "లహో! యిఁకఁ గృష్ణుఁడుదారమయ్యెనే
చక్కని మోమువాఁడు, రుచిసంపద లొప్పిన మేనువాఁడు, చేఁ
జిక్కక జాఱిపోయి యొకసెక్కెములాడెడువాఁడటంచుఁ బెం
దిక్కును బొందిరోలి; నుపదేశమహత్త్వమనూనమై చనన్--

శా॥ తన్నేపక్కుచుఁ బాఁడుచుం దలఁచుచుం దర్కించి
చింతించుచున్,
నన్నారుల్ బగలెల్లఁ బోమఱచి సాయంకాలమైనంతఁ దా
మెన్నెన్నో తినువస్తువుల్గొని ప్రియం బెపారఁగాఁ బోయి 'మా
వెన్నుండెక్కడ నే? యశోద!' యని యన్వేషింతురుద్విగ్నలై

సీ॥ కృష్ణవేణి యొకర్తు కృష్ణదర్శనమహో
త్కంఠయై ప్రొద్దు గుంకకయమున్నె
చకచకఁ బనిఁజేసి సంధ్యఁజీఁకటిరాఁగ
వత్తిని వెలిగించి తెత్తుననుచుఁ
దిన్నగాఁ గృష్ణమందిరముఁ బ్రవేశించి
వత్తిముట్టించుచుఁ జిత్తమలర
నందనందనుని యాననము వీక్షించుచుఁ
దత్పరచిత్తయై తడవుసేయ

తే॥ వత్తి చూచిచూచి యాగ్రహమొంది, గో
పమ్మయింటి కరిగి సెమ్మె యొద్దఁ
జెయ్యిఁ గాల్చుకొనెడి చిన్నకోడలిఁ జూచి
యాగ్రహంబుమాని యార్తిఁ బొందె॥ 72

క॥ దినదినప్రవర్ధమానమ
యిననిష్ఠామహిమకతన నిందుముఖులు గ్ర
న్నన గృహకార్యంబులయం
దనాదరము గలిగి మఱచి రఖిల జగంబున్॥ 73

మ॥ రమణన్ గోపకుమారకుల్ సెలఁగి బాల్యక్రీడలం దేలుచో
యమునారణ్యమునన్ బలానుజుఁడు సోహంభావముం బూనియే
మమకారంబులఁ బోకదీక్ష మెఱయన్ మానంబు వాటించి, యో
గముఁ బ్రారంభముసేసె వేడ్కమెయి గర్గప్రోక్తమార్గంబు
గన్॥ 74

తే॥ పొన్నవృక్షంబుక్రిందఁ జిన్ముద్రతోడఁ
జెలఁగు పద్మాసనమున రేచించి, పూర
కంబున హృదయబృందావనంబులో న
పానయమునా¹ప్రవాహముఁబట్టిచనుచు॥ 75

తే॥ ఒనర నామీఁద దుర్వారఘనతరంగ
సంగతోత్తుంగమగుచుఁ బ్రచ్ఛన్నభుజగ
మానితాధారమగు నిండుమడుఁగు దఱిసి
సరస నొక్కదినాన నిశ్చలత మెఱయ॥ 76

సీ॥ పట్టుపుట్టము మొలచుట్టుఁ జక్కఁగఁ గట్టి
దీర్ఘశిరోజముల్ దిటవు పఱచి
హారావళులఁ గంఠమందునఁ గీలించి
బర్హిపింఛము మౌళిఁ బాదుకొలిపి
పైవస్త్రమును గ్రిందవైచి నేరుపుమీఱఁ
గాయమధ్యమమును గళము శిరము
నిక్కించి బాహువుల్ నిగిడించి తొడరి యు
ద్రేకించి మది హుంకరించి మించి
ఆ॥ ముక్కు మూసిపట్టి ముప్పోకలాఁ దూఁది
మడువులోనదుమికి మహితవృత్తి
నలపుసొలపులేక వలయముల్ బచరించె
వింతయీఁతతోడఁ గొంతతడవు॥ 77

1. గంగా, యమునా, సరస్వతీ యని ఇడా పింగళా సుషుమ్నా నాడులకు పేర్లు.

శా॥ కల్లోలాక యథేచ్ఛఁ దొల్లి కమఠగ్రాహాదిరూపంబులం
జెల్లాటంబుగ నీఁదు నేర్పుకలిమిం జెన్నారి శ్రీకృష్ణుఁ డ
త్యుల్లాసంబునఁ బిరుఁదై బహుళవాయుస్తంభనల్ సేయుచుం
గల్లోలంబొనరించె నామడుఁగుఁ బ్రాగ్భక్తి క్రియాస్ఫూర్తితోఁ॥

క॥ లోపలి చేతననిచయము
లోపమిగా హ్రదముఁ గలఁచి యుగ్రస్థైర్యా
టోపమున నడుగునకుఁ జని
యేపునఁ గుండలినిఁ దన్ని హేలాగతుఁడై॥ 79

సీ॥ లలితాజపామంత్ర మలఘునాదముగాఁగ
సకలేంద్రియములు ప్రేక్షకులుగాఁగ
బహుళనాడీధ్వనుల్ ప్రథితవీణావేణు
శంఖమృదంగనిస్వనముగాఁగఁ
బటుకుంభితోదగ్రపవనఝంపాధ్వనుల్
క్రమముగాఁ దాళశబ్దములుగాఁగ
నిర్మలానందాంబునిధియైన బ్రహ్మనా
ళము భవ్యనాగస్వరంబుగాఁగఁ
తే॥ త్రిజగదభినవసౌభాగ్యరేఖ వెలయ
నంబుజాధారపల్వలాభ్యంతరమునఁ
జిత్రనటనుండు గోపాలశేఖరుండు
నృత్యమాడె నిమీలితనేత్రుఁడగుచు॥ 80

క॥ ఆవిధ మావరణంబుః1
కావలగాఁబోవునెడ సహస్రాక్షునిచే2
గోవులు3జడిఁగొని తఱఁబడ
గోవర్ధనబిందు4 వెత్తె గోవిందుండై॥ 81

మ॥ ఘనుఁ డాకృష్ణకుమారకుం డిటు లవక్రప్రక్రియారంభుఁడై
వనమధ్యంబును జేరి దీర్ఘగమనాస్వస్థాంగుఁడై విశ్రమిం
చిన నాలో మృదుశబ్దమొండు నెయిదిం జిత్రంబుగా మ్రోగుచుం
వినరా మేల్కని యాలకించె నచలాభిన్నైకధీభాసుఁడై॥82

సీ॥ ఎలమిఁ జిణీస్వాన మెఱిఁగి, యంతఁ జిణిచి
ణీనిస్వనము నేర్పుతో నెఱింగి,
క్రమముగా ఘంటారవమును గుర్తించి, శం
ఖనినాదమును జక్కఁగా గ్రహించి,
వెలయు వీణాతాళ వేణునాదంబు ల
త్యంతభద్రార్థుఁడై యాలకించి,
యలఘు భేరీమృదంగారావములను నే
ర్పుఱిచి, మేఘధ్వని నెఱిఁగి, యనుప

1=సుషుమ్నానాడియందలి చక్రములు (లేక) ఎల్లలు.
2=వేలకొలది సాంకల్పములను కన్నులు గలిగిన మనస్సు (లేక దేవేంద్రుడు
3=గోః-అనగా యింద్రియములు
4=ఇంద్రియప్రవర్ధమానమైన రేతోబిందువు

తే॥ మౌన నాదం "బ" కారంబుగాను, విమల
బిందువు "నం" కారముగను గావించి, తనరు
కళ "వం" కారముగాఁగ హృత్కమలమందు
ఘనతరోంకార మరసి లక్ష్యంబు సేసె॥ 83

శా॥ జ్ఞానానందమహాత్స్వరూప రుచిరోంకారంబు నిట్లంచిత
ధ్యానాకర్ణనయుక్తిభేదములచేతందెచ్చి యోగీంద్రుఁడై
నానాస్థావరజంగమప్రతతులం దన్గాంచి విశ్వానుసం
ధానోద్వేలమహాసుఖంబుఁగనెఁదత్త్వజ్ఞానసంపూర్ణుఁడై॥

క॥ ధీరుఁడు శ్రీకృష్ణుఁ డహం
కారము నాశంబు సేయగాఁ దనువున నోం
కార రవ మెఱుఁగఁ బడు నని
పేరెన్నికఁ దాల్చె నంతఁ బిల్లనగ్రోవిన్॥ 85

మ॥ ఒకనాఁడాయదువంశమండనుఁడు ధ్యానోద్దీప్తిమైఁ బొంగి గా
యకుఁడై బ్రాహ్మముహూర్తకాలమున బృందారణ్య
మధ్యంబునం
బ్రకటస్ఫూర్జితగాత్రుఁడై మురళిఁ గేలం దాల్చి పూరించుచుం
డొక గీతంబును బాడెనద్వయరసం బొప్పం బ్రభూతంబుగాన్

సీ॥ చెలఁగి నాడీధేనువులు మోదమునుజెంది,
తన్మయత్వముఁబొంది, ధన్యమొందఁ;
జటులతరప్రాణసర్పరాజంబులు
వశ్యమై, కడుఁ బారవశ్యమొంద;
వరబ్రహ్మదండి తామరసషండంబు లం
దంబులై, ఘనవికాసంబునొంద;
హాళి దేహజగత్త్రయంబు లానందించి
సుఖమొంది, దీర్ఘసుషుప్తిఁజెందఁ;
తే॥ దన యిడాపింగళాకరద్వయమునందు
ఘనసుషుమ్నామురళి ముద్దుగాఁ దాల్చి
హృదయబృందావనమున శ్రీవేశ్వరుండు
గాన మొనరించె ననఁగ నోంకారమొప్పె॥ 87

క॥ నవరంధ్రాన్వితనాళం
బవిరళ సిద్ధాంగుళీవిహారోజ్జ్వలమై
పవనప్రసరోదంచిత
రవంబు దశగతులఁ బటుతరంబుగఁ బఱవన్॥ 88

తే॥ తేనెవాఁకలఁ బఱతెంచు తేంట్లువోలెఁ
బూర్వజన్మానుభవమైన బోధగదుర
విమల విజ్ఞానజనకమా వేణురవము
కర్ణపుటములసోఁక నాకాంతలెల్ల॥ 89

ఉ॥ "ఈవరశబ్ద మీస్స్వరము నీకళ లెన్నఁడొ వింటి" మంచు సం
భావన సేసి తత్స్వరము భాగవతార్ధసమృద్ధనాదముఁ
బావిరిగు రైతెంగి, తనువాసనలం దెగఁగోసి, యద్వయ
శ్రీవిలసిల్ల గానలహరీమహితాంబుపథోన్ముఖంబుగన్॥90

శా॥ ప్రస్తాకంపిత కేశపాళికలతో స్వస్థానముల్ వాసి, యే
ప్రస్తావంబులఁబోక, భర్తృజనులన్ భావింపఁగాలేక వ్య
త్యస్త శ్రీచరణారవిందు నెదలోదర్శించి, భ్రాంతాత్మలై,
హస్తాహ్వానము సేయుచుం జనిరి "కృష్ణా!" యంచు
నయ్యామినిన్॥ 91

మ॥ చని, డాయంగని, భామినుల్ ప్రణతలై సాక్షాత్కృతున్
మాధవున్
జనితోత్కర్ష మనస్కలై ప్రవిమలోత్సాహాత్మలై కూడి, పా
యనిభక్తిన్ స్తుతిఁజేసి యత్యలఘునిత్యాత్మానుసంధానయో
గనిరూఢత్వమొసంగవే! మముదయంగాంక్షించి రక్షింపవే!

ఆ॥ అని సభక్తికముగఁ బ్రార్థింపఁ గృష్ణయో
గీశ్వరుండు భువనహితుఁడు మిగుల
సంతసిల్లి యాత్మసందర్శనంబును
గలుగఁజేతు ననుచుఁ గరుణఁ జేసి॥ 93

తే॥ గరుడ గంధర్వ కిన్నర సుర మునీంద్ర
సంఘముల కెల్ల మంగళాస్పదమగుచును
జెలువుమీఱెడు తన యఱచేయిఁ జాచి
హస్తమస్తకసంయోగ మపుడు సేసె॥ 94

క॥ మాధవుకరసంస్పర్శన
బోధితలై పూర్వకర్మపుంజము లెడలన్
సాధన లేకయ కాంచి ర
సాధారణమైన యాత్మసాక్షిత్వంబున్॥ 95

క॥ సత్యంబై, సుజనముని
స్తుత్యంబై, నిగమమూలసూత్రార్థంబై,
నిత్యంబై, సద్యోగ
ప్రత్యక్షంబై వెలుంగు పరము, ననంతున్॥ 96

తే॥ సగుణనిర్గుణమయు, శుద్ధసత్త్వరూపు
నజరు నక్షరు నచ్యుతు నచలు నమలు
గూఢుఁ జిద్రూపు నిత్యు నంగుష్ఠమాత్రు
నవ్యయానందుఁ బరిపూర్ణు నంతరాత్ము॥ 97

క॥ అధ్యేయు నాద్యు నవ్యయు
నధ్యాత్ము నగోచరుం బరాపరశక్తున్
మిథ్యాగుణుని సుమనో
మధ్యస్థుం గాంచి యధిక మహిమోన్నతలై॥ 98

సీ॥ జయజయసర్వేశ! సకలభూతములకా
ధారుఁడవగుచు హృద్వనజకర్ణి
కాంతంబులం దంతరాత్ముండవై యుండి
కర్తృత్వ భోక్తృత్వ కర్మఁబొరయ
కఖిలేంద్రియద్రష్టవై యొప్పు నిన్నన్య
థాకరించితిమి ప్రధానపురుష!
యహహా! మాగోవులాయాదవుల్ నందయ
శోదాదు లేము మత్సుతులుఁ బతులుఁ
తే॥ గా సమస్తము నీవనాఁ గంటి మిప్పు
డిట్టి విజ్ఞానచక్షువు నెల్ల ప్రొద్దుఁ
గలుగ వరము బ్రసాదించి కరుణఁ జూడు
మచ్యుతా! నంత! హరి! పరమాత్మ! కృష్ణ!॥ 99

ఉ॥ నీవు యశోదసూనుఁడవె? నీరజనాభ! చరాచరాత్మలో
కావళి కెల్ల నాశ్రయుఁడ వారయ వేదమయుండవీవు, తం,
గావుమటంచు ముద్ధరణి గాసిలి ప్రార్థనఁ జేసియుండుటన్
నీ విటులుద్భవించితివి నేఁడు జగంబుల నుద్ధరింపఁగన్॥ 100

క॥ అని బ్రహ్మానందము నొం
ది, నెఱినమస్కృతులొనర్చి, దృఢచిత్తములన్
ఘనముగ నాభగవంతుని
గొనియాడి రనంతనామ గుణరూపములన్॥ 101

క॥ గరుడని పరుడని హరుడని
వరుడని ప్రణుతించి నయనపంకజముల నా
వరదుని కృష్ణబ్రహ్మము
సరోజలోచనలు పూజ సలిపిరి ప్రీతిన్ ॥ 102

తే॥ ప్రేమమీఱంగ భక్తిమైఁ బ్రీతివుట్టి
విభవుఁ బ్రత్యక్షుఁ దిలకించి వివశలగుచు
నెత్తుకొని ముద్దుఁగొని ముదంబెసఁగఁ జాలఁ
"గాఁగిలించిరి గోపికల్ గానలోలు"॥ 103

చ॥ అనవరతానురక్తి హృదయంబులఁగృష్ణుని బాయలేమి మా
నిను లనవద్యమవ్యయమనింద్యమఖండమబోధ్యమచ్యుతం
బనఁదనరారు నిర్గుణము నాత్మలఁ గాంచియు భక్తిఁబూనినె
మ్మనములలోన నాయదుకుమారునిగొల్చిరి
దేవదేవుఁగన్ ॥ 104

క॥ వెన్నుని సుస్మితవదనుఁ బ్ర
సన్నుని మురళీవినోదు సర్వాత్ముని నా
పన్నలయి కదియఁ బోవుదు
'రన్నా!ర' మ్మనుచుఁ దోయజాస్యలు ప్రీతిన్ ॥ 105

సీ॥ కృష్ణుఁడా! రమ్మని గేలిసేయుచు నొక్క
జలధరకచభర జలకమార్చుఁ
బురుషోత్తమా!యని ముద్దుసేయుచు నొక్క
యంబరమధ్య వస్త్రింబుఁగట్టు

నగధరా! యని యొక్క నవనీతహృదయ మేల్
వెన్న ముద్దలను నైవేద్యమిచ్చు
మాధవా! యని యొక్క మలయజగంధి శ్రీ
చందనం బలఁదు వక్షంబునందుఁ

తే॥ ప్రియమెసఁగఁ బల్లవాధర విడియ మొసఁగు
మాల లలినిడుఁ గుసుమకోమలి గళమున
రత్నకంకణ మంగళారతిని బట్టు
మేటి కలకంఠి యంకించి పాటఁబాఁడు॥ 106

ఉ॥ తమ్ము నెఱుంగలేక తమ తల్లులఁదండ్రుల నత్తమామలన్
బమ్మెరవోవ భామినులు బాలురఁ జూచి యప్పుడెల్ల నే
మమ్మనఁ గృష్ణుఁడంచును గ్రమమ్మున నాప్రభుఁ గాంచి
రెల్లరూ
పమ్ములఁ బుత్రులం బతుల భ్రాతృజనంబుల బంధుమిత్రులన్

తే॥ పరమమైన పరాభక్తిఁ బ్రమద లఖిల
జగము శ్రీకృష్ణమయమని సంగ్రహించి
సచ్చిదానందపరమహంసల వడువున
జడతమీఱి చరించిరి సగుణమందు॥ 108

ఉ॥ మాపటి వేళలందు వనమార్గములన్ హరి వేణుగాన మా
లాపము సేయుచోఁ గృహకలాపములన్ మదరోసి శ్రీకృష్ణుఁడే
ప్రాపని డాసి, తత్పరమ పావన గానసుధారసాంబుధిం
దాపముదీఱఁ గ్రుంకులిడి తన్మయలయ్యెద రంగనామణుల్

మ॥ వనితల్ మన్మథకేళికిన్ నిజపతుల్ ప్రాపించినం జూచి తా
రని గుర్తింపఁగలేక కృష్ణుఁడని యవ్యాజానురాగంబుతోఁ
గనుచుంబల్కుచు నవ్వుచుం బెనఁగుచుం గందర్పలీలాంతరం
గనికాయంబుల నోలలార్చెదరుతత్కాంతారభాగంబులన్

కం॥ వేదార్థప్రతిపాదిత
నాదమధురసంబుఁ ద్రావి నారీమణులు
న్మాదోద్ధతిఁ గ్రీడించిరి
నాదబ్రహ్మైకరతి సనాథోత్సుకలై॥ 111

మ॥ తమ జీవేశ్వరు లంతలో మఱలినన్ దందహ్యమానాంగలై
యమునారణ్యనికుంజపుంజముల మాయాకృష్ణునిన్ రోయుచుం
దమలోనొండొరులన్భ్రమించుచు యశోదానందనుం
బొన్నభూ
జముపొంతంగని డాయఁబాఱుదురు చంచత్కాంతితోఁ
గామినుల్ ॥ 112

కం॥ లీలామానుషవిగ్రహుఁ
డా లలనాజనముఁగూడి యస్ఖలితవిధిన్
హేలాగతిఁ గ్రీడించుచు
లీలలఁ దాఁ దేలి యొప్పె లీలాత్ముండై॥ 113

మ॥ పౌదరిగడ్డంబులిన స్థలంబుల లసద్భూమీరుహచ్ఛాయలం
బదునాల్గ్వేలసతీలలామ లనువొప్పన్ దాస్యముల్సేయ 'నీ
యదు శుభ్రాంశుని తేజముంగన నశక్యంబింక మీ'కం చు వె
ల్లదనంబొప్పఁ బలాయితుండగును దారాకాంతుఁ
డశ్రాంతముల్॥ 114

ఉ॥ అంద ఱకన్ని రూపములనాడుచుఁబాడుచుబోధ సేయుచున్
నందటియందు సర్వసముఁడై విలసిల్లుచు వేతలన్ మహా
నందరసాబ్ధిఁ దేల్చి భవనాశకుఁడై తఱిపుచ్చెఁ జేసెఁ దా
నందజ, నందునింటి శిశువై చెలియై గురుఁడై
కుమారుఁడై॥ 115

క॥ మంగళము రుక్మిణీధవ!
మంగళ మవతారపురుష! మధురావాసా!
మంగళము పాపహరణా!
మంగళ మఖిలాగమప్రమాణధురీణా! 116

1. తాత్పర్యము:- త్రేతాయుగమున నొకపాదము ధర్మము నశించునన్నట్లుగా నంతదనుక సత్ప్రవర్తనగలిగి యున్న రాక్షసులు గొప్పగొప్పవరములను బొంది యున్న వారలై, మదించి, ముల్లోకములందలి ప్రజలను నానాహింసల బెట్టుచుండగా ఆబాధలు పడలేక దేవతలు సృష్టికర్తయైన బ్రహ్మదేవు నొద్దకు బోయి రాక్షస నాశమునకు బూనుకొని తమ్ముగాపాడవలసినదని ప్రార్థించిరి.

2. తా॥ బ్రహ్మదేవుడా దేవతల మొఱయంతయు సావధానముతోవిని రణశూరులైన రాక్షసులను జయించుటకు దనకు యుద్ధనైపుణ్యము లేదని విచారించి, పురాణపురుషుడును సర్వాజ్ఞానసగోచరుడునైన ఆ అఖండ పరిపూర్ణసచ్చిదానందస్వరూపమగు పరబ్రహ్మమును దనహృదయమునందు ధ్యానించెను.

3-4. తా॥ అప్పు డొకశబ్ద మభయమిచ్చుచు నారాక్షసులు వరబలముచేతబిచ్చలించియధర్మపరులైయన్యాయముగాలోకులను హింసించుచుండినను, వారి వారి పాపకర్మ పరిపక్వముగాలేదనియు, అట్టికాలమే సమీపించిన శీఘ్రముగా దనమాయాధర్మమైన కర్మసూత్రప్రకారముగా స్వయముగా దానే వారిని నశింపజేయగలవాడననియు, కావున నా దేవతలు నిశ్చింతగా

నుండవలసినదనియు, ఆబ్రహ్మదేవున కాత్మనిష్ఠలో స్ఫురించి, ఆదేవతలకును వినిపింపగా, వారందఱు సంతోషించి బ్రహ్మలోకమునుండి మఱలి నిజస్థానములకు వెళ్ళిరి-

వివరణ:-

భగవంతుడు సర్వాంతర్యామియయ్యు జీవుల పుణ్యపాపకర్మవిషయములో దాను గర్త కాడు. జీవుడు భగవంతుని యొక్క అంశయేగావున ఆపరబ్రహ్మమువలెనే తానుగూడ స్వతంత్రమైనశక్తి గలిగియున్నాడు. కావున జీవులుదాము సంకల్పించి చేయు కర్మమే, వారివారికి కాలపరిమాణములో దప్పక ఫలించి సుఖదుఃఖరూపముగా సిద్ధించుచున్నది. కాని సహజముగా నొకజన్మలోని కోరిక వేఱొకజన్మలో బక్వమై లభించుటచేత, అప్పుడది సుఖదాయకముగాక ప్రతిబంధకముగా నేర్పడుటయు దటస్థించుచున్నది. ఉదహరణముగా నొక భాగ్యవంతుడు మొదటిజన్మలో సంతానములేక కోరికోరియుండుటచేత రెండవజన్మలోగాని మూడవజన్మలోగానియాసంతానము గలుగవచ్చును. కాని యాజన్మలో దాను గర్భదరిద్రుడై యుండును- ఎందువల్లననగా, దా నా పూర్వజన్మలో సంతానమొక్కటియే గోరెనుగాని ధనముగూడ గోరియుండలేదు. కనుక ఆమఱుజన్మలో దనకు సంతానముమాత్రమే కలుగుచు, దరిద్రుడుగానే పుట్టుచున్నాడు. అట్లు దుఃఖభాజనముగా సంభవించిన ఆజన్మయందు, మఱల, ధనములేదని ధనమొక్క

టియే గోరును గాని, సంతానము మాట కోరుటకూడ సంభవిం పదు. ఆరీతిగా కోరికలపసవ్యములై దుఃఖకారకములే యగుచు వాటి ననుభవింపవలసిన బంధనముతో జన్మలను బెంచుచు న్నవి. అట్లు కర్మబీజము వృద్ధిబొందకయే, కోరిక పుట్టినతో ననే ఫలించవీలులేనట్లు, కాలపరిణామముతో గర్మపక్వమై నచో నే దేవతలు దన్ను బ్రార్థింపకపోయిననూ భగవం తుడు స్వయముగానే దుష్టశిక్షణ జేయుననుట కర్మసూత్ర లక్షణమైయున్నది. ఇందులకు ప్రమాణము శ్రీమద్భగవద్గీత యందలి భగవానువాచ:-

పరిత్రాణాయ సాధూనాం వినాశాయచ దుష్కృతాం
ధర్మసంస్థాపనార్థాయ సంభవామి యుగే యుగే॥

5. తా॥ అట్లు క్రూరులైన రక్కసులు దమ్ము వివిధప్రకార ముల హింసించుచుండగా నాబాధల కోర్వలేని దేవ తలు మొదలైన ప్రజలు దమ తమ హృదయములలో ఆరాతులను దూషించుచూబోగా ఆదూషణములను వారిచిత్తవృత్తులు సత్త్వగుణప్రధానుడైన జీవుని యొక్క కోరికలుగావున వృధాగా నశించిపోవీలులేక కర్మసూత్రము ననుసరించి సృష్టి కారణమైన ప్రకృతి ధాతువుతోగలిసి పరిణామముబొందుచుండెను.

వివరణ:-

ఇది అవతారలక్షణము. అసలు భగవంతు డఖండనిర్గు ణసచ్చిదానందమయస్వరూపమని శ్రుతులు సెప్పుచున్నవి.

అట్టి అఖండమైన పరబ్రహ్మము ఖండమగుటకాని, నిర్గుణము సగుణముగా మారుటకాని, యన్యోన్యవిరుద్ధము. జీవాత్మస్వరూపవిషయమై గూడా ఆ యఖండపరిపూర్ణపరబ్రహ్మము దన మాయయైన మూలప్రకృతియందు ప్రతిబింబము నొంది, అద్దములోని సూర్యబింబమువలె పరమాత్ముని అంశమై జీవుడని వ్యవహరింపబడుచు, సత్తు- చిత్తు- ఆనందమను భగవల్లక్షణములే స్వరూపముగాగలిగి క్రీడించుచున్నాడని చెప్పబడియున్నదిగాని ఆ యఖండస్వరూపము ముక్కలు ముక్కలుగా జెదిరిపోయి యీ నానాజీవులైరని యర్థవాదము లేదు. సృష్టిపరిణామమునందు నద్దమువంటి ప్రకృతియే తునకలు తునకలై యసంఖ్యాకములగు ప్రతిబింబములను జీవులను గల్పించుచున్నది. అయితే అవతారమునున దట్లొక సామాన్యజీవుడుగా బరిగణింపబడ వీలులేదు. శ్రీమద్భగవద్గీతలోగూడా దానే ప్రతియుగమునందు నవతరించి ధర్మసంస్థాపన జేయుచుంటినని భగవంతుడు స్పష్టముగానే చెప్పికొనియుండెను. ఇది సూక్ష్మగ్రాహ్యము. ఎట్లన:- ఒక బలవంతుడకారణముగా నొకదుర్బలుని బీడించును. ఆబలహీనుడు సేయునదిలేక ఆ బలవంతునిపై వ్యసనపడి తన మనములో దూషించికొనును. ఆ దూషణములను చిత్తవృత్తులు జీవాత్మయొక్క స్వయంశక్తి ప్రధానములుగావున ఆబలశాలివైపు ప్రసరించును. ఆబలవంతు డట్లు గ్రమేణ ననేకదుర్బలులను హింసించుచుబోగా, వారివారియొక్క చిత్తవృత్తులుగూడా నల్పశాపములై ఆదుర్మార్గుని నావరించును. ఆప్రకారముగా ఆబలవంతునితో సమానమైనశక్తి సమకూడువఱకు నానా

జీవుల యొక్క లక్షలకొలది చిత్తవృత్తులు ప్రకోపించి గుమి గూడి ఆవరించికొనుచు నేకీభావమునొందును. అట్లు తగిన శక్తివంతముగాగా, ఆధాతువు దట్టమై సంకర్షణబొందుచు, బీజమై సాకారముగా ప్రభవించి తనకర్మవృత్తమైన క్రియా పరిష్కారమునకు వేచికొనియుండును. అట్లనేక కోట్లకొలది జీవాత్మలయొక్క అంశలు గూడి యొకే తేజముగా జనియించుటచేత ఆవ్యక్తియొక్క చిత్తప్రకృతి సహజముగా అమానుషమైన శక్తికలిగియున్నదై, సామాన్యజీవుడని గణింపబడ వీలులేక, అవతారపురుషుడనియే ఆమోదింపబడుచున్నాడు. అట్టి అవతారపురుషుడును దన కర్మయోగమంతయు నివర్తించికొనుచు, సులభముగా జ్ఞానముగూడా సంపాదించికొని, తదనుసారముగానే జన్మసంస్కారము బొందుచున్నాడనుట ధర్మ సూక్ష్మము.

6. తా॥ క్రమక్రమముగా ఆచిత్తవృత్తులమోఘములై యేకీభవించి, నీరు ఆవిరిగామారి వర్షమేఘమైనట్లు, ఘనీభవించుచు బరిణామమునొంది సత్వగుణప్రధానమైన తేజోవిశేషముతో నీలవర్ణముగా మారుచుండెను.

వివరణ:-

మహాతేజమైన ప్రకాశము దృగ్గోచరమగునపుడు నీలవర్ణముగా గనుపించును. ఇందుకు దార్కాణము: ఆకసమునందు సూర్యరశ్మి. ఎండ యొక్కుడుదీక్షణముగానుండుమిట్టమధ్యా

హ్నకాలమున ఆరశ్మి నీలముగానుండి, సాయంప్రాతఃకాలములందు బ్రకాశముదక్కువకాగా వివిధరంగులతో కన్పించుచున్నది. అకారణముచేతనే జ్యోతిర్మయమైన జీవాత్మపరమాత్మలకు నీలవర్ణ ముపాధిగా చెప్పబడియున్నది. అట్లే వర్ణమును జలాశయముగా నన్వయించి శ్రీమన్నారాయణుడు అనగా నీటియందు వసించినవాడనియు బ్రతిపాదింపబడియున్నది.

7. తా॥ అట్లు కోట్లకొలది దేవతాజనులయొక్క యంశలు గలిసి ఒక మహాతేజముగుచు నావిధముగా సృష్టివెచిత్ర్యము బొంది జీవస్వరూపమై దేశకాలపాత్రానుసారముగా భూలోకమున బుణ్యాత్ముడగు దశరధమహారాజుయొక్క పట్టమహిషియైన కౌసల్యాదేవికి బుత్రరూపమున ఆవిర్భవించెను.

8 తా॥ అట్టి సమష్టిశక్తియైన ఆశిశువు తనయొక్క మహాతేజ మెక్కుడు బ్రకాశమానముగా వెలుగుటచేత శ్రీయనియు, దన చైతన్యరూపమైన ఆత్మలీలలు మనోరమ్యమై చూపఱులనాకర్షించుటచేతరాముడనియు, చంద్రబింబమువంటి తనముఖకాంతులు జంద్రకిరణములవలె హృదయానందకరముగా నుండినందున చంద్రుడనియు, సార్ధకపదములతో "శ్రీరామచంద్రమూర్తి" యని వ్యవహరింపబడెను.

9. తా॥ తరువాత శ్రీరామచంద్రుడు పెరిగి పెద్దవాడై తన క్షత్రియ ధర్మము ననుసరించి రాక్షససంహారమను దుష్టశిక్షణము గావించుటకై దండకారణ్యము సేరెను.

10. తా॥ ఆ దండ కారణ్యమునం దొక్కచోట జ్ఞానులును, వైరాగ్యవంతులును, శాంతులును నైన సంయమీంద్రులు గూడ నెల్లప్పుడు భగవద్ధ్యానతత్పరులై యుండిరి.

11. తా॥ అట్టియెడ ఆశ్రీరామచంద్రు డొకనా డొకముని పల్లె సమీపించి యంపసమావేశమైయున్న మునికూటములోనికి ప్రవేశించి వారికందఱకు దనజగన్మోహనమైనసౌందర్యముతో నేత్రపర్వ మొనరించుచు, నక్షత్రరాశి నడుమనున్న నిండుచంద్రునివలె తేజోమూర్తియై ప్రకాశించెను.

వివరణ :-

భగవంతుని యొక్క యన్ని అవతారములలోను శ్రీరామావతారమేయనన్యమైన రూపలావణ్య విభ్రమములుగలిగి మిక్కిలి సౌందర్యవంతమై యుండెనని చెప్పబడియున్నది.

12. తా॥ తొలకరిమబ్బువంటి మెఱుగుగల నీలవర్ణమైన శరీరచ్ఛాయయు, పదునాలుగులోకములను సంకల్పమాత్రముచే బుట్టించు గంభీరమైన నాభిస్థలమును, విశ్వమంతయు ప్రకాశింపజేయు సూర్యచంద్రులవంటి నేత్ర

ద్వయమును, లక్ష్మీదేవి కాటపట్టయిన విశాలమగు వక్షస్థలమును, మిగులసన్నమైన నడుమును, గలిగి, యేను గుగున్నవలె ఠీవిగా నడచుచు రూపలావణ్యతేజో విశేషములచే బురుషులనుగూడా మోహింపజేయు సౌందర్యమూర్తియైన ఆ శ్రీరామచంద్రుని,—

13. తా॥ ఆ మునీశ్వరులు కనుఱెప్ప లార్పకుండగా జూచి చూచి, తనివిజెందక, పులకాంకితులై, తదేకదృష్టితో నివ్వెఱబడి లక్షించుచుండిరి.

14, 15. తా॥ అప్పు డాశ్రీరామచంద్రమూర్తి యొక్క ఆనీలవర్ణమైన దేహచ్ఛాయయు, ఆవ్రత్తైన విగ్రహసౌష్ఠవము, ఆమోకాళ్లనుదాకు పొడవైనచేతులు, ఆ చెవులు కన్నులు భుజములు ముఖము కంఠము నాభి పాదములు, దక్కగల నడుము తొడలు వక్షస్థలము మొదలైన ప్రతియొక్క యవయవము మనోరంజకములై మన్మథునిబాణములవలె గాఢముగా మనస్సుల నాటుకొనగా ఆమునీంద్రులు చలించి భ్రమించి చిత్తవైకల్యము నొందినవారలై విరహముజెందిన స్త్రీలవలె ఆయవతారపురుషుని మూర్తివైభవము నొక్కట నాలింగనముసేయ గుతూహలపడిరి.

16. తా॥ అంతలో ఆశ్రీరామచంద్రుడును దమవలెనొకమగవాడే కదా యనియు, నగుబాటుసుమా యనియు,

తడబడుచు, సంబరపడుచు, ఒకరిమొగమొకరు చూచి కొనుచు, ముచ్చటపడుచు, తమలోదా మిట్లని తలపో యఁజొచ్చిరి.—

17. తా॥ అక్కటక్కటా వానప్రస్థాశ్రమవాసులమై యరణ్యముల నివసించుచు, నీవారధాన్యముతో పొట్టపోసికొనుచు ననేకసంవత్సరములనుండి బ్రహ్మచర్యదీక్షవహించి యింద్రియజయముగలిగి జీవితమునందుగూడా విసుగుజెందియున్న మాబోటి తపస్సంపన్నులనే యీ పురుషు డొకడీరీతిగా మోహింపజేయుచున్నాడు గదా!

18. తా॥ అయ్యయ్యో! కేవలమైన నిర్వికల్ప సమాధినిగూడా సాధించుచు, మనస్సును బుద్ధిని జిత్తమును లయమొనరించి, ద్వంద్వాతీతమైన అమనస్కయోగ మనుభవించుచుండిన ఆత్మ సంచలించిన మాతపశ్శక్తియంతయు గూడ నేడు వృథామైపోవును గదా!

19. తా॥ ఆ సచ్చిదానంద పరబ్రహ్మమే ఈ శ్రీరామచంద్రమూర్తియై అవతరించెననుట యథార్థమైనను, ఆపరమాత్మునియొక్క అంశయని పిలువబడుటకు హంసమాత్రుడైన జీవునకు వ్యవహరించునుగాని, శుద్ధజడాత్మికమైన యీపాంచభౌతికస్థూలశరీరమే ఆపరబ్రహ్మస్వరూప మనుట అజ్ఞానమేయగును గదా!

20. తా॥ పరబ్రహ్మ మనునది సర్వాంతర్యామియు, మహత్తు మాత్రము చేతనే రూపముగలవాడని తెలియబడువాడును, శాశ్వతుడును, తానే వస్తువుచేతను జూడబడక తనకు దానే సర్వమునకు సాక్షిమాత్రుడు నగునుగావున దదంశసంభూతుడైన జీవుడగు హంసునకే యాలక్షణము లేర్పడుచున్నవి కాని క్షయవృద్ధులకులోనైన దేహమునకు గాదు కదా!

21. తా॥ అట్లని యెంచియు, నింతటి యింద్రియజయమును గూడా సాధించి గొడ్డుబాఱిపోయిన యీవృద్ధాప్యమున నిట్లాలింగనము సేయగోరు టెంతయనుచితము సుమా!

22. తా॥ అని ఆందోళనబడుచుండియు ఆశ్రీరాముని సౌందర్యముచేత నాకర్షింపబడి, హృదయస్థైర్యము సెడి, ఆతురబడుచున్న ఆమునిలోకమును జూచి,—

23. తా॥ లోకేశ్వరుడును, సమస్త స్థావరజంగమరాసుల నేలువాడును నైన ఆశ్రీరామదేవుడా మునీశ్వరుల యభిమతమును గ్రహించి, దయామయుడును, భక్తుల కోరికల నొసంగువాడును గావున ననురాగము సూచించుచు వారి నెల్లను గలయజూచి యిట్లనియె,—

4. తా॥ ఓ సంయమిప్రవరులారా! నేను నిష్కపటముగా బ్రహ్మజ్ఞానులకు వశ్యమయ్యెయున్నాను. అంతేగాక, సర్వసాధారణముగా నేమానవుడైనను నాయొక్క సగుణస్వరూపముగాని నిర్గుణస్వరూపముగాని హృదయములో ధారణజేయుచు ధ్యానించుచుండిన నేను వానికి బ్రహ్మానందమొనగూర్చుటయేగాక, యీ పదునాలుగు భువనములుగూడా వానిధనమై ప్రవర్తిల్లును. అట్టియెడ జిత్తశుద్ధిగలిగిన యోగసిద్ధులుచునిరంతరము నిర్వికల్పసమాధిలో నిమగ్నులగుచు మునిపుంగవులైన మీవంటి సిద్ధపురుషులు గోరినప్పుడీపాటి నా యీ దేహాలింగనమే మీకు దొరుకకపోవునా? కనుక, యది మీకందఱకు దప్పక సిద్ధించితీఱును.

5. తా॥ కాని మీ యీకోరిక నీక్షణమే నెఱవేర్చుటకు వీలు లేదు. ఏలనన గా, నేనీజన్మమునందు గర్భిష్ఠుడనై కొన్ని అమోఘనియమముల బూనియున్నాడను గనుక నా యర్ధాంగియైన యొక్కసీతకుదప్ప నితరుల కాలింగనమొసగుటచేత నాయేకపత్నీవ్రతమునకు భంగము వాటిల్లును గావున నిషిద్ధమైయున్నది.

6. తా॥ అంతేగాక యమోఘమైన తపశ్శక్తిగలిగిన దేవతల నుండి సముద్భవమైన యీసమష్టి తేజము దివ్యములైన యాషడ్గుణైశ్వర్యములయొక్క సమ్మేళనముతో మూర్తిభవించుటచేత నాయీశరీరముగూడా మిక్కిలి

పవిత్రమైయున్నది. కనుక యట్టి యీ నాదేహమును గాగిలించుట కయోనిజయు నా భూదేవికూతురునగు ఆసీతవినా యితరులెవరును పాత్రులుగాజాలరు.

27. తా॥ కనుక మీ రిప్పుడు గోరిన నాదేహాలింగనము మీకు రాబోవు ద్వాపరయుగాంతములో దప్పకలభింపజే యుచున్నాను. ఆయుగములో నేను నా నిజభూతితో మఱల నవతరించుచున్నాడను. మీరును స్త్రీబుద్ధితో నే డిట్లుగోరినవార లైతిరికావున మీరందఱు గోపవని తలై పునర్జన్మము నొందెదరు. నేను మీకోఱకై వ్రేపల్లెలో నివసించుచు యశోదాదేవికి గుమారుడనై విహరించునప్పుడు మీకు నా ఆలింగనము సిద్ధింపగ లదు.

28. తా॥ అని పలికిన ఆశ్రీరామదైవము యొక్క వచనము లాలకించి యా మునీశ్వరులు, "ఔర! ఏమి యీరా మావతార నియమములు? ఒక్కటే మాట, ఒక్కటే బాణము, ఒక్కతెయేనట భార్యయుగూడా నని తమ లోదాము మెచ్చికొనుచు గుసగుసలాడుకొనిరి.

వివరణ:-

శ్రీరాముడు ధనస్సునందు బాణము సంధించిన, దానికి నెత్తురు తగిలి తీఱవలయుననియు, శత్రువు పాఱజూచిన వెనుకగాబోఁడు తగులక వెన్నంటిమాత్రము దిరుగుననియు, జెప్పబడియున్నది.

29. తా॥ పిమ్మట ద్వాపరయుగము కడపటగా బృందారణ్య ప్రాంతమునందలి వ్రేపల్లియలో ఆసంయమీంద్రులు దమతమ కర్మానుసారముగా గొల్లపడుచులై పుట్టి పెరుగుచుండగా, పెద్దగొల్లయగు నందుని భార్యయైన యశోదాదేవికి ఆరామావతారము యొక్క తేజము మఱల నిజభూతితో శ్రీకృష్ణుడై ఆవిర్భవించెను.

వివరణ:-

త్రేతాయుగములో శ్రీరామచంద్రమూర్తియై ప్రభవించిన ఆమహాతేజము పుణ్యపాపవిచక్షణతోడి కర్మయోగ పరమగు సిద్ధిని గాంచుటచేత ఉత్తరజన్మమైన శ్రీకృష్ణావతారమునందు ఆజన్మజ్ఞాని యయ్యెను.

30. తా॥ అట్లు ఆజన్మజ్ఞానియైన గోపాలకృష్ణుడు దయాసముద్రుడును, అరిషడ్వర్గముల జయించినవాడును, మంగళప్రదుడును, కపటనాటకసూత్రధారుడును, భక్తపరతంత్రుడునై విలసిల్లెను.

31. తా॥ అట్టియెడ గోపికలు బూర్వజన్మజ్ఞానము లేక, సంసారలంపటలోబడి శ్రీకృష్ణుడు వ్రేపల్లెవాడలో నవతరించిన కర్మయోగ రహస్యమైన భగవదాలింగన విషయమును గాని, ఆయవతారపురుషుని మహిమము గాని గుర్తింపకపోవుటచేత, ప్రజ్ఞగలపాత్రులకే దొరకువా

డును, జ్ఞానచక్షువు నొసంగువాడును నైన శ్రీకృ
ష్ణుడు వారియందు జాలినొందినవాడై యిట్లని విమర్శిం
చికొనెను.

వివరణ:-

గోపికలు సామాన్యజీవులవలె జన్మించుటచేత పూర్వజన్మజ్ఞానమును మఱచియుండిరి. కాని వారలకు పూర్వజన్మసంస్కారములు లేకపోలేదు. అనగా వారి మనస్సులందు పూర్వజన్మమునందు సాధించియున్న చిత్తశుద్ధి దాగికొనియేయున్నది. అట్లణగియున్న చిత్తవృత్తులు ప్రకోపించిననే కాని వారలు మఱల సత్త్వగుణప్రధానలు గాజాలరు. అట్లు సత్త్వగుణము ప్రకాశమానముగాక, యింద్రియప్రవృత్తిలోనేయుండిన, వారు ప్రజ్ఞాలభ్యుడైన శ్రీకృష్ణుని యొక్క ఆలింగనము లభించుటకు పాత్రులుగారు. పూర్వజన్మమునందు వారలెట్టి యంతఃకరణముతో శ్రీరామచంద్రుని యాలింగనము గోరిరో యట్టి సత్త్వగుణస్థితిలోనే యిప్పుడది చేకూఱవలసియున్నది, కాని వారింద్రియలోలలై యుండినగాదు. కావున భక్తపరతంత్రుడగు శ్రీకృష్ణభగవానుడు వారి నట్లుద్ధరింపవలసినవాడయ్యెను.

32. తా॥ పాప మీ గోపిక లింద్రియజాలములోబడి చిత్త
భ్రమనొంది సంసారమార్గానువర్తినులై నన్ను దెలియ
లేకుండిరి కదా!

33. తా॥ వీరు గొల్లజాతికి జెందియుండుటచేత, ఆలమందల
గాచికొనుచు, పాలువెన్నల నమ్మికొని సుఖముగా జీవ

నము సేయుచున్నారే కాని, యీజగత్తు మిథ్యయ
నియు, నీశారీరసుఖము లనిత్యములనియు నెంతమాత్ర
ము దెలియకుండిరి కదా!

4. తా॥ విశ్వమున కంతటికి జీవస్వరూపమైన ఆపరంజ్యోతి
యందు సమాధినిష్ఠలో లయముజెందిన పూర్వజన్మ
పరిపాకము గలిగియున్నవారలయ్యు, ఈ గోపికలు
నామాయాపాశమున జిక్కుబడియున్నారు గనుక
వీరల నే నిప్పుడు తప్పక రక్షింపవలసియున్నది.

వివరణ:-

సాధకుడు మొదట దన పురుషప్రయత్నముతో వ్యవ
సాయముసేసి యింద్రియజయము బొందినయెడల దదనంత
రము దైవమే ప్రయత్నపూర్వకముగా దనున్నుద్ధరించుచున్నా
డు. అమెట్లు భోజనపిదప మానవునకు దానుతిను ఆహారము తన
ప్రయత్నము లేకపోయిననూ ఏవిధముగా జీర్ణమగుచున్నదో,
యదేవిధముగా మనస్సు నివృత్తిపరమగునట్టి నాడీశుద్ధిని
బొందిన పిమ్మట ఆపరమాత్మునిచేతనే యాకర్షింపబడి సాధ
కుని చిత్తవృత్తికి బాహ్యేంద్రియసంకర్షణ నిరోధించి మనో
లయ మొనరించుచున్నది. కావుననే భక్తాగ్రేసరుడగు ప్ర
హ్లాదు డయస్కాంత మినుపముక్కను లాగికొను నట్లుగా
దనచిత్తము నాహృషీకేశునిశక్తి లాగికొని పోవుచున్నద
నియు, దానిని మఱలింప దనకు వశముగాకున్నదనియు దండ్రి
యైన హిరణ్యకశిపునితో విన్నవించికొనెను.

35. తా॥ అని తర్కించికొనినవాడై శ్రీకృష్ణుడు గనికరము విడిచి, తోడిగోపాలురతోగూడి ఆగోపికల సర్వసౌఖ్యములకు మూలమైన పాలు పెరుగు వెన్నల నపహరించి బాధింప సమకట్టెను.

వివరణ:-

తమ శిశువును సన్మార్గములో నుంచుటకు మొదట దలిదండ్రులశిక్షణ మవసరమైయున్నది. అట్లు దా మాకుమారుని గొట్టినను దిట్టినను వారి భావ మాబాలకుని క్షేమమే గావున నన్యాయముగాదు. అజ్ఞానుడగుబాలున కది తెలియక నిజముగానే భయపడవచ్చును. కాని తనక్షేమము విషయమై తనకంటె నెక్కువగా వాని తలిదండ్రులకే తెలిసియున్నదనుట నిర్వివాదము. అదేవిధముగా గోపికలయొక్క చిత్తప్రవృత్తి నిరోధించుటకు భగవంతుడు బాహ్యసుఖముల కంతరాయము గల్పింప సంకల్పించుటయు, ఆగోపికల యాత్మక్షేమమునకే కావున, వా రది మొదట గ్రహింపలేకపోయినను దాను వారి జ్ఞానసంస్కారములను రక్షింపవలసినవాడయ్యెను.

36. తా॥ అక్కడక్కడ నాటలాడుకొనుచుండెడిగోప బాలురను గూర్చుకొని, దొంగతనముగా, ఆగోపికలయొక్క యిండ్లలోనికి జాగరూకతతో జొఱబడి, ప్రతిదినమును చేతికందిన పాలుపెరుగువెన్నల సొంతముగా దినివేయుచుండుటచేత, ఆగొల్లపడుచులు శ్రీకృష్ణునిపై అ

సూయా ద్వేషములు జెందినారై యాబాలుని చిదానం
దలీలలు గ్రహింపలేక వాపోవుచు,—

37. తా॥ అబలలు, చంచలలునైన ఆగోపకన్యలు, భగవం
తుడైన శ్రీకృష్ణు నెఱుంగజాలక, లోకవ్యవహారరీత్యా
నన్యాయము నవమానము జరుగుచున్నదని భ్రమించి
యొకనాడు వారందఱుగలిసి యశోదాదేవి యింటి
మీదికి దండెత్తి ఆకృష్ణుని చేతలవిషయమై ఆమెతో
ఘోరముగా బోట్లాడిరి,—

38 తా॥ ఓ యశోదమ్మగారూ! నీకు గొడుకుపుట్టుట మాక
ర్మకోలది· మాకొంపలు దోచుకొనుటకే కాబోలు.
ఇంకేమున్నది, మాపాప మిట్లాపండిపోయింది. ఏమో
నమ్మా! ఈయూరిలో మే మిక కాపురములువదలి
యింకేయూరైనా లేచిపోవలసి వచ్చినట్లేయున్నది.

39. తా॥ అయ్యయ్యో! నీకొడు కేదో యొకవంకబెట్టుకొని
మాయిండ్లలో దూఱి యన్నియు నాశముచేసి పోతా
డమ్మా. అంటే, అడ్డము గనుపించలేదు కొంచెము
చుక్కబెట్టమ్మాయీ! యంటూ దగ్గరకు జేరుతాడు;
పోనీలేయని, మొగమున జుక్కదిద్దుతుంటే, మెడ
లోని సొమ్ములు చూచినట్లు నటించి సొమ్ములు-ముట్టు
కుంటాడు; ముట్టుకొని నీకొక మంచిరహస్యము చెవుతా
నంటూ! చెవియొద్దకువచ్చి చెక్కిలినొక్కుతాడు;నొక్కి

నీకంటె నే నే పొడవున్నాను కొలుచుకుందా
మంటూ, ముందునకు నిలబడి మోవిదగులుతాడు;
తగిలి నీవు కండ్లుమూసుకో గమ్మత్తుచూపుతా నంటూ,
నాకండ్లు రెండూమూసి యింట్లోకిజొఱబడి ఆపాలు
మీగడలు దోచికొని, పోతూపోతూ నానోటికికూడా
కొంచెముబూసి కెకిలినవ్వు నవ్వుకుంటూ పరుగెత్తి
పోతాడమ్మా! మీనల్లపిల్లగాడు.

వివరణ:-

శ్రీకృష్ణుడు బదునొకండేండ్ల ప్రాయమువచ్చువఱకే వ్రేపల్లెలో నందునింట బెరిగెనని శ్రీమద్భాగవతమునందే చెప్పబడియున్నది. అట్లు శ్రీకృష్ణుని బాల్యక్రీడలు పసితనమునందే జరిగియుండెనుకనుక నట్టిచిన్నవయస్సునకు జారత్వమాపాదింప వీలులేదు. పోతనామాత్యుడు దనకవితాచమత్కృతితో భగవల్లీలలని యట్లు శృంగారరసములో దెనుగు భాగవతమునందు వర్ణించియుండెనుకాని, యౌవనమే లేని బాలున కట్టికామకాభావము గలిగెననుటలో నర్థములేదు. అంతేగాక "నీవుయశోదబిడ్డడవె నీరజనేత్ర సమస్తజంతుచేతో విదితాత్మ వీశుడవు" అని యాకవీశ్వరుడు బిమ్మట గోపికాగీతలందు వ్రేతల చేతనే స్తుతి జేయించియున్నాడు. కనుక గోపికలు మొదట దన్ను గడపద్రొక్కనీయకపోయినప్పుడా బాలకృష్ణుడేదోయొక చమత్కారముతో దగ్గరకు జేరి, మఱపించి, యుక్తిగా నింటిలోనికిజొచ్చుట జరిగియుండెడిది. అది సహజముగా కుఱ్ఱవాండ్లకందఱకును స్వాభావికమేయై యున్నది.

40. తా॥ అంతేగాక మేము మాయిండ్లలోనున్న పాలకుండలనన్నింటిని జాగ్రత్తగా దాచికొని, తలుపులు బిగించి, గుమ్మముమీదనే గూర్చొని కావలియుండగా, మాకంటబడకుండగనే యెటుగండి లోనికిబోవునో కాని, కడవలుమాత్రము ఖాళీయైయుండునమ్మా! ఇంకా యేమేమో పులి, తోడేలువలె దొంగయఱుపులఱచి మమ్ము నిర్ఘాంతపెట్టి మాయిండ్లలోదూఱి పాలకుండల దన్నికొనుచు జిక్కకుండా దప్పించుకొని మఱీ పాఱిపోతూయుంటే, యింకా నీకేమిచెప్పవలెనమ్మా యశోదమ్మగారూ! మొత్తముమీద కనిపాఱేసి యాంబోతును విడిచినట్లుగా ఊరిమీద వదలివేస్తేమట్టుకు మే మిక యూరుకోలేమమ్మా!

41. తా॥ అని యుప్పతెనబెట్టుచూ ఆడిపోసుకొనుచుండగా విని నివ్వెఱబొందిన యశోద తన చిన్నికుమారుని ముఖలక్షణములలోని యమాయకత్వమును జూడగానే చిఱునవ్వు గలిగి, తనముద్దుబిడ్డ నన్యాయముగా సరిపడక నిందించుచుండి రనితలంచి యొడలుపులకరింపగా వారిని నిరాకరింపనెంచి,—

42. తా॥ ఓహోహో గోపికలారా! మీ రిట్లు గోపమెత్తి వచ్చి యీరోజువరకు నాచవుబాలైనామానని యీ పసివాని నీరీతిగా జారచోరదూషణములతో నిందించి వృధాగా యెందులకిట్లుప్పతెనపాల్జేసెదరమ్మా?

అన్యాయముగా శిశువుల నిందజేసిన గన్నకడుపైన తలిదండ్రుల కెంతయు విచారకరము గాదా!

43. తా॥ మీరుమట్టుకు బిడ్డలగనని గొడ్డుబోతులా యీరీతిగా నాముద్దులకొడుకుమీద బాఉలుసాపిమఱీ తిట్టిపోయుచున్నారు. చాలుజాలుగాని యీ వేషాలు మాని నాయింటిముంగటినుంచి వెళ్లిపొండి.

44. తా॥ కానిచో మీరు మీమగవాండ్లపై నిరుగుబాటుజేసి గెలువలేక, ఆకసియంతయు, యీ పరాయితల్లిగన్న పసివానిమీద జూపించి వాపోవుచుంటిరి కాబోలు.

45. తా॥ ఆహా ఏమి యీఆగడము? పసివాడన్న తఱువాత బొరుగిండ్లవైపుకే రాకయుండునా? వచ్చినప్పుడొక వేళ నేమైన తినేవస్తువులు గన్పించిన నందుకొనక మానునా? అట్లని ఆపాలుపెరుగులు గంటబడకుండా జాటుగా దాచిపెట్టుకొని, యేదో కళ్లెదురుపెట్టి వాడందుకొనకుండా చూచుకొనవలెనుగాని, యిట్లు పరువుమర్యాదలులేకుండా కాస్తంతదానికి గంపెడంత చేసి బాఉలు చాపుతూ భాజారు కెక్కితే యేమున్నది?

46. తా॥ అని యీ గోపికలను తిరస్కరించినదై యశోద కుమారునిపై ప్రేమజనింపగా, వారి సంగతివిడిచి, శ్రీకృష్ణుని దగ్గరకుదీసికొని,—

47. తా॥ నాయనా! నిన్ను ఊరిలోనివారందఱు గొల్లపిల్ల వాడని యపఖ్యాతనబెట్టుచున్నారు. నీవా నాకు లేకలేక కలిగిన వంశాంకురము గనుక చెడ్డపేరు దెచ్చికొనబోకుమురా నాతండ్రీ!

48. తా॥ అని లాలనముసేయుచు శ్రీకృష్ణుని గృహములోనికి దీసికొనివెళ్లి దృష్టిదోషము దగిలెనేమోయని భయపడి విభూతిని మంత్రించి తన మనస్సునకు దృప్తిగా నాబాలుని కాపాదమస్తకమును బూసినదయ్యెను.

49. తా॥ ఆప్రకారముగా దల్లిచేత మందలింపబడిన శ్రీకృష్ణుడు పేక్షాభావము వహించి గోపికల విషయమై వదలివేయగా, దమ యింటిపురోహితుడైన గర్గమహాముని యరుదెంచి యాకృష్ణావతారమర్మ మెఱిగియున్నవాడు గనుక ఆయోగేశ్వరుని యోగవిద్యా విధానమును బునశ్చరణ జేయవలసినదని ప్రేరేపించుచు క్రియాయోగములో నుదాసీనుడు గాగూడదని యాశ్వాసించి వెళ్లెను.

వివరణ:-

అట్లు లోకులచేత దూషింపబడి ఉదాసీనుడైయున్న బాలకృష్ణుని గర్గమునీంద్రుడు క్రిందివిధముగా నుద్బోధించెను:-

(10)

గర్గ॥ గోపాలదేవా! ఏమట్లుదాసీనునివలె నేదో చింతించుచున్నాడవు?

కృ॥ గురుదేవా! నే నితరులకు మేలుసేయుచుండగా నన్ను దుర్మార్గునిగా భావించుచున్నారుగదా స్వామీ!

గ॥ నాయనా! లోకము కాకులవంటిదనికదా సామెత. మఱియు "లోకో భిన్నరుచిః" కావున మన మితరుల యుద్దేశములు గమనింపకూడదు. నీవు నీబుద్ధికి దోచి నటుల జేయుట నీకర్తవ్యము.

కృ॥ కాని యితరులు నన్ను దూలనాడుచుండిరిగదా స్వామీ!

గ॥ ఎవ్వ రెవ్వరిని దూలనాడి రోయీ, గోపాలా?

కృ॥ ఈ యూరివారందఱువచ్చి నన్ను దిట్టి మాయమ్మతో బోట్లాడిపోయిరి స్వామీ!

గ॥ ఎవరిని దిట్టిరి నాయనా?

కృ॥ నన్నే స్వామీ! నన్నే.

గ॥ అంటే నాకర్థముగాలేదే!

కృ॥ అయ్యో నన్నేనండి, నన్నే. ఈ యశోదాకుమారుడ నగు శ్రీకృష్ణుని.

గ॥ ఓహో! అటులానా, కృష్ణుడవైన నిన్నే తిట్టి పోయిరా?

కృ॥ ఔ నండి, ఔను.

గ॥ అయితే నీపేరు కృష్ణుడన్నమాట.

కృ॥ కాదు స్వామి; నాపేరు శ్రీకృష్ణుడు.

గ॥ సరే, నీ పేరైతే శ్రీకృష్ణుడు.

ఆఁ ఔను స్వామీ, నా పేరు శ్రీకృష్ణుడు.

అయితే నీ వెవ్వర వోయీ?

అయ్యో! నేను శ్రీకృష్ణుడనని చెప్పికొంటిని గాదండీ, యింతలోనే మఱచిపోతిరా స్వామీ!

కాదబ్బాయీ! శ్రీకృష్ణు డనేది నీయొక్క పేరు గదా! అటులైన నీవు ఎవ్వరో చెప్పుము.

అదేమిటి స్వామీ! అట్లా అడుగుచున్నారు.

నీకు నామాట యర్ధముగాలేదు కాబోలు. సరే, విను ఈయశోద ఎవరి తల్లి?

నా తల్లియే.

ఔను గదా! నీవు వేఱు, మీయమ్మ యశోద వేఱుగా నుంటిరికావున, ఆమె నీయొక్క తల్లియైనది. కాని ఆమెయు నీవును నొక్కటే మనిషి కాదుగదా!

అవునండి, అమె నాతల్లికాని, నేనూ ఆమె యొక్క రమే యెట్లగుదుము!

మఱి, యిందాక నీవు నీపేరు శ్రీకృష్ణు డంటి వే. అప్పుడు నీవూ నీయొక్క పేరును వేఱువేఱేగాక, యొకేవస్తు వెటులైనది?

అవును స్వామీ! నేను బుట్టినతరువాత చిన్నప్పుడు దమరే దయచేసి నాకు శ్రీకృష్ణుడని పేరుబెట్టినా రటగదా! ఆ అబ్బాయినేనండి నేను. ఇప్పు డింత పెద్దవాడనైతిని.

గ॥ సరే పోనీలే, నీ చేయి యేది?

కృ॥ ఇదుగో నండి, యిది కుడిచేయి.

గ॥ అవును, యిది ఎవరి చేయ్యి?

కృ॥ నాచెయ్యే గదండి, నాదే.

గ॥ అవును, ఇది నీది. అనగా నీయొక్క చేయి. అంటే, యిందాక నీయొక్క తల్లి యన్నట్లుగా, నీ చేయి వేఱు, నీవు వేఱుగా నున్నారు గాదూ!

కృ॥ అ దెట్లాయగు నండి? నాచేయీ నేనూ కలిసియే యున్నాము. కాని నాతల్లీ నేను వేఱేవేఱే యున్నాము గాదండీ.

గ॥ అయితే, యీ నీచేయి తెగిపోయిన, నీవుగూడ లేక పోదువా?

కృ॥ అఁహఁ; ఈచేయిపోతే, నా కింకొకచేయిగూడాయున్న దిగదండి.

గ॥ అవును, యీచేయిపోతేగూడా "నీవు" అంటూ యుంటున్నాడవు గనుక నీవు వేఱు, నీచేయి వేఱు. అనగా నీవు ఆచేయి వే యని చెప్పవీలులేదు అది నీయొక్క చేయి. అనగా నీవు వేఱేగా యుంటూయుండగా, ఆ చేయిగూడా వేఱేగానే యుండి, నీది యగుచున్నది.

కృ॥ ఔను స్వామి, తెలిసినది. ఇది నాయొక్క చేయి యగుచున్నది. అయితే యీ కాలూ నాదియే, యీ ముక్కూ నాదియే, యీ కన్నులూ నావియే నన్నమాట ఇవి యుంటే నావి, యుండకపోతే నాకు లేకపోవుచు

న్నవి కాని "నే" నంటూ నివి లేక పోయిన గూడా యుంటానండి!

గ॥ మఱి, యీ కండ్లూ ముక్కూ, చెవులూ, కాళ్లూ తలా నీవు గాకపోతే "నే" వెవ్వర వోయ్?

కృ॥ అదేనండి, నే నెవరినీ?...ఆఁ, యీముక్కులో నడిచే యూపిరి గావచ్చును గాదండీ!

గ॥ మంచిది, ముక్కు మూసిపట్టుకొని చూడు.

కృ॥ నాకు ఊపిరి ఆడదుగదండీ!

గ॥ ఆఁ, నీకు ఊపిరియాడదంటే నీవు వేఱు, నీ యూపిరి వేఱు గాదూ?

కృ॥ అంతే నండి.

గ॥ మఱి నీ వెవ్వడవు?

కృ॥ ఏమో తెలియుట లేదండి. అంతా అయోమయముగా నున్నది. స్వామీ! తమరే నన్ననుగ్రహింప వలసినది మునీంద్రా!

గ॥ అటులైన వినుము. నీశరీరమునందు "నే" ననునది నీశరీరము కాదు. నీశ్వాసయు గాదు. ఈశ్వాస మనస్సుయొక్క స్థూలరూపము. ఈశ్వాసననుసరించుచు నను గమించిన, నీదేహమునందలి పంచకోశములను దెలియగలవు. ఆ యింద్రియములజయించి,మనస్సును వశపఱచికొని యహంకారము నణగద్రొక్కిన బుద్ధికి ఆత్మావలోకన మొదవి నిను నీవు యథార్థముగా నెఱిగికొనగలుగుచున్నాడవు. కాని, యీదేహమునీ

వనియు, మనస్సు నీ వనియు పొరపడుట మాయ (లేక) అజ్ఞాన మనబడుచున్నది. నీవు సర్వకాలసర్వావస్థలందునగూడా ఆత్మవే యై యున్నాడవు. ఆ అజ్ఞానమను మాయ తెర దొలగిన, సూర్యోదయముతో నిండుచీకటియంతయు నెగిరిపోవునట్లు, ఆత్మసాక్షాత్కార మొదవి, అజ్ఞానమంతయు నశించుచున్నది. ఆత్మ యెల్లప్పుడు సాక్షిమాత్రుఁడే కాని, కర్తయు భోక్తయు గాడు. కావున ఆత్మకు దూషణభూషణము లెన్నడును లేవు. నీ వా ఆత్మస్వరూప మయ్యేయుంటివి గనుక లోకు లాత్మయగు నిన్ను దిట్టుచుండిరని తలంచుట యారోపిత మగుచున్నది. అన్ని జీవుల లోని ఆత్మ యొక్కటే గనుక తిట్టువాఁడు, తిట్టుబడినవాఁడు గూడ నాత్మయేయై యున్నది. ఇక ఈమిథ్యారోపణ చేయుంచునది మనస్సేయై యున్నది. ఆమనస్సు పంచజ్ఞానేంద్రియములద్వారా యానందము కొఱకు బాహ్యవిషయములలో వెతకికొనుచు, జీవునకహంకార మాపాదించి కర్మలంపట నొందించి జననమరణముల బొందించుచున్నది. జీవాత్మయే యథార్థస్థితిలో అఖండానంద స్వరూపముగానున్నది. కావున మనస్సు నంతర్ముఖము సేయవలయును. రెండుకండ్లను మూసికొనిన, యీ మాయాప్రపంచమునం దొకభాగము అదృశ్యమగుచున్నది. నోరు గూడా మూసిన, రెండు వంతులుగా నశించుచున్నది. చెవులు మూసిన మూడువంతులు మాయమగుచున్నది. అట్లే

ముక్కు మూసిన నాల్గువంతులు గాను, శరీరమే మఱచిన బూర్తిగా గాను ప్రపంచము లేకపోవుచున్నది. అనగా యీ మైను మార్గములు నిరోధించిన,మనస్సు పరిభ్రమించక జీవాత్మలో నణగిపోవుచున్నది. కనుక శ్రీ, గోపాలదేవా! నీ వా మనస్సునుజయించి లోకులకు వెలువక, నీ బుద్ధికి యుక్తమని తోచినట్లు కర్మాచరణము సేయుచు, కర్తృత్వాభిమానములేక లోకోపకారము సేయ వలసినది.

కృ॥ అయితే, గురువర్యా! సాధన యేప్రకారముగా జేయవలయునో యనుగ్రహించి, నన్ను గృతార్థుని జేయుడు.

గ॥ కృష్ణభగవానుడా! నీవు సాక్షాత్ భగవంతుడవును ఆ జన్మజ్ఞానివియు గావున నేను నీకు వేఱే యుపదేశింపవలశినది లేదు. ఐనను, నీ వీబాల్యమునందే యష్టాంగయోగముతోగూడిన రాజయోగమును బునశ్చరణచేసికొనిన, ఉత్తరోత్తరా లోకమునకు దత్త్వోపదేశము సేయుటకు మాననీయుడవగుదువు. కానిచో లోకులు నీయమానుషత్వమెఱుగజాలక నీ గీతాబోధతత్త్వ మాదరింపకపోయిన రాబోవు కలియుగమున ధర్మము బొత్తుగా నశించిపోవును సుమా!

అని గర్గమహాముని శ్రీకృష్ణుని బ్రోత్సాహపఱచి వెడలిపోయెను.

50. తా॥ ఆవిధముగా మాతృదేవతకంటె గొప్పదైన గురుదేవుని వాక్యము ననుసరించి, కాలయాపనము సేయక,

శ్రీకృష్ణుడు గోపికల విషయమై త్వరపడి విచ్చలవిడిగా వారి పెరుగు పాలు మొదలైన వస్తువుల నాశము సేయ మొదలుబెట్టగా, వారందఱు జాలా మనోవ్యథపాలైరి.

51. తా॥ గోపిక యొక్కతె ప్రతిదినము శ్రీకృష్ణుడు సేయు దానికి వానిని బట్టికొని ప్రతిక్రియ జేయవలెనని సంకల్పించి, ఆనాడు యేకాదశి గూడా అగుటచే నింటిలో వంటచేయనక్కఱలేదుగదా యని యితరపనులేమియు దలబెట్టక, కృష్ణు డందుకొన వీలులేకుండునట్లు నడికప్పున కొక యుట్టినిగట్టి, అందులో బాలు పెరుగు వెన్నకుండలను జాగ్రత్తపఱచి, తలుపులు బిగించి, పీఢిగుమ్మము మీదనే మిక్కిలి మెలకువతో గూర్చొని త్రోవగాచికొనుచుండగా నంతలో మధ్యాహ్నకాలమయ్యెను.

52. తా॥ అట్లు పచ్చియుపవాసముసేయు నామెకు నోరుఎండగా వాకిలిముంగటనున్న చెఱువులోనికి వెనుకకు దిరిగితిరిగి చూచికొనుచు బోయి, త్వరగా నొకగ్రుక్కెడు నీటితో నోరుదడిపికొని, మఱుక్షణములో గిర్రున తిరిగి యిల్లుసేరుకొనునప్పటికి గుండెఝల్లురనగా నంతలోనేయిల్లంతయునిండియుండిన యనేకమంది గోపకులజూచెను.

53. తా॥ ఆబాలురతోపాటు శ్రీకృష్ణుడును రోళ్లు పీటలు ప్రోగుబెట్టి, వేఱొకపిల్లవాని నెక్కించి, వాని భుజ

ములపై దానునిలబడి, చేతికందని యాయుట్టియందలి కుండలకు రంధ్రముగొట్టి, ఆవిసురున కాయుట్టి యిటు నటు నూగుచుండగా దానితోబాటు దాను తనశిర మునుగూడా సమానముగా వంచి త్రిప్పుచు, క్రిందికి గారుచున్న క్షీరధారకు దోసిలిబట్టి, తానును దనక్రింద నిలబడినవాడును ద్రావుచుండగా, తక్కుగల బాలకులు మో చేతులక్రింద జుట్టికొని త్రావుచుండి, యందఱు దదేక నిమగ్నులై పిలచినా వినిపించికొనలేని స్థితిలో పొట్టలుమట్టుకు బెద్దవిగా బెరుగుచుండగా, అయిల్లాలి ఏకాదశీవ్రతము సఫలమాయెనా యన్నట్లుగా శ్రీకృష్ణుడు నిజవిభూతిమైన గోపాలురతో సహా ప్రత్యక్షమయ్యెను.

వివరణ:-

ఈ గోపవనిత యుపవాసదీక్షతో నేకాదశేంద్రియముల నిరోధించి, చిత్తైకాగ్రతగలదై, శ్రీకృష్ణునే స్మరించుచు బగచేతనో వగచేతనో ధ్యానించుచుండెను గనుక, భక్తపరాధీనుడైన భగవంతు డామె కవశ్యము దర్శన మీయవలసివచ్చినది. కాని ఆమెబుద్ధిపరిపక్వముకాకపోవుటచే ఆమె ఆభగవత్సాక్షాత్కారము నెఱుగ లేకపోయినది. అట్లాధర్మ సూక్ష్మమాయిల్లాలు గ్రహింపలేకపోయినను, గర్మఫలము దప్పదుకావున, దదేకధ్యానముతో శుచియై ఆదిన మామె

సాధించిన కర్మయోగ్యతయే యామెపాత్రతకొలది నామెకు దక్షిణము ఫలించి భగవత్సందర్శనము ప్రసాదించెను.

54. తా॥ ఆరీతిగా జూచి, భయము, నాశ్చర్యములతో గూడి కొనిన వణకుపుట్టుచున్ననూ, దొంగయని యనుకొనిన ఆబాలకృష్ణుని బట్టుకొనవలయునని ధైర్యముదెచ్చికొని, వానిమీదనే దృష్టినిలిపి, మెల్లమెల్లగా దగ్గరకు జేరుచుండగా శ్రీకృష్ణు డామెనేత్రము లుపవాసము చే జిక్కియుండెనని దయదలచెనన్నట్లుగా, బుక్కిట లోని పాల నామెకన్నులపై నుమిసి, ఆమె తెప్పరిల్లి చూడగలిగేలోపుగా నాగోపాలకులతో సహా చిత్రముగా నదృశ్యమయ్యెను.

55. తా॥ ఆవిధముగా నెవ్వరి కంటబడకుండా నెక్కడ గని పెట్టుకొని యుండునో, యెప్పు డింద్లలోనికి దూఱునో యెట్లు పాఱిపోవునో, కాని యేమాత్రమును చప్పుడు గాదు. పైగాకుండలు బెట్టినట్లేయుండును కాని లోపల చూచిన శూన్య మని పరిపరివిధముల దలపోయుచు ఆశ్రీకృష్ణుని విషయమై వానితల్లికూడా పట్టించి కొనుట లేదుగదా యని వ్యసనపడుచు,—

56. తా॥ అట్టి విచార మారోజు కారోజు కెక్కుడుగాగా, ఆగోపికలు వాకిం డ్లూడ్చుచున్ననూ, ముగ్గుబెట్టు చున్ననూ, వంటకములు సేయుచున్ననూ, మాట

లాడుకొనుచున్ననూ, నిద్రపోవుచున్ననూ, తిరుగుచున్ననూ, చూచుచున్ననూ, వినుచున్ననూ, యింకా నేమేమిచేయుచున్ననూ, చిత్తముమాత్ర మాకృష్ణుని చేతలమీదనే యాకర్షింపబడి వేఱే తాముగా గష్టపడి సాధించే ప్రయత్నము లేకుండగనే మనస్సులంతర్ముఖమై యేకాగ్రత్వము నొందిరి.

తా॥ అట్లు దాము బట్టుకొనవలయునని ప్రయత్నములు సేసినను, దొరికియు దొరకని బాలునిగూర్చి విసిగి, వేసరి, లోలో మెచ్చికొనుచు, యనురాగవతులై తుద కా గోపికలసూయాద్వేషములు మఱచి, యందఱుగలసి సమానముగా శ్రీకృష్ణుని ప్రేమింపదొడగిరి.

తా॥ ఈ ప్రకారముగా జిత్తైకాగ్రత నొందుచు, హృదయపూర్వకముగా గామక్రోధాదుల విసర్జించి శ్రీకృష్ణునియం దెక్కుడు మమకారము గలిగినవారలై గోపిక లాంబాలకుని దమ చేతులలోనికి జేరదిగిచికొని గారాబము సేయవలయునని గాఢముగానపేక్షింపగా ఆశ్రీకృష్ణుడు వారలకు శరీరము వేఱు ఆత్మలు వేఱు అని, నిర్ధారణచేయుచు స్ఫుటముగా అనహంకారోపదేశము సేయదలచినవాడై చిత్రముగా దన బాల్యలీల నొకటి నిరూపించెను.

వివరణ:-

గోపిక లింద్రియలోలులుగానుండియే శ్రీకృష్ణుని దాకగోరుచుండిరి, కాని గతజన్మలోని మునీశ్వరులవలె నింద్రియాతీతలై కాదు. కనుక, వారికి స్థూలదేహవాసన పూర్తిగా నశింపజేయుటకై భగవంతు డుపదేశము సేయవలసివచ్చెను. అట్లని తన దైవత్వ మెఱుగని సంసారిణులగు ఆగోపికలను బిలిచి మంత్రోపదేశము సేయుటకు వీలులేమి క్రియారూపముగా నొక్కటి ఆత్మచికిత్స నొనరింపగడగెను. ఆవిధముగా జ్ఞానులైన వారతాత్తుగా జిత్తప్రక్రియ నొనర్చిన బాత్రులుగానట్టిమూఢహృదయులగు శిష్యులకు నాడీదోషముసంభవించి ప్రమాదము జరుగుట తటస్థించును. అందువల్లనే యమనియమాదులు మొదట తప్పక సాధింపవలసియున్నది. కాని ఆగోపికలన్ననో అదివఱకే యింద్రియవాసనలను మఱల్చిన హృదయసైర్యమును బొందియున్నవారగుటచే వారికి నాడీవిజృంభణము దరుణమేయయ్యెను.

59. తా॥ ఒకనాడు గోపికలందఱు గౌరీదేవీవ్రత మారంభించి వినోదముగా నాడుచు బాడుచు యమునానదికి వెళ్లి నిస్సంకోచముతో వివస్త్రలై స్నానముసేయుచుండిరి.

60. తా॥ అప్పుడాబాలకృష్ణుడా యొడ్డు మీదనున్న ఆవ్రేతల చీరెలు దొంగిలుచుండగా వారు చూచి యాతని వారింపదొడగిరి,—

61. తా॥ అయ్యో, అయ్యో, కృష్ణా! ఇదేమిపనిరా? ఆడ వాండ్లు స్నానమాడుచుండగా మగవాం డిట్లు బొంచి చూచి రావచ్చునటరా? ఒకవేళ పొరపాటున వచ్చి తేని, యీ విధముగా చీరె లెత్తుకొనిపోవుదురా? ఛీ! ఛీ! నీవు చాలామంచివాడవు గదరా! పరుగెత్తి పాఱిపోక మాకోక లక్కడ విడిచిపెట్టి వెళ్లు నాయ నా. అయ్యో! అప్పుడే చాలాప్రొద్దుగూడా యెక్కి నదే!

62. తా॥ ఓ కృష్ణా! నీవు మా మాట వినకపోయిన, మీయ మ్మతో జెప్పెదము సుమా! అయ్యయ్యో! ఇవేమి యాటలురా? మా నాయనగాదూ! తే, మాచీరెలు మా కందిచ్చు తండ్రీ! యని స్వభావసిద్ధమైన లజ్జతో నయమున భయమున బ్రతిమాలికొనిరి.

63. తా॥ అప్పుడా గోపాలకృష్ణుడు దానకర్మపరుడు గాడు గావున వారి కోకలు దీసికొని పాఱిపోక వారి కొక క్రియావిధానమును గల్పించి సాభిప్రాయముగా నిట్ల నియె:—ఓ గోపికలారా! భయపడకుడు. మీ రేల యింత సిగ్గునొందెదరు? ఈజగమంతయు మిథ్యయే కదా! అటులనే యీపాంచభౌతికమైన మీశరీరము లును మీ మీ ప్రారబ్ధకర్మానుభవమునకై మీరుధరిం పవలసివచ్చినదేకదా! కావున అనిత్యములైన మీ యీతుచ్ఛదేహములపై నింతయభిమాన మెందులకు?

మీరు యింద్రియవాసనలుమాని, దేహభ్రాంతివిడిచి ఆత్మానాత్మానుసంధానబుద్ధితో నీటిలోనుండి వెలుపలికి వచ్చిన, మీకు మీ మీ ప్రకృతిధారణావశ్యకములైన వస్త్రములిచ్చుటయేగాక, తక్క ఆత్మక్షేమకరము లైన దివ్యలక్షణములను దృఢమగు మనోబలమును గూడ బాప్తింపగలవు.

64. తా॥ అని సహేతుకముగా వారిదేహవాసన బలాత్కారముగా హరింపగా, నిశ్శంకగా దదోభ్ఘ గ్రహింప లేని చంచలలుగావున, నిర్విణ్ణహృదయలై ఆగోపిక లోపికలుసెడి మఱల యశోదకడకుంజని కృష్ణుని విప రీతచర్యను సాదృశ్యముగా నిరూపించి వాపో యిరి.

65. తా॥ అప్పు డాయశోదాదేవియు సహజమైన స్త్రీహృ దయముతో గమనించి, గోపికలు సెప్పినమాటయే నమ్మినదికాని, శ్రీకృష్ణుని బుద్ధియందలి సదుద్దేశమైన అనహంకారోపదేశవిధానము గ్రహింపలేకపోయెను. అందువలన, ఆమె తనకుమారునిపై నలుకదెచ్చికొని తాను వానిని దప్పక దండింతునని త్రేతల సమా ధానపఱచి పంపివేసెను.

66 తా॥ తరువాత ఆ యశోదమ్మ శ్రీకృష్ణుని దుశ్చేష్టల గురించి విచారగ్రస్తమై,యికబిల్లవాడింటనేయుండిన

బ్రొత్రిగా జెడిపోవునని తలంచి, తమ కులవృత్తియైన గొడ్లకాపరితనముపై నియమించుచు శీఘ్రముగా నడవులకు బంపవలసినదే యని మనస్సునగుదుర్చుకొని, భర్తయైన నందునకుగూడా నచ్చజెప్పినదై యొక నాటి సుముహూర్తము నిర్ణయించెను.

67. తా॥ అట్లు ప్రప్రథమముగా మందదోలికొనిబోవుటకై యలంకరింపబడిన ఆగోపాలకృష్ణుడు దన మాతృదేవతకు ప్రదక్షిణపూర్వక నమస్కారాదులాచరించి, ఆమె యాశీర్వచనమునందుకొని, చల్దియన్నము నొకకట్టెకు దగిల్చికొని తన్ను జూచి పరితపించుచున్న గోపికాజనమునకు నుపశాంతి కలుగునట్లుగా జిఱునవ్వు నవ్వుచూ, నొయ్యారముతో వారివైపు తిరిగి తిరిగి చూచుచు నావులమంద వెంట నడచెను.

68. తా॥ అట్లు శ్రీకృష్ణుడూరి వెలుపల నున్న పొలములలో బశువుల మేపికొనుచు క్రమముగా నన్నిదిక్కులందలి దూరపు బయళ్లనుగూడా యరసికొనుచు, తుదకు యమునానదీప్రాంతము జేరెను. అక్కడ నున్న కొండభూములయందు, గడ్డి యెక్కుడుగా గన్పడుటచేతను ఆ నదియందెల్లప్పుడు నీరుగూడా పాఱుదలగా నుండుటచేతను, ఆ ప్రదేశమే యెక్కువ వసతిగా నున్నదని నిశ్చయించికొని, క్రూరమృగములు సంచరింపని పచ్చికబీడులందా పశువుల మేపికొనుచుండెను.

69. తా॥ ఆవిధముగా యాదవకులశేఖరుడైన గోపాలదేవుడు దేశకాలపాత్రమెఱిగికొని పశుపోషణ జేయుచుండగా ఆవులును బొదుగులుబెంచి పుష్కలముగా బాలిచ్చుచూ ఆవ్రేపల్లెవాడలో గలవువూటయే కల్లగా సిరిసంపదల కభివృద్ధి గలుగజేసెను.

70. తా॥ ఇట్లు శ్రీకృష్ణుడాలమేపికొనుటకై ప్రతిదినమును యూరిబైటకు బోవుచుండగా నక్కడ వ్రేపల్లెవాడలోని గోపికలాబాలగోపాలుడట్లు గంటికిదూరమవ్వొగదా యని వగజెందినవారై ప్రొద్దస్తమానము వానివిషయమే చెప్పికొని యాలాపము సేయుచు దిగులుపడజొచ్చిరి.

71. తా॥ అంతేగాక ఉపదేశముయొక్క బలముచేతగూడ నిరంతర మాశ్రీకృష్ణునిమీదనే ధ్యాసకలిగినవారై వాని విషయమే మాటలాడుకొనుచు, వానిమీదనే పాటలుబాడుకొనుచు, వానిసంగతియే యనుకొనుచు వానినే మెచ్చికొనుచు యెప్పుడెప్పుడు ప్రొద్దుగ్రుంకునా, యెప్పుడా బాలకృష్ణుడడవులనుండి మఱలి యింటికివచ్చునా యని తపించుచు వేచియుండి, సూర్యాస్తమయము కాగానే ఆగోపికలాకృష్ణుని కిష్టమగు తినుబండములను సేకరించికొని వెళ్లి యాతురలై మాచిన్నికృష్ణుడెక్కడున్నాడమ్మా! యశోదా! యని వెతకికొనుచుండిరి.

వివరణ:-

ఉపదేశమనునది ఉపన్యాసమువంటిది గాదు. ఉపన్యాసమనునది చిత్తక్షోభముగా జేయు గ్రంథవిమర్శనకు పర్యవసానమై యెప్పటికప్పుడు సెప్పువాడును, వినువాడును మఱచుట కవకాశము గలిగియుండును. ఉపదేశమన్ననో యట్లుగాక అక్షరస్పృహనే యరికట్టి దన్నుదానుగా ప్రపంచమునుండి మఱల్చుచు మనోవేగమునిలిపి జీవాత్మపరమాత్మలను జతగూర్చు దారమువంటి యొకనాడీచలన మగుచున్నది గురువైన వాడొక్క యుపదేశములోనే తనయోగశక్తిని ప్రవేశపెట్టి శిష్యునిశరీరమునందలి నాడిని ప్రకోపింప జేయగా నిక నని యావజ్జీవమును వ్యక్తిగతముగానే ప్రసరించుచుండి, తదధిష్ఠానదేవత నేనాటికైననూ సాక్షాత్కరింపజేయుచున్నది. అట్లా యా దేవతల కా యా నాడీస్థానములుండి, బ్రహ్మత్వమునకును వేఱే యొకయూర్ధ్వనాడి హృదయమునందు గలదు గావున, అట్టితత్త్వోపదేశము సేయుటకును గురువైనవాడు బ్రహ్మజ్ఞానియేయై యుండవలెనుగాని యోగసిద్ధి లేని వారలు సేయజాలరు. అందునను క్షుద్రదేవతలు శీఘ్రముగాను గొప్పదేవత లాలస్యముగాను ప్రసన్నులగుదురు, గావున అవ్యక్తపరబ్రహ్మస్వరూపమగు నేకాక్షరప్రణవారాధన మత్యంత దూరముగానున్నది. అట్టి బ్రహ్మజ్ఞానిని యెఱుగుటయు కష్టతరమే. కాని సాధకునికి వైరాగ్యయుక్తమైన పాత్రత చేకూరిన ఆపరబ్రహ్మమే గురుదేవునిరూప

ముగా స్వయముగా వచ్చి యుద్ధరించుచున్నాడని శ్రుతులు సెప్పుచున్నవి.

72 తా. శ్రీకృష్ణభక్తి తత్పరురాలైన (రాధయను) ఒక గోపిక యెప్పుడు బ్రొద్దుగ్రుంకునా యెప్పుడువెళ్లి బాలకృష్ణుని ముద్దులమోమును జూడగలుగుదునా యని యాతురతతో తొందరతొందరగా దనయింటిలోని పనులన్నియు దీర్చికొని, చీకటిపడగానే, దివ్వె వెలిగించికొని వచ్చెదనను నెపముతో గడపదాటి నేటుగా యశోదయింటికిం జని యక్కడ దీపము ముట్టించికొనుచు, దాపుననున్న నందనందనుని సుందరముఖారవిందమును దిలకించియానందించుచు, తన్నుదా మఱచియుండగా, ఆమె వెలిగించుచున్న చేతిలోని వత్తియంతయు మండుకొని తుదకు చేతివేళ్లు కాలిపోవుచున్ననూ ఆగోపిక తెలిసికొనలేకపోయెను. అంతలో ఆమె యత్తగారు తన కోడలాయశోదమ్మగారింటికే వెళ్లియుండునని యనుమానించి, యాగ్రహావేశముతో నచ్చటికివెళ్లగా, ఆ యమాయకపుకోడలి చేతివ్రేళ్లు కాలిపోవుటజూచి, తనకు వచ్చిన కోపమంతయు మఱచి గొల్లుమంటూ బొమ్మబాదుకొని యేడ్వసాగెను.

విశేషార్థము:-

ముఖ్యముగా నాగోపాలకృష్ణుని మేనత్తయైన రాధయను యువతి ఆ బాలకృష్ణునియందలి భగవల్లక్షణములను

దన పూర్వపుణ్య భాగ్యముచే స్వయముగా గుర్తించినదై, ఆకృష్ణకుమారకునిపై దివ్యమైనభక్తి భావమును బెంపొందించి కొనుచు, ఆమాయామానుష విగ్రహుని శిష్యబృందమననొప్పు నాపదునారువేల గోపికలందఱిలోను ముఖ్య శిష్యురాలయ్యెను.

వివరణ:-

సాధకుడు దనహృదయములో నిజమైన భక్తిని గలిగియున్న వానికి ప్రకృతియంతయు ననుగుణ్యముగానే నడచికొనును, కనుక కోపముతో బోయిన ఆయత్తగారు శాంతురాలై గారాబముతో గోడలి నింటికిదీసికొని వెళ్లినది.

73. తా॥ ఆవిధముగా దినదినమును వృద్ధియగుచుండిన ధ్యానశక్తితో ఆ వ్రేతలు క్రమక్రమముగా గృహచ్ఛిద్రములయం దాసక్తి వదలి తమ చిత్తములయందు బ్రపంచధోరణినే మఱచి మనోలయము నొందుచుండిరి.

వివరణ:-

ఈ ప్రకారముగా బూర్వజన్మసంస్కారములు గలిగిన గోపికల నింద్రజాలమగు సంసారప్రవృత్తినుండి మఱలించి, భక్తులను సంసారచక్రమునుండి తఱింపజేయు ప్రభువైన యాశ్రీకృష్ణభగవానుడా గోపీజనమునకు ధారణాధ్యానసమాధియోగముల నలవాటుబఱచి సంయమనిష్ఠుల నొనరిం

చెను. కాని గోపికలన్ననో ఆబాలకృష్ణు డవతారమూర్తియని కాని, ఆజన్మజ్ఞానియని కాని యెఱిగికొనలేకపోగా, తామ ధ్యాత్మనిష్ఠ బొందుచుండుటయుగూడా తెలిసికొనియుండ లేదు. అనగా వారికి దమ బుద్ధియొక్క ప్రమేయములేకుండినను తమశరీరములలో జీర్ణకోశము, శ్వాసకోశము మొదలైన వెట్లుపనిచేయుచుండెనో, యదేవిధముగా వారిబుద్ధి కవగతము గాకపోయినను తామాత్మనిష్ఠాధురంధరిణులగుట సహజమైనట్లుగా సంభవించినది.

74. తా॥ అక్కడ ఆయమునారణ్యములందు దోడిగోపాలు రాటపాటలయందు బ్రొద్దుబుచ్చుకొనుచుండగా, ఆజన్మజ్ఞానియైన శ్రీకృష్ణు డేకాంతముసొచ్చి నిజగురువులాదేశించినచొప్పున రాజయోగము బునశ్చరణము సేయదలకొని యమనియమములతో అష్టాంగయోగాభ్యాసదీక్షవహించి సాధన కుపక్రమించెను.

75. తా॥ ఆ ట్లాటపాటలయం దాసక్తిలేనివాడై శ్రీకృష్ణు డాయమునారణ్యములందలి వింతలను జూడదలచి యేకాంతముగా బోవుచు బృందావనము బ్రవేశించి, యొకపొన్నచెట్టుక్రింద గూర్చొని వినోదించుచు ఆయమునానదియొక్క నీటిప్రవాహమును గమనించుచుండగా,——

విశేషార్థము:-

అటు యమనియమముల నవలంబించి యేకాంతము జొచ్చిన శ్రీకృష్ణుడు దీక్షవహించి, యొకపొన్నచెట్టుక్రింద బద్ధాసనస్థుడై కూర్చొని, చిన్ముద్రబట్టి, క్రమముగా రేచక పూరక కుంభకములతో హృదయకోశమునందలి యపానవాయువును త్రేల్చుచుండగా,—

76. తా॥ అటువైపున పెద్దపెద్దయలలతో బొంగుచుండి, లోపలదాగియున్న కాళియసర్పమునకు నిలయముగా నుండిన యొక నీటిమడుగును గుర్తించి దానిని సమీపించెను.

విశేషార్థము:-

కొలది యభ్యాసముతోనే తెంపులేని యింద్రియవాసనలతో బొంగిపొరలుచు, లోపలనణగియున్న కుండలినీశక్తి కాశ్రయముగానున్న మూలాధారచక్రము నెఱిగికొనినవాడై,—

77. తా॥ అట్లా కాళిందీమడువును సమీపించి, సాహసముతో ఆమడుగులోనికి దుముకదలంచి, మొలనున్న పీతాంబరమును గట్టిగా బిగించికట్టుకొని, శిరోజములను జక్కగాముడివైచికొని, హారములను కంఠమునకు మెలికలుగా దగిల్చికొని, పింఛమును దీర్చి యమర్చికొని, తన పైనున్న యుత్తరీయమును గూడా గ్రిందబడవైచి, శరీ

రము బెంచి, భుజములుగొట్టి, యూపుతో నుద్రేకము దెచ్చుకొని హుమ్మనుచు మూర్ఖపుపట్టుదలగా ముక్కు బట్టికొని, యెగిరి, యామడువులోనికి దూకినవాడై వలయాకారములు దిరుగుచు నలయక ఘోరముగా నీదులాడజొచ్చెను.

విశేషార్థము:-

ఒకనాడు దృఢమగు బుద్ధితో దీవ్రముగా గుంభకములు సేయదలంచి, కటిచేలమును జక్కగా వదులు సేసికొని, శిరోజములు గాలికెగిరి చెదరకుండా సర్దుకొని, హారములు దేహస్పృహ గలిగింపకుండునట్లుగా మడతలుగా వేసికొని, మీది యుత్తరీయమునే యాసనయోగ్యముగా క్రిందబఱచికొని, బిగువుగా బద్మాసనముమీద వెన్ను, కంఠము, శిరము సమానముగా నిలువరించి కూర్చొని, హస్తముసాపి చిన్ముద్ర బట్టి, పూనికతో "ఓం" అను ఏకాక్షరప్రణవమును స్మరించుచు బ్రజ్ఞమీఱగా నొకముక్కురంధ్రమును మూసి, రేచించి పూరించుచూ, ఆ ముల్లోకేశ్వరు డలసటనొందక యమోఘముగా గుంభకములు సేయుచు, ఆమూలాధార చక్రమును భేదింపజొచ్చెను.

78. తా॥ ముఖ్యముగా దా ననేకమాఱులు మత్స్యకూర్మాది యవతారములెత్తుచు మహాసముద్రములయందే యీది యున్న నేర్పరి కావున, శ్రీకృష్ణు డేమాత్రము నలయక

వీరావేశముతో గ్రుక్కబట్టి మునిగి తిరుగుచు ఆమడు
గంతయు గలచి బురద బురద చేసెను.

విశేషార్థము:-

యథార్థమునకు దాను, యోగేశ్వరుడైన సగుణనిర్గుణమయపరబ్రహ్మస్వరూపుడును అవతారపురుషుడుగా వున అనంతవీర్యుడై దృఢముగా ననేక కుంభకములుసేసి తన చైతన్యశక్తితో నామూలాధార కమలమును భీభత్సముసేయ జొచ్చెను.

79. తా॥ అట్లామడుగులోని జలచరములన్నియు బెగ్గడిలు
నట్లుగా అల్లకల్లోలమొనరించుచు విజృంభించి, యమడు
గునేలవఱకుబోగా హఠాత్తుగా దనకాలుదాకి బుస్సు
మనుచు దఱిమివచ్చిన కాళియసర్పమునుజూచి క్రీడా
వినోదియై,—

విశేషార్థము:-

అట్లామూలాధార చక్రమునందలి ప్రాణశక్తులు భరించి తట్టుకొనలేనట్లుగా గుంభించి భీభత్సముసేయుచు, నిజమనోబలమునుజూపి భేదించి, ఆమూలాధారకమలమునందు నిద్రించియున్న కుండలినీశక్తిని లేవగొట్టి లీలావినోదియై,—

80. తా॥ తన ముక్కురంధ్రములలో సంచరించెడి శ్వాస
యొక్క బుసలే నాదముగను, నదీతీరమునందలి యర
ణ్యములనుండిన ఆలమందలు మొదలగుజంతువులు బ్రే
తుకులుగను, నరములయొక్కయు కీళ్లయొక్కయు

చప్పుడులు మద్దెల మొదలగు వాయిద్యములుగను, ముక్కు యూదునప్పుడు ప్రసరించెడి యూపిరి యొక్క గతులు తాళముగను, ఒక పెద్దబూర నాగస్వరముగను మేళము సేసికొని ప్రపంచమునకంతటికి నాశ్చర్యముగలుగునట్లుగా, ఆమడుగులోని తామరపుష్పములమధ్యనున్న కాళియసర్పముపై నిలబడి యూతుంటరి పిల్లవాడైన గోపాలకృష్ణుడు కన్నులుగూడా మూసికొని పరవశమొందుచు మోడివేసెను,—

విశేషార్థము:-

అట్లు సులభముగా ప్రాణాయామసిద్ధిగాంచిన శ్రీకృష్ణుడు దదేకదీక్షతో ప్రత్యాహారముసేయువాడై సోహంభావమే స్వరముగాను, దశేంద్రియములే ప్రేక్షకులు గాను, 72,000 నాడులధ్వనులే బహువిధవాద్యవిశేషములుగాను, కుంభకమునందు బరిభ్రమించుచుండిన శ్వాసయొక్క గతియే తాళముగను, నిత్యానందదాయకమగు బ్రహ్మనాళమే నాగస్వరముగను నన్వయించికొని, ముల్లోకములకు నూతన మంగళమొనగూర్చెడి సర్వోపనిషద్సారసంగ్రహమైన గీతోపదేశవైఖరిసూచించుచు, చైతన్యమాత్రస్వరూపుడై యూపద్మాసనముమీదనేయుండి తనమూలాధారకమలమధ్యనున్నకుండలినీశక్తి నాడించుచు, తదధిష్ఠానదేవతయైన గణేశున కారువందల హంసగాయత్రిని "వశషస" బీజాక్షరములతో జపించి సమర్పించెను.

61. తా॥ ఆప్రకారముగా గాళియమర్దన మాచరించిన శ్రీ కృష్ణుడాయమునారణ్యములలో నెల్లలుమీఱిభయంకరమైన చోట్లుగూడ బ్రవేశించి యావులమేపికొనుచుండగా దేవేంద్రుడు రాలవాన గురిపించెను. అప్పుడా వర్షములో గోవులు దడిసి బెగడువడి చావ సిద్ధముగాగా దక్షణము శ్రీకృష్ణుడాదాపుననున్న గోవర్ధనమను కొండను లేవనెత్తి ఆవులమందల కాశ్రయమిచ్చి వాటిప్రాణములు దక్కించెను.

విశేషార్థము:-

ఆవిధముగా బ్రత్యాహార మొనరించిన శ్రీకృష్ణుడు మూలాధారచక్రమునుండి సహస్రారకమలమువరకుగలయేడు చక్రములనుదాట వలెనని ధారణాయోగమునుబూని నిర్మలత్వము బొందుచుండగ చంచలమైన మనస్సుయొక్క పరివర్తనచేత సూక్ష్మముగానున్న యింద్రియములు క్షోభించి దుర్బలమగుచు సడలి నశించిపోవుచుండగా నంతలో సులభముగా స్వాధిష్ఠానకమలములోని రేతోబిందువును గదల్చియూర్ధ్వరేతస్కుడైనందున ఆయింద్రియములకు బూర్ణసత్వముగలిగి బునర్ధారణము నొందెను.

వివరణ:-

ఇక్కడ నొక గూఢమైన విషయముగలదు. ఏమన, అదివఱ కధోముఖముగానుండిన కుండలనీశక్తి లేచినప్పు డూర్ధ్వముగా బైకిబ్రాకుచు సుషుమ్నామార్గముగా నడచునప్పుడు,

దద్వారభేదనముతో సాధకునికి ప్రాణాపాయమే సంభవించును. లేక, ఆసుషుమ్నానాడిలోనున్న మలము కపాలమునకెక్కిననూ మెదడుసెడి పిచ్చివాడగుటయు జరుగును. అట్టియేప్రమాదముగలుగకుండా ఆపాచి కుత్తుకలోనికే వచ్చినిలబడి నోటిలోనుండి యుమియబడుటకు ఆక్రియాసిద్ధి తన పురుషార్థములో లేక కేవలము సాధకుని యొక్క భగవద్భక్తి తాత్పర్యమును, ఆసర్వేశ్వరుని యొక్క దయాకటాక్షమునై యున్నది. ఈస్థితిలో సాధకునికి భౌతికముగా నొక పెద్దజబ్బు చేసి క్రమేణ నివారించును. ఆపరీక్షతో ఆవ్యక్తి జీవన్ముక్తి గూడ ఆజన్మలోనే సాధింపగలుగుననుట నిస్సంశయముగా నుండును, యెందువల్లననగా నటనుండి ఆపరమేశ్వరుని శక్తియే తన మనస్సును ఆకర్షించి లాగికొనిపోవుచున్నది. మూలాధారచక్రమునుండి కుండలినీశక్తి కదలువరకు, మానవుడు కర్మేంద్రియములకువశ్యుడై స్త్రీలోలుడై యుండును. ఆకుండలినీశక్తియూర్ధ్వముఖమైన కామము స్వతః గానే నశించి బ్రహ్మచర్యము నిర్విఘ్నముగా నిలచుచున్నది. ఈకుండలినీ శక్తి నాభికమలము యొద్దనున్న మణిపూరకచక్రమును జేరియున్నను, ప్రమాదము జరిగిన మరల మూలాధారమునందు వచ్చినిలచును, గాని యది యామణిపూరకచక్రమును గూడా గడచియున్న, తిరిగి మూలాధారచక్రము వరకు రాజాలక మణిపూరకచక్రమునందే నిలబడిపోవుచున్నదనియు యోగశాస్త్రము చెప్పుచున్నది.

82. తా॥ ధీరుడైనగోపాలకృష్ణుడట్లు నిరాటంకముగా గోవులను మేపికొనుచు, అరణ్యమధ్యమును ప్రవేశించి,

దూరప్రయాసముచే నొక్కింత విశ్రమించగా, నం
తలో నొక విపరీతమైన యీలవంటిధ్వని విని మేలు
కాంచి, యెవ్వడైనా బోయవా డాదాపున దిరుగుచు
ద నొకయడవిమృగమని పొరపడి బాధించడుగదా
యని తన జాతకలక్షణము దలచికొనుచు ధైర్యము
దెచ్చికొని నలుదిక్కుల బరికించి చూచెను.

విశేషార్థము:-

సిద్ధసంకల్పుడైన శ్రీకృష్ణు డట్లు నిర్విఘ్నముగా యోగ సాధన జేయుచు నూర్ధ్వరేతస్కుడై శ్వాసను హృదయస్థానము నందలి అనాహతచక్రమున జేర్చి చిత్తశాంతినొందుచు ధారణాయోగ మతిక్రమించుచుండగా నంతలో నొక చిత్రమైన "రీజ్" కార శబ్దమొకటి విని మిక్కిలి శ్రద్ధతో ఆధ్వనియందు బుద్ధిని దీవ్రముగా బ్రవేశపెట్టి సంయమన మొనరించెను.

83. తా॥ అట్లు జాగరూకుడై యాయడవిలోని చిన్నచిన్న యెండుటాకుల చప్పుళ్లను, కిచకిచమను పిట్టలయొక్క కూతలను, టంటం అని దొర్లుచుండెడి రాతి బండలయొక్క శబ్దములను, వెదురుచెట్లు మొదలైనవాటి యొక్కయొరపిడిధ్వనులను, నలుగడలబరుగులెత్తు జింకలు లేళ్లు మొదలగు జంతువులయొక్క గిట్టలచప్పుళ్లను, ఆకసమును గప్పియున్న మేఘముల యొక్క గర్జలను, నాలకించి, విమర్శించికొనుచు, సావధానుడై

యా యరణ్యసీమయందు దనకు వినిపించుచున్న "రీజ్" కారము దద్వాయువుయొక్క ప్రకృతిసిద్ధ మగు ఝుంకారమేగదా యని బుద్ధిలో సమాధానపడి మనస్సుగుదుర్చుకొని భయరహితుడయ్యెను.

విశేషార్థము:.

శ్రీకృష్ణుడట్లనాహతచక్రమునుండి స్ఫురించిన "రీజ్" కారముపై సంయమనము సేసి, క్రమముగా దదంతర్భాగమైన "చిణీ" నాదమును, "చిణి-చిణీ" నాదమును, ఘంటారవమును, శంఖనినాదమును, వీణానాదమును, తాళధ్వనిని, వేణుస్వరమును, భేరీ నాదమును, మృదంగ శబ్దమును, మేఘధ్వనిని, శ్రద్ధాయుక్తుడై విమర్శించికొని, యానంద పరవశుడై, అకార బీజమైన ఆసమష్టి నాదమునందు, ఉకారసంజ్ఞనొప్పు బుద్ధీంద్రియమును జొనిపి, తత్పర్యవసానముగా నొదవిన "మ్" అను వాచ్యార్థమునందు లక్ష్యముసేసి, సప్తకోటి మహామంత్రములకు మూలమైన యా "ఓం" కార బీజమును దనహృదయకర్ణికయందు సంశయరహితుడై ఆరాధించెను.

వివరణ:-

84 లక్షల జీవరాసులందు "నేను—నే" నను అహంకారభావము సమానముగానేయున్నది. ఈ "నే" ననునప్పుడాభావము పాదములందుగాని, శిరస్సునందుగాని కలుగక హృద

యమనందే తెలియవచ్చుటచేత "నే" నని యుచ్చోటనే చూచికొనుచున్నాము. మఱియు ముక్కురంధ్రములద్వారా నడచుచుండెడిశ్వాస, లోనికిబోవునపుడు "సో" అనియు, వెలుపలికి వచ్చునప్పుడు "హం" అనియు ధ్వనించుచున్నది. అట్టి "సోహం" అను పదము "సః + అహం" అను మాత్రల చేగూడికొనియుండి "సః" అను సత్తామాత్రస్వరూపమైన పరబ్రహ్మమునందు, "అహం" అను జీవాత్మను హృదయకమలమునుండి కలుపుచున్నది. అంతేగాక యీ "సోహం" అను అజపా గాయత్రీమంత్రవిశేషముచేతనే, పశుపక్ష్యాదులైన జీవులుగూడా క్రమముగా నుచ్చజన్మలకు వచ్చుచు, తుదకు మానవజన్మ మెత్తగలుగుచున్నవని కూడా చెప్పబడియున్నది. అట్టి "సోహం" అను హంసగాయత్రియందలి హల్లులైన "స—హ" లను గొట్టివేసిన, "ఓం" అను అచ్చులతో గూడిన యేకాక్షరప్రణవము నిలచుచున్నది. ఆ "ఓం" అను అక్షరమును విడదీసిన "అ" "ఉ" "మ్" అను మూడుమాత్రలు గన్పడుచున్నవి. "అ" యని పలికినప్పు డాధ్వని బొడ్డువద్దనుండి పుట్టి హృదయములోనుండి మీదికెగసి కుత్తుకవఱకు వ్యాపించుచున్నది. "ఉ" యను మాత్రయొక్క ధ్వని కుత్తుకలోనుండి పుట్టి నాలుకకొనవరకు వచ్చుచునది. "మ్" అను అనుస్వరము నోటికి వెలుపలగా పుట్టుచు, దీర్ఘముగా నెంత పొడవుగానైనను బోవుచున్నది. అట్టి మూడుమాత్రలుగలిసినచో "ఓం" అను అక్షరమన్నిరకములైన ధ్వనులు (లేక) అక్షరములకు మూలమై మాతృరూపముగానున్నది. ఈప్రణవశబ్దమునకు జాతిమతభాషాభేదములును, స్త్రీపురుషలింగభేద

ములును లేక సమస్తప్రాణులయందును సమానముగానే తెలి
యఁబడుచు "ఏకోపరబ్రహ్మ" త్వము నిర్దేశించుచున్నది.
అంతేకాక వ్యక్తికి నెక్కుడు సంతోషము గలిగినప్పుడు,
యెక్కువ దుఃఖము వచ్చినప్పుడు, "ఓ"—"హో" యను
భిన్నధ్వనులలో జీవునిప్రాణము విలీనమై శాంతిబొందుచున్న
ది. మఱియు, రోగియైనవాడుగూడా "ఊఁ" యను భిన్నస్వర
ముతో మూల్గుచు ఆ "ఓం" కారమునందు శాంతిననుభవించు
చున్నాడు. అట్టి మూర్తిత్రయరూపమైన "ఓం" కారమే
శబ్దబ్రహ్మమై వేదములకుగూడా యందక, వేదాంతమనబడుచు
న్నది. అట్టి శబ్దాతీతమైన ఓంకారబ్రహ్మమే సత్ = శాశ్వతము,
చిత్ = చైతన్యము, ఆనందము = సుఖము అను లక్షణముల
మిశ్రమస్వరూపముతో సకలజీవులయందున నిలిచియున్నది.
కావుననే యెఱుకచెడినజీవాత్మ యింద్రియములద్వారా సుఖా
న్వేషణకై బాహ్యవిషయవాసనలందు పరివర్తనజేయుచు
నెచ్చోటను నిత్యానందముగానక తపించుచు కర్మాభిమాన
ముతో సంసారచక్రమునందు జన్మలెత్తుచున్నాడు. అట్టియింద్ర
జాలరూపమైన విశ్వమునకంతటికి, నవ్యక్తస్వరూపమైన ఆ
ఓంకారపరబ్రహ్మమే సృష్టిస్థితిలయములకు గారణమై కర్మ
యోగప్రవృత్తిగల ప్రకృతితత్వములో ధర్మసూక్ష్మముగా
వ్యాపించి, యీ క్రియాప్రపంచములో "సత్" గా నిలిచి
"సత్కర్మ" యని నిర్వచింపబడుచు సర్వకాలసర్వావస్థలందను
సాక్షిస్వరూపమై నిత్యముగా వెలయుచున్నది.

84 తా॥ ఐనను దాను భ్రమచే బొరపడిన బోయవాండ్రే
యైనచో మోసమువాటిల్లునని తలచి యుపేక్షింపక,

ఆధ్వనిని నానావిధముల నాలకించి పరీక్షించి యను మానరహితుడై ఆయరణ్యమునందలి సకలచరాచర జంతుజాలములలో దాను దప్ప యితరుల నెవ్వరిని గానక నిశ్చింతతో దన శరీరశ్రమయంతయు బూరి గాబాసిపోవునట్లు గాఢ నిద్ర జెంది మహాసుఖము నొందెను.

విశేషార్థము:-

అట్లు సచ్చిదానందస్వరూపమగు ఆత్మసాక్షాత్కార ము బొంది జీవన్ముక్తుడయ్యు దీక్ష విడువక విదేహముక్తినిగూడ ననుభవింపగోరిన వాడై శ్రీకృష్ణ డాయఖండపరిపూర్ణపర బ్రహ్మము నేకాక్షర ప్రణవ బీజముతో ధ్యానించుచు నానావిధయుక్తి భేదములైన ప్రత్యక్షానుమానాగమప్రమాణ విధుల మననము సేయుచు, తన ఆత్మవంటి ఆత్మయే సకలజీవ రాసులయందు నున్నదని సమాధానము బొందినవాడై, త ల్లక్ష్యమైన కేవలనిర్వికల్పసమాధి నధిగమించి, స్థితప్రజ్ఞుడై విశ్వాతీతుడగు ఆయఖండపరిపూర్ణ సచ్చిదానందమయపర బ్రహ్మమునందు లయసిద్ధినిగూడ ననుభవించి ఆయోగేశ్వరు డైన గోపాలకృష్ణుడు యోగీశ్వరుడయ్యెను.

వివరణ:-

యోగసాధనకు మొదట యమనియమముల నలవరిం చికొని, తరువాత చిత్తవృత్తినిరోధకమైన సాధన మేదైనా

యభ్యసింపవలెను. ఈ ప్రయత్నమే యజ్ఞమున బరగి "యజ్ఞానాం జపయజ్ఞోస్మి" యన్నట్లు హింసాపూర్వకమైన యజ్ఞములకంటె జపయజ్ఞ మేశ్రేష్ఠమైయున్నది. అట్లు వ్యవసాయము సేయగా క్రమేణ మనస్సు పరిపరివిధముల సంకల్పించుటలుమాని చిత్తము నిర్మలమగుచున్నది. అట్లు చిత్తశుద్ధి కలిగిన మీదట నిష్కల్మషమైన అద్దమునందలి బింబమువలె బరమాత్మని ప్రతిబింబమైన ఆత్మ ప్రత్యక్షముగా బుద్ధీంద్రియమునకు దర్శనమిచ్చుచున్నది. ఈ స్థితికే "జీవన్ముక్తి" యని పేరు.

జీవన్ముక్తితో వ్యక్తి మోక్షాధికారి యగుచున్నాడు. కాని ప్రారబ్ధ మనునది పూర్తిగా నశించలేదు గనుక, ఆ యోగియొక్క జీవాత్మ హృదయకమలములోనుండి బైటకు దుమికిరాజాలదు. కావున ప్రారబ్ధమనుభవించుదనుక నంతఃకరణమునందే నణగియుండి, యవసానకాలమున గర్మరహితమయ్యెను గనుక బరమాత్మలో గలిసి పుట్టుటయే లేని మోక్షమొందుచున్నాడు. ఈ యోగ మెక్కుడు చిత్తశుద్ధిగల యధికారునకు ఆరుమాసములలోను, మధ్యస్థునకు ఒక సంవత్సరపరిమితిలోను, మూఢహృదయునకు బండ్రెండు వర్షములలోను సిద్ధినొసగుచున్నదని శృతి ప్రమాణము.

అట్లు ఆపరమాత్మలో ఈ దేహమునందుండియే కలసిన "విదేహముక్తి" యనబడుచున్నది. దీనికి వేరేయోగసాధనలు లేవు. జీవన్ముక్తుడాపరబ్రహ్మవృత్తిననుసంధానముసేసికొని తైలధారవలె ప్రణవధ్యానముసేయుచు నహోరాత్రములు నిమగ్న

డే గావలయును. అట్టి పరాభక్తికి మెచ్చికొని ఆ పర
బ్రహ్మమే యావిశ్వరూపము గటాక్షించుచున్నది. అట్టి నిర్వి
కల్పసమాధిసిద్ధికి దేశకాలపాత్రాన్యాయములు లేక నడచు
చుండినను, మాటలాడుచుండినను గూడా అకస్మాత్తుగానే
లభించుచున్నది. అట్టి అమనస్కయోగసిద్ధిని గాంచిన ఆజీ
వుడు తిరిగి ఆజీవన్ముక్తుని శరీరములోనికి మరలివచ్చుటకూడా
దుర్ఘటము. తన ఆత్మయను జ్యోతి ఆపరంజ్యోతిలో గలిసి
సముద్రములోబడిన ఉప్పుకల్లువలె అపరూపమే యగుచున్నది.
కాని యొక్కొక్కప్పుడాపరబ్రహ్మమే తన్ను దెలిసిన ఆ వి
దేహముక్తుని లోకోద్ధరణమునకై మరలబ్రతికించుచున్నాడు.
కావున అట్టి నిర్వికల్పసమాధిలో నిర్జీవమైన జీవన్ముక్తుని కళే
బరము నిరువదొకదినములవరకు శిష్యులు గాపాడుకొనవలసి
యున్నది. అట్లా కాలములో ఆ దేహమునకు చైతన్యము గలు
గకపోయిన సంస్కారము నడపవచ్చునని శృతివచనము.
అది యట్టిది గావున, సాధకుడు జీవన్ముక్తి నొందిన తరువాత
వెంటనే విదేహముక్తికి బ్రయత్నించుటయు ప్రమాదకరమని
యెఱింగి, కేవలము స్వాభిలాషి కాక వేదాంతజ్ఞానమును ప్ర
చారముచేసి లోకములోని యజ్ఞాననారాయణుల నుద్ధరిం
చి, తదనంతరమే నిర్వికల్పసమాధికై యత్నింపవలయునని
యుశృతులు నిర్దేశించుచున్నవి. అప్పుడాజీవన్ముక్తుని కానిర్వి
కల్పసమాధి సిద్ధించినను, లేక యంతలో నవసానవేళ ప్రా
ప్తించినను, అనుభవ భేదమే గాని, మోక్షమునే పొందు

చున్నాడు గనుక పునర్జన్మము గలుగదు. కాని విదేహముక్తి గూడా నీభౌతికదేహములోనే సాధింపవలె ననిన అది కోటి జీవన్ముక్తులలో నొకానొకనికే గాని సిద్ధించుటలేదని శ్రీభగవానువాచ:

మనుష్యాణాం సహస్రేషు కశ్చి ద్యతతి సిద్ధయే
యతతామపి సిద్ధానాం కశ్చి న్మాం వేత్తి తత్త్వతః॥

అనగా వేలకొలది గానుండిన సాధకులలో, నే యొకనికో జీవన్ముక్తి సిద్ధించుచుండగా, అటువంటి వేలకొలది సిద్ధులలోగూడా, నెవ్వడో యొక్కడే నన్ను సంపూర్ణముగా తెలిసికొన గలిగిన విదేహముక్తి సాధించి యనుభవింపగలుగుచున్నాడు సుమా!

85. తా॥ ఆజన్మజ్ఞానియైన శ్రీకృష్ణు డట్లు దృఢ వ్రతుడై షణ్మాసప్రమాణమున జ్ఞానానందమహత్స్వరూపమును, అవ్యక్తపరబ్రహ్మము నైన ఓంకారమునందట్టి స్వానుభవసిద్ధిగాంచి, ఆవిధముగా అహంకారమును దీసి వైచిన ప్రతిమానవుడును బ్రణవస్వరూపుడగుచున్నాడని సార్థకపఱచుటకుగాను, లోపలనున్న మలమంతయు దీసివేయబడి డొల్లగానుండిన వెదురుగొట్టమును పిల్లంగ్రోవిని తన విజ్ఞాన చిహ్నముగా స్వీకరించి ధరించెను.

86. తా॥ అట్లొకనాటిరాత్రి తెల్లవాఱుఝామున ఆబృందారణ్యమునందు బ్రణవధ్యాననిష్ఠాగరిష్ఠుడై తనివి సనక

తన్నిష్ప్రపత్తికి బాత్రాంతరముగ వేణువును గ్రహించి, గానలోలుడై, యొక గీతముతో నాగస్వరము నాలాపన జేయుచు నావేశపూరితుడయ్యెను.

37. తా॥ అట్లు విశ్వమంతట వ్యాపించి నిండుచుండిన ఆమురళి యొక్క ప్రణవనాదమునకు నొక వైపున దనశరీరమునందలి 72,000 నాడులు లయమగుచుండగా, రెండవ వైపున బాహ్యప్రపంచములో నాలమందలు మోరలెత్తి వినుచు దన్మయ మొందునట్లుగాను; ఇటు తన దేహమునందలి పంచప్రాణము లను ముఖ్యవాయువులు విలీనమై తనకు వశ్యమగుచుండగా, అటుబాహ్యసృష్టిలో త్రాచుపాములు లేచి పడగలువిప్పి పరవశమొందునట్లుగాను; తన బ్రహ్మనాడియందలి షట్చక్రములు శ్వాసకు సులభమార్గములగుచుండగా, బాహ్యమున బ్రాతఃకాలముతో బాటు ప్రకృతియందలి పద్మములు చక్కగా వికసించునట్లుగాను; తన యొక్క స్థూలసూక్ష్మకారణోపాధిత్రియము నడలి బ్రహ్మానందమయమగుచుండగా, ఆచతుర్వ్యూహమున బ్రకృతింగల జీవకోటులు లాలింపబడి, మైమఱచి, గాఢనిద్రయను సుఖ మనుభవించుచుండినట్లుగాను; దన కుడిరెండవ హస్తములందా జీవమాత్రుడైన బాలకృష్ణుడు మురళిని ధరించి, ఆబృందావనమునందు గానము సేయు

దొడగగా, సాక్షాత్తుగా ఆసర్వేశ్వరుడే హృదయ గోళమునందాయిడాపింగళానాడులమధ్యనున్న ఆసుషుమ్నా నాళమును ధరించి, నాదానుసంధానము సేయుచుండెనా యనునట్లుగా, ఆమురళీనినాదము కేవలము సోహంమంత్రరూపమగు బ్రహ్మనాదమైన ఓం-కారమై బ్రహ్మాండమంతయు నిండి ప్రతిధ్వనించెను.

వివరణ:-

సిద్ధపురుషుడైన శ్రీకృష్ణభగవానుడు ప్రాకృతముగా వేణుగానము సేయునప్పుడు గూడా తన యోగకౌశల్యముతో శుద్ధమైన ఓంకారనాదమునే ప్రవర్తింపజేయగలుగగా నది యంతర్బహిర్వ్యాప్తముగా ప్రసరించి యొకవైపు యోగసిద్ధి నొందిన ఆబాలకృష్ణుని వ్యష్టిరూపమును రెండవవైపు సమష్టి రూపమైన యావత్ప్రపంచమును నిర్మలమగు నానందమహా సముద్రమున నోలలాడించెను.

88. తా॥ అట్లు తొమ్మిదిరంధ్రములతో చేయబడిన యా వెదురుగొట్టము, చాకచక్యముగల యెనిమిది వ్రేళ్లచే నెడతెగకుండా నాదింపబడుచు, వాయువుతో పూరింపబడగా ఆ గానరసము దశదిశలందు దట్టముగా వ్యాపించెను.

విశేషార్థము:-

అట్లు నవద్వారములు గలిగిన ఆగోపాలదేవుని శరీరము మహనీయమైన యష్టసిద్ధులతో జాజ్వల్యమానమై శ్వాస

పర్యటనచేత నుద్ఘాటింపబడిన ఆప్రణవనాదము దశవిధనాదములతో భూనభోంతరాళములు నిండునట్లుగా ఘూర్ణమానమయ్యెను.

89. తా॥ అట్టి సమయమున నాప్రణవనాదపరంపరలు చెవులబడగానే ఆవ్రేపల్లెవాడలోని గోపవనితలు దమ పూర్వజన్మజ్ఞాన సంస్మృతిచే నిద్రావస్థనుండి యకాత్తుగా మెలివివచ్చి కలవరబడుచు,—

90. తా॥ ఆ యపూర్వనాద మిదివఱ కెప్పుడో వినియుంటిమి సుమా యని యాందోళనబడి పూర్వజన్మ సంస్కారబలముచే నయ్యది స్మృతికిరాగా, అమ్మహనీయమైన ఓంకారనాదమును గుర్తించి,తత్క్షణమే దేహవాసనల నొక్కట విసర్జించి, తేనెవాసనల కెదురుగా బరుగులిడు తేనెటీగల చందమున, ఆమురళీగాన ప్రవాహమున కెదురీదునట్టి వారలై,—

91. తా॥ తమతమ స్వగృహములనుండి వెడలి నిజభర్తలనుగుఱించిగాని తదితర సంసారవిషయములనుగుఱించిగాని తలంపనేఱక, తమ చిత్తశుద్ధి విశేషముతో బృందారణ్యమునందలి వ్యత్యస్తపాదారవిందుడైన వేణుగానలోలుని నిజమనోవీధియందు బొడగని, సంభ్రమాశ్చర్యములు ముప్పిరిగొనగా, నెదుట దోచుచుండిన ఆగోపాలదేవు నాతురపడి తమ రెండు గరములతో

నందుకొనబోయిన ట్లాహ్వానించుచు "కృష్ణా! కృష్ణా!" యను కేకలతో నా రాత్రిఘామునందా గోపికలు గొప్పలు ముడివీడగా నాయరణ్యమార్గములబట్టి-పరుగులెత్తి జనిరి.

92. తా॥ అట్లామురళీవినోదుని డాసి, యాగోపకాంతలు సాక్షాత్ భగవంతుడని తెలిసికొనిన వారై నందున, భయభక్తివినమ్రలై స్తోత్రములొనర్చి, తమ కా అద్వైతానుసంధానయోగప్రాప్తి దయజేసి కర్మరహితలను గావించి రక్షింపవలసినదని ప్రార్థించిరి.

93-94. తా॥ అప్పు డాజగదోద్ధారకుడగు శ్రీకృష్ణభగవానుడును ప్రసన్నుడై వారలకు బరమాత్మసందర్శనముగలిగింప నిచ్చగించి, పదునాల్గు భువనములకు మంగళప్రదమైన తన కుడిచేయి చాచి హస్తమస్తకసంయోగ మొనరించెను,—

95. తా॥ ఆకరస్పర్శతో వెంటనే సమస్త సంచితకర్మము నశించినవారలై ఆమానవతుల తికష్టతరమైన నిర్వికల్పసమాధిని సునాయాసముగా నొక్కక్షణములోనే సాధింపగలిగి ఆ యఖండ పరిపూర్ణ నిరాకార పరబ్రహ్మసాక్షాత్కారము నొందిరి.

వివరణ:-

మానవశరీరమునందు 72,000 నాడులు గలవు. ఈ నా
డులన్నియు వేలా వేలు దేవతాశక్తులుగా బరిగణింపబడి
ఆ యా నాడీప్రసారములయొక్క ధ్వనులను బీజమంత్రము
లతో నారాధింపగా దల్లక్షితమైన నాడీప్రకోపము సిద్ధించు
చున్నది. ఈ మంత్రాక్షరములకు స్వరమే ప్రధానమై, యా నా
డీస్వరముతో దన మంత్రోచ్చాటనాధ్వని యేకీభవించినతో
డనే ఆనాడిలో సుష్ణముగలిగి దానిని గదలింపగా జ్యోతిర్ఘ
ళిలు గూడా బుట్టుచున్నవి. కావున నీమంత్రాక్షరముల నెగు
డుదిగుడుగా గాని, భాషాంతరీకరణముగాని చేయగూడదు. అ
ట్లొనర్చిన యవి ఫలమునీయవు. ఆవిధముగా హృదయస్థాన
మునుండి కపాలమువరకు వ్యాపించియున్న యొకానొకనాడి
అమృతనాడి యనబరగుచు ప్రణవారాధనతోడి గురుకటాక్ష
మువల్లనే తెలియబడి సంకల్పరహితమైన కేవలామనస్కయో
గసిద్ధి బ్రసాదించుచు గపాలమోక్షలక్షణమైన విదేహముక్తి
నొసగుచున్నది. కావున, అట్లాహృదయగ్రంధిని హస్తమస్త
కసంయోగవిధానముతో నకస్మాత్తుగా సడలింప జేసియు దజ్జీ
వాత్మల స్థితప్రజ్ఞులుగా నిలువరించుట కాయాచర్యవరుడు
సాక్షాత్ శ్రీకృష్ణభగవానుడు క్రీస్తుదేవులవలె గేవల మవతార
పురుషుడు గావలయునేకాని, యితర సిద్ధపురుషులవల్లనూ
గాదు. కాని గురుదేవుడైనవా డామార్గము నెఱిగికొనియున్న
వాడు గావున నిజశిష్యు నవశ్యము కృతార్థుని జేయగలుగుచు
న్నాడు. అంతేకాక అట్టిసద్గురునికటాక్షములేనిదే ఆమోక్షకవా
ట మెఱిగికొనుటయే సాధ్యము గాదని శ్రుతులు సెప్పుచున్నవి.

96 తా॥ అట్లు కేవలము సత్యమైనదియు, పుణ్య పురుషుల చేత గొనియాడబడునదియు, శృతిస్మృతేతిహాసములకు రహస్యమైనదియు, సత్త్వగుణప్రధానమైన ఆత్మనిష్ఠ లోదర్శన మిచ్చునదియు, దేదీప్యమానమైనదియు, అవ్యక్తమైనదియు, ఆదియంతములులేని యఖండస్వరూపమైనట్టిదానిని,—

97. తా॥ సగుణము నిర్గుణ మను రెండునై యొప్పునదియు, శుద్ధసత్వరూపమైనదియు, జరారహితమైనదియు, నాశము లేనిదియు, తెగగొట్టబడనిదియు, కదలిక లేనిదియు, మాలిన్యదోషము లేనిదియు, గోప్యమైనదియు, చైతన్యరూపమైనదియు, నిత్యమైనదియు, నంగుష్ఠప్రమాణమైనదియు, బ్రహ్మానందస్వరూపమైనదియు, సర్వవ్యాపియు, సర్వాంతరాత్మయు నైయున్న ఆదిపురుషుని,—

98. తా॥ బుద్ధికి నగమ్యమైన యవ్యక్తపరబ్రహ్మతత్త్వమును దమ హృదయాకాశమునందు జ్ఞాననేత్రముతో సువ్యక్తముగా సందర్శించి దివ్యమహిమ నొందినవారలై యాగోపికలావిశ్వాత్ము నిట్లని స్తుతించిరి.

వివరణ:—

అసలు మానసిక ప్రపత్తిలో నేదైనా యొకవస్తువు నూహించుటకు దా నావస్తువు నొకప్పుడు గనినదైన వినినదైన యుండవలెను. ఎట్లనగా "ఆవు" యని చెప్పగానే

మనస్సునకొకయావుయాకారము బొడగట్టి,తద్వారా తక్కిన విషయము గ్రాహ్యమగుచున్నది. అట్లిదివర కేయావును దాను జూచియుండని పక్షమున, దా జూచియున్న వేఱొక జంతువుతోనైనా పోల్చిచెప్పవలసివచ్చుచున్నది. అటువలెనే పరబ్రహ్మస్వరూపము సూచి మొఱుగనంత వఱకు నిట్టిట్టి దని నిర్దేశింప వీలుగాకున్నది. అందునను అవ్యక్త పరబ్రహ్మ మసలే గ్రాహ్యము గాజాలదు. అంతేగాక,యథాస్థితిలో జీవాత్మయు బరమాత్మస్వరూపమే గావున, దన మొగము దాను జూచుటకు వీలుగాదను న్యాయప్రకారమున, బరమాత్మస్వరూపము ముఖాముఖిగా దెలియ వీలులేకున్నదని శృతులు సెప్పుచున్నవి. ఐనను సమాధియందా పరమాత్మదర్శనము బ్రత్యక్షముగా ననుభవవేద్యమే యగుచున్నదనియు, శృతివాక్యము. కావున ఆపరబ్రహ్మస్వరూప మెట్లుండునా యని తర్కించిన మన కనుభవస్థితిలో గాఢనిద్రావస్థ కావలగా బోల్చుకొనవలసియున్నది. ఆనిద్రావస్థయు దమోగుణప్రధానమేమైయున్నప్పటికి, అది యవ్యక్తాత్మిక స్థితిలోని చిట్టచివరి దశగా నుండి, వ్యక్త సృష్టికి మొదటి మెట్టగుచు దశేంద్రియములతోగూడిన మనస్సు ననుదినము లయ మొనరించి పునరుద్ధారణ జేయుచున్నది. కాన దాని కాశ్రయమగు శుద్ధసత్వప్రధానమైన నిర్వికల్పసమాధిస్వరూప మగు అవ్యక్త పరబ్రహ్మలక్షణమును దదంతర్గతముగా నూహించికొనవలసియున్నది.

39. తా॥ హే జగదీశ్వరా! నీ వీసమస్తమైన స్థావర జంగమ

ప్రాణికోటులందు సూత్రధారివై కర్తృత్వ భోక్తృత్వములు లేక సాక్షిమాత్రుడవయ్యు, సర్వాధారుడవై యుండి, మా పశువులు, యాదవులు, నందయశోదాదులు, మా బంధువులు, మేమునుగూడా సర్వము నీవే యగుచు నీవు గాసివస్తువే యీ విశ్వములో లేదని యిప్పు డనుభవసిద్ధమైన యీవిజ్ఞానము మఱల మాకు జన్మజన్మేపి మఱపుగలుగకుండునట్లుగా స్థిరపరిజ్ఞురాం డ్రనుజేసి మమ్మనుగ్రహింపుమో యచ్యుతా! అనంత! హరి! పరమాత్మ! కృష్ణా! యని వేడుకొనిరి.

100. తా॥ ఓ యశోదాకుమారా! నీవు కేవలము మానవమాత్రుడవుగాక నిక్కువముగా నీ భూతకోటికెల్ల నాశ్రయుడవైన ఆహిరణ్యగర్భుడగు పరబ్రహ్మవే సుమా! అట్టి నీవు భూభారముదొలగింపగా నవసరపడి యిట్లు లీలామానుషవిగ్రహుండవై యవతరించిన పురాణపురుషుడవే గదా!

101. తా॥ అని పరమానందముతో బ్రిదక్షిణపూర్వకసాష్టాంగదండప్రణామాదుల నాచరించి ఆగోవిందుని అనంతనామగుణముల గీర్తన జేయుచు నుతించిరి.

102. తా॥ ఆట్లు బాలకృష్ణు ననేక విధములుగా స్తుతించి ఆగోపాల దేవుని విజ్ఞానమయమగు మాయామానుషవిగ్రహమునందు జూమ్ములు నిలిపి ఆరాధించుచు—

103. తా॥ భక్తిపరవశలై యత్యధికమైన యనురాగమును జెంది యాగోపిక లాపరిత్యక్తపరబ్రహ్మమైన బాలకృ

ష్ణుని నెత్తికొని, ముద్దుగొని, కౌగిటనిడికొని, భక్తివివశాత్మలై బ్రహ్మానందము నొందిరి.

104. తా॥ అంతియుకాక తాము యశోదాకుమారుని దివ్యవిగ్రహముపై జిరకాలమునుండి స్నేహభావము గలిగి యుండినందున, నిరాకారమైన ఆయఖండనిర్గుణపరబ్రహ్మైక్యానుభవము నొల్లక కేవలభక్తిప్రధానలై, ఆ అవ్యక్త పరబ్రహ్మమే యీ బాలకృష్ణుడై యవతరించెనని సిద్ధాంతీకరించికొని సగుణోపాసనయందే నిలిచి యారాధింపదొడగిరి.

వివరణ:-

కేవలాద్వైత సమాధియందు జీవాత్మ పరమాత్మయను ద్వంద్వభావము నశించి సముద్రమునందుబడిన యుప్పుకల్లువలె నపరూపమగుచున్నది. అట్టి స్థితియందు మనస్సు గాఢనిద్రలోనుండునట్లు లయమైపోవుటచేత బుద్ధికిగూడా నయోమయముగానే యుండి, ఆసమాధినిష్ఠనుండి మెలకువవచ్చువరకు నేమియు దెలియక తరువాతనే తాను ఆనిష్ఠలో అట్టిసుఖము నొందితినిగదా యని యెఱిగికొనగలుగుచున్నాడు. సగుణోపాసనమన్ననో యట్లుగాక, తాను వేఱు, తేనె వేఱుగానుంటూ, తానా మధుపానము సేయునప్పు డుండునట్లుగా ననుభవవేద్యమైన హృదయాహ్లాదము బొందుచున్నాడు. ఆయానందానుభవము దానాతేనెలో గరగిపోయినచో బ్రాప్తించుట లేదుగదా! కావుననే ప్రహ్లాదనారదాది నిత్యసిద్ధులు

గూడా తాము భగవద్భక్తి విశేషముతో సాజన్మజ్ఞానులై యె న్నిమారులైనను బుట్టుదుమనుచు భక్తిప్రసాదమునే వేడుకొనిరి కాని కించిత్ గర్భచరకమును గుఱించి యీ మాయసంసారచక్రమునకు భయపడి జన్మరహితమైన మోక్ష మాసించి యుండలేదు.

105. తా॥ అట్లు సగుణబాహ్యారాధనాసక్తలై యాగోపికలా బాలకృష్ణుని షోడశోపచారముల నిత్యము నర్చించి సేవింప దొడగిరి.

106. తా॥ ఓ నల్లని పిల్లవాడా యిటు రా! యని హాస్యమాడుచు వానమబ్బులవంటి కొప్పుగల యొకపొలతి యానందనందనుని స్నానము సేయించగా, వేఱొక సన్నని నడుము గల తన్వి ఓ గొప్పమగవాడా! యని మందహాసము సేయుచు వాని మొలకు బీతాంబరమును జుట్టును. ఓ గుట్టలెత్తెడివాడా! యని వెన్నముద్దలవంటి వక్షస్థలముగల యొక వెలది వెన్నదెచ్చి నైవేద్యము బెట్టగా, మంచికస్తూరివంటి శరీరవాసనగల వేఱొక చేడియ మాధవా! యని చేరదీసి దేహమునకు జందనముబూయును. చిగురుటాకువంటి యధరముగల నొక కన్నియ ప్రేమతో దాంబూలము నందించగా, పుష్పమాలవంటి కోమలమైన దేహముగల యింకొక జవ్వని కంఠమునకు బూలహారము వేయును. రత్నకంకణములు గలిగిన యొకయిల్లాలు మంగళహారతి నిచ్చు

చుండగా, మేటియైన కలకంఠి యొక్క తెయూగుచు
బాటబాడి లాలించి జోకొట్టును.

107. తా॥ ఈప్రకారముగా శ్రీకృష్ణ సేవాతత్పరలై మైమ
అఱచియున్న తమ్ముగని మతిభ్రష్టలైరని బంధుజనులు
బెగ్గడిలుచుండగా ఆగోపికలు జాగ్రదావస్థలో నుండి
నపుడు గూడా బాలకు డెవ్వడు దృగ్గోచర మైననూ
ఆనందనందను డేయని భ్రమించుచు, దుద కా సర్వ
మయుని దివ్యరూపము దమబంధుకోటితో సహా సకల
దేహధారు లందున బ్రత్యక్షముగా దమ మాంసపు
కన్నులతోనే చూడగలిగిన వారలైరి.

108. తా॥ అట్టి పరమోత్కృష్టమైన పరాభక్తితో సమస్త
భౌతికప్రపంచ మాకృష్ణదైవము యొక్క దివ్యవిగ్ర
హమయ మేయని ప్రత్యక్షముగా జూచి యానందిం
చుచు, బరమహంసలై, భావముఖసమాధియందు నిలిచి,
సగుణబ్రహ్మమునందే సంచరించిరి.

వివరణ:-

అద్వైతసిద్ధి నొందినప్పటికీ, ఆశ్రీకృష్ణుడుగాని యీ
గోపికలుగాని యాద్వాపరయుగాంతమునందే సన్యాసాశ్ర
మమునుస్వీకరింపలేదు. ఇక నీకలియుగమునందనన్నో, సన్యా
సాశ్రమమునుని యోగమును, శ్రీశంకరాచార్యులవారిచేఋూర్తి
గాని మేధింపబడియున్నది. అసలు సన్యాసమనునది బౌద్ధమత
సాంప్రదాయముగా బూర్తిగా కర్మసన్యాస మై పోయినది.
వేదాంతమునందు జ్ఞానియైనవాడు నిరాటంకముగ భూతసేవ

జేసి లోకోద్ధారణము సేయవలయుననియు, నందులకు గాను దనకు లంపటలేకుండిన నెక్కుడు స్వేచ్ఛగా దిరుగుచు జ్ఞానబోధ జేయవలయుననియు వ్రాయబడియుండినను, ఆయాచార్యుడు భార్యాసమేతముగా కూడా నుండవచ్చు ననియే చెప్పబడియున్నది. గావున బ్రహ్మచర్య, గార్హస్థ్య, వానప్రస్థ సన్యాసాశ్రమప్రకారము జీవన్ముక్తి సాధించి, లోకసేవ జేయుటకే నిర్ణయింపబడియున్నను, బ్రహ్మజ్ఞానియైనవానికే యాశ్రమధర్మములు లేక కర్మఫలత్యాగియగుచు జనకునివలెను శ్రీకృష్ణునివలెను రాజ్యభారముగూడా వహింపదగియున్నది. అంతేగాక, ఉపనిషత్తు లందును పెక్కుచోట్ల రాజులే బ్రాహ్మణుల కధ్యాత్మబోధ జేసియుండిరనియు గ్రహింపనగును. విశేషించి, జీవన్ముక్తి యను సగుణసాక్షాత్కారము సిద్ధించువలకు మనుజుడాశ్రమధర్మముల ననుసరించి, ఆత్మానుభవము దొరికినమీదట త్యాగియగుచు ననగా బుద్ధిమాత్రముగ కర్మఫలసన్యాసములో నిలిపికొనియుండి యజ్ఞానములోనుండిన సంసారుల ననుసరించియే వారి నుద్ధరింపవలసియున్నది. తుదకవసానకాలమెఱిగికొని నిర్వికల్ప సమాధికొఱకు బ్రయత్నింపవలయును. ఏలననగా దా నీయజ్ఞానసారాయణుల ప్రబోధింపకయే (సగుణసాక్షాత్కారముతో దృప్తినొందక) నిర్గుణసమాధిలో బ్రవేశించిన దత్క్షణమే తన జీవాత్మ పరమాత్మలో బూర్తిగా గలిసిపోయి తనకళేబరము సంస్కారయోగ్యమగుచున్నది. అట్లు కేవలము స్వలాభియైనను మోక్షదూరుడై నరకమునే పొందుచున్నాడనియు శృతులు సెప్పుచున్నవి.

కనుక ప్రతిమానవునికి "బ్రహ్మం చరంతి బ్రహ్మచర్యంతి" అను నట్లు వేదాధ్యయనలక్షణమైన బ్రహ్మచర్యాశ్రమమనబడు 12 వర్షముల మాత్రకాలముతోడి కౌమారావస్థ గడచిన మీదట గృహస్థాశ్రమ వ్యవహారియై పండ్రెండు సంవత్సరముల మాత్ర కాలము సంసారధర్మ మవలంబించి, పిదప వానప్రస్థాశ్రమ లక్షణమైన పండ్రెండు వర్షముల యస్ఖలితబ్రహ్మచర్యదీక్షతో దపోనిష్ఠబొందుచు భార్యాసమేతముగానే నడపికొని యోగ సిద్ధినొందుచు ధర్మార్థ కామ మోక్షము లనుచతుర్విధ పురుషార్థములను సాధింపవలసియున్నది. అట్లు జీవన్ముక్తుడైన వాడు సన్న్యాసాశ్రమము బ్రవేశించి వేదాంతతత్త్వప్రచారమును ముగించికొని కృతకృత్యుడై పిమ్మట నిర్వికల్పసమాధికి బ్రయత్నించి విదేహముక్తి నొందుచున్నాడు. కావున సన్న్యాస మనుదానికి గర్మసన్న్యాసమని పూర్వాచారము లేదు. సన్న్యాసాశ్రమమనగా కర్మఫలసన్న్యాసియై అనగా త్యాగియై భూపర్యటనచేసి జ్ఞానబోధచేయుచు తరువాత నిర్వికల్ప సమాధి కధికారి కావలసియుండుటచేత ముఖ్యముగా భక్తి యుగలిగియుండవలసియున్నది. అనగా కేవలకర్మఫలత్యాగ ముతోడి భక్తి లక్షణమే సన్న్యాసాశ్రమధర్మమై యుండెను. కాని బౌద్ధమతము ప్రచారమైన తరువాత సన్న్యాసమనగా బూర్తిగా గర్మనే సన్యసించుట యను నర్థవాదము బైలుదేరి సాధకునికి బ్రారంభదశనుండియు సన్న్యాసదీక్ష నిచ్చుచుండిరి. అందుచేతనే, శ్రీశంకరాచార్యులవారు అవతరించి, కలియుగమున సన్న్యాసము నిషేధముగాజేసి, వేదాంతధర్మమును సంస్కరింపవలసివచ్చెను.

109. తా॥ అట్లు దమ తమ కుటుంబములం దుండియే మహా త్యాగినులై సగుణబ్రహ్మారాధన మాచరించుచు ఆ వ్రేత లనుదినము రాత్రియామముల శ్రీకృష్ణుడేయరణ్య మధ్యమునుండి వేణుగానము సేసినను, దత్క్షణ మాదేవ దేవుని జేరంజని ఆప్రణవనాదామృత రసాస్వాదనమున బ్రపంచమే మఱచి పోవుచుండిరి.

110-111. తా॥ అట్టి సందర్భములలో బామరులైననిజభర్తలు గాముకులై తమ్మరసికొనుచు వెళ్లి మన్మథ కేళీరతు లగుచుండిననూ, తత్క్రియాపరతను పరమహంసలైన ఆగోపికలు పసిపాపలవలె గుర్తింపలేకయే, శ్రీకృష్ణుడే సన్నిహితుడాయెనను నిధిధ్యాసతో సంకల్పశూన్యలై పరిభ్రమించుచు, ఆప్రణవామృతపానముచే జొక్కి లయముబొందినవారలైరి.

112. తా॥ అట్లు దమపతులు తిరిగి యిండ్ల కేగగా, నంతలో దమ మనస్సులుగూడా క్రిందిమెట్టునకుదిగి యింద్రియ స్పృహ కలిగినవారలై తమ కడవఱకు సన్నిహితమై నట్లుగా దోచిన ఆ శ్రీకృష్ణస్వరూప మప్పుడు దాపున గనుపింపమి దపించుచు, కృష్ణాన్వేషలై యరణ్యమంత యు గాలించుచు నొకరి నొకరుగా కృష్ణుడేయని భ్రమించుచు దిరిగి తిరిగి తుదకాపొన్నవృక్షముయొద్ద నెప్పటివలె బద్మాసనాసీనుడై వేణుగానము సేయు చుండెడి ఆ గోపాలబాలునిజూచి చిత్తశాంతిబొందు చుండిరి.

113. తా॥ ఆవిధముగా జగన్నాటక సూత్రధారుడును అఖండితబ్రహ్మచారియునైన ఆకృష్ణకుమారుడు దన బాల్యమునం దా గోపీజనములో గూడి వివిధలీలల గ్రీడించుచు లీలామానుషవిగ్రహుడై విహరించెను.

114. తా॥ ఆ ట్లా శ్రీకృష్ణు నాపదునాఱువేల గోపికాలలామ లర్పించి దాస్యముసేయుచుండగా నాకసమునుండి ఆ నక్షత్రములకు పతియైన చంద్రుడు సూంచియా మహాశోభ కసూయపడుచు క్షోభించి నిలువక వెనుకకు మఱలిపోవుచుండెనా యన్నట్లుగా బ్రతిదినము భల్లున దెల్లవాఱుచు న నే క సుదినములు గడచిచనెను.

115. తా॥ అట్లు నందనందనుడైన శ్రీకృష్ణపరమాత్ముడు తనకు బదునొకండు సంవత్సరముల ప్రాయము వచ్చుదనుక యశోదాకుమారుడై వ్రేపల్లెవాడలో బెరుగుచు ఆ రాధ మొదలైన గోపికాజనము నందఱను గర్మాతీతురాండ్రనుగా నొనరించి మోక్షాధికారుల జేసి క్రియాకర్తృత్వమును బాచికొనియెను.

116. తా॥ అట్టి మధురానగరనివాసియు, దుష్టజనశిక్షకుడును అవతారపురుషుడును శ్రీమద్భగవద్గీతోపదేశికుడునైన ఆ రుక్మిణీపతియగు శ్రీకృష్ణభగవానుడు నిత్యమంగళస్వరూపుడై యీ చరాచర జంతుజాలములకు సదా శుభమంగళ మొసగూర్చుగాత!!!

-: గద్యము :-

ఇది శ్రీమద్భరద్వాజసగోత్ర పవిత్ర యెల్లాప్రగడవంశోద్భవ
లక్ష్మయాఖ్యాతపౌత్ర రామకోట యామాత్యపుత్ర
సీతమాంబికా గర్భ శుక్తి ముక్తాఫలాయమా
నానవరతాద్వైతానందసమ్మిళితచిత్తవశవర్తి
శ్రీ కృష్ణ మూర్తి నామధేయ
విరచితతాత్పర్యవివరణసహిత
నిర్వచనైకాశ్వాస
శ్రీగోపికారహస్యం
బను గ్రంథంబున
సర్వంబును,
సమాప్తము.

ఓం తత్ సత్.